

మార్చి 2014
రూ. 12/-
విపుల
విశ్వకథా వేదిక
MOHAN
PUBLICATIONS
Mohanpublication.com
మోహన్ పబ్లికేషన్స్
grantha nidhi
THE TREASURE OF PAGES
www.granthanidhi.com
Granthanidhi.blogspot.in
స్టార్ సంతాన సాఫల్యత కేంద్రం
స్టార్ ఫర్టిలిటి
IUI IVF ICSI
IMSI HSG
మా ప్రపంచస్థాయి ఆధునిక పరికరాలు మరియు చికిత్స విధానాలు అందరికీ అందుబాటులో...
7416 106 106
www.starfertility.com
OPP : సెయింట్ ఆన్స్ స్కూల్, విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్

14

35 ఏళ్లనాటి విపుల కథ

నేటితరం పాఠకలోకం కోసం 'ముప్ఫైఅయిదేళ్ల నాటి విపుల కథల్ని' తిరిగి అందిస్తున్నాం. అనువాద కథల్ని మాత్రమే ఈ శీర్షిక కింద ఇస్తున్నాం. సుప్రసిద్ధ కథకులు విపుల ఆవిర్భావం నుంచి ఒక్కో సంచికను కూలంకషంగా చదివి వీటిని ఎంపిక చేశారు. 1979 మార్చి విపుల నుంచి జయంపు కృష్ణ ఎంపిక చేసిన ఓరాహమ్ ఆదస్ ఇజ్రాయెల్ కథ రుతువు మీకోసం! ఈనెల 15 న పుట్టినరోజు జరుపుకుంటున్న జయంపు కృష్ణ గారికి శుభాకాంక్షలు!

రుతువు

చౌకీదారు మేల్కొనే సమయానికే నిద్రలేవడం అలవాటు అవడానికి నాకు ఎక్కువకాలమే పట్టింది. ఇక్కడ రుతువును బట్టి వేరు వేరు సమయాలలో మేల్కొనవలసి ఉంటుంది. గొర్రెలు పాలు ఇచ్చే కాలంలో తెల్లవారుఝామున మూడు గంటలకే లేవాలి. గొర్రెల్ని మేపే కాలంలో పచ్చిక బీళ్ళకు తోలుకుపోయే సమయంలో నాలుగు గంటలకు లేవాలి. ఆకు రాలే కాలం అయితే ఐదు దాటాక లేచినా ఫర్వా లేదు. ఇది ఇక్కడి రివాజు. ఇలా రుతుధర్మాన్ని బట్టి వేరువేరు సమయాలలో మేల్కొనడం అభ్యాసాన్ని బట్టి అలవాటు కావలసినదే. మనస్సును అలారం గడియారంలా తయారుచేసుకోనిదే ఇది సాధ్యం కాదు.

ఇది గొర్రెల్ని మేపే కాలం. ఈ రోజున చౌకీదారు బూట్ల చప్పుడు నా గది బయట ఆగిపోగానే నేను మేల్కొన్నాను. ఐనా బద్ధకంగా ఉండి మంచం దిగలేదు. చౌకీదారు మాటలు వినవచ్చాయి. "యాకోబ్, నాలుగు అయింది"

అతని హెచ్చరిక వింటూనే తటాలున మంచం దిగి గది బయటకు వచ్చాను. వెన్నెల ఇంకా వెలుగుగా మారలేదు. ఇంతలో చౌకీదారు వెనక్కు వచ్చాడు. అతని చేతిలో టార్చిలైటు ఉంది. బట్టలు మార్చుకొంటూ అతన్ని అడిగాను... "ఇవాళ వంటపని ఎవరిది? "- అని.

"చవీవా!" చౌకీదారు బదులు చెప్పాడు. చవీవా పేరు వింటూనే నేను టిఫిన్ గురించి ఆలోచించసాగాను... డబుల్ రొట్టి ఉంటుంది. హల్వా చేస్తుంది. రుచిగా, వేడిగా కాఫీలు ఇస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తు, అయాచితంగా చవీవా చేసే నవ్వుల విందు ఒక ఎత్తు. ఆమె నవ్వు నాలో కోటి విద్యుత్తులు ప్రసరిస్తుంది. ఆమె కాక మరే స్త్రీ డ్యూటీలో ఉన్నా ఈ వేడి ఉండదు. సరదా ఉండదు. వారంతా యంత్రాలవలె పనిచేస్తారు. చవీవా అలా కాదు. కలుపుగోలుగా మాట్లాడుతూ టిఫిన్ పెడుతుంది. ఆమె డ్యూటీలో

ఉంటే నేనూ ఉత్సాహంగా ఉంటాను. ఇద్దరం యౌవన ప్రాంగణంలో అడుగుపెట్టడమే ఇందుకు కారణం.

ఈ వయస్సులో యువతీయువకులకు ప్రతి మాటలో శ్లేషార్థం ద్యోతకమవుతుంది. ప్రతి భంగిమలోను శృంగారం కనిపిస్తుంది. అందుకే ఆమె మాటలు నాలో వేయి రాగాలు పలికిస్తాయి. ఆమె సాన్నిధ్యం వేయి కలలు రేపుతుంది.

అరబ్బీ ఫక్కీలో నెత్తికి తలపాగా చుట్టుకొని "సరే పదా!"- అని చౌకీదారుతో వంటశాల వైపు దారి తీశాను. రాళ్ళను దాటుకొంటూ ఇద్దరం వంటశాల చేరాము. నేను లోపలకు వెళ్ళాను. ఎర్రటి మంటల కాంతిలో లోపల జేగురు రంగు కనిపించింది. మేజా బల్లకు ఒక చివర చవీవా మహా రాణివలె కూర్చుని ఉంది. నిద్రచాలక కాబోలు ఆమె కనులు అలసటగా వున్నాయి.

నన్ను చూస్తూనే ఆమె ఒక కప్పులో కాఫీ పోసి నా ముందుకు తోసింది.

"ఆ గిన్నెల్లో హల్వా, డబుల్ రొట్టి ఉన్నాయి. ఎంత కావలసి వస్తే అంత తీసుకోవచ్చు"- అంది ముక్తసరిగా నేల చూపులు చూస్తూ. నేను కాఫీ 'సిప్' చేశాను...

"బ్రహ్మాండం! కాఫీ చాలా బాగుంది. నీ



చేతుల్తో ఇచ్చిన కాఫీ మధురాతిమధురం” అన్నాను ఓరగా చవీవా వంక చూస్తూ. ఆమె మాట్లాడలేదు. అలవోకగా చూసింది. అంతే!

“కాఫీకి ఇంత రుచి ఎలా వచ్చింది? ” ఆమెను మాట్లాడించాలన్న ఉద్దేశంతోనే సూటిగా ప్రశ్నించాను.

“ఏమో! నాకేం తెలుసు!” అని ఆమె మరికొంత కాఫీ కప్పులో పోసింది.

“చవీవా! నీకు చాలా విషయాలు తెలీవు. నువ్వొక అద్భుతమైన రోజా పువ్వులా ఉంటావని నీకు తెల్సా? లోకంలో ముళ్లులేని రోజాలే లేవు. కానీ నువ్వు ముళ్ళులేని గులాబీవి. నీ శరీరాన్ని స్పృశించాలని నాకెంత ఆరాటమో తెల్సా? ” నేనింకా ఏదో అనబోయాను... అందుకు ఆమె ఆస్కారం ఇవ్వలేదు. తను నిలబడిన చోటు నుండి తటాలున వెనక్కి

అనువాదం :
పురాణపండ రంగనాథ్

తిరిగింది.

“అంత ఆరాటం పనికిరాదు”... అంటూ నా వైపు చూడకుండానే చకచకా ప్రక్క గదిలోకి వెళ్ళిపోయింది. ఆమె అందినట్లు కనిపిస్తుంది, కాని అందదు!

నేను టిఫిన్ పూర్తి చేసుకొని, రివాల్వరు సరిచూసుకొని గొర్రెల మందల వైపు వెళ్ళాను. తోడేళ్ళ భయం వల్ల గొర్రెమందలను ఉంచిన బయళ్ళచుట్టూ కంచె వేసి, రాత్రి దీపాలు పెడతారు. ఆ కాంతి దివ్యంగా కనిపిస్తోంది.

★ ★ ★

ఇది గొర్రెలు ‘ఎద’కు వచ్చే రుతువు. పాలిచ్చే రోజులలో ఏ గొర్రెలు ఎన్ని పాలు ఇచ్చినదీ రికార్డు చేస్తారు. దానిని గుర్తు పెట్టుకొంటారు. ఇలాగే మేలు జాతి పొట్టేళ్ళను సిద్ధం చేస్తారు. ఈ రకంగా పొట్టేళ్ళను, గొర్రెలను వర్గీకరిస్తారు. గొర్రెలు ఎదకు వచ్చే సమయంలో ఒక పొట్టేలును మందతో తీసుకువెళ్తారు. దానికి లంగోటా బిగిస్తారు. రుతుకాలం రాగానే దానిని వదిలిపెడతారు. అది ఎదకు వచ్చిన గొర్రెను పసికడుతుంది. ఆ గొర్రెను వేరు పరుస్తారు. అది ఏ తెగకు చెందినదో వివరం చూసి, దానికి సరిజోడి అయిన పొట్టేలుతో వదిలిపెడతారు. రెండుసార్లు సంపర్కం చేయిస్తారు. ఇతర రోజులలో ఈ పొట్టేళ్ళను ఎత్తైన గోడలు గల దొడ్లలో బంధిస్తారు. లోపల నుండి అవి చేసే ఛీత్కారాలు, కొమ్ములతో తలుపులు బాదుతున్న శబ్దాలు వినిపిస్తుంటాయి.

పొట్టేళ్ళ పెరడు దగ్గరకు వచ్చాను. ఆవాళ ఎదకు వచ్చే గొర్రెలను పసిగట్టే గూఢచారి పొట్టేలుని చూశాను. అది మేలుజాతిది. నల్లగా, ఏపుగా, దృఢంగా పెరిగిన ఆ పొట్టేలు కొమ్ములు వాడిగా సుడులు తిరిగి ఉన్నాయి. చాలా అందంగా పురుషాకారానికి ప్రతీకగా ఉందది. నేను దానికి లంగోటా బిగించాను. దొడ్డి తలుపు తెరిచాను. ప్రక్కనే గొర్రెల మందలున్నాయి. అది ఒక్క ఉదుటన బయటకు వెళ్లింది.

ఒక చోట నిలిచిపోయింది. గిట్టలతో నేలను దువ్వింది. ముక్కుతో మన్నును వాసన చూసింది. నోరును వింతగా తిప్పింది. దాని శరీరంలో వింత వూపు కాన వచ్చింది. తదేకంగా చూస్తూ అది పళ్ళు కనిపించేలా నోరు తెరిచింది. ఎదకు వచ్చిన గొర్రె శరీరం నుండి వింత వాసన వస్తుంది. ఆ వాసనను పొట్టేలు పసికడ్తుంది. అదే జరిగింది. పొట్టేలు నాసికాపుటాలు ఎగురవేసింది. ఒక్క వుదుటన గెంతి మందలో ఎదకు వచ్చిన గొర్రె దగ్గరకు పరుగుపెట్టింది. ఆ గొర్రె కొంచెం బెదిరింది. పొట్టేలు దాని వెంట పడింది.

ఆ సమయంలో పొట్టేలు ముఖంలో కాముక ప్రవృత్తి స్పష్టంగా కనిపించింది. దాని కళ్ళలో ఎరుపు జీరలు. అది ఉద్రే కంగా ఉంది. పొట్టేలును వెంబడిస్తోంది. 'ఎదకు వచ్చిన గొర్రె వెనక పొట్టేలు'- ఆ దృశ్యాన్ని తదేకంగా చూస్తున్న నా వెనక 'కిల కిల' నవ్వు వినిపించింది. నా ఏకా గ్రత భగ్నమైంది. వెనక్కు చూశాను.

ఆ దృశ్యాన్నే చవీవా కూడా తదేకంగా చూస్తోంది. ఆమె ముఖంలో ఎటువంటి వికార భావాలు లేవు. చాలా సహజంగా, సరళంగా ఆ దృశ్యాన్ని ఆమె చూస్తోంది. ఈ ప్రాంతం ప్రజలకు కృత్రిమత్వం తెలి యదు. అందుకే వాళ్ళంటే నాకెంతో ఇష్టం. సహజత్వం మూర్తీభవించిన వాళ్ళంటే అప్పుడప్పుడు నాకు ఈర్ష్య కూడా కలుగుతుంటుంది.

"చవీవా! ఇప్పుడు నువ్వు నిద్రపో తావా? " ఆమెను ఏదో విధంగా పలకరిం చాలని నేన్ను ప్రశ్నించాను.

"చెప్పలేను. కానీ ఆ తర్వాత నేను మైఖే ల్ తో కలిసి ఈదులాడతాను"- చవీవా పొడిపొడిగా సమాధానం చెప్పింది. ఆమె కళ్లలో మెరపు నన్ను విచారితుణ్ణి చేసింది. నన్ను ఏడిపించాలనే ఆమె మైఖేల్ పేరు చెప్పిందని నేను పసిగ ట్టాను. ఆమెను నావైపు తిప్పుకోవాలని ఇలా అన్నాను.

"చవీవా! మధ్యాహ్నం నేను విశ్రాంతి తీసుకునే చోటుకు నువ్వు ఎందుకు రావు? సెలయేటి ప్రక్కన చెట్ల నీడన ఎంత చల్లగా అందంగా ఉంటుందనుకొన్నావ్! అక్కడ ద్రాక్ష పళ్ళుంటాయి. రేగిపళ్ళుం టాయి. అక్కడ మనిద్దరం ఏకాంతంగా కలుసుకొనవచ్చు"

నేనీ మాటలు అంటూనే, ధైర్యంచేసి ఆమెను గట్టిగా కౌగిలించుకొన్నాను. కాని ఆమె గింజుకొని నాకౌగిలి నుండి దూర మైంది.

"యాకోబ్ ఈ గులాబీకి ముళ్ళున్నాయి" అని ఆమె కోపంగా చూసి, అక్కడ నుండి రుసరుస వెళ్లిపోయింది.

నా అభిమానం దెబ్బతింది. ఆమెకు ఎంత గర్వం! ఎంత నిర్లక్ష్యం!! కాని ఆమె అందానికి నేను బానిసను. అలా అని భీరువును కాలేని ఆంగ్లోశాక్రన్ మనస్తత్వం నాది.

నేను తమాయించుకొన్నాను. గొర్రెల మందవైపు చూశాను. ఎదకు వచ్చిన గొర్రె దగ్గర పొట్టేలు నిస్సహాయంగా నిలబడిచూ స్తోంది. అది అలసిపోయి ఉన్నది. దాని దగ్గరకు వెళ్ళాను. లంగోటా విప్పాను. అది ఒక్క ఉదుటున ముందుకు లంఘిం చింది. అప్పుడు నాకు అనిపించింది.

'ఇంతకాలం నేనూ కట్టుబాట్లకు బందీని. పొట్టేలుకు లంగోటా వలె, నా మనస్సును ఆంగ్లోశాక్రన్ కట్టుబాట్లు బంధించి ఉంచాయి. అవి నా వ్యక్తిత్వాన్ని నెరవేరనివ్వవు. అంతే!'

మరి చవీవా నుండి దృష్టి మరలడం లేదే! అసలు నేను చవీవాను సరిగా అర్థం చేసుకొన్నానా? లేదేమో! ఆమెను తప్పుగా అంచనా వేసుకొన్నానేమో? ఆమె 'లజ్జ'ను కోపంగా, ఆమె సరళ సహజవర్తనను 'కాముకత'గా భావిస్తున్నానేమో!

మరి ఆమె ఎందుకు నన్ను వెంబడిస్తుంది? కోరగా ఎందుకు చూస్తుంది? ఉసిగొలుపుతుంది ఎందుకు? కసి పుట్టిస్తుంది ఎందుకు?

నేను ఆలోచనల బరువుతోనే కర్ర తీసుకొని గొర్రెల్ని అదిలించాను. అవి జరజర బీళ్ళ వైపు నడవసాగాయి.

★ ★ ★

ఏ కల్మషాలులేని ఈ చల్లటి వాతావరణంలో మనుష్యులకు, గొర్రెలకు మధ్య ఆత్మీయతా భావం పెనవేసుకొన్నది. అయితే గొర్రెలకు, కాపరులకు మధ్య మాత్రం శతాబ్దాలుగా నౌకరు, యజమాని- అనే భావం కొనసాగుతోంది.

కాపరులు తమ చేతుల్లోని పొడవాటి సన్నటి కర్రలతో ర్! ర్! ర్! అని గొర్రెల్ని అదలిస్తుంటారు. వారెప్పుడూ వాటిపై కోపగించరు. అనవరంగా గడబిడ చేయటం అనాగరిక లక్షణం. జీవన సత్యం తెలిసినట్లు వారు వ్యవహరిస్తారు.

కాపరుల వెంట గొర్రెలు సుశిక్షిత సైనిక దళాలవలె బారులు తీరి నడుస్తాయి. కాపరి వెనక్కు చూసుకొనవలసిన పని లేదు. అతడు వెనక్కు తిరిగి చూస్తే కొన్ని వందల గొర్రెలు మోరలెత్తి అమాయకంగా చూస్తాయి. యజమాని చెప్పినట్లు చేయడానికి అవి సిద్ధంగా ఉంటాయి. యజమాని పట్ల వాటికి అచంచల విశ్వాసం.

ఎప్పుడైనా కాపరి కొత్తదారి పడ్తే అర క్షణ కాలం ఆగిపోతాయి. ముట్టెలెత్తి ప్రశ్నార్థకంగా చూస్తాయి. వెంటనే యజమాని వెంట నిస్సంకోచంగా నడిచిపోతాయి. 'నువ్వేం చేసినా ఆలోచించి చేస్తావనే విశ్వాసం మాకుంది' అన్న ధీమాతో అవి కదలిపోతాయి. యజమాని వెంట అవి కొండ చరియలు ఎక్కుతాయి. లోయలలో నడుస్తాయి. 'షు షు' అంటూ నడుస్తాయి. పచ్చిక బీళ్ళను కోసే యంత్రాల వలె అవి క్రమబద్ధంగా గడ్డి మేస్తుంటాయి. తర్వాత వాటిని పొలాలకు తోలుకు వచ్చి ధాన్యం దాణా వేస్తారు. గాజుగోళీలు దొర్లుతున్నట్లు ధ్వని చేస్తూ దాణా మేస్తాయి. మధ్యాహ్నం కాగానే మందల్ని చెట్ల నీడకు, సెలయేటి తీరాలకు తోలుకు వస్తారు. కడుపు నిండా నీరు త్రాగి అవి తలలు ముడుచుకొని శిలాప్రతిమలవలె విశ్రమిస్తాయి. అలా రెండు గంటలు అవి పడుకొంటాయి. ఆ సమయమే మాకు ఆటవిడుపు. భోజనాలు చేస్తాం. సెలయేటి ప్రక్కన అల్లుకొన్న ద్రాక్ష లతల నుండి పళ్ళు కోసుకొని యథేచ్ఛగా తింటాం. అంజీరా ఫలాలు, బాదం కాయలు మాకు అల్పాహారాలు. సెలయేటి నీళ్ళు మాత్రం గొంతును సుతారంగా కోస్తున్నంత చల్లగా ఉంటాయి.

గొర్రెల కాపరులవలె ఎవ్వరూ నిశ్చింతగా విశ్రమించలేరనిపిస్తుంది. పట్టణాలలో వారికి ఇటువంటి విశ్రాంతి దొరకదు. ఇది ఒక వరం. కాపరులు కటిక నేలపై నిద్రించగలరు. కోసిన చేలల్లో గడ్డి పరుచుకొని విశ్రమించగలరు. రాతి మీద తల పెట్టుకొని నిశ్చింతగా కునుకు తీయగలరు. వాళ్ళు ప్రకృతి పుత్రులు. ఆ మాత ఒడిలో 'నిర్భయం' వారికి సహజ వరం.

★ ★ ★

మధ్యాహ్నం విశ్రాంతి సమయం. సెలయేటి ఒడ్డున రాతికి ఆనుకొని కూర్చొని

‘మనిషి’ ప్రకృతి అంతర్భాగం



ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందించే ఘనత ఒక్క ‘విపుల’ మాసపత్రికకే సొంతం. వీలైనప్పుడల్లా ‘విపుల’ చదివి ఆనందిస్తుంటాను. 1979 మార్చి సంచికలో పన్నెండు కథలూ బావున్నాయి. వాటన్నింటిలో నాకు ఓరాహమ్ ఆదస్ రాసిన ‘రుతువు’ అనే ఇజ్రాయెల్ కథ నచ్చింది. ఈ కథే నచ్చటానికి చాలా కారణాలున్నాయి. జంతువులు- ప్రకృతి- మనిషికీ ఉన్న సంబంధం, రుతువులు మన మనసుపై చూపే ప్రభావం - చాలా అందంగా, సహజంగా ఆవిష్కృతమయింది ఈ కథలో. అంతేకాదు, యవ్వనంలో ఉన్న స్త్రీపురుషుల మధ్య ఉండే ఆకర్షణ, వాంఛలను ప్రకృతితో మేళవించి రాయడంలో రచయిత ఎంతో నేర్పు చూపాడు. ఇరువురి మానసిక బంధాన్ని స్పష్టం చేయడంలో రచయిత శైలి మనోహరంగా సాగిపోయింది. సరైన రుతువులోనే పుష్పం నిండుగా వికసిస్తుంది, హసిస్తుంది, పరిమళాలు వెదజల్లుతుంది. ఆ రహస్యం తెలుసుకోగలిగిన పురుషుడు స్త్రీ సాంగత్యాన్ని కైవసం చేసుకోగలడు. యవ్వనంలో వేగిరపాటు ఎక్కువ. కోరిన వెంటనే పొందాలనే ఆరాటం, తపన అధికంగా ఉంటాయి. కానీ పురుషుడు స్త్రీని బలవంతంగా లొంగదీసుకోవడం సరి కాదు. స్త్రీ తనంతట తానుగా ఇష్టపడి చేరువైతేనే స్వర్గం అందుతుంది. ఈ విషయాన్ని ఈ కథలో రచయిత చాలా ఇంపుగా, సొంపుగా చెప్పగలిగాడు.

స్త్రీ అంతరంగాన్ని అర్థం చేసుకోవడం అంత సులువేమీ కాదు. నైపుణ్యం కావాలి. పవిత్రత ఉండాలి. తొందరపాటు పనికిరాదు. అప్పుడే వనిత వలచి వస్తుంది. మందార మకరందం శ్రీగంధమై గుబాళిస్తుంది.

ఈ కథలో చవీవా కోసం యాకోబ్ ఆరాట పడతాడు. ఆమె మాత్రం అడుగు ముందుకు వేయదు. ఈ ఆకర్షణ, సంఘర్షణల్లో గొర్రెలు, పొట్టేళ్లు మంచి పాత్ర నిర్వహిస్తాయి. ప్రకృతి సహకరిస్తుంది. అలా జంతువులకు, మనుషులకు, ప్రకృతికీ ఉన్న అనుబంధాన్ని చిక్కగా, చక్కగా చెక్కగలిగాడు రచయిత. అందుకే ఈ కథ నాకు బాగా నచ్చింది.

– జయంపు కృష్ణ, సినీ దర్శకులు

బహుముఖ ప్రజ్ఞావంతులు

జయంపు కృష్ణ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. చిరకాలంగా సాహిత్యరంగంలోనే కాక, సినీ నాటక రంగాల్లో కూడ తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. వీరు స్పృశించని రచనా పార్శ్వం లేదు. లెక్కకు మిక్కిలి కథలు, నవలలు, కవితలు, పాటలు, వ్యాసాలు, నాటకాలు, కలం మిమిక్రీ, హైకూలు, శతకం, పత్రికా-సినిమా-రేడియో-దూరదర్శన్ రచనలు వెలువరించింది ఆయన కలం. వీరి కథలు, నవలలు ఇతర భాషల్లోకి అనువదితమయ్యాయి. అనేక సినిమాలకు రచనా దర్శకత్వ సహాయాలు అందించారు. నాటకాలు రచించి, నిర్వహించి, నటించి సన్మానాలు, సత్కారాలు పొందారు. అనేక పత్రికలకు సంపాదకత్వం వహించారు. సంపూర్ణ అక్షరాస్యతా కార్యక్రమంలో విద్యావేత్త. తెలుగు భాషా వికాస పురస్కారం, సాహిత్య అకాడమి పురస్కారం, గవర్నర్ పురస్కారంతో బాటు అనేక అవార్డులు ఆయన్ని వరించాయి. వీరి నవలలు, కథలపైన విద్యార్థులు పిహెచ్‌డి కూడా చేశారు.

క్రింద దూరంగా కనిపిస్తున్న ఎండిన చేల స్వర్ణ సౌందర్యాన్ని చూస్తున్నాను. ఎదురుగా గొర్రెల ఉచ్ఛ్వాస నిశ్వాసల ధ్వని వినవస్తోంది. దూరంగా ట్రాక్టరు ధ్వని సంగీతాన్ని సృష్టిస్తోంది. ఆ లయబద్ధమైన వాతావరణంలోనే నేను మధ్యాహ్నం విశ్రమిస్తాను. అయినా తోడేళ్ళు ఎప్పుడు వస్తాయో తెలియదు కనక అప్రమత్తంగానే ఉంటాను. తుపాకి ప్రక్కనే ఉంటుంది.

ఈ సమయంలోనే అప్పుడప్పుడు చదువుతుంటాను. ఇవాళ బాగా చదవాలనిపించడం లేదు. దగ్గర చార్లెస్ లాంచ్ పుస్తకం ఉంది. అయినా తెరవబుద్ధి కాలేదు. ఆలో

చనల బరువు, కోరికల భారం నన్ను కుది పివేస్తున్నాయి. ఆ భారం తగ్గుతుందేమో నని కళ్ళు మూసుకొన్నాను.

కనురెప్పల సంగమ స్థలంలో ఆలోచ నల భారం కేంద్రీకృతమై మనస్సును క్రుంగదీస్తోంది. ఇంతలో శరీరానికి తగి లిన ఒక మధుర స్పర్శతో కనులు తెరి చాను. చవీవా కోమలాంగుళులు నా కను రెప్పల్ని నిమురుతున్నాయి. ఆమె సుకు మార శరీరం నన్ను ఆవరించింది. మొదట సిగ్గుపడ్డాను. అంతలోనే తేరుకొని ఆ యువతి సుమపేశల శరీరాన్ని కౌగిట బంధించాను. ఆమె పెదాలు చుంబిం చాను. చవీవా నా సొంతమైంది.

మా క్రింద ఎండిన ఆకులు 'గరగర' శబ్దం చేశాయి. ఆ చప్పుడుకు గొర్రెలకు నిద్ర చెదిరిపోయింది. మమ్మల్ని చూసి కాబోలు అవి ఆశ్చర్యంగా లేచాయి. నేలను గిట్టలతో తవ్వసాగాయి.

"చవీవా! నీ ఈ మాదక శరీరం, నీ మత్తుకనులు, ఈ పచ్చని ఆకుల పాన్పు, నీ ఆత్మార్పణం..."

నాకు మాటలు పెగల లేదు. మేం ఇద్దరం ఏకమైనాం. తర్వాత ఒకరిపక్క ఒకరు దగ్గరగా పడుకొన్నాం. లోయలో నుండి వస్తున్న చల్లటి గాలి చెమటను ఆర్పి సుఖ స్పర్శ కలిగిస్తోంది. శరీరం బరువు తీరిన ఘడియ అది. ఆనందాతిరే కంతో చాలాసేపు మేం మాట్లాడుకోలేక పోయాం. హఠాత్తుగా చవీవా తనకు సహ జ సిద్ధమైన ఫక్కీలో కిలకిల నవ్వింది.

"నీకు తెల్సా! యాకోబ్.." ఆమె ఇంకా ఏదో చెప్పబోయింది. కానీ నవ్వు తెర అడ్డువచ్చింది. ఆమె నవ్వును ఆపుకోలేకపో యింది. నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. ఆమె నవ్వును హఠాత్తుగా ఆపేసి అంది.

"నీకు తెల్సా? యాకోబ్..." ఆమె ప్రశ్నించింది. నేను అయోమయంగా చూశాను.

"నిన్ను చూస్తే నాకు ఆ పొట్టేలు గుర్తు వస్తుంది. ఉదయం దానిముఖంలో ఎటు వంటి భావాలు ఉన్నాయో నీలోనూ అవే భావాలు" అంటూనే ఆమె మరల పకపక నవ్వసాగింది.

నేను కృత్రిమ కోపం నటిస్తూ 'ష్!' అని కోరిక తీరిన నా మనస్సు సృజించిన సిగ్గు తెరలు ఆవరించిన నా ముఖాన్ని ఆమె ఉన్నత వక్షంలో దాచుకొన్నాను.

గమనిక: *ఈ శీర్షికలో ప్రచురిస్తున్న ఆయా భాషల కథలు విపులలో తెలుగు అనువాదంగా వెలువడి 35 ఏళ్లయిందని గ్రహించగలరు. మొద టిసారి మూల రచయిత / అనువాదకులకు విపుల పారితోషికం చెల్లించింది కనుక వారికి మరోసారి పారితోషికం ఉండదని మనవి* V

Ⓐ1 జోక్

★ ఒత్తిడి , ఉద్రిక్తత , భయాందోళన - మూడిటికీ తేడా ఏమిటి?

ఒత్తిడి: భార్య గర్భవతిగా ఉన్నప్పుడు కలిగేది

ఉద్రిక్తత: ప్రియురాలు గర్భవతిగా ఉన్నప్పుడు కలిగేది

భయాందోళన: ఇద్దరూ గర్భవతులైనప్పుడు కలిగేది!



★ శోభనపు రాత్రి పడక గదిలో

భార్య: ఏమండీ నాకు చాలా టెన్షన్‌గా ఉందండీ

భర్త: మొదటిరాత్రి కదా, అలానే ఉంటుంది

భార్య: అవును, రాత్రిపూట మొదటి సారే

అది రోగం - ఇది చట్టం



ఒక మనిషి తిండి తినటం మానేస్తే దానికి అనేక శాస్త్రీయ కారణాలు

★ జీర్ణశక్తి సక్రమంగా లేక తిండిమానేస్తే
– అది రోగం

★ ఇరుగుపొరుగుల ఆంక్షల వలన తిండి మానేస్తే
– అది చట్టం

★ అన్నంలో విషం కలుస్తుందనే సందేహంతో తిండి మానేస్తే
– అది మనస్తత్వ శాస్త్రం

★ ప్రజాదృష్టిని ఆకర్షించటానికి తిండి మానేస్తే
– అది రాజకీయం

★ తినటానికి తిండి లేక తినటం మానేస్తే
– అది ఆర్థిక శాస్త్రం



ఇతి'హాసం'

★ "కాసిని మంచినీళ్ళివ్వవే... చాలా దాహంగా ఉంది"
– భార్యతో వరుణుడు

★ "అలా వెన్నెల్లో తిరిగి వద్దామా? "
– తారకతో చంద్రుడు

★ "చాలా వేడిగా ఉంది. విసనకర్ర ఇలా తీసుకురా"
– భార్యతో అగ్ని

★ 'రేపు చాలా పనుంది. పెందలాడే నిద్ర లేపు'
– ఊర్మిళతో లక్ష్మణుడు

★ 'నాథా! మాంచి ఆకలిగా ఉంది, కాస్త తొందరగా వంట చేయరూ'
– భీమునితో పాంచాలి



భోజన మర్యాదలు

ఈ రోజుల్లో చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలు వెళ్ళటం పరిపాటి. మన అలవాట్లు, అక్కడివారి అలవాట్లు చాలా విషయాల్లో వేరుగా ఉంటాయి. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ ఎదురయ్యే సందర్భం 'భోజనం'. మన భోజన మర్యాదలు (టేబుల్ మ్యానర్స్) మన గురించి సానుకూల అభిప్రాయం కలుగజేస్తాయి. ఇతరులు గమనించే అవకాశమున్న ఈ అలవాట్లు మన వృత్తిలో సఫలతకు కూడా దోహదపడతాయి. అందుకే టేబుల్ ఎటికెట్ తెలుసుకోవడం ఎంతైనా అవసరం!

★ హోటల్లో టేబుల్ బుక్ చేశారా?

చెప్పిన సమయానికి వెళ్ళలేకపోతే వారికి తెలియజేయాలి. ఎంత ఆలస్యమౌతుందో చెప్పాలి. ఎందుకంటే చాలా రెస్టారెంట్లు, హోటళ్లు 'నో షో' రుసుము వసూలు చేస్తాయి. అంటే మీరు వెళ్ళకపోయినా డబ్బులు వదుల్తాయనమాట.

★ ఎవరి ఇంటికైనా అతిథిగా వెళ్తుంటే

ఆలస్యంగా వెళ్ళొద్దు. వీలైతే ఓ పదినిముషాలు ముందే వెళ్ళండి. ఏదైనా చిన్న బహుమతి తీసుకెళ్ళడం మర్యాద. మీరు తీసుకెళ్ళిన పదార్థం విందులో వడ్డించాలని ఆశించకూడదు.

★ డ్రెస్ కోడ్ ఏదైనా ఉంటే అది తప్పనిసరిగా పాటించండి.

★ అమరిక

ఫార్మల్ డిన్నర్ పార్టీల్లో ఎవరు ఎక్కడ కూర్చోవాలో పేరు రాసి ఉంచుతారు. అక్కడ కూర్చోవటమే మర్యాద. పేరు రాసి పెట్టకపోతే మీ ఆతిథేయులు ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చోవాలి. సాధారణంగా ఆడ-మగ-ఆడ-మగ ఇలా ఉంటుంది ఏర్పాటు.

★ ఫోన్‌ను మౌనంలో ఉంచి జేబులో పెట్టుకోవాలి. టేబుల్ మీద కాదు. సాధ్యమైనంత వరకూ భోజన సమయంలో ఫోన్ కాల్ తీసుకోవద్దు.

★ ప్రార్థన

భోజనానికి ముందు చేసే ప్రార్థన తెలియకపోతే మౌనంగా ఉండటం మేలు. టోస్ట్ చేస్తుంటే తప్పకుండా కలవాలి. యజమాని/ అధికారి నిలబడి టోస్ట్ ఇస్తుంటే మీరూ నిలబడాలి.

★ కూర్చున్నాక నాప్‌కిన్ విప్పి ఒళ్ళో పరుచుకోవాలి. దాంతో ప్లేట్లు, ముఖం తుడవటం చేయ



కూడదు. లేచి వెళ్ళేప్పుడు దాన్ని బల్లమీద ఎడమవైపున ఉంచాలి. ప్లేట్లో కాని కుర్చీలో కాని వదలకూడదు.

★ మోచేతులు బల్లమీద ఆన్చకూడదు. ఎడమచేతిని ఉపయోగించనప్పుడు ఒళ్ళో పెట్టుకోండి.

★ అందరికీ వడ్డన పూర్తయ్యాకే తినడం మొదలుపెట్టాలి.

★ వేడి పదార్థం చల్లారేవరకూ ఆగాలి. అంతేకానీ ఉఫ్ ఉఫ్‌మని ఊదకూడదు. నోరు పట్టనంత ముద్దలు కాకుండా చిన్న చిన్న ముద్దలు తినడం మర్యాద.

★ వడ్డించిన పదార్థాలన్నీ కాస్త అయినా రుచి చూడాలి. అంతగా నచ్చకపోతే వదిలేయచ్చు. వడ్డించుకునేటప్పుడే కొంచెం కొంచెం వేసుకుంటే ఇబ్బంది ఉండదు. ఉప్పు తక్కువైతే కలుపుకొని తినాలి తప్ప 'ఇదేంటి ఇందులో ఉప్పు ఇంత తక్కువ వేశారు మీకు బీపీనా' వంటి ప్రశ్నలు వేయకూడదు.

★ డిన్నర్ పార్టీలు పరిచయాలు పెంచుకోవడానికి మంచి సందర్భాలు. కాబట్టి అందరితో మాట్లాడటం అవసరం. గొంతు చించుకోనవసరం లేదు. ఆహ్లాదకరంగా, ఉల్లాసంగా మాట్లాడాలి.

★ పెద్దపెద్ద చప్పుళ్లు చేస్తూ తినడం అస్సలు మర్యాద కాదు. ఎసిడిటీ ఉన్నవారు (త్రేన్పులు వగైరా రాకుండా) ముందుగా జాగ్రత్తపడాలి.

★ నోట్లో ఆహారం ఉంచుకొని మాట్లాడడం చాలా అమర్యాదకరం. చెంచాలో, ఫోర్క్‌లో ఆహారం ఉంచి దాన్ని గాల్లో ఊపుతూ మాట్లాడద్దు.

★ టేబుల్ మీద దూరంగా ఉన్న పదార్థం కావాలంటే ఇవ్వమని అడగాలి. వంగి తీసుకోవటం అమర్యాద. ఇతరులకు అందించేప్పుడు మధ్యలో ఆపి మనం వడ్డించుకోవటం కూడా అమర్యాదే! మనమే అందిస్తున్నట్టయితే చేతికి ఇవ్వడం కన్నా టేబుల్ మీద పెడితే ఆ దగ్గర్లో ఉన్నవారందరూ కూడా తీసుకునే అవకాశం ఉంటుంది.

★ ప్లీజ్ అనడం మర్యాద. అలాగే, వెయిటర్లు పళ్ళాలు, చెంచాలు తీస్తున్నప్పుడు థాంక్స్ చెప్పడం మరవద్దు.

★ సాస్/వెన్న గిన్నెలోనే చిప్స్/బ్రెడ్ ముంచటం సరి కాదు. ముందు గిన్నెలోంచి మన పళ్ళెంలోకి వడ్డించుకోవాలి.

★ కింద పడ్డ గరిటెల్ని చెంచాల్ని తీయకూడదు. పదార్థం కింద పడితే మన నాప్‌కిన్‌తో తుడవాల్సిన అవసరం లేదు.

★ అందరికంటే వేగంగా కాని, నెమ్మదిగా కాని తినకండి. అందరి భోజనం పూర్తయ్యాకే లేవడం మర్యాద.

★ భోజనాల బల్ల దగ్గర టూత్‌పిక్ వాడకూడదు. మేకప్ సరిచేయకూడదు. టేబుల్ వదిలి వెళ్ళాల్సొస్తే 'ఎక్స్క్యూజ్ మీ' లేదా 'ఇప్పుడే వస్తాను' అని చెప్పాలి. రెస్ట్‌రూమ్‌కి వెళ్తున్నాను అని చెప్పాల్సిన అవసరం లేదు.

★ చాలామంది తినడం పూర్తయ్యాక



పళ్ళాన్ని దూరంగా నెడుతుంటారు. ఇది సరి కాదు. ఎలాగూ వెయిటర్ వచ్చి తీసేస్తాడు కాబట్టి ఎక్కడివక్కడ వదిలెయ్యాలి.

★ టీ కాఫీలు ఇస్తుంటే విందు ముగిసిందని అర్థం. మనం వెళ్ళిపోవచ్చు, లేదా వారు ఉండమంటే ఉండచ్చు. ఈ సమయంలో ఫార్మాలిటీ ఉండదు, సరదాగా గడపచ్చు.

★ కృతజ్ఞతలు


ఫార్మల్ డిన్నర్ పార్టీ అయ్యాక థాంక్యూ నోట్ పంపడం మర్చిపోకండి. బాగా పరిచయమున్నవారైతేనే ఫోన్ చేయండి.


– విక్రమ్


'సరసిజ


చాల్లేవమ్మా తెలియకపోతే అడగాలి గానీ - 'ఎంటర్ యువర్ పిన్'
అంటే చెంపపిన్ను తీసి దూర్చుతావా?






రాహువు ఏడవ స్థానంలో... కేతువు తొమ్మిదో స్థానంలో...
భయంకర సిద్ధాంతి
అవి సరే.. అయ్యగారి స్థానం పదిలమో.. కాదో.... కాస్త చూసి చెప్పండి....!!
PA



మా ఆయన నోటి దగ్గర కట్లు విప్పితే... ఉగాది పచ్చడి పెడతాను డాక్టర్..!!
EMERGENCY WARD
వి. రామకృష్ణ


భలేవాడివే... మా ఆవిడ నిర్వాకం కాదు.. అటకమీద పిల్లి సామాన్లు తోసింది...
రఘు


సన్నబడ్డానికి నేనిచ్చిన టానిక్ సంవత్సరానికి వాడాలయ్యా... అంతా ఒకేసారి వేసేసుకుంటే ఎలా...?!!
డాక్టర్ బకేశ్వరరావు
శేఖర్



దొంగలు ఎప్పుడూ పెరటివేపు నుంచే వస్తారని మన్ని అటువేపు కట్టేసారు! వాళ్ళు రాత్రి వీధి గుమ్మం లోంచి వచ్చారు! మరి మనం ఔట్ ఆఫ్ కవరేజ్ ఏరియా లో ఉన్నామాయె!
SARMA


మాఇద్దరి పెళ్ళిఫోటోలూ.....
"ఫేస్‌బుక్‌లో పెడితే.... సంవత్సర
కాలంగా ఒకటి "లైక్" రాలేదండీ...!!
అందుకే మేం విడాకులు
తీసుకోవాలనుకుంటున్నాం...!
లాయర్
నాగ్రాజ్.


ఈ నెంబరు గల వ్యక్తి మనుగడ లో లేడు!
దయ చేసి..ఇంక ఇతనికి ఫోన్ చేయకండి!!
SARMA

గీతాబోధ

క్యారికేచర్స్ గీయటం
చాలా సులభం.
ఒక నిలువుగీత, (/)
అర్ధచంద్ర గీత (( ) గీయగలిగిన
వారంతా వీటిని గీయవచ్చు.
ఎలానో చూద్దాం.



తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత బొమ్మ తయారైపోయిందోచ్!

- శ్రీధర్ (ఈనాడు కార్టూనిస్ట్)

ఇట్లు

★ 'విపుల'కు 37వ జన్మదిన శుభాకాంక్షలు. ఫిబ్రవరి సంచికను చాలా అందంగా ముస్తాబు చేశారు. 'రొమాంటిక్ స్పెషల్'లో కథలన్నీ రసవత్తరంగా ఉన్నాయి. ప్రతికథనూ తనివి తీరా ఆస్వాదించాం. ఫ్రెంచ్ కథ 'వీలుకాని విరహం'లో యువగాయకుడు అమ్మాయిల అందాలకు లొంగిపోక మనోనిబ్బరంతో తన పిల్లలపై అపేక్షను చూపడం యువకులందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంది. '35 ఏళ్లనాటి విపుల కథ' 'సంధి' చాలా బాగుంది. సరదాగా సాగిపోయే కొత్తశీర్షిక 'రింగ రింగా రింగ రింగారే..'ని యువత కోసం ప్రారంభించినందుకు కృతజ్ఞతలు. కవితాసుత్తిని తట్టుకోలేక రాసిన 'ఉత్తరాస్కేల్' బాగుంది. మళ్లీ ఉత్తరాలు రాయాలన్న ఆలోచనకు ప్రాణం పోసిందీ శీర్షిక.

– *పల్లా పవన్‌కిశోర్*, ప్రొద్దుటూరు,

– *వానపల్లి వాసిని*, కశింకోట, విశాఖ జిల్లా

★ 'రొమాంటిక్ స్పెషల్' తెలుగు కథల్లో 'అనూహ్య' వినోదభరితంగా ఉంది. భారతీయ, ప్రపంచ భాషల కథలు బాగున్నాయి. 'జ్ఞాన ధార' వల్ల కొత్త విషయాలు తెలుస్తున్నాయి. కొత్తగా ప్రారంభమైన 'రింగ రింగా రింగ రింగారే' లో శీర్షికలన్నీ ఒకదానిని మించి మరొకటి ఆహ్లాదపరిచాయి. 'ముషాయిరా'లో 'ఆరు రుతువుల అనుభవాలు' మనసును కదిలించింది. 'నేనెవరిని' మెదడుకు పదును పెడుతోంది.

– *జి.వి.డి.ఎస్. లక్ష్మీ రామకృష్ణ*,
జీడిమెట్ల, హైదరాబాద్

★ ఫిబ్రవరి సంచికలో కథలన్నీ 'రొమాంటిక్'గా ఉన్నాయి. ఏ కథలోనూ శృంగారం శ్రుతిమించకుండా జాగ్రత్త వహించినందుకు సంపాదకవర్గానికి అభినందనలు.

– *అత్తివిల్లి సుబ్రహ్మణ్యం*, శేరిలింగంపల్లి

★ కథలంటే ఇష్టపడేవారందరూ 'విపుల'ను విపులంగా చదువుతారంటే అతిశయోక్తి కాదు. కొత్త శీర్షిక 'రింగ రింగా రింగ రింగారే' ద్వారా పత్రికను నిత్యనూతన ఒరవడితో వెలువరిస్తున్నందుకు చాలా ఆనందం కలిగింది. కథలకు సజీవాత్మకమైన చిత్రాలనందిస్తున్న చిత్రకారులందరికీ ప్రత్యేక ప్రశంసలు. ప్రేమైక, నివేదనాత్మక కవితల్ని అందించిన రచయిత్రులిరువురికీ అభినందనలు. కార్డుకథల్లో 'ఆతిథ్యం' చదివింపజేసింది. 'గీతాబోధ' వర్ధమాన చిత్రకారులలో ఆత్మవిశ్వాసాన్ని కలిగింపజేసేదిగా ఉంది. శ్రీధర్‌గారికి కృతజ్ఞతలు.

– *నేమాన సుభాష్ చంద్రబోస్*,
పోతినమల్లయ్య పాలెం, వైజాగ్

★ 'ముషాయిరా' కవితలు రెండూ అద్భుతంగా ఉన్నాయి. పదే పదే చదివింపజేశాయి. ఆనందింపజేశాయి. రచయిత్రులిరువురూ అభినందనీయులు. 'జ్ఞానధార' చాలా బాగుంది.

– *పి.ఎస్. వెంగన్న*, కొత్తచెరువు

★ వివిధ భాషల కథాసంకలనం 'విపుల' ఫిబ్రవరి సంచిక సరస శృంగార కథాలహరిగా వెలువడి నన్ను ఆకట్టుకుంది. శృంగారంలో సైతం సభ్యశృంగార కథలే కావడం సాహూరే అనిపించింది. కథలన్నింటిలో కెల్లా ఇది బాగుంది, అది బాగాలేదు అని చెప్పడం అసాధ్యం. హెచ్‌ఐవి బాధితుడి ప్రేమకథ 'నీడ', తెలుగుకథ 'లవ్‌డైలమా' బాగున్నాయి. 'అష్టోత్తర వసంతం' నవ్వించింది. శృంగారం కన్నా 'ఆకలి' మరీ గొప్పదని నిరూపించింది. మొత్తానికి అన్నీ ఆణిముత్యాలే.

– *తోటపల్లి శశికళాధర్*,
గుంతకల్లు

★ 'రొమాంటిక్ స్పెషల్'గా జన్మదిన సంచిక 'విపుల' కలర్‌ఫుల్‌గా ఉంది. కాశ్మీరీ కథ 'తేనెటీగ', ఫ్రెంచ్ కథ 'వీలుకాని విరహం' బాగున్నాయి. 'రింగ రింగా రింగ రింగారే..' కొత్త శీర్షిక మా ఇంటిల్లిపాదికీ నచ్చింది.

– *కాళహస్తి వెంకట శేషగిరిరావు*,
నెల్లూరు

★ విశ్వకథా విపంచి 'విపుల' జన్మదిన సంచిక రొమాంటిక్ స్పెషల్‌గా బాగుంది. 'రింగ రింగా రింగ రింగారే..'లో ప్రేమికుల కోసం 'ముద్దు' ముచ్చట్లు, జోకులు బాగున్నాయి. కథలన్నీ చాలా బాగున్నాయి.

– *బి. ధనవర్మరాజు*,
బిహెచ్‌పిపి, విశాఖజిల్లా

★ జన్మదిన సంచిక కథల్లో, బొమ్మల్లో కాస్త శృంగారం పాళ్లు ఎక్కువైనట్లు అనిపించింది. గమనించగలరు.

– *కరణం శివానందరావు*, కర్నూలు

– *ఎ. రోశయ్య*, పాల్వంచ

కథ కుల పైల్ - 44

- యల్లాప్రగడ సీతాకుమారి


'తెమ వచ్చేనా?'

సాయంకాలం అయ్యేటప్పటికి రెసిడెన్సీ చమను గాలి మేతకు వచ్చిన యువకుల తోటి, ఆటలకు వచ్చిన పిల్లలతోటి కిటకిట లాడిపోతుంటుంది. అందులో ముందువైపు స్క్వేరులో రాజారావు కూచొని, అఖిలాంధ్ర కథక సమ్మేళనానికి పంపడానికి ఏమి కథ రాద్దామా అని ఆలోచన చేస్తున్నాడు.

'కథకు ఎన్ని విధాల చూచిన మంచి 'థీము' దొరకడము లేదు. అందులో టూకీగా రాశామా అంటే పాఠకులు సంద ర్భాలు వివరంగా లేవు అంటారు. పోనీ వివరంగా రాస్తే చాలా దీర్ఘం అయింది, మాకక్కర్లేదంటారు సంపాదకులు. పైగా చిన్నకథకు పాత విషయాలేమీ పనికిరావు. కొత్త పోకడలు ఏం పోదాము? ప్రణయ రంగాలేమన్నా తీసుకుందామా, అబ్బే, ప్రణ యమంతా పాతబడిపోయింది. పోనీ కర్షక కార్మిక సమస్యలో? చెత్త. ఎందుకూ మన కర్షక కార్మికులేమో రష్యాలో లాగ చదువు కోరు. ఇతర్లు చదివినా కార్యం శూన్యం. ఏదో కాస్త చదువుకున్న ఆడవాళ్లను తీసు కొని అవీ ఇవీ తగిలించిరాస్తే... బాగానే ఉంటుంది కాని ఇప్పటి స్త్రీలు ఊరుకోవడం లేదు. మా తెలుగువాళ్ల డాబులూ, ఇంట్లో

ధీర వనిత సీత

తమ ప్రతిభా వ్యుత్పత్తులతో, పాండితీ ప్రకర్ష తో, మేధా సంపదతో, ఆచార్యత్వంతో కీర్తిప్రఖ్యా తులు పొందిన విద్వన్వరేణ్యులు సీతాకుమారి గారు. 1926లో సర్వోదయ కార్యకర్త వై.వి. యల్. నారాయణరావుతో వివాహమయ్యాక హైదరాబాదు వచ్చారు. 1929లో స్టేట్ కాంగ్రె స్ సభ్యురాలు. ఆంధ్ర శబ్దాన్ని ఇక్కడ ప్రచారం లోకి తేవడానికి గట్టికృషి చేశారు. 1934లో ఖమ్మంలో నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభకు అనుబంధంగా జరిగిన ఆంధ్ర మహిళాసభకు అధ్యక్షత వహించారు. చిక్కడపల్లిలో ప్రమదా మండలిని స్థాపించి స్త్రీ విద్యా స్వాతంత్ర్యాల కోసం, వరకట్న నిషేధం, వితంతు వివాహాల కోసం కృషిచేశారు. నిజాం నిరంకుశ పరిపాల నలో అక్కిరెడ్డిపల్లి గ్రామంలో స్త్రీలపై అత్యాచా రాలు జరుగగా వాటిని గూర్చి విచారణ జరిపిన కమిషన్‌లో ఆమె సభ్యురాలు. కల్లోలిత ప్రాంతాలలో పర్యటించి 'పతితులార భ్రష్టులా ర, ఏడవకండేడవకండి' అంటూ స్త్రీలకు ధైర్య సాహసాలు నూరిపోశారు. స్త్రీ జనాభ్యుదయా నికై నిర్భీకతతో కృషి నెరిపారు. విద్వాన్ పరీ క్షలో ఉత్తీర్ణయై 1946-56 మధ్య సికింద్రాబాదు లోని కీస్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పండితురాలిగా ఉద్యోగం చేశారు. ఆవిడకు ఆసక్తి లేని అంశమే లేదంటే అతిశయోక్తి కాదు. భావోన్నతి, రచనా పద్ధతి ఎంతో విశిష్టం. జానపద సాహిత్యంపై అభిరుచి మెండు. ప్రజా వ్యవహారాలను గూర్చి ఎప్పటిక ప్పుడు గోలకొండ పత్రికలో వ్రాశారు. విభిన్న మైన సాహిత్య ప్రక్రియలు ఎన్నో చేపట్టి సాహి త్యంలో విప్లవం అవసరం అని చాటి చెప్పారు. సరళసుందరమైన శైలిలో, పాఠకులను ఆకట్టుకు నేలా ప్రబోధాత్మక రచనలు చేశారు. దీక్ష దక్షతలుగల సంఘసేవికగా, సంస్కర్తగా, ప్రజా సేవకు అంకితమైన విదుషీమణిగా, రచయి త్రిగా పేరు ప్రతిష్ఠలు పొందారు.



పూర్తి పేరు	:	**'విద్వాన్' యల్లాప్రగడ సీతాకుమారి**
జననం	:	1911 అక్టోబరు 1న గుంటూరు జిల్లా బాపట్లలో
ప్రసిద్ధి	:	1935లో ఆంధ్ర యువతీ మండలి స్థాపన. నిజామాబాద్ నుండి శాసనసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన తొలి మహిళా సభ్యురాలు(1957)
రచనలు	:	మందారమాల- మహనీయుల జీవిత విశేషాలు (1951), ఏడవతరగతికి ప్రభావాచకము (1952), వ్యాసమాల సంకలనం (1968). ఇవే కాక ఆవిడ రచించిన ఎన్నో అముద్రిత వ్యాసాలు, కథలు, ఊహాచిత్రాలు, బుర్రకథలు, స్మృతికవితలు, రేడియో ప్రసంగాలు, నాటికలు- 'యల్లాప్రగడ సీతాకుమారి రచనలు' పేరిట సంకలితం
మరణం	:	1986 జనవరి 2న

కోతలూ, బయట పిరికితనమూ... ఊహూం. ఈ కుళ్ళంతా పేపర్లకెక్కిస్తే, బయటి వాళ్ళు ఎగతాళి పట్టించరూ!! పోనీ మా యువకుల్లో...'

ఆకస్మికంగా అతని ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఎదురుగా ఒక పదహారేళ్ళ అమ్మాయి పమిటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ నిలుచొని ఉంది. ఆమె చూడ్డానికి ఎక్కువ సౌందర్యవతి కాదు. చామన చాయా, సామాన్యమైన పొడుగూ, పల్చని చెంపలూ, కొద్దిగా ముందుకు వాలిన నుదురూ చూడ్డానికి చాలా సామాన్యంగా కనిపిస్తుంది. కాని ఆ కళ్ళూ ఆ జుట్టూ... అవి రెండే అమ్మాయిని మనిషిని చెయ్యడానికి తోడ్పడ్డాయి. ఆ కళ్ళు గూడా చాలా పెద్దవి కావు గాని నల్లగానూ, తీక్షణంగానూ ఉండి, ఒక విధమైన వశీకరణ శక్తితో ప్రకాశిస్తూ ఉన్నాయి. జుట్టు కూడా బిరుసుగానూ, వంకరలుగానూ ఉండి, ఆమెలోని దృఢ నిశ్చయాన్ని తెలియచేస్తోంది.

రాజా ఆ అమ్మాయిని ముందుగా పలకరించడం ఎందుకని ఊరుకున్నాడు. కాని ఆమె మరికొంచెం సమీపానికి వచ్చి "క్షమించాలి, మీ పరిచయం లేకపోయినప్పటికీ, మీ వేషాన్ని బట్టి ఆంధ్రులేనని గ్రహించి మాట్లాడుతున్నాను. ప్రస్తుతము నేను కొంచెం ఇబ్బందిలో ఉన్నాను. ఇప్పుడెవరయినా ఒక పురుషుడి సాయం కావలసి ఉంది. కనుక మీరెవరయినా నాకు సాయం చెయ్యగలిగితే..." సగంలోనే అందుకొని రాజా "తప్పకుండా నా ప్రాణాల్నిచ్చైనా రక్షిస్తాను. మీకు వచ్చిన ఆపద ఏమిటో చెప్పండి. ఆంధ్రులు కాకపోతే మరెవరు తోడ్పడుతారు? " అంటూ పొంగిపొయ్యే ఆంధ్రోత్సాహంతో తొందరపెట్టాడు.

"కృతజ్ఞురాలిని. నా స్థితి అంతా ఇప్పుడు చెప్పాలంటే చాలాకాలం పడుతుంది. టూకీగా చెబుతాను. మా వాళ్లు నన్ను ఇప్పుడొక ముసలివాడికిచ్చి పెళ్ళి చెయ్యాలని చూస్తున్నారు. నాకది ఇష్టం లేక ప్రస్తుతమా ముహూర్తం తప్పించాలని వీలయినంత వరకు ఒక వందరూపాయల వరకూ దొరికించుకొని ఇలా వచ్చాను. మీరు దయవుంచి నన్ను ఒక సురక్షితస్థానంలో జేరిస్తే కొన్నాళ్ళుండి మళ్ళీ వస్తాను.. ఏమంటారు? "

"మీ ధైర్యానికి నా అభినందనాలు, ఇలాటి అసందర్భపు బలాత్కార వివాహాలను బలవంతంగా ఫోర్సు చేసి అయినా తప్పించాలని మా యువకుల ఉద్దేశం. తప్పకుండా మీరు కోరిన చోట మిమ్మల్ని దిగబెట్టి వస్తాను"

ఆ అమ్మాయి సంతృప్త నయనాలతో "అలాగైతే మనం షాదునగరం వెళుదాము. ఈ రోజుల్లో అక్కడ కొంచెం చల్లగా కూడా ఉంటుందిట..." అంటూ వీధిలో పోతున్న ఒక మనిషిని చూచి కొంచెం భయంతో ముఖం పక్కకు తిప్పుకొని "చూచారా, ఆ ఎర్రకోటు మనిషి మా పక్క ఇంట్లోనే ఉంటాడు. మనల్ని చూచినట్టు మా వాళ్ళతో చెప్పాడా అంటే మళ్ళీ ప్రమాదంలో ఇరుక్కుపోతాము. సాధ్యమైనంత త్వరగా మనం వెళ్ళిపోతే మంచిది" అంది. రాజా కూడా కొంచెం తడబడి, "మీరు ఇక్కడే చెట్లచాటున కొంచెం నిలబడండి. నేను వెళ్ళి టాక్సీని తెస్తాను" అని గబగబా క్లాకుటవరు దగ్గిరకు వెళ్ళి ఐదు నిమిషాల్లో ఒక కారు తీసుకువచ్చాడు. ఇద్దరూ కట్టుబటల్తో అందులో ఎక్కి కూచోని కాచీగూడెం స్టేషనుకు పోనిమ్మన్నారు.

"ఇక్కడ నుంచీ సౌకర్యంగా ఉండటానికి మీ పేరేమిటో చెప్పండి. నన్ను రాజారావు అంటారు" అన్నాడు రాజా. ఆమె కొంచెం నెమ్మదిస్తున్న తొట్రుపాటుతో "రాధ అంటారు" అంది.

రైలు కదిలింతరువాత ఇద్దరూ సంభాషణలోకి దిగారు. "ఐతే మీ వాళ్ళు ఎందుకిస్తున్నారు అంత పెద్దవాడికి? "

పాత బంగారం



తెలుగు కథ ఆది నుంచి విభిన్న అంశాలను స్పృశిస్తూ సాగిపోతోంది. అందులో ఒక భాగం ప్రేమకథలు. ఇప్పుడంటే తగ్గిపోయాయి గానీ అప్పట్లో ప్రేమకథలు విరివిగా వచ్చేవి. ఆ కథల్లో పదహారేళ్ళ అమ్మాయి, ఇరవై ఏళ్ళ అబ్బాయి ఉండేవాళ్ళు. వారి మధ్య ప్రేమ చిగురించడం, అది ఫలించడమే కథాంశం. ఎక్కడో ఒకటీ అరా భగ్న ప్రేమ కథలున్నా సామాన్యంగా అన్ని ప్రేమకథలూ సుఖాంతమే.

అయితే ఆ ప్రేమ ఇప్పటి రోజుల్లో ప్రేమ లాగ అమ్మాయి కాదంటే మొహాన ఆసిడ్ పోయడం, లేదా ఆ పిల్ల కళ్ళు పొడిచేసి తన కన్ను ఒకటి దానం చేసి ఆ పిల్లను పెళ్ళి చేసుకొని ఆదర్శాన్ని నిరూపించుకోవడంలా భీకరంగా ఉండేది కాదు. సున్నితంగా, ఆహ్లాదంగా సాగిపోయేవి అప్పటి ప్రేమ కథలు. అందమైన అమ్మాయి పొడవైన జడ వేసుకొని మల్లెపూలు కోసుకుంటూ ఉంటే, అప్పుడే బీఏ పరీక్షలు రాసొచ్చిన అబ్బాయి మేడ మీద నుంచి చూసి మనసు పారేసుకునేవాడు. ఈ కథల్లో బామ్మా, బాబాయి, పిన్నీ, వదినా, మేనమామా మొదలైన పాత్రలు కూడా ఉండేవి.

కథ మొదలుపెడితే చివరిదాకా ఆగకుండా చదివించేలా ఉండేవి. చదివాక చదివిన వారి మనసు గాల్లో తేలిపోయినట్టు ఉండేది. నూటికి ఎనభై ప్రేమకథల్లో కథానాయిక రాధే. కథానాయకుడు సూర్యమో, సుబ్బారావో, రాజారావో ఉండేవాళ్ళు గానీ కథానాయిక మాత్రం రాధే. యల్లాప్రగడ సీతాకుమారిగారు రాసిన ఈ కథలోనూ నాయకురాలు రాధే. నాయకుడు రాజారావు. కథ మొదలుపెట్టటమే తరువాయి అలా కథలో లీనం అయిపోతాం.

ఇటీవల వస్తున్న కథల్లా హీరో ఆ అమ్మాయిని మోసం చేసేస్తాడు లేదా ఇతగాడే మోస పోతాడు. అదీ ఇదీ కాకపోతే ఇంకెవరో దుండగులు వీళ్ళిద్దర్నీ మోసం చేస్తారనేలా అప్పటి కథలు ఉండవు. ఇది అప్పుడెప్పుడో రాసిన కథ కదా! అందుకే కథ అందంగా మొదలై హాయిగా సాగి ఆహ్లాదంగా ముగుస్తుంది.

మా చిన్నతనంలో గుళ్ళో చెట్టుకింద రాలిన పొగడ పూలని ఏరుకొచ్చి నీడన ఆరబెట్టి చెక్క బీరువాలో బట్టల మధ్యన జల్లితే ఆ సుగంధం ఏళ్ళ తరబడి ఉండేది. మా ఇంట్లో ఉన్న చంద్రహారం తాతల కాలం నాటిది. అయినా ఇప్పటికీ వన్నె తగ్గలేదు. ఏమిటో కొన్ని అంతే. పాతబడిన కొద్దీ వాటి విలువ పెరుగుతుందే తప్ప తగ్గదు. అందుకు చక్కని ఉదాహరణ మన ఈ తెలుగు కథ.

– పొత్తూరి విజయలక్ష్మి
సీనియర్ రచయిత్రి

"ఏమీ లేదు. ఎక్కడ చూచినా పెద్దపెద్ద కట్నాలు కావాలెననే వాళ్ళే. పోనీ కాలేజీ స్టూడెంట్లెవరన్నా వప్పుకుంటారేమోనంటే, వాళ్ళ రేటు మరీ ఎక్కువగా ఉంది. అభివృద్ధి పక్షంలో యువకులెవరన్నా కుదురుతారేమోనంటే వాళ్ళకి నా చదువూ, చక్కదనమూ సరిపోలేదు. ఏం చేస్తారు మరి"

"ఐతే మరి మీరు పారిపోయి మాత్రం ఏం లాభం? "

"ఏదో తొందరపడకుండా విచారిస్తే ఎవరైనా సంస్కార బుద్ధి ఉన్నవాళ్ళు దొరక్కపోతారా అని.. మీరేం చేస్తున్నారిప్పుడు? "

"ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాను. ఈ యేడే ఎమ్.ఏ అయిపోయింది. మా నాన్నగారెక్కడన్నా ఉద్యోగంలో ప్రవేశించమంటున్నారు. నాకేమో జర్మనీ వెళ్ళి డాక్టరేటు తెచ్చుకుందామని ఉంది కాని ఏదో ఆర్థికపు చిక్కుల్తో అనుకూలపడ్డం లేదు"

"బహుశా వివాహం అయిందనుకుంటాను"

"ఇంకా లేదండీ, అదంతా ఓ రామాయణం. అసలు నాకు పెళ్ళంటేనే ముందు అదో వికారం. అందులో నా ఉద్దేశాలకు తగిన ఆమె దొరకడం అంటే కుందేటి

కొమ్ము సాధించడమన్నమాట!"

"అలాగా, అయినా ఎలాటి ఊహలుం డేవో...?"

"అసలు నాకు మన తెలుగు పిల్లలంటేనే అసంతృప్తి. ఎక్కడైనా మగాడిమాట వినబడితే తుర్రున పారిపోవడమూ, ఏ సందర్భంలోనన్నా కాస్సేపు నలుగురు మగవాళ్ళల్లో నుంచోవలసి వస్తే ఇక తొట్రుపాటు, పమిటెసర్దుడూ, బెదురు చూపులూ ఇలాటి వాళ్లతో మనకేం రొమాన్సు దొరుకుతుంది? ఏదో సందర్భపడితే జర్మనీ నుంచే..."

"పోనీ, మంచి చదువులు చదివిన వాళ్ళెవరూ దొరకలేదూ ఇక్కడే? ..."

"ఇక్కడ ఒకటుంటే ఒకటుండదండీ. చదువుంటే చక్కదనం ఉండదూ, రెండూ ఉంటే చలాకీగా ఉండదు. హైదరాబాద్‌లోనే ఎన్నో సంబంధాలున్నాయి. నాకొక్కటీ నచ్చలేదు. మా మేనమామ కూతురే ఓ అమ్మాయి ఉంది. చిన్నప్పుడొకసారి చూచాను. తోక ఒకటి తక్కువగా ఉంటుంది! మా వాళ్లంతా చేసుకోమన్నారు. కాని నేను ఒద్దు పొమ్మన్నాను. నా సంగతి విన్నారు కాదూ, ఏదో కాస్త ఆంధ్రోద్యమం అనీ, వైతాళిక సమితి అనీ, సమ్మేళనాలనీ... ఏదో ఒక ఉద్యమం నడిపిస్తూ ఉండాలిసిందే కాని ఊరికే ఉండే ఘటం కాదు. ఇక తీరా చేసుకున్న తరువాత అవతలి మనిషి కూడా కాస్త మనకు సరిపోయ్యేటట్లుండాలెనా...!"

ఏదో స్టేషనులో బండాగింది. ఎవరో తెలుగువాళ్లే మొగుడూ పెళ్లామూ పిల్లల్తో వచ్చి ఎక్కారు. రాజా కొంచెం సర్దుక్కూచున్నాడు. రాధ మాత్రం బెదురు లేకుండానే ఆ వచ్చిన వాళ్లనడిగి ఒక చెంబు పుచ్చుకొని "చూడండీ అక్కడ నల్లా ఉంది. మీరు కొంచెం తాగి నాక్కొంచెం తెచ్చిపెడతారా...?" అంది.

రాజా నీళ్లు తీసుకువచ్చాడు. ఇంతలో రాధ అక్కడికి వచ్చిన పూరీ, సేరూ కొని ఉంచింది. ఇద్దరూ ఫలహారం మొదలెట్టారు.

రాజా తల్లో ఆలోచన శకటాలు పరుగెత్తుతున్నాయి. 'పాపం ఎప్పుడు తిన్నదో, ఏమో...? అయినా ముఖంలో ఇందాకటి దైన్యం కొంచెం తగ్గింది. ఇప్పుడు మనిషిలో కాస్త చురుకుదనం కూడా కనిపిస్తున్నది... నేను కొత్తవాణ్ణే అయినా ఎవరికీ అనుమానం కలక్కుండా ఉండడానికేమో, ఎంతో చనువుగా ఉంటున్నది... ఈ మోస్తరు'.

షాదునగరంలో దిగి ఇద్దరూ బండి చేసుకొని వెళ్లి ఒక ఇంట్లో దిగి కావలసిన సామాన్లన్నీ కొద్దికొద్దిగా తెచ్చుకున్నారు.

మర్నాడు సాయంత్రం రాజా ప్రయాణం అయినాడు. కాని రాధ విచారంతో వేడుకుంది. "ఈ కొత్తవూళ్లో నేనొక్కదాన్ని... ఇంకో రెండురోజులుంటే... ఎల్లుండే మావాళ్లు పెట్టిన సుముహూర్తం... అదయిపోతే మళ్లీ మనం ఇంటికి వెళ్లిపోవచ్చును"

నిజంగా రాజా కూడా వెళ్లలేకపోయినాడు. ఆ రాత్రి రాజా హృదయంలో చిన్న కదలిక కలిగింది. రాధ నడత అతన్ని చాలా ఆకర్షించేస్తున్నది. ఆమె మాటల్లోనూ, నడతలోనూ ఎక్కువ అనురాగమూ, పరిపూర్ణమైన జాగ్రత్తా, సూక్ష్మమైన విధేయతా తొలుకాడుతూ కనిపించేవి. ఆమె అంటే అతనికి ఒక విధమైన అవ్యక్తభావం ఎక్కువౌతూ ఉన్నది. పాపం కష్టాల్లో ఉంది కదూ, సానుభూతేమో... ఏమో... త్వరగా వెళ్లిపోతే బాగుండును.

నిద్రలేచేప్పటికి రాధ ఫలహారమూ, కాఫీ తయారు చేసింది. రెండూ చాలా రుచిగా ఉన్నాయి. రాజా కొద్దికొద్దిగా సంకోచం వదిలిపెట్టి, అడిగి వేయించుకోడం మొదలుపెట్టాడు.

"పాపం నా నుంచి మీకు చాలా కష్టం కలిగింది. అక్కడేమన్నా తొందరపనులున్నాయో ఏమో" అంది రాధ కాఫీ కలు



పుతూ.

"అంత చెడిపొయ్యే పనులేమీ లేవులెండి. వచ్చే శుక్రవారం నాడు కథక సమ్మేళనం ఉంది. దానికందుకుంటే సరి. కష్టమ్మాత్రం ఏముందీ నాకు. నాలుగు ఉపన్యాసాలిచ్చే కంటే, ఒక అబలను కష్టాల్లోనుంచి తప్పిస్తే మంచిది కాదా? "

గంభీరమైన రాధ ముఖంలో నుంచి ఒక విశ్వాసంతో కూడుకున్న మందహాసం బయటికొచ్చింది. "నిజంగా ఆ కష్ట సమయంలో మీరు దొరికినందుకూ... మీలో ఇన్ని ఆదర్శకోద్దేశాలు ఉన్నందుకూ... ఆ భగవంతుడికి పదివేల నమస్కారాలు..."

"అబ్బే... అట్టే పొగడకండి నాకు కష్టంగా ఉంటుంది. ఎలాగైనా మిమ్మల్ని నిర్విచారంగా ఇంటికి చేరిస్తే..."

రాధ సంతృప్త హృదయంతో వంటకు వెళ్లిపోయింది. సాయంకాలం రాజా అక్కడక్కడ తిరిగి ఇంటికి వచ్చేసరికి రాధ తలంటి పోసుకొని క్రిందటిరోజే తెప్పించిన ఔరంగాబాదు తెల్లపట్టుచీర కట్టుకొని ఉతికి అరవేసిన పెద్ద పోలోకాలరు జంపరు వేసుకుని ఇంకా సొమ్మేమీ పెట్టుకోకుండానే లోపలి వాకిట్లో పారిజాతం చెట్టుకింద చాప వేసుకుని జడ అల్లుకుంటూ కూచున్నది. రాజాను చూడగానే లేచి స్వాగత సూచకంగా చిన్న మందహాసంతో "వూరు చూడడానికి వెళ్లారు కాబోలు, చాలా సేపయింది. ఏమయినా విశేషాలున్నాయా ఇక్కడ చూడదగినవి? " అంటూ పలకరించింది.

రాజా కోటూ చెప్పులూ విప్పి వచ్చి కూచొని "అట్టే విశేషాలేమీ లేవు కాని రెండు మూడు ఫర్లాంగుల దూరంలోనే చిన్న గుట్ట ఒహటుంది. దానిమీద కూర్చొని చుట్టూ ఉన్న మబ్బుల్నీ పొలాల్నీ చూస్తూ ఉంటే బాగా సాయంకాలమైపోయిన సంగతే తెలీలేదు" అన్నాడు.

"ఎక్కడానికి వీలుగా ఉంటుందా? "

"ఫరవాలేదు. ఒక మోస్తరుగా ఉంటుంది. కొంచెం కష్టంగానే అయినా పైకి గనక వెళ్లితే... ఏదో మాలాటి వాళ్లకి కాస్త మనోహరమైన దృశ్యాలు కనిపిస్తాయి"

"వంటయింది భోంచేద్దామా"

ఆ రాత్రి రాజా హృదయంలో పెద్ద తుఫాను రేగింది. 'ఈ అమ్మాయి ఇదివరకు నేను భావస్వప్నాల్లో తిలకిస్తున్నంత చక్కంది కాదు కాని ఎందుకో నన్ను ఆకర్షించి వేస్తూన్నది... ఏమో, గృహిణిగా ఉండటానికి ఈ చక్కదనం చాలదా ఏమిటి? ... అయినా మనిషి నడకలో మంచి చక్కదనం ఉంది. మాటలు చాలా పొంకంగానూ, పొదుపుగానూ వాడుతుంది. వంట మహారుచిగా చేస్తుంది. సాయంత్రం చెవులకీ, ముక్కులకీ గూడా ఏమీ

సొమ్ములు లేకుండా ఉంటే నిజంగా కళ్లల్లో ఉన్న కాంతీ, చెంపల్లో ఉన్న స్నిగ్ధత్వమూ బయటపడ్డాయి. ఈ ఆడాళ్లంతా సొమ్ములూ, పూలూ, రంగు చీరలూ వదిలి పెడితేనే కాని అసలు అందమనేది వాళ్లల్లో కొంచమయినా ఉందా, లేదా, అనే విషయం తేలదు... పైగా రాధకు నేనంటే ఎంతో ఇష్టంలాగా ఉన్నది. కాస్త బయటికి పోతే సరి. ఎంతో సేపయిందంటుంది, కృతజ్ఞ తేమో...? కాకపోయినా కష్టాల్లో నుంచి తప్పించడానికి తీసుకువచ్చి ఇప్పుడిలా అను కోడం...?'

సగం రాత్రయింది. రాజాకు నిద్ర రాలేదు. రాధకు గూడా బహుశా నిద్ర రాకుండవచ్చు. లేచి రాధ పడుకున్న వరండా వైపు వెళ్లి చూచాడు.

రాధ నిర్విచారంగా నిద్రపోతూ ఉన్నది. ఏ సుఖస్వప్నం చూస్తున్నదో ఏమో, పెద వుల్లో చిన్న మందహాసం, ముఖంలో సంతృప్తి, చెంపల్లో వికాసమూ తొలకా డుతూ ఉన్నాయి. నిశ్శబ్దంగా రాజా తన గదిలో కెళ్లి పడుకొని ఆలోచనల్లో మునిగి పోయినాడు.

మర్నాడు సాయంత్రం రాధచేసిన క్యాబేజీ పకోడీలు ఫలహారం చేస్తూ రాజా "చూడా లని ఉంటే, ఇవ్వాళ నువుగూడా రా, రాధ! నిన్నటి కొండ చూచి వద్దాము. చిన్న దేవా లయము కూడా ఒకటుంది అక్కడ. నీకు దేవుడు కావాలెనంటే" అన్నాడు.

ఇద్దరూ కాఫీ ముగించి బయలుదేరారు. ఆ ఎగుడుదిగుడు కొండరాళ్లను, రాధ కూడా అనాయాసంగానూ, ఉత్సాహంగానూ పమిట బిగించి ఎక్కుతూ ఉంటే రాజా కళ్లు కొత్త ఆశల్తో నిండిపోతున్నాయి.

రేగిపోతూ ఉన్న ఆమె జుట్టూ, జారిపో తున్న ఆమె పూలు, అలిసిపోతూ ఉన్న ఆమె ముఖమూ రాజా భావాలను తెలగొ డుతూ ఉన్నాయి. ఆమెతో ఎక్కలేక అడుగ డుక్కీ తానే వెనుకబడిపోతూ వచ్చాడు. ఇక పైకిపోలేక ఇద్దరూ పడమటి వైపునున్న ఒక సమప్రదేశాన కూర్చున్నారు, అక్కడ నుంచి చూస్తూ. చాలా దూరం దాకా పరుచుకొని ఉన్న వరిమళ్లు పచ్చీసు గళ్లలాగా కనిపిస్తు న్నాయి. అక్కడక్కడ కాపువాళ్లు స్త్రీ పురుష బేధం లేకుండా కలిసి పాటలు పాడు కుంటూ పని చేసుకుంటున్నారు. ఉండటా నికి కొంచెం దూరంలోనే ఉన్నా పంటచె రువు చూడ్డానికి కొండకిందనే ఉన్నట్లుంది. నిర్మలంగా ఉండడంచేత రంగురంగుల పశ్చి మాకాశాన్నీ, అస్తమించబోతున్న రక్తసూ ర్యుణ్ణి ప్రతిఫలింపచేస్తున్నది. ఆ నిండు చేలల్లో గాలిపిల్లలు హృద్యంగా ఈలపాటలు పాడుతున్నాయి.

ఆయాసంచేత కొంచెం తీవ్రంగా వస్తూన్న నిశ్వాసాలతో రాధ "చాలా హాయిగా ఉన్న దండీ ఇక్కడ. మీరు చెప్పిన మాటల్ని బట్టి ఏదో భావకవులకే గాని నాలాటి వాళ్లకేమీ బాగుండదేమోననుకున్నాను. కానీ తీరా వచ్చి ఆ దృశ్యాల్ని చూస్తుంటే చెప్పలేనంత తృప్తీ హాయీ కలుగుతూ ఉన్నాయి" అని సంభాషణ ప్రారంభించింది.

"నేనూ అలాగే అనుకున్నాను సుమండీ మొదట్లో. ఆ తెల్లని మేఘాలన్నీ కరుళ్ళు క ట్టి పాలసముద్రం ఇదేనా అనిపిస్తున్నాయి" అన్నాడు రాజా రాధలో కూడా కొద్దిగా కళా పిపాస ఉన్నందుకు సంతృప్తి చెందుతూ. "అయితే రాధా, మరి మీవూరు వెళ్లడం ఎప్పుడూ"

"వెళ్లాలి మరి త్వరగానే, డబ్బుకూడా అయిపోతున్నది"

"వెళ్ళితే మరి మీ వాళ్లు ఏమీ అనకుండా వూరుకుంటారా? "

"ఆ విషయం తలచుకోడానికే భయాన కంగా ఉంది. కోప్పడుతారని నాకు పెద్ద భయంగా లేదు గానీ మళ్లీ ఆ బండతనికే ఇచ్చే ప్రయత్నం చేస్తారని దిగులుగా ఉంది"

పాపం రాధకళ్లు మళ్లీ మొదటిరోజున లాగే దిగులుతో నిండిపోయాయి. రాజా

హృదయం నీరయిపోయింది. తను రాధను వివాహం చేసుకుంటే ఇక చిక్కేమీ ఉండదు. కాని తన మహదాశయాల న్నీనో... ఇంతకూ రాధ తన్నా ఉద్దేశంతో చూస్తున్నదో లేదో...? ఆమె ఏ ఐ.సి.యస్ ఆఫీసర్నీ చేసుకుందామనుకుంటున్నదో! రాధ తన హృదయ పరివర్తనాన్ని ఎంతవ రకు కనిపెట్టుతున్నదో ఏమో గానీ ముఖంలో మాత్రం ఏమీ కల్లోలం కనిపిం చడం లేదు.

చివరకు రాజా ధైర్యం చేసి గొంతు సవ రించుకొని చెప్పడానికి ఉపక్రమించాడు. "పోనీ రాధా! నీకిష్టమైతే... మీవాళ్లతో చెప్పి... నేనే... మరి మన వివాహం... నీకిష్టమేనా...? "

రాధ ఆకస్మికంగా 'షాకు' తగిలినట్టయి పోతుందనుకున్నాడు రాజా. కాని రాధ

నిర్వహణ :
డా. వేదగిరి రాంబాబు

సామాన్యమైన ముఖంతోనే కొంచెం నిరాశ కంఠంతో-

"ఏం లాభం, మీకు మాత్రం వెయ్యి రెండువేలూ కట్నం మావాళ్లెక్కడ నుంచి తీసుకురాగలరు...? " అంది.

రాజా ఉద్వేగంతో "కట్నమెవరిక్కావాలి. పిల్ల నాకు అన్ని విధాల నచ్చాలి. నా కళో పాసనకు తోడ్పడాలి అని గానీ... అసలు నీకు నేను తగినవాణ్ణేనో, కాదో... చూసుకో..." అన్నాడు.

కళవళపాటేమి లేకుండానే రాధ స్థిరస్వ రంతో "ఇప్పటికైనా మీకు నేను అర్హురాలి నని తోస్తే...? ".

క్షణం ఆలస్యం చేయ్యకుండా రాజా ఆమెను ఒళ్ళోకి తీసుకున్నాడు. విజయ గర్వంతో రాధ వణికిపోయింది. గుండెలు ఆగిపోతాయేమోనన్నంత తీవ్రంగా కొట్టుకుం టున్నాయి. కళ్లు ఉద్రేక బాష్పాలతో నిండి పోయినాయి. రెండు చేతుల్తో రాజా తలను తన హృదయంలో చేర్చుకొని కంఠాన్ని పెనే సుకపోయింది. విజయ ధ్వజంలాగా పంచమి చంద్రరేఖ బయటికి వచ్చింది. తేలికబడ్డ హృదయాలతో ఇద్దరూ కిందికి దిగి వచ్చారు.

ఆ మర్నాడు సాయంత్రం హైదరాబాద్ స్టేషనులో, రాజా రాధతో గూడా దిగేటప్ప టికి, ఎందుకొచ్చారో తెలీదుగానీ వాళ్లవా ళ్లంతా కనిపించారు.

తన తండ్రీ తమ్ముడూ ఇంకో పెద్దమనిషీ, తెలుసు తన మేనమామే. మరో యువ కుడూ... అవును మేనమామ కొడుకే... మరికొందరూ తన పెట్టెదగ్గరికి వచ్చారు. తన కోసమేనేమో...?

ఆశ్చర్యంతో చూస్తుండగానే ఆ మేన మామ దగ్గరకు వచ్చి, కొడుకు చేతుల్లోని 'చెంగేరీ' అందుకొని, రెండు పూలహారాలు తీసి ఇద్దరి మెళ్లో చెరొకటీ వేసి రాజాను గట్టిగా కావలించుకొని, "మారాజా! ఇప్పటికి దారికి వచ్చావా? " అని, రాధను దగ్గరకి తీసుకొని "ఇప్పటికి నీ పట్టు నెగ్గించుకు న్నావా తల్లీ" అని బుజ్జగించి, "సరీగా ముహూర్తానికందుకున్నారు" అన్నాడు.

రాజా విభ్రమంలో పడిపోయినాడు. 'ఏమిటిది? తన మేనమామ కూతురేనా ఈ రాధ! ఈ రాధనేనా చిన్నప్పటి నుంచీ ఎంతమంది చెప్పినా చేసుకోనని కూచు న్నది!! రాధ చేసిన పన్నాగమంతా అందరికీ తెల్సిందేనా!! రాధ ఎంత మేధావి!! నిజంగా ఈ రాధే తన చేతి నుంచి జారిపోయినట్ట యితే తనంత నిర్భాగ్యుడు ఇంకోడుండడు!! విధాతకు కృతజ్ఞుణ్ణి'

రెండోనాటి సాయంత్రం రాజా వాకిట్లో కూచుని అఖిలాంధ్ర కథక సమ్మేళనానికి పంపడానికి ఆ ఘటనా సంఘటితమైన తన వివాహాన్నే కథగా రాస్తున్నాడు.

ఒడిశా కథ

-జ్ఞానపీఠ గ్రహీత **ప్రతిభారాయ్**

క్రెడిట్ కార్డ్

నిర్మాణం పూర్తయి తన చేతికి వచ్చిన ఫ్లాట్ ని చూసుకుని మురిసిపోతూ అతడు జ్ఞాపకాల్లోకి జారుకున్నాడు. గతం తాలూకు మధుర స్మృతులు కలలా అందంగా వుంటాయి. పిల్లల కోసం పడే ప్రతి కష్టం వెనుక శ్రమవున్నా, వాళ్ళ సుఖం కోసం ఆ మాత్రం చేయడం తమ బాధ్యతలా వుంటుంది కన్నవారికి. కూతురు సరస్వతి పెళ్ళి చేసుకుని వెళ్లిపోయింది. కొడుకు ప్రయోజకుడై తమకు దూరంగా ఉంటున్నాడు. కనీసం కొడుకైనా తమ దగ్గరకి వస్తాడనే ఓ చిరు ఆశ, తనతో రెండు బెడ్రూముల ఫ్లాట్ కొనేలా చేసింది.

ఇంతలో అతడి జ్ఞాపకాలకు అడ్డు తగులుతూ భార్య "కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు అంతా ఒకేసారి సెలవులకి వస్తే, డ్రాయింగ్ రూములో ఎవరిని పడుకోబెట్టాలి? " అడిగింది.

ఎంతైనా తల్లి హృదయం కదా! నేను ఆమె మాటలకి నవ్వేస్తూ "పిచ్చిదానా, డ్రాయింగ్ రూమున్నది మన కోసమే కదా!" అన్నాను.


ఏది ఏమైనా కష్టార్జితంతో నా కలను సాకారం చేసుకోగలిగానన్న ఆనందం ఆ రోజు నన్ను నిలువనీయలేదు. నిజానికి చాలామందితో పోల్చిచూస్తే నా బతుకు బండి సాఫీగానే గడిచిపోతోంది. డబ్బుకి, తిండికి, బట్టకి ఏ మాత్రం లోటులేని జీవితం నాది. దేవుడి దయవల్ల పిల్లలిద్దరూ తమ తెలివితేటలతో స్థిరపడి, జీవితాలని సాఫీగా గడిపేస్తున్నారు. రెక్కలు వచ్చాక పక్షులు ఎగిరిపోయినట్టుగానే పిల్లలిద్దరూ పెళ్ళిళ్ళు చేసుకుని ఎవరి గూటికి వారు చేరుకున్నారు. ఇక మిగిలింది నేను, నా భార్య. చుట్టపుచూపుగా పిల్లలు ఎప్పుడైనా వచ్చినా ఎగిరిపోవటానికి వాళ్ళకి అట్టేసేపు పట్టేది కాదు. ప్రస్తుతం వాళ్ళకి మా అవసరం కూడా కనిపించడం లేదు.

కూతురు సరస్వతి ఉన్న వూళ్ళోనే వుండటం మా ఆవిడకి చాలా నచ్చిన విషయం. కూతురుపై మమకారంతో రోజూ వాళ్లింటికి వెళ్లేది. మధ్యాహ్నం అయ్యేసరికల్లా అందరికీ అప్పచ్చులు తయారుచేయటంలో మా ఆవిడ బిజీగా వుండేది. ఏ మాటకామాటే చెప్పుకోవాలి.. మగాళ్ళకి యిలాంటివి తట్టవు. తండ్రి పిల్లల చదువు గురించి, వాళ్ళ ఉద్యోగాల గురించి తప్పిస్తే మిగిలిన వాటి గురించి అంతగా పట్టించుకోడు. తల్లి ఒక్కత్తే పిల్లల కడుపెరిగి ప్రవర్తిస్తుంది. అందుకే అప్పుడప్పుడు నాకు 'తల్లి' అనే జీవి లేకపోతే సృష్టి ఏమైపోతుందా అనిపిస్తుంది. కష్టజీవి అయిన మా ఆవిడ ప్రతిరోజూ కూతురుకిష్టమైనవన్నీ బాక్స్‌లో సర్దుకుని నా దగ్గరకొచ్చి "ఏంటలా కూర్చున్నారు? అమ్మాయి దగ్గరకెళ్ళాలి కారు బయటికి తీయండి!" అంటూ హుకుం జారీ చేసేది.

మొదట్లో రోజూ కలుసుకోవటం అందరికీ ఆనందంగానే వుండేది. కారు హారన్ వింటూనే కూతురు, మా కోసం ఒక్క పరు

గున కిందకి చేరుకునేది. అల్లుడు కూడా సాదరంగా మమ్మల్ని ఆహ్వానించేవాడు. ఇక మనవడు, మనుమరాలు తామేమీ తక్కువ కాదన్నట్టుగా అమ్మమ్మ తెచ్చిన చిరుతిళ్ళు క్షణంలో సగం పైగా ఖాళీ చేసే వారు. దాంతో మా ఆవిడ ఆనందానికి అవధులు వుండేవి కావు. ఇక సెలవు ల్లోనయితే చెప్పే అవసరమే లేదు. మా ఆవిడ రెండుపూట లకి వంట తయారుచేసి కూతురింటికి చేరేది. నిశ్చలంగా వున్న నీటి లో రాయిపడ్డట్టుగా హఠాత్తుగా అల్లుడు అమెరికా వెళ్లే యోచ న చేయడంతో మా ఆవిడ తట్టుకోలేకపో యింది. అల్లుడి ఆ లోచనకు చెక్ పెట్టడా నికి వాళ్లతో ఓ అంద మైన ఫ్లాట్ కొనిపిం చింది. అందుకు డ బ్బు సహాయమే కా కుండా, వాళ్ళు తీసు కున్న బ్యాంక్ లోన్‌కి ష్యూరిటీ కూడా యిచ్చింది. ఇలా చేస్తే అల్లుడు, అమెరికా ప్రయాణం మానుకుని ఇండియాలోనే వుంటాడనే ఓ పిచ్చి ఆశ.

ఆవిడ అనుకున్న విధంగానే కొంతకాలం



సాఫీగా సాగిపోయింది. కొత్త ఫ్లాట్‌ని అందంగా తీర్చిదిద్దటంలో తలమునకలైపో యాడు అల్లుడు. అంతా బాగానే ఉంది కానీ, భార్య ప్రతిరోజూ ఠంచనుగా కూతు రింటికి వెళ్ళి వాళ్ళ స్వేచ్ఛా స్వాతంత్ర్యా లని లాక్కోవటం నాకు విసుగు తెప్పించ సాగింది. మన ప్రేమ వాళ్లని ఆనం దింపజేయాలి గానీ, విసుగుచెందేలా వుండకూడదనేది నా అభిప్రాయం. అదీ కాక పనులేవైనా వుంటే వాటిని పక్కకి పెట్టి, కారు నడిపే డ్రైవరులా సాయంత్రం అయ్యేసరికల్లా భార్య వెనకాలే వెళ్ళటానికి నా మనసు నిరాకరించసాగింది.

అల్లుడు, కూతురు మునుపటిలా మాతో వుండలేకపోతున్నారు. దానికి తోడు పిల్ల లు పెద్దవ్వాళ్ళవుతున్నారు. చదువులు, పరీక్షలు వాళ్ళని ఊపిరాడనీయకుండా చేస్తున్నాయి. అందుకే రోజూ వచ్చే అమ్మ మ్మ, తాతయ్యలని పిల్లలు అంతగా పట్టిం చుకోవడంలేదు. ఇవన్నీ పక్కకి పెడితే పిజ్జాలు, బర్గర్‌లు తినే పిల్లలకి పాతకా లపు చిరుతిళ్ళు చేదైపోయాయి. ఆధునిక యుగంలో అడుగుపెట్టాక ఆరోగ్యం గురిం చి పట్టించుకోకపోతే ముప్పుతప్పదని, దానికి తోడు భర్తకి అసలే రక్తపోటు. కానీ తల్లి యివన్నీ కొట్టిపడేస్తూ "వట్టి చేతులతో ఎలా రమ్మంటావ్? " అనేది.

తల్లిమాటలకి కూతురు బ్రేక్ వేస్తూ "అమ్మా! పిల్లల పరీక్షలు దగ్గరపడుతు న్నాయి. నువ్వు రోజూ ఇలా వచ్చి కూర్చుంటుంటే వాళ్ళేం చదువుతారు చెప్పు? దయచేసి కాస్త గొంతు తగ్గించి మాట్లాడు. నేను టీ తీసుకొస్తాను అప్పటి వరకు మాట్లాడకుండా కూర్చో..!" అంటూ టీ తేవటానికి లోపలికెళ్ళిపోయింది.

నేను నా భార్యవైపు చూసి "అమ్మాయి అన్న మాటలు నూటికి నూరుపాళ్ళు ని జం. మనం కాస్త పిల్లల గురించి కూడా ఆలోచించాలి. మునుపటి చదువులు కా దు. ఈ రోజుల్లో కాంపిటీషన్ పెరిగిపో యింది. నిజంగా వాళ్ళని చూస్తువుంటే జాలేస్తుంది నాకు" అంటూ భార్యకి క్లాసు పీకాను.

కూతురు మునుపటిలా కారు హారన్ వినగానే కిందకి రాకపోవడం, నౌకర్‌ని పంపడం నేను గ్రహించలేకపోలేదు. కానీ మొండి పట్టుదలతో కూతురింటికి తీసు కొచ్చే భార్యని మందలించడం నాకు చేత కాలేదు. కూతురు విసుగు ముఖంతో తల్లి-తండ్రులను లోపలికి ఆహ్వానిస్తూ "రోజూ ఇలా కష్టపడి మా ఇంటికి రాకపోతే కొంప లంటుకుపోతాయా? బోలెడు డబ్బులు తగలేసి ఈ చిరుతిళ్ళు తీసుకొచ్చి మా ఆరోగ్యాలు పాడుచేస్తావెందుకమ్మా? పైగా మా ఆయనకి నాన్నలాగా ఎక్కడ షుగరు వ్యాధి వస్తుందోనని భయపడుతున్నారు. నీకు చెప్తే అర్థం కాదు. నాన్నా! మీరైనా కాస్త అమ్మకి చెప్పచ్చుకదా? " అంటూ నెపాన్ని నా మీద వేయడం మొదలెట్టింది.

ఇంటికి వెళ్ళేదారిలో నేను ఆమెను సము దాయిస్తూ "చూడు! కూతురు రావద్దని అంత స్పష్టంగా చెపుతున్నా ఆ మాటలు నీకు ఎందుకు ఎక్కటం లేదో నాకు అర్థం కావటం లేదు. నా మాట విని, రోజూ కూతురింటికి వెళ్ళటం మానుకో. నెలలో ఒకట్రెండు సార్లు వెళితే గౌరవంగా వుం టుంది. ఇవన్నీ నీ మట్టి బుర్రకి తోచవు. వయసు రాగానే సరికాదు. కాస్తంత ఇంగి తజ్ఞానం కూడా వుండాలి. 'అత్తగారు' లేక పోయింది కాబట్టి బతికిపోయింది. లేక పోతే నా కూతురు తల్లీ, అత్తల మధ్య నలిగిపోయేది" అన్నాను.

ఓ రోజు కూతురింటికి వెళ్ళేసరికి అంతా వారిపనుల్లో బిజీగా వున్నారు. మేం వచ్చి న సంగతి ఎవరూ పట్టించుకోలేదు. కూతురు వంటగదిలో, అల్లుడు ఏవో కాగి తాలు తిరగేస్తూ బిజీగా వున్నారు. కాసే పాగాక నేనే కాస్త గొంతుపెంచి "అమ్మా

మీరంతా చాలా బిజీగా వున్నట్టున్నారు. మేం వెళ్ళొస్తాం. నేను మీ అమ్మకి చెప్పి చెప్పి విసిగిపోయాను. ఆమె అర్థం చేసు కోదు. నాకా వయసు మీద పడింది. మీ ఇంటికి రోజూవచ్చే ఓపిక లేకపోయినా దాని మనసు కష్టపెట్టలేక బలవంతంగా కారు నడుపుకుంటూ వస్తున్నా" అన్నాను.

"అలాంటివేవీ లేదు నాన్న పని ఒత్తి డిలో మిమ్మల్ని గమనించలేకపోయాను" అంటుందనుకున్న నాకు నా కూతురి మౌనం శరాఘాతంలా తగిలింది. బాధతో తలొంచుకున్నాను. అంతలో నా భార్య కూతురువైపు తిరిగి "చూడు తల్లీ! మీ నాన్నకి నన్ను నీ దగ్గరికి తీసుకొచ్చే ఓపిక లేకపోతే రిక్షా కట్టుకుని మరీ వస్తాను. మీరు నాతో మాట్లాడినా, మాట్లాడకపో యినా నేనేం బాధపడను. మీ నాన్నకి

అనువాదం :

డా. రాజ్యలక్ష్మి

క్రికెట్ పిచ్చి, మీ ఆయనకి కంప్యూటర్ పిచ్చి వున్నట్టుగా నాకు నీ మీద, నీ పిల్లల మీద పిచ్చిప్రేమ, మమకారం వున్నాయి. మిమ్మల్నందరినీ చూస్తే కానీ నాకు ని ద్ర.." అంటున్న ఆవిడ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. బాధతో ముడుచుకు పోయిన కూతుర్ని చూశాక, ఆమె మౌనం గా తమని బాధపెట్టినందుకు లోలోన కుమిలిపోతోందని నాకర్థం అయింది.

ఓ రోజు అల్లుడు కూతుర్ని, పిల్లలని తీసుకొని అమెరికా వెళుతున్నాడని తెలి సింది. "ఓహ్! అయితే మీరు కూడా అమె రికా వెళుతున్నారన్నమాట. అందరికీ ఈ అమెరికా పిచ్చి ఏమిటో? వెళ్ళిరండి. కాక పోతే త్వరగా రావటానికి ప్రయత్నించండి. రెండు, మూడు నెలల్లో వచ్చేస్తారుగా" అంది అమాయకంగా నా భార్య.

నేను ఆమె వైపు జాలిగా చూస్తూ "పిచ్చి దానా, నీకు వినబడటం లేదా? అల్లుడికి అమెరికాలో పెద్ద ఉద్యోగం వచ్చింది" అన్నాను.

"రానీయండి, ఆరు నెలల్లో ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వచ్చేస్తాడు" అంది.

అల్లుడు నవ్వేస్తూ "లేదత్తయ్యగారూ! ఇమిగ్రేషన్ వీసా మీద వెళుతున్నాం. కనీ సం పదేళ్ళదాకా వుంటాం. ఇష్టమయితే అక్కడే సెటిలవుతాం" అన్నాడు. ఆ మాట లకి ఆమె నిర్ఘాంతపోయింది.

"వచ్చే ఏడాది మీ ఇద్దరికి టికెట్లు పంపు తాం వచ్చి నాలుగురోజులు వుండి వెళ్ళం డమ్మా!" అంటున్న కూతురి మాటలని వినిపించుకోకుండా-

"అన్నాళ్ళు అక్కడే వుండిపోతే ఇల్లు పాడైపోదూ.. మాకా వయసు మీరిపో యింది. ఇలాంటి బాధ్యతలు మాకు పెట్ట కండమ్మా!" అంది నా భార్య.

అల్లుడు ఆమె వైపు తిరిగి "లేదత్తగారు! మిమ్మల్ని కష్టపెట్టకూడదనే ఉద్దేశ్యంతోనే ఇంటిని అమ్మేశాం. కంపెనీవాళ్ళు నా భార్యా పిల్లలకు టిక్కెట్ల ఖర్చులు ఇవ్వ లేమన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇల్లు అమ్మాల్సి వచ్చింది. పైగా ఇదేమన్నా ఇంద్రభవనమా? " అన్నాడు.

పాపం నా భార్య. ఇంటిని ఆప్యాయం గా చూసుకుంటూ 'అయిపోయింది. కూతు రింటితో తనకి ఋణం తీరిపోయింది' అనుకుంది.

నేను మటుకు "చాలా సంతోషం. మీరె ప్పుడూ వృద్ధిలోకి రావాలన్నదే నా కోరిక. ఇక పోతే అనవసరంగా డబ్బు దుబారా చేసి మాకు టిక్కెట్లు కొని పంపకండి. మన దేశంలో లాగా 'ఈజీ మనీ' అక్కడ దొరకదు. రెక్కలు, ముక్కలు చేసుకోవా ల్సిందే. పైగా ఆ దేశం మాలాంటి ముసలి వాళ్ళకి సరిపడదు. వీలు చూసుకుని మేమే చూడటానికి వస్తాం" అన్నాను.

నా భార్య నా మాటలకి విసుక్కుంటూ "ఆ దేశం ఎలా ఉంటుందో మీకేం తెలుసని మాట్లాడుతున్నారు? అనవసరమైన మాటలు మాట్లాడకండి. మీరు వెళ్లకపోతే వెళ్లకపోయారు. నేను కూతుర్ని చూడటానికి తప్పకుండా వెళతాను" అంది.

ఎవరున్నా లేకపోయినా గడియారం తన పని తాను చేసుకుంటూ వెళ్లిపోతుంది. కాకపోతే కన్నకడుపుకు పిల్లలు లేకుండా ఎలా ఉండాలా? అని దిగులు.

కూతురు అమెరికా వెళ్లి రెండు సంవత్సరాలైపోయింది. మాటిమాటికీ రమ్మని అడగటంతో మేమిద్దరం అమెరికాకి ప్రయాణమయ్యాం. స్వాభిమానం గల నేను కూతురిచ్చిన డబ్బులని సున్నితంగా తిరస్కరించి నా డబ్బుతోనే టిక్కెట్టు కొనుక్కున్నాను. నా భార్య కూతురు ప్రేమ ముందు తలవంచుతూ ఆమె పంపిన డబ్బుతో టిక్కెట్టు కొనుక్కుంది. ఇద్దరం రెండు నెలల పాటు అమెరికా అంతా చూసి ఆనందించాం. నా దృష్టిలో భారతీయ సభ్యత, సంస్కృతుల ముందు ఏ దేశమైనా దిగదుడుపేననిపించింది.

తిరిగి వచ్చే ముందు తల్లి, కూతుర్ని ప్రేమగా దగ్గరికి తీసుకుంటూ "ఈ దేశం చాలా బాగుంది. కానీ పనిమనిషి లేకుండా పనంతా నువ్వొక్కదానివే చేసుకోవడం నాకు సుతరామూ నచ్చలేదు" అంటూ వాపోయింది.

నేను మాత్రం "చూడమ్మా! మన పని మనం చేసుకోవడం చాలా తృప్తినిస్తుంది. నేను మీ దేశంలోని ప్రదేశాలన్నీ చూశాను. బహుశా మరోసారి మీ దగ్గరికి రాలేకపోవచ్చు" అన్నాను.

"ఇది మరీ బాగుంది మీరు లేకుండా నేనెలా వస్తాను. పైగా ఈ వయసులో మిమ్మల్ని ఒంటరిగా వదిలి నేనెలా ఇక్కడికి రాగలను? " అందామె.

"పొరబడుతున్నావు, నీ దారికెన్నడూ అడ్డం రాలేదు. రాను కూడా" అన్నాను నవ్వుతూ. ఇద్దరం స్వదేశానికి వచ్చేశాం.

ఇద్దరం చాలా ముసలివాళ్ళమైపోయాం. మధ్యలో మా ఆవిడ ఒంటరిగా రెండు, మూడుసార్లు కూతురు దగ్గరికి వెళ్లొచ్చింది. ఆవిడ వెళ్లినప్పుడల్లా నా కోడలు నన్ను చూసుకోటానికి వచ్చేది. కూతురు కూడా ఉద్యోగం చేయడం మొదలెట్టడంతో ఆమె రాకపోకలు ఎక్కువయ్యాయి. ఒంటరిగా కూతురింట్లో పనులన్నీ చూసుకోవడంతోపాటు, పెంపుడు పిల్లి బాధ్యత కూడా ఆవిడ మీద పడింది. ముసలితనంలో కూతురింటి బాధ్యతని భరించడం తల్లికి రోజురోజుకీ భారం కాసాగింది. ఏదో ఒక సాకుతో వెళ్లిన వెంటనే తిరిగి వచ్చేయటం మొదలెట్టింది. అదీ కాకుండా కూతురు ప్రతిదానికీ తనమీద ఆధారపడటం ఆవిడకి నచ్చలేదు. లోగడ నేను చెప్పిన మాటల్లో దాగిన సత్యం ఆవిడకి నెమ్మది, నెమ్మదిగా అర్థం అవసాగింది. ఇది సరైన పద్ధతి కాదని కూతురికెట్లా చెప్పాలో అర్థంకాక సతమతమవసాగింది. అలా బాధపడుతూ నా భార్య ఇండియాకి వచ్చేసింది.

★ ★ ★

ఆమె ఇండియాకి వచ్చి సంవత్సరం కూడా కాలేదు. మళ్ళీ తల్లికి టికెట్ పంపుతూ, తను పనిమీద మరొక దేశానికి వెళుతున్నానని, వయసులో ఉన్న కూతుర్ని చూసుకోవటానికి రావాల్సిందని తల్లిని బతిమిలాడుకుంది. ముసలి భర్తని వదిలి రాలేనని చెప్పే స్థితిలోనూ ప్రస్తుతం ఆవిడ లేదు. కారణం ఆమె భర్త గతించి ఆరు నెలలు కావస్తోంది. ఏనాడూ భర్త ఆమెకి ఎలాంటి బాధని కలిగించలేదు. కూతురు తల్లిదండ్రులకిద్దరికీ జాయింట్‌గా క్రెడిట్ కార్డు పంపింది. స్వాభిమానంగల భర్త దాన్ని ఏనాడూ వాడుకోలేదు. సరికదా భార్యని కూడా వాడుకోనీలేదు. భర్త

పోయాక కూడా ఆవిడ దాన్ని వాడలేదు. అంత అవసరం కూడా ఆవిడకి ఏనాడూ కలగలేదు. ఎప్పుడైనా ఆరోగ్యం పాడయితే క్రెడిట్ కార్డు అవసరం అవుతుందని దాన్ని దగ్గరే ఉంచుకొంది.

ముసలావిడకి కొడుకు, కోడలు దగ్గర రోజులు హాయిగా గడిచిపోతున్నాయి. తండ్రి చనిపోయాక కొడుకు తండ్రి ఉన్న వూరుకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. భర్త బతికున్నప్పుడు కొడుకు తమ దగ్గర ఉండుంటే ఎంత బాగుండేదని ముసలా విడ తరచుగా అనుకుని వాపోయేది.

విదేశానికి వెళ్లి బాధపడే యోగం తన ముఖాన భగవంతుడు రాశాడని అను కుంటూ ముసలావిడ కూతురి దగ్గరికి ప్రయాణం అయింది. అత్తగారిని తీసుకెళ్ల డానికి అల్లుడు ఎయిర్‌పోర్టుకి వచ్చాడు. ఇంటికెళ్లిన ఆవిడకి, ఇంటి నిండా అల్లుడి స్నేహితులు, కూతురు స్నేహితులు దర్శన మిచ్చారు. కూతురికి ప్రమోషన్ వచ్చిన సందర్భంలో అందరికీ పార్టీ ఇస్తోందని ఆవిడకర్థం అయింది. మిత్రులంతా ముస లావిడని చూసి "హాయిగా మీకు పనిమ నిషి ఫ్రీగా దొరికింది. మా అత్తగారూ ఉంది, కానీ ఏం లాభం? చాలా స్వార్థప రురాలు. ఉద్యోగ విరమణ అయినా కూడా తనకి ఎన్నో పనులు ఉన్నాయని, రావటానికి వీలుకాదని, నిక్కచ్చిగా చెప్పి తప్పించుకుంటోంది" అన్నారు.

కూతురు సరస్వతి తన స్నేహితులవైపు తిరిగి కన్ను గీటుతూ "ఇంటి పని అప్ప గించటానికి అమ్మని ఇక్కడికి పిలిపించుకో లేదు. ఆవిడకి కాస్త తోస్తుంది కదాని రమ్మన్నాను" అంది.

మనవడిలోను, మనవరాలిలోను వచ్చిన మార్పు ఆవిడని ఆశ్చర్యానికి గురిచేసింది. పిల్లలకోసం కష్టపడి చేసిన పిండివంటలు అలాగే ఉండిపోతున్నాయి. ఆకలేసినప్పు డల్లా పిల్లలు ఫ్రిజ్ తెరుచుకుని ఛీజ్, బటర్ చికెన్ పిజ్జాని మైక్రో వేవ్‌లో పెట్టి వేడి చేసుకుని తిని గదుల్లోకి వెళ్లిపోయే వారు. పాపం ముసలావిడ పప్పు, అన్నం కంచంలో పెట్టుకుని తినమంటూ పిల్లలని బతిమిలాడుకునేది. విసిగిపోయిన పిల్లలు అమ్మమ్మ వైపు తిరిగి "నాస్టీ ఇండియన్ హాబిట్.. రైస్, దాల్ ఛి... ఛీ" అంటూ విదిలించి కొట్టేవాళ్లు. ముసలావిడకి వాళ్ల మాటలు వింతగా తోచేవి. 'వీళ్లు ఇండి యన్స్ కాదా, ఎందుకు వీళ్ళు మాటిమాటికీ ఇలా మాట్లాడుతున్నారు? ' అనుకునేది.

ఆవిడకి సాయంత్రం అయ్యేసరికి దేవు డికి సంధ్యా హారతి ఇచ్చి గొంతెత్తి హాయి గా భజన చేసుకోవడం అలవాటు. ముస లితనం మీద పడ్డా ఆవిడ గొంతులో మాధుర్యం చెక్కు చెదరలేదు. కానీ మను మరాలికి ఆవిడ భజనలో ఆర్తి కనపడకుం డా ఏడుపు కనపడేది.

ఒక రోజు ఆవిడతో "అమ్మమ్మా! సాయంత్రం అవగానే దీపం పెట్టి ఏడుస్తా వెందుకు!" అంటూ ఆవిడ మీద ఓ వ్యంగ్య బాణాన్ని వదిలింది.

ఆ విషయం అర్థం కాని ఆవిడ "భగవం తుడికి నా మనసులోని మాట చెప్పుకుం టున్నానమ్మా" అనేది.

దాంతో ఆ పిల్ల "ఇండియన్స్‌కి ఈ అడు క్కునే బుద్ధి ఎప్పుడు పోతుందో కదా! చేయి చాచి అడుక్కునే ఈ స్వభావం, ఎదుటి వారి మీద ఆధారపడే మనస్తత్వం చూస్తే నాకు అరికాలి మంట నెత్తికెక్కు తుంది" అని ఈసడింపుగా అంది.

'ఇలా మాట్లాడుతున్న ఈ పిల్ల చిన్న ప్పుడు ముద్దు ముద్దుగా తను చెప్పే శ్లోకా లన్నీ చెప్పేది' అనుకుంటూ కూతురు వైపు తిరిగి "ఇదేం పెంపకం సరస్వతీ! మన సభ్యత, సంస్కృతులు వీళ్లు మంటగలి పేలా ఉన్నారు. వీళ్లు భారతీయులు కారా? మాటకి ముందు, చివర 'నాస్టీ ఇండియన్స్' అంటూ నన్ను తిడుతుంటే

నువ్వసలెలా ఊరుకుంటున్నావో? నాకు అర్థంకావటం లేదు" అంది.

కూతురు పిల్లల్ని సమర్థిస్తూ "అమ్మా! ఊరికే ఆవేశపడతావెందుకు? వీళ్ళు చిన్నప్పుడే ఇక్కడికొచ్చేసారు. ఇక్కడి పరిస్థితులు, వాతావరణం వీళ్ళల్లో మార్పు తీసుకొచ్చాయి. అది చాలా సహజం కూడాను. మేం ఉన్నట్టుగా ఉండమంటే వాళ్ళెందుకు ఉంటారు? "

ముసలావిడ కూతురు మాటలకి మౌనం వహిస్తూ పిల్లల్ని అనుకోవటం అనవసరం అనుకుంది. అంతేకాదు వీళ్లు భారతీయులు కాదు అనే అభిప్రాయానికి వచ్చేసింది. తన కూతురు తనని "నాస్టీ ఇండియన్స్" అననందుకు సంతోషపడింది. ముసలావిడ గొప్ప దేశభక్తుల జాబితాలోకి రాకపోయినప్పటికీ, ఆవిడకి తన దేశపు మట్టి, గాలి, నీరు వీటన్నిటిని తలుచుకుంటే ఆనందంగానూ, గర్వంగానూ ఉండేది.

కూతురు ఉదయాన్నే ఆఫీసుకి వెళ్ళిపోయేది. వెళుతూ వెళుతూ "అమ్మా! నువ్వు హాయిగా రెస్ట్ తీసుకో. ఏ పనీ ముట్టుకోకు. నేవచ్చాక చూసుకుంటా" అనేది. ఇంటెడు చాకిరి చేయాల్సింది తానే అని తెలుసు కాబట్టి కూతురు మాటలు విని మౌనంగా ఉండిపోయేది. అయినా ఊరికినే కూర్చుంటే టైమ్ గడవదు కదా. కాకపోతే ఇంట్లో పెరిగే పెంపుడు పిల్లిని చూస్తేనే ఆవిడకి చిరాకుగా ఉండేది. అమెరికాలో అంతా పిల్లిని ఎందుకు ఇష్టపడతారో? ఆవిడకి అర్థం అయ్యేది కాదు.

స్వదేశానికి వచ్చేముందు ఆవిడ కొడుకు పిల్లల కోసమని పక్కనే ఉన్న షాపులోంచి రెండు బిస్కెట్ల డబ్బాల్ని కొనుక్కొచ్చింది. డబ్బాలు రెండూ చూడటానికి చాలా అందంగా ఉన్నాయి. పైగా వాటి మీద రెండు అందమైన పిల్లికూనల బొమ్మలు



కూడా వేసున్నాయి. వాటిని చూడగానే కూతురు పిల్లుల పట్ల తల్లి ప్రేమ పెంచు కుంటున్నందుకు సంతోషించింది. కానీ తల్లి వాటిని తన బ్యాగులో సర్దుకోవడం చూసి "అమ్మా! తమ్ముడు కూడా పిల్లిని పెంచుతున్నాడా? అయినా వాడు పెంచు తానంటే నువ్వెలా రాజీపడ్డావు? అవున్లే ఎంతైనా కొడుకుకదా. అదీకాక అక్కడ నో రెత్తి మాట్లాడే ధైర్యం నీకెక్కడిది? అయి నా నువ్వు వాడింట్లో ఉండటంలేదు, వాడే నీ ఇంట్లో ఉంటున్నాడన్న విషయాన్ని మరిచిపోయాను. అది నాన్న నీకు కొని చ్చిన ఇల్లు కదా...? " అంది.

కూతురు మాటల్లోని మార్పును తల్లి గమనించింది. భర్త తన పేరున ఇల్లు కొన్నాడు. కానీ ప్రస్తుతం ఆయన బతికి లేరు కదా! తనూ ఏదో ఒకరోజు భర్తని వెతుక్కుంటూ వెళ్ళిపోతుందన్నది సత్యం. భర్త కొన్న ఇల్లు కొడుకుది, కూతురుది. ఇద్దరిదీను. మరెందుకు కూతురు పరాయి దానిలా మాట్లాడుతోంది? అనుకుంటూ కూతురు ప్రశ్నకి జవాబిస్తూ "నేను నీ ఇంట్లో ఈ పిల్లితోనే కదా ఉండేది. మీరంతా ఎప్పుడూ బిజీగానే ఉంటారు. చుట్టుపక్కల వాళ్ళెవ్వరికీ నా సంగతి పట్టదు. వీళ్ళ వెనకాల తోకాడిచ్చుకుంటూ మనం ఎంతగా తిరిగినా, వీళ్ళు మాత్రం మనల్ని 'నల్లవాళ్ల'మని అసహ్యించుకుం టూనే ఉంటారు. మీ నాన్న చచ్చి ఏ లోకాన ఉన్నారో కానీ ఎప్పుడూ నాతో 'తెల్లవాళ్ల దేశంలో ఉన్నంత మాత్రాన నువ్వు తెల్లదానివనిపించుకోలేవు' అని అంటూ ఉండేవారు" అంది.

కూతురు, తల్లివైపు చూసి ఆశ్చర్యపో యింది. తండ్రి ఉన్నంతకాలం ఆయన ఏం మాట్లాడినా? తప్పు పట్టేది. కానీ



ఆయన పోయాక ఆయన మాటలు అక్షర సత్యాల్లా ఉన్నాయి. "ఇంతకీ పిల్లుల కోసం అమ్మే బిస్కెట్లు నువ్వెందుకు తెచ్చావమ్మా. ఇవి చాలా ఖరీదైనవి" అంది.

"ఏంటీ! ఇవి పిల్లులకోసం అమ్మేవా! నేనింకా పిల్లలకోసం అనుకున్నా.." అంటూండగానే కూతురు రెండు బిస్కెట్ల డబ్బాలని తల్లి చేతుల్లోంచి తీసుకుని, పిల్లిని ఒళ్లో కూర్చోబెట్టుకుని దానికి తినిపిస్తూ "చూశావా! అమ్మమ్మ నీకోసం ఎంత ఖరీదైన బిస్కెట్లు తెచ్చిందో, అమ్మమ్మకి థ్యాంక్స్ చెప్పు" అంటుంటే ముసలావిడకి ఒళ్లు మండిపోయింది. చేసేది లేక చటాలున కూతురు ముందర నుంచి లేచి వెళ్లి సామాన్లు సర్దుకోసాగింది.

ఆ రోజు ఆగస్టు పదిహేను. పిల్లలిద్దరూ స్కూల్‌కి వెళ్ళడం చూసిన ముసలావిడ "ఈ రోజు ఆగస్టు పదిహేను కదా! మీకు సెలవు ఇవ్వలేదా? మీ తాతగారున్నప్పుడు ఆయన గాంధీ గారి ఫొటోకి పూలదండ వేసి కృతజ్ఞతలు తెలుపుకునేవారు. అంతే కాదు ఆ రోజు నాన్‌వెజ్ కూడా వండనిచ్చేవారు కాదు. మీరు ఇవన్నీ మర్చిపోయారా? " అంది.

పిల్లలు వెంటనే ఆవిడ వైపు తిరిగి "మా స్వాతంత్ర్యదినోత్సవం జులై నెలలో వస్తుంది. పైగా గాంధీ గారేమైనా దేవుడా..? ఫొటో పెట్టుకుని పూజలు చేయటానికి.."

"అవును ఆయన మనకి దేవుడితో సమానం" అంది.

"అమ్మమ్మా! ఇవన్నీ ఇండియన్ సెంటిమెంట్స్. మనిషి ఎక్కడైనా దేవుడవుతాడా? దేవుడు ఒక్కడే ఇక్కడ. మీలాగా అంతమంది దేవుళ్ళు లేరు" అన్నారు.

"మీ తాతగారు కూడా భగవంతుడు ఒక్కడేనని చెప్పేవారు. కాకపోతే అవసరా

న్నిబట్టి లోకరక్షణ కోసం రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, గాంధీ లాంటి అవతారాలని ఎత్తారు" ఆమె మాటలు పూర్తికానే లేదు. వాళ్లు "మా తాతగారు లిస్టులో లేరా? " అంటూ ఆమెని హేళన చేస్తూ స్కూలుకెళ్లిపోయారు. వాళ్ల మాటలకి ఆమె మనసు బాధతో విలవిల్లాడిపోయింది. ఆరోజు ఆమె ఏమీ తినకుండా, ఒక్క పని కూడా చేయకుండా ఎక్కడి పని అక్కడ వదిలేసి వెళ్లి పడుకుంది.

సామాన్యంగా రోజూ కూతురు ఇంటికొస్తూనే "అమ్మా! ఎన్నిసార్లు చెప్పాలి, ఇంటి పనులేవీ చేయొద్దని. ఇన్ని పనులు చేసి ఆరోగ్యం పాడు చేసుకుంటే నీకు వైద్యం చేయించటం మా వల్ల కాదు. ఇది ఇండియా కాదు, అమెరికా అని బాగా గుర్తుపెట్టుకో" అనేది.

అందుకు తల్లి నవ్వుతూ "పనీ పాట లేకుండా పొద్దస్తమానం కూర్చుని తినటం నా వల్ల కాదు. నా గురించి నిజంగా అంత బాధపడేదానివే అయితే బయటికెళ్ళి ఉద్యోగం చేయడం మానుకో..!" అనేది. అయినా కూతురు, తల్లితో పైకి అలా అనేదే కానీ ఆవిడ లేకపోతే ఇల్లు ఎంత భయంకరంగా ఉంటుందో ఆమెకు బాగా తెలుసు.

కానీ ఈ రోజు ఆమె వస్తూనే ఎక్కడ పడితే అక్కడ వస్తువులన్నీ అస్తవ్యస్తంగా ఉండటం గమనించింది. అంతే ఆమెలో ఆరాటం పెరిగిపోయింది. కొంపతీసి అమ్మ ఆరోగ్యం పాడవలేదు కదా! అనుకుంది. అంతే! ఒక్క అంగలో తల్లి గదిలోకి తొంగిచూసింది. తల్లి మంచం మీద పడుకుని వుండటం గమనించి దగ్గరికెళ్ళి నిలుచుంది. తల్లి బిడ్డని చూసి కూడా వులుకూ పలుకూ లేకుండా అలాగే పడుకుంది. కాసేపటికి తమాయించుకుని "నా ఆరోగ్యం బానే వుంది. అనవసరంగా కంగారు పడకు. మనసే భారంగా... బాధగా..."

"కారణం లేకుండా మనసు భారంగా వుండదు కదమ్మా! ఎవరైనా ఏదైనా అన్నారా? పిల్లలు నిన్నేమన్నా అన్నారా? వాళ్ళు ఏమన్నా అంటే అవి పట్టించుకుని బాధపడితే నేనేం చేయలేను? " కూతురి మాటలలో విసుగు ఆవిడ గుర్తించలేకపోలేదు. కన్నకడుపు, అలసి సొలిసి ఇంటికి వచ్చిన పిల్ల పని చేసుకుంటుంటే చూసి భరించలేకపోయింది. ఆవిడ మంచం దిగి బయటికి వచ్చింది.

అంతలోనే కూతురు తల్లి దగ్గరికి వచ్చి "అమ్మా! పిల్లి దొడ్డి ఇంట్లోనే వెళ్ళి ఇల్లంతా ఖరాబు చేసింది. పొద్దున దాన్ని లెట్రిన్‌కి తీసుకెళ్లలేదా? ఇల్లంతా కంపు వాసన కొడుతోంది. పిల్లలొచ్చారంటే రాద్ధాంతం చేస్తారు. దానికి కూడా ఇలాంటి అలవాటు లేదు"

"జంతువులన్నాక ఇలాంటి పనులు చేయకుండా వుంటాయా? మనుషుల్లాగే ప్రతిదీ అర్థం చేసుకుని, ఆలోచించి చేయటం పాపం వాటివల్ల ఎక్కడవుతాయి. ఊరికినే నా మీద అరవకు" అంది తల్లి కూతుర్ని మందలిస్తూ.

కూతురు తల్లి వైపు కోపంగా చూస్తూ "అది జంతువు కాదు. మాలో ఒకర్తి. దాని దొడ్డి ఎత్తినంత మాత్రాన నువ్వేమీ మైలపడిపోవు. మా పిల్లల దొడ్డి ఎత్తిన దానివి దీనిది ఎత్తలేవా? ఇన్ని రోజులున్నా ఈ పిల్లిని మటుకు ప్రేమగా దగ్గర తీసుకోలేని నీ మూర్ఖత్వానికి జాలిపడాలో, ఏడవాలో అర్థం కావటం లేదు"

"ఏమన్నావు? నేను పిల్లి దొడ్డి క్లీన్ చేయాలా? అది ఎత్తటానికా ఇంత దూరం తీసుకొచ్చి ఈ జైల్లో నన్ను పడేశావు. శ్రద్ధగా విను. చావనైనా చస్తాను కానీ ఈ దరిద్రపుగొట్టు పిల్లి దొడ్డి ఎత్తే మాటే లేదు" అని కచ్చితంగా చెప్పింది.

"ఇండియన్స్‌కున్న పనికిరాని హిపో

క్రసీయే ఇది. ప్రతి ప్రాణిలోనూ భగవంతుడిని చూడండి అంటారు. మళ్లీ ఆ నోటితోనే మనుషులకీ జంతువులకీ భేదం వుందంటూ లెక్చర్లు దంచుతారు" కూతురు మాటల్లో సత్యం లేకపోలేదు. కాకపోతే కూతురు "ఇండియన్స్" అని ఎవరినంది. తల్లినా లేక తను ప్రస్తుతం ఇండియన్ని కాదనా? పిల్లలు అన్నారంటే అర్థం వుంది. వాళ్లు ఇక్కడి రంగుల వలయంలో చిక్కుకుని నోటికొచ్చింది పేలుతున్నారు. వాళ్ళని తను ఎప్పుడో క్షమించేసింది. కానీ కూతుర్ని... కూతుర్ని తల్లి క్షమించలేకపోయింది. కారణం భారతదేశంలో కనబడే ప్రేమా, ఆప్యాయతలు, మమతానురాగాలు, వాళ్ళ అణువణువులోనూ నిండిపోయిన సభ్యతా సంస్కారాలు, దేశం పట్ల వారికున్న భక్తి వీటన్నింటినీ రంగరించి "ఆడపిల్ల" అనే అందమైన ప్రతిమను తయారు చేసింది. కానీ నేడు ఓ పిల్లి కారణంగా... ఎంత అసభ్యంగా..!

కళ్లల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నా ఆ ముసలి తల్లి "నాకు ఇండియా వెళ్ళటానికి టికెట్ తెప్పించు. ఇంక ఒక్క క్షణం కూడా ఇక్కడ వుండటం నా వల్ల కాదు. కారణం నేనూ ఇండియన్నే. ఇక్కడే వుండే అర్హత నాకు లేదు!" అంటూ కూతురితో దృఢంగా పలికింది. అంతేకాదు. ఆవిడ కూతురిచ్చిన క్రెడిట్ కార్డ్ని తిరిగి ఆమెకే ఇచ్చేస్తూ "ఇందులో ఒక్క పైసా కూడా నేను వాడలేదు" అంది.

అది ఇవ్వగానే ఆమె మనసు తేలికపడింది. భర్త ముందుచూపు వున్నవాడు. ఒకరి మీద ఆధారపడకుండా వుండేందుకు డబ్బు జాగ్రత్త చేసి వెళ్ళాడు. దాంతో తన జీవితం ప్రశాంతంగా వెళ్ళిపోతుంది. మమకారం కొంత వరకే వుండాలి. అది హద్దులు దాటితే జీవితం నరకం అన్న నగ్నసత్యం ఆవిడకి తెలిసొచ్చింది.

తెలుగు కథ

- డా. మృదులాంజలి

బుడ్డోడు-పెద్దోడు

"అరే బుడ్డోడా, ఏడెల్లినావురా"

దట్టంగా ఉన్న చింతచెట్టు గుబురుల్లో దాగిన చింతకాయలను కొమ్మమీద వాలి కోయడానికి ప్రయత్నిస్తున్న రంగడు చివ్వున తలతిప్పాడు.

"అయ్యా వత్తుండా"

ఒక్క ఉదుట్న కొమ్మమీంచి కిందికి దూకాడు రంగడు.

కొమ్మ అంత ఎత్తు లేదేమో, వాడికేమీ కాలేదు.

"అట్టే అట్టే, దూకమాకు, బొమికలిరుగు తయ్" హడావిడిగా గుడిశెలోంచి వచ్చిన మల్లి అంటూనే ఉంది.

ఈలోగా రంగడు, వింటిని విడిచిన బాణంలా పరిగెత్తాడు.

"అయ్యా..., అయ్యా..." భుజాన ఉన్న గుడ్డమూట, నెత్తిన ఉన్న కట్టెలమోపు కిందికి జారవిడుస్తున్న నారిగాడు కొడుకుని దగ్గరకు లాక్కున్నాడు.

"ఓరయ్యా అట్టా పరిగెత్తమాక అని అమ్మ చెప్తుండ్లా" మురిపంగా అంటూ, మరో చేతిలో ఉన్న తాటాకు దొప్పలోంచి తేనెపట్టు ముక్కలు తీసి రంగడి నోటికి అందించాడు.

"ఆ నీవొచ్చినాకా, వాడు నామాటెప్పుడు వినాల" నిష్టూరంగా అంటూ వెనకే వచ్చింది మల్లి.

"సింతకాయలేంజేసినావురా? కొడుకుని అడిగింది.

"చెట్టుకిందనే రాల్చినా" తేనెపట్టు కొరుకుతూ, గడ్డం మీదికి కారిన తేనె మరో చేత్తో తుడుచుకుంటూ చెప్పాడు రంగడు.

"మరేం, అయ్య రాకముందే కోయరా, పచ్చడి నూరతా అన్నా, ఇప్పుడు చూడు అయ్యొచ్చిండు, బువ్వలోకి ఏంపెట్టాలె" మల్లి నసుగుతుంది.

"నేను కోత్తాలెయ్యి, నీళ్లోసుకొనేకల్ల పచ్చడి అయిపోదూ" కొడుకునేమీ అనబాక అన్నట్టు చూసాడు నారిగాడు.

"ఇక మీరిద్దరూ కలిసినాక, నేనేం సెయ్యాల, అట్టేకాని" గుడ్డమూట చేతిలోకి తీసుకుంటూ లోనికి నడిచింది మల్లి.

"ఇయ్యాల ఏటి దొరికాయి? " మూటకేసి చూపిస్తూ అడిగింది.

"వేళ్లూ, దుంపలు. అన్నట్టు, అప్పుడు సాములోరడిగిన వేళ్లూ కొండవతల ఉంటాయట, అక్కడ ఒకతను సెప్పాడులే, రేపటుపోయొత్త"

చింతచెట్టు కేసి నడుస్తున్న నారిగాడి వెనకాల్నే దారిపట్టాడు రంగడు.

ఇంకా చీకట్లు ముసరలే. అడవిలో జంతువులు రోజు ముగిసినట్టు గ్రహించుకుని రకరకాల శబ్దాలు చేస్తున్నాయి.

నారిగానికి, మల్లికి, రంగడికి ఆ అరుపులు, గర్జనలు అలవాటయిపోయాయి.

నారిగాడు నిజానికి అడవికి అవతల ఉన్న గూడేనికి చెందినవాడు. గూడెంలో జనం ఎక్కవయ్యేకొద్దీ, తిండికి పోటీ ఎక్కువైంది.

ఒకరిని మించి ఒకరు తిండికోసం తిరు



గుతూ చిన్నగా గూడెం వదిలి అడవిలోకి జరిగిపోయారు.

అలా అలా దూరం జరుగుతూ నారి గాడు ఇక్కడికి వచ్చాడు.

మొదట్లో మల్లి భయపడేది. పొత్తిళ్ళలో ఉన్న రంగడిని వెయ్యికళ్ళతో కాపాడుకొనేది.

నారిగాడు కూడా ఎక్కువ దూరం వెళ్ళకుండా, దగ్గరదగ్గరలోనే ఉండి ఏదో ఒకటి తెచ్చేవాడు.

క్రమంగా అలా అలవాటయ్యింది.

అప్పుడప్పుడు గూడేనికి వెళ్ళి అందర్ని పలకరించి వస్తాడు.

రంగడికైతే అక్కడినుండి ఎక్కడికెళ్ళినా ఇష్టం ఉండదు.

గూడెంలో అయ్య ఎవరెవరితోనో మాట్లాడుతూ తనని పట్టించుకోడని వాడి బాధ.

వాడి లోకమంతా అయ్యతోనీ, అమ్మతోనే!

ఇప్పుడు వాడికి అయిదెళ్ళి ఆరొస్తాయి. నారిగాడితో పాటు అడవిలోకెళ్ళాలని వాడి ఆరాటం.

"అయ్యా, నేనూ నీతో వత్తానే" చెట్టెక్కడానికి సిద్ధపడుతున్న నారిగాడిని అడిగాడు రంగడు.

"ఏడకిరా? " అడ్డంగా చుట్టుకున్న పంచెని పైకి ఎగ్గడుతూ, తలెత్తి కొమ్మలని పరీక్షగా చూస్తూ అడిగాడు నారి.

"కొండవతలికి అయ్య, నేనెప్పుడూ సూసుండలే గదా"

చెట్టుమొదలుకి చేతులు చుట్టి ఎక్కడానికి సిద్ధపడుతున్న నారి ఒక్క నవ్వు నవ్వాడు.

"ఏం సూడాల? " చెట్టుపైకి ఎగబాకుతూ అడిగాడు.

"అటుపక్క ఇంకా పెద్దచెట్లుంటాయని సెప్పావుగదా, అవిసుత్తా"

సెట్లు సూసేదేముంది, అన్ని ఒకలానే ఉంటయిరా" చకచక కాయలు తెంపుతూ అన్నాడు.

"అదికాదే అయ్య, నువ్వెల్లిపోయాక నాకే దోలా ఉంటదే, నేనూ నీతో వత్తా" మారాంపోయాడు రంగడు.

తెంపిన కాయలు పంచె మడతల్లో వేసు కుంటూ, చకచక కాయలు కోయడం ముగించాడు నారి.

తేనెపట్టు మీద వెగటుపుట్టిన రంగడు, తాటాకుదొప్పను పక్కన పెట్టి చెట్టు కింద విసిరేసిన కాయిలు ఏరసాగాడు.

"అయ్యా, నేనూ వత్తానే" చెట్టు దిగిన నారి కాళ్లను చుట్టేసాడు.

"ఒరొరే ఆగుమా, కాళ్ళు సుట్టేస్తే నేనెట్టా నడిచేది? " పంచెలోంచి కాయలు దులిపి, తలగుడ్డలో మూటకట్టాడు నారి.

"వొత్తునారా? " మల్లి పిలుస్తుంది.

"నడునడు, అమ్మ పిలుత్తుండ్లా" రంగ డిని చేయిపట్టి లోనికి తీసుకుపోయాడు నారి.

రంగడు మాత్రం పట్టు విడవలే. అయ్యా నీళ్ళోసుకున్నంతసేపు గుణిసాడు.

ఇక బువ్వలకని కూర్చున్నప్పుడు మాత్రం నారి పిల్లగాడిని తప్పించుకోలేక పోయాడు.

"నాకు బువ్వొద్దు, నేనూ నీతో వత్తా" మొండికేసాడు రంగ.

"ఏడకిరా? " విషయం తెలీని మల్లి అడి గింది.

"కొండవతలికి"

"యేటీ, నిజమేనా? " మల్లి కళ్ళుపెద్దవి చేసి చూసింది.

నారి మాట్లాడకుండ బువ్వ తింటు న్నాడు.

వేడివేడి బువ్వలో చింతకాయ పచ్చడి అమృతంలా ఉంది.

"నిజమే, నేనూ అయ్యతో పోతుండా" నిక్కచ్చిగా చెప్పాడు రంగా.

"యేంది మావా మాట్లాడవు, పోరగాడు సెప్పేది నిజమేనా? " నిలదీసింది మల్లి.

"లేదులేవే, వాడినెక్కడికి తోలుకుని పోతాను" తేల్చేసాడు నారి.

ఆ మాట వింటంతోనే, కాళ్ళు చేతులూ కొట్టుకుంటూ, కిందపడి దొర్లసాగాడు రంగడు.

వాడి దొర్లుడికి పచ్చడి గిన్నె, బువ్వ దాక, అటుపక్కనున్న సొరకాయబుర్ర ఎగిరి ఎటో పోయాయి.

"నేను పోతా, అయ్యతో నేనూ పోతా" రాగంతీసి ఏడుస్తున్నాడు రంగడు.

వాడి తీరు అర్థమైనట్టు నారి తీరుబడిగా

తినడం ముగించాడు.

మల్లి మాత్రం వాడికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తుంది.

"అయ్యతో నువ్వెల్లితే, అయ్యకి పనవ్వ దురా బుడ్డోడా, నామాటినురా"

"నేయెల్తా, అయ్యతో యెల్తే అన్నీ చూడొచ్చు, ఇక్కడేముంది? " రంగ ఇంకా దొర్లుతున్నాడు.

మల్లి నిస్సహాయంగా నారికేసి చూసింది.

నారి నవ్వుతున్నాడు.

"సెప్పవేమావా, వాడలా యేడుత్తుంటే నవ్వుతావేంది? " సుర్రుమంది మల్లి.

"యేటి సెప్పేది, ఆడికి ఒక తమ్ముడొ, సెల్లెలో ఉంటే ఆళ్ళతో ఆడేటివాడు. ఒక్కడే ఏంసెయ్యాల? " పళ్ళెం పక్కన పెడుతూ అన్నాడు నారి.

మల్లి గుండె ఝల్లుమంది. రంగడు పుట్టినపుడే ప్రాణం పోయినంతపన య్యింది.

ఇంకో బిడ్డా! తనవల్ల కాదు. అదీకాక ఇక్కడ వంటరి బతుకులో ఇద్దరు పోరగా ల్లని తనెలా సాదగలదు?

"బాగుందయ్యో! అల్లా అయితే ఆడిని తోలుకపో, నాకేటి? " విసురుగా అటుతి రిగి గిన్నెలు సర్దసాగింది.

మల్లి సంగతి తెలిసిన నారిగాడు ఒక నిట్టూర్పు విడిచాడు, "మేమిద్దరం పోతే నీ సంగతేటి? "

"నా సంగతి నీకెందుకు, నీ పని నువ్వు సూసుకో, సాములోరు వేరు అడిగి చాన్నా ళ్ళయింది" గుర్తుచేసింది మల్లి.

"అందుకేగదా కొండావతలికి పోతుండా, ఓపని సేద్దాం. అందరం అటుపోయి ఆ వేరు దొరికినాక వద్దాం" నారి అన్నాడు.

"పోదామే అమ్మ," లేచికూర్చుంటూ అన్నాడు రంగా.

"యేడకిపోయ్యేది? యెట్టాపొయ్యేది? "

"యేముందే మల్లి, వంటకి గిన్నెలు పెట్టు, అక్కడే వండుకుని తిందాం. పన య్యిన వెంటనే వద్దాం" నారి నచ్చచె ప్పాడు.

వాడికి కూడా కొడుకుని తీసుకు పోవాలని ఉంది, అలా మల్లిని వదలటం ఇష్టంలేదు.

ఓసారి అలా అడవిలో తిరుగుతుండగా ఓ సాములోరు కనిపించి, ఒక వేరు చూపించాడు.

అట్టాంటి వేరు తెస్తే దుడ్డులిస్తాన న్నాడు. మళ్ళ ఆ సాములోరు వచ్చే రోజొ త్తుంది. ఇంతవరకు తనకు అట్టాంటి వేరు దొరకలే. ఎట్టాగైనా ఆ వేరు తెస్తే, సాము లోరిచ్చే దుడ్లకి సంతలో మల్లికి సీర, బుడ్డో డికి బొమ్మ కొనాలని నారిగాడి ఆశ.

ఇప్పుడు మల్లిని కూడా తీసుకపోతే ఎంత ఆలీశమైనా వేరు తీసుకుని రావచ్చు.

మల్లికి కూడా నారి కొండావతలికి పోతే ఎప్పుడొస్తాడొ అని గుబులుగ ఉంది.

కొంతసేపు మౌనంగా ఉండి, నారి మరో రెండు సార్లు బతిమలాడాక సరేనంది మల్లి.

రంగడి ఆనందానికి అంతులేదు. గుడిశె అంతా ఒకసారి పరిగెత్తాడు. నారిని, మల్లిని కావలించుకుని ముద్దులుపెట్టాడు.

వాడి ఉషారు చూసి నారి, మల్లి నవ్వు కున్నారు.

పాపం రంగడికి అక్కడ ఆడేటోళ్ళు లేక ఏమీ తోచదు.

ఇప్పుడు అయ్య, అమ్మతో కలిసి కొండా వతలికి పోతుండా అన్న ఆనందంతో వాడికి కాళ్ళూ చేతులు నిలవటంలేదు.

వాడడిగే ప్రశ్నలకి బదులిస్తూ కావల సిన గిన్నెలూ గుడ్డలూ మూటకట్టి, మొద టిఝాముకే బయటపడాలన్న ఆలోచనతో చాపలమీద వరిగారు నారి, మల్లి.

పడుకుని కూడా రంగడు ఇంకా ప్రశ్నలే స్తూనే ఉన్నాడు.

★ ★ ★

"హే రాజ్, కమాన్ మేన్, హేవ్ వన్

మోర్" నారాయణ్ పిళ్ళై మాట తడబడ టంలేదు కాని డోసు ఎక్కువైందని తెలుస్తుంది.

"నో సర్, మీరు కూడా ఇక ఆపాలి. మనకి రేపు అసైన్మెంట్ ఉంది" రాజ్‌కుమార్ ఓపిగ్గా చెప్పాడు.

"ఒహ్హో రాజ్, నాకేమీ ఎక్కువ కాలేదు. ఇలాంటి అసైన్మెంట్లు నేను చాలా చూసాను, చేశాను" నిర్లక్ష్యంగా గ్లాసు అందుకున్నాడు నారాయణ్.

రాజ్ కుమార్ నిస్సహాయంగా చూసాడు.

నారాయణ్ పిళ్ళై సీనియర్ మోస్ట్ ఎయిర్ క్రాఫ్ట్ పైలెట్.

రాజ్ అతని దగ్గర ఇంకా ఫ్లయింగ్ నేర్చుకుంటున్నాడు. అంతా బాగుంది. కాని నారాయణ్ పార్టీల పేరుతో ఇలా తాగేయడమే రాజ్‌కి నచ్చదు.

రాజ్ కూడా లైసెన్స్ ఉన్న పైలెట్, కాని నారాయణ్ దగ్గర నేర్చుకోవలసిన మెళుకువలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం ఇద్దరూ ఓ పెద్ద వ్యాపారవేత్తకి చెందిన చార్టర్ ప్లేన్ నడపడానికి వచ్చారు.

మరునాడు ఉదయమే వాళ్ళ పని మొదలవుతాది. నారాయణ్ పబ్‌లో చేరి మజా చేస్తున్నాడు. రాజ్‌కి ఇది అస్సలు నచ్చదు. మందు కొట్టడమే తప్పంటే, మరుసటిరోజు పని పెట్టుకుని ఇప్పుడు మందు కొట్టడం మరీ తప్పని రాజ్ అభిప్రాయం.

కాని నారాయణ్ వినే స్థితిలో లేడు.

రాజ్‌కుమార్‌కి పాతికేళ్ళుంటాయి. చిన్ననాటి నుండి విమానాల మీద ఆసక్తితో పైలెట్ కోర్స్ చేసాడు.

తన బాచ్ అంతటిలో అధిక ప్రతిభ చూపించి, త్వరగా లైసెన్స్ సంపాదించాడు. ఎయిర్ ఇండియాలో ఉద్యోగం వచ్చినా, ప్రైవేట్ పైలెట్‌గా ఉండడానికే ఇష్టపడ్డాడు.

రాజ్ తల్లిదండ్రులు ఆస్ట్రేలియాలో పెద్ద కొడుకు దగ్గర ఉన్నారు. తోబుట్టువులంతా తమతమ ఇష్టాలను బట్టి ఆయా దేశాలను ఎంచుకుని చెదిరిపోయారు.

రాజ్ చిన్న వాడవటంతో అతని మీద ఎవరూ అంత శ్రద్ధ పెట్టలేదు. పైలెట్ కోర్సుపై ఇష్టంతో అది చదివి, ఇండియాలోనే ఉండిపోయాడు రాజ్.

"సర్, రండి, ప్లీజ్" నారాయణ్‌ని బతిమిలాడాడు.

తెల్లారితే ట్రిప్పులేసి బాస్ గెస్టులను అతని బొంబాయి విల్లాకి తేవాలి. గెస్టులు ఎక్కువమందిలేరు కాని, అన్ని దిక్కుల నుండి తేవాలి.

"ఓకే బాబా, ఓకే వస్తున్నా, సరేనా" కుర్చీలోంచి లేచాడు నారాయణ్.

"ఈజీ సర్, ఈజీ" అతనికి చెయ్యి అందించాడు రాజ్.

"ఓహ్! కమాన్ రాజ్, అయామ్ నాట్ డ్రంక్, నడవగలను" రాజ్ చేతిని తోసేసి తూలుకుంటూ ముందుకు నడిచాడు నారాయణ్.

మొదటిసారి రాజ్‌కి భయం వేసింది. మరుసటిరోజు తెల్లారితే పని మొదలవుతాది. నారాయణ్ పరిస్థితి ఎలా ఉంటుందో అని, సందేహం మెదిలింది.

నారాయణ్‌తో పని చేయడం రాజ్‌కి కొత్తకాదు. అతని డ్రింకింగ్ హాబిట్ కూడా కొత్తకాదు. ఎంత తాగినా ఉదయానికి మామూలుగా ఉండగలడు.

కాని అలాగని ఎంతకాలం అలా స్టడీగా ఉండగలడు?

నారాయణ్‌ని అతని గదిలో వదిలి తన గదికి వచ్చిన రాజ్ మనసులో కొత్తగా ఒక అనీజీనెస్.

ఏదో ఆరాటం, అలజడి అతడిని కలవరపెడుతుంటే, ఏం కాదులే అని నిద్రపోయే ప్రయత్నం చేసాడు రాజ్‌కుమార్.

సరిగ్గా ఆరుగంటలకి పూర్తిగా సిద్ధపడిన రాజ్, నారాయణ్ పిళ్ళై గది తలుపు

తట్టాడు.

"కమిన్" లోపలినుంచి వినిపించింది.

తలుపు తీసుకుని లోపలికి వెళ్ళిన రాజ్ ఆశ్చర్యపోయాడు.

నారాయణ్ పిళ్ళై పూర్తి యూనిఫాంలో ట్రిమ్ముగా తయారయ్యి ఉన్నాడు.

"గుడ్ మార్నింగ్ సర్"

"వెరి గుడ్మార్నింగ్ రాజ్, రెడీ ఫర్ డ్యూటీ? " అడిగాడు నారాయణ్.

"యెస్ సర్" శెల్యూట్ చేస్తూ అన్నాడు రాజ్.

"కం, లెట్స్‌గో" గదిలోంచి బయటికి నడిచాడు నారాయణ్ పిళ్ళై.

తను అనవసరంగా కంగారు పడ్డాడు అనుకుంటూ, హుషారుగా అతని వెనకనే నడిచాడు రాజ్ కుమార్.

మొదటి ఇద్దరు గెస్టులు దగ్గరి ప్రాంతాల వారే. వాళ్ళని గంటలో బాస్ ఇంటిలో దింపారు. తరవాతి గెస్ట్ హైద రాబాద్ నుంచి. హైదరాబాద్‌లో గెస్ట్‌ని పిక్ చేసుకుని వెనక్కి బయలుదేరారు.

వాతావరణం చాలా అనుకూలంగా ఉంది. రాడార్ సిగ్నల్స్ క్లియర్‌గా ఉన్నాయి. రాజ్ మనసులో తేలిగ్గా ఫీల య్యాడు.

రాత్రి నారాయణ్‌ని చూసిన వాళ్ళెవరూ అతను అంత కామ్‌గా, కంట్రోల్‌లో ఉండి పని చేస్తాడని ఊహించరు.

ఆలోచనల్లో ఉన్న రాజ్ చార్టర్ ప్లేన్ ఒక్కకుదుపు ఇచ్చేసరికి ఉలిక్కి పడ్డాడు. తన చేతిలోని కంట్రోల్ స్టిక్ సరి చూసు కుని, నారాయణ్ కేసి చూసాడు.

నారాయణ్ దీక్షగా ముందుకి చూస్తు న్నాడు.

బహుశ ఎయిర్ పోకెట్ అయ్యుం టుంది!

ప్లేన్ దట్టమైన అడవి మీదుగా పో తోంది. కొండని కప్పేసిన చెట్లు, కొండని చుట్టి ప్రవహిస్తున్న నది. ఏమన్నా జరిగితే సహాయం అందటానికి చాలా టైమ్ పట్టే ప్రదేశం.

ఛ, ఛ, తనేం ఆలోచిస్తున్నాడు, తనని తనే తిట్టుకున్నాడు రాజ్.

మళ్ళ కుదుపు ఇచ్చింది విమానం.

"ఏమైంది? ఎందుకిలా అవుతుంది? " వెనక సీట్లో ఉన్న అతిథి కంగారు పడ్డాడు.

"నథింగ్ సర్, ఎయిర్ పోకెట్, భయం లేదు" నారాయణ్ అన్నాడు.

రాజ్ కంట్రోల్ పానెల్ చూసాడు. ఎయిర్ పోకెట్ లాంటిదేమీ కనబడడం లేదు.

వాతావరణం చాలా క్లియర్‌గా ఉంది. అడవి వల్ల కొత్తగా ఏమన్న ఎయిర్ పోకెట్ ఏర్పడతాదా?

ఈసారి నారాయణ్‌ని అడగాలి. ఇప్పుడే అడిగితే వెనకున్న అతిథి గాభరా పడ తాడు.

రాజ్ తన కంట్రోల్ పానెల్ సరిచూసు కున్నాడు.

సడెన్‌గా విమానం డిప్ అయ్యి కిందకి వచ్చింది.

రాజ్ చటుక్కున తన దగ్గరి స్టిక్‌ని పైకి లాగాడు. "సర్", నారాయణ్‌కి మాత్రమే వినిపించేలా తన మౌత్ పీస్‌లో పిలి చాడు.

అటు నుండి ఏమీ జవాబు రాలేదు. విమానం మరింత కిందకి వెళుతుంది. తన దగ్గరి కంట్రోల్స్‌తో దానిని సరిచేయ డానికి ప్రయత్నిస్తూ, "సర్, సర్" గట్టిగానే అరిచాడు రాజ్.

ఇప్పుడూ సమాధానం లేదు. ఒక్క సెకను తలతిప్పి పక్కకి చూసిన రాజ్ గుండె ఆగినంతపనయ్యింది.

నారాయణ్ ముందుకి వాలిపోయి ఉన్నాడు. అతని ఛాతి సరిగ్గా.. ఎత్తు సరి చూసే స్టిక్ మీద బరువుగా పడడంతో, అది ప్రెస్ అయ్యి, విమానం కిందకి వెళ్లి



పోతుంది.

"దేవుడా, దేవుడా, ఏమవుతుంది, పైలెట్, ప్లీజ్, చెప్పండి" వెనక నుండి గెస్ట్ అరుస్తున్నాడు.

"సర్, ప్లీజ్, కంట్రోల్లో ఉండండి, ఏమీ కాదు" రాజ్ అతనికి చెప్పి, ఒకచేత్తో ఎత్తు కంట్రోల్ చేస్తూ, మరో చేత్తో నారాయణ్‌ని కంట్రోల్ స్టిక్ మీద నుండి జరిపే ప్రయత్నం చేసాడు. కాని నారాయణ్ ఒక అంగుళం కూడా కదల్లేదు.

"ఏమయ్యింది, ఏమయ్యింది? " హిస్టీరిక్‌గా అరుస్తున్నాడు గెస్ట్. "సర్, కొంచెం ఈయన్ని వెనక్కి లాగండి" తన హెడ్ ఫోన్స్ చెవుల నుండి తప్పిస్తూ అన్నాడు రాజ్.

"నో, నో, నా వల్ల కాదు, ఏమన్న చెయ్యి, అయ్యో, నాకు చావాలని లేదు, నాకు చాలా పనులున్నాయి" పిచ్చిపిచ్చిగా అరుస్తున్నాడు గెస్ట్.

రాజ్‌కి కోపమొస్తుంది కాని ఇప్పుడు కోప్పడి లాభంలేదు. ఇలాంటి సమయాల్లో ఎంత కూల్‌గా ఉంటే అంత మంచిది.

"ప్లీజ్ అరవకండి. నేను ప్రయత్నిస్తున్నాను" రాజ్ తన శాయశక్తులా విమానాన్ని కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నాడు కాని, నారాయణ్ వంటి బరువువల్ల కంట్రోల్ స్టిక్ కిందకి పోతోంది.

చిన్న చిన్న కొమ్మలు, రెమ్మలు విమానం అద్దం మీద కొట్టుకోవడం మొదలైంది.

రాజ్‌కి అర్థమైంది. ఇక తను ప్రయత్నం చేసి అనవసరం.

బహుశా నారాయణ్ గుండె నొప్పితో చనిపోయి ఉంటాడు.

కనీసం తన గెస్టునైన తను కాపాడాలి.

"సర్ విమానం కూలిపోతుంది, మీరు దూకెయ్యాలి, సీటు కింద పారాచ్యూట్ ఉంది. దయచేసి కట్టుకోండి" రాజ్ చెప్పాడు.

విమానం చాలా కిందకొచ్చేసింది.

"నాకు రాదు, నాకు భయం, నువ్వే కట్టు" గెస్టు వణికిపోయాడు.

తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోపైలెట్ పెట్టి పాసెంజర్‌కి అటెండ్ అవ్వడం మామూలే.

రాజ్ ఆటో పైలెట్ ఆన్‌చేసి, వెనక పాసింజర్ దగ్గరకు జరిగాడు.

పారాచ్యూట్ తీసి అతనికి కట్టబోతే, భయంతో వణుకుతున్న అతిథి సహకరించడంలేదు.

"సర్, ప్లీజ్, కంట్రోల్ యువర్ సెల్ఫ్. మనకి ఎక్కువ సమయంలేదు" రాజ్ బ్రతిమలాడుతూ ప్రయత్నిస్తున్నాడు. విమానం విపరీతంగా ఊగిపోతోంది.

"హెల్ప్, హెల్ప్" హిస్టీరిక్‌గా అరుస్తూ, గెస్ట్ రాజ్‌ని తోసేసాడు. ఏమైందో అర్థమయ్యేలోగా, తెరుచుకున్న ఎమర్జెన్సీ డోర్నుండి రాజ్ బయటపడిపోయాడు.

విమానం అడ్డదిడ్డంగా వెళ్లడం రాజ్ చివరగా చూసాడు. తరవాత పల్టీలు కొడుతూ అంత ఎత్తు నుండి కిందకి పడిపోయాడు. చెట్ల కొమ్మల మీద పడడం వరకు గుర్తుంది, తరవాత అంతా చీకటి కమ్మేసింది.

★ ★ ★

పూర్తిగా వెలుగురేఖలు విచ్చక ముందే నారి భార్యని, కొడుకుని తీసుకుని కొండవతలకి బయలుదేరాడు. కొంతసేపటి వరకు చిరు చీకట్లలో రంగడికి ఏమీ కనిపించలేదు. అయ్య భుజాల మీద కూర్చుని, తల అయ్యతల మీద వాల్చి నిద్రపోయాడు.

వాడికి మెలుకువ వచ్చేసరికి ఎండ కళ్ళలో పడుతుంది. చుట్టూ అడవి గొప్ప సందడిగా ఉంది. అరుపులు, గర్జనలతో పాటు, ఎక్కడో జలజల పారుతున్న జలపాతం హోరు.

"అయ్యా, అయ్యా అటుసూడవే, ఆ కాయలెంత ఎర్రగా ఉన్నాయో, కొన్ని

వియత్నాం కథ : **తల్లిపేగు**
మూల రచయిత : **వు లె మాయ్**
అనువాదం : రంగనాథ రామచంద్రరావు

లింబూ కథ : **గాజు బంధం**
మూల రచయిత : **బి. బి. సుబ్బా**
అనువాదం : కాలిపు వీరభద్రుడు

హిందీ కథ : **చెరకు ముక్క**
మూల రచయిత : **యశ్‌పాల్**
అనువాదం : జనపన లక్ష్మిరెడ్డి

ఏప్రిల్ **విపుల** లో..

కొయ్యావే తింటాను” నారిగాడి భుజాల మీద కూర్చుని చుట్టూ చూస్తున్న రంగడు అరిచాడు. బాగా పైకి ఉన్నాడేమో వాడికి కాయలు, పూలు అన్నీ బాగా కనిపిస్తు న్నాయి.

కొమ్మల మీద కోతులు ఒక్కోసారి వాడిని చూసి పళ్ళు బైటపెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి కాని రంగడు పట్టించుకోలేదు. వాడికి అంతా కొత్తగా, ఆశ్చర్యంగా ఉంది. వాడి గుడిశెదగ్గర లేని ఎన్నో రకాల చెట్లు, జంతువులు కనిపిస్తు న్నాయి.

ఆ జలపాతం నీళ్ళు, కొండను చుట్టి పారే నదిలో కలుస్తాయి. వర్షకాలంలో జలపాతం ఒరవడి మహా జోరుమీదుం టాది.

“ఏది పడితే అది తినకూడదురా అయ్యా, నేను కోసి ఇస్తాగా” కొడుకుకి చెప్పాడు నారి.

మల్లి కూడా కళ్ళు పెద్దవి చేసి చూస్తుంది. ఈ వైపు అడవిలోకి తను కూడా ఎప్పుడూ రాలేదు.

చెట్లు దట్టంగా ఉన్నాయి. అందువల్ల ఎండ ఎక్కువగా తగలటం లేదు. ఒక్కో చోట, ఒక్కో చెట్టు కూలిపోయి, ఆ సందు లోంచి ఎండ సూటిగాతగులుతుంది.

చెట్ల కొమ్మలకి తీగలు చుట్టేసి ఉన్న మూలాన అడవి మరింత దట్టంగా కనబ డుతుంది.

మల్లికి కూడా తెలీనన్ని రకాల పళ్ళు, పూలు కనబడుతున్నాయి. కాని నారి చెప్పిన మాటను బట్టి మల్లి మౌనంగా నడుస్తుంది.

అడవిలో పక్షుల కిలకిలలు, జంతువుల అరుపులు వినిపిస్తున్నాయి గాని అంత భయంకరంగా అనిపించలేదు. ఉండుండి ఒక్కో జింక పొదల మీదుగా దూకు తోంది.

కాళ్ళ మధ్య నుండి కుందేళ్ళు పరుగెడుతున్నాయి. ఎలుగుబంట్లు, చిరుతలు లాంటివి కనబడటంలేదు.

"మావా, పులులుంటాయా?" బెరుగ్గా అడిగింది మల్లి.

"ఇక్కడుండవే, ఇంకా లోపలికి పోవాల. మనకి భయంలేదులే" మల్లి మనసు అర్థం చేసుకున్న నారి అన్నాడు. పైన బయ్యమంటు ఏదో దూసుకుపోయింది.

రంగడు తండ్రి తలను గట్టిగా హత్తుకున్నాడు. మల్లికూడా నారి చేయి పట్టుకుంది.

"ఇమానమే, గాల్లో పోతాది. అందులో మడుసులు ఎక్కి ఒక ఊరి నుండి ఇంకో ఊరుపోతారంట" వివరించాడు నారి.

"అంటే గద్దలాంటి పక్సి కాదా?" మల్లి అనుమానంగా అడిగింది.

"కాదే, పట్నపోళ్ళు సేసారంట. ఎంత దూరమైన సిటికిలో పోవచ్చుంట" గూడెంలో తను విన్న విషయాలు చెప్పాడు నారి.

"అయ్యా, మనం అదెక్కిపోదామే, త్వరగా పోవచ్చు" రంగడు అడిగాడు.

"అట్టానే లేరా, సరిగా కూసో" కొడుకుని మురిపెంగా ముద్దులాడాడు నారి.

మాటల్లోనే చాలా దూరం వచ్చేసారు.

దూరంగా దబ్బుమన్న శబ్దం వినిపించింది. కొంతసేపటికి పొగ దట్టంగా చెట్ల పైకి లేవసాగింది.

"అల్లక్కడ చెట్లకి పొగపెడుతున్నమల్లే ఉంది, తేనెపట్లు ఉన్నాయి కామోసు" మల్లి అంది.

నారి ఏమీ మాట్లాడలే. వాడెంచుకున్న దారి చిన్నగా అడవిబైటికి పోతుంది.

ఇంతవరకు సాములోరు అడిగిన వేరు దొరకలేదు.

"అయ్యా, అటుసూడు, సెట్టు మీద" రంగడు అరిచాడు.

సెట్టు మీద అనేసరికి ఎలుగుబంట్లు గుర్తొచ్చాయి నారికి.

"ఉష్, అరవమాక" కొడుకుని గద్దించాడు. ఎలుగ్గొడ్డు మీదపడి గాయపరుస్తాది.

చిన్నగా తలెత్తి పైకి చూసాడు.

కొమ్మల మధ్యలో చిక్కుకుని ఉన్నాది. కాని తెల్లతెల్లగా ఉంది.

ఎలుగ్గొడ్డు అయితే నల్లగా ఉండాలి కదా!

"ఏందయ్యా అది?" మల్లి భయంభయంగా అంది.

"ఎలుగొడ్డుకాదు కాని, ఏందో తెలీట్లా" నారి పరీక్షగా చూసే ప్రయత్నం చేసాడు.

రంగడు భుజం మీద ఉండడం వల్ల తల సరిగా లేపలేక, సరిగా కనిపించటం లేదు.

"ఓ పాలి దిగరా అయ్యా" కొడుకుని కిందకు దింపాడు. ఈసారి మెడసారించి చూసాడు.

కాళ్ళు, చేతులు కనిపిస్తున్నాయి. మడిసా? సరిగా తెలవటం లేదు నారికి.

"కూకోండి, సూసొత్తా" పంచె మరింత యెగ్గడుతూ అన్నాడు.

"యెందుకయ్యా, అదేందో తెలీనిదానికి. యేటన్నా అవుతాదేమో?" మల్లి వారించింది.

"యేటీ కాదు, బుడ్డోడ్ని పట్టుకుని కూసో" చకచక చెట్టుపైకి ఎగబాకాడు నారి.

'తను అనుమానించినట్లే మనిషే... ముఖానికంతా నెత్తురుంది. చెయ్యి, కాల్లు కూడా రగతంతో తడిసి ఉండాయి. అయ్యో, ఇట్టా ఎట్టా అయ్యిందో?' అనుకుంటూ ఒడుపుగా అతన్ని భుజం మీదకు లాక్కుని, జాగ్రత్తగా చెట్టు దిగాడు నారి.

మల్లి, రంగడు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"యెవరయ్యా ఇతను?" మల్లి అడిగింది.

"తెలీదుమా, ఎట్లా వచ్చాడో... ఎందుకు సెట్టెక్కాడో? " నారి అతన్ని కింద పడుకో బెట్టాడు.

రంగడు కళ్ళు పెద్దవి చేసి చూస్తు న్నాడు.

కొత్త మనిసి తెల్లని బట్టల్లో ఉన్నాడు కాని బట్టలు చిరిగిపోయి, నిండా రక్తం మరకలతో నిండి ఉన్నాయి.

"బతికే ఉన్నాడు, ఊపిరుంది" ఛాతి మీద చెవిపెట్టివిన్నాడు నారి.

"యే యెలుగ్గొడ్డో తరిమితే సెట్టెక్కి ఉంటాడు. దెబ్బలు, రగతం తెలుస్తుంది కదా" మల్లి అంది.

"అయ్యుంటాది. సూత్తుండు, పసరా కులు తెత్తా" నారి పొదల్లోకెల్లాడు.

మల్లి మెల్లగా అతని ముఖం మీద రక్తం తుడిచింది. సిన్న కుర్రాడె, నారికన్నా కొంచెం పొట్టిగా ఉన్నాడు.

అప్పుడే అతను తల కదిపాడు "నీళ్ళు" అస్పష్టంగా అడిగాడు.

రంగడు తల్లి వెనక్కి జరిగాడు. వాడికి భయంగా, కొత్తగా ఉంది.

మల్లి గబగబ పక్కనున్న సొరకాయ బుర్ర తీసి అతని పెదాలకి అందించింది. ఆతృతగా కొంచెం తాగి తోసేసాడు. దగ్గు తెర అతన్ని కమ్మేసింది.

"ఏందే, ఏమైంది? " నారి వచ్చాడు. అతని చేతుల్లో ఏవేవో ఆకులు. "దాగం అన్నాడయ్యా, నీల్లు పట్టా" మల్లి సొర కాయ చూపింది.

"అయ్యో, అది ఇప్ప సారానే, పర్లేదులే, వొల్లునెప్పులు తగ్గుతాయి" ఆకులు చేతుల మధ్య నలిపి గాయాల మీద పసరు పిండాడు నారి.

వళ్ళు చీరుకుపోయింది తప్ప, పెద్ద గాయాలులేవు. అప్పటికి కళ్ళు తెరచి చూస్తున్నాడతను.

"అబ్బాయా, ఎవర్నువ్వు? యేడనుండి వచ్చావు? నీతో యెవరున్నారు? " అడిగాడు నారి. ఆ అబ్బాయి అయోమయంగా చూసాడు. చూపులో స్పష్టత లేదు.

"పోన్లే అయ్యా, ఏమన్న తినడానికిచ్చి అప్పుడడుగుదాంలే" మల్లి అంది.

అతన్ని చిన్నగా లేపి చెట్టుకాన్చి కూర్చో పెట్టాడు నారి. రంగడు ముందుకొచ్చి చూస్తున్నాడు. అతను కూడా తమలాగానే ఉండడంతో వాడికి ధైర్యం వచ్చింది.

"ఇదో, ఇది తిను" బుట్టలోంచి ఉడికించిన దుంపతీసి ఇచ్చింది మల్లి. మౌనంగా అందుకుని తినసాగాడు.

"నీపేరేంది? " నారి అడిగాడు. అయోమయంగా చూసాడు అతను. "సరేలే తిను" అన్నాడు నారి. ఆ అబ్బాయి బాగా భయపడి ఉంటాడు, అందుకే మాట్లాడలేకపోతున్నాడు. రంగ దగ్గరకి జరిగి కూర్చున్నాడు. ఆ అబ్బాయి చేతికున్న పెద్ద, గుండ్రటి బిళ్ళ గొలుసువాడికి బాగా నచ్చింది.

"అయ్యా, అదేంటే? " అడిగాడు.

"ఝామెంతయ్యిందో సెప్పే మిసనురా" చెప్పాడు నారి.

కళ్ళు పెద్దవి చేసి చూసాడు రంగ. అట్టాంటి మిసన్లు ఉంటాయని ఆడికి తెలీదు.

ఆ అబ్బాయి దుంపతినడం ముగించాడు. "నీళ్ళు" అడిగాడు. ఈసారి నారి సరియైన సొరకాయ బుర్ర అందించాడు.

గబగబా నీళ్ళు తాగి బుర్ర తిరిగి అందించాడు. "ఎక్కడినుండి వచ్చావు, సెట్టెందుకెక్కావు? " నారి అడిగాడు, కాని అతను అయోమయంగా చూసాడు.

"నీపేరేంది? " మల్లి అడిగింది. మల్లా అలానే చూసాడు.

"భయంతో మర్సిపోయినట్టున్నాడు, మల్లా అడుగుదాంలే" నారి అన్నాడు.

నారి ఆ పిల్లాడి వళ్ళంతా తడిమి చూసాడు. ఆ అబ్బాయి తలూపాడు. కొంతసేపు అక్కడ కూర్చుని, వెంటతెచ్చిన పళ్ళు, దుంపలు తిని బయల్దేరారు. అతను కూడా వాళ్ళవెనకే బయల్దేరాడు.

ముందు కొంచెం కుంటాడు కాని క్రమంగా తేలిగ్గానే నడవసాగాడు. తమ వెనెకనే వస్తున్న అతన్ని అనుమానంగా చూసింది మల్లి.

"పాపం యెంటవచ్చినవాల్లు ఎటో పోయినట్టున్నారు, రానీయే, ఏంగాదు" నారి మల్లికి నచ్చ చెప్పాడు. రంగడు ధైర్యంగా కొత్త అబ్బాయి చెయ్యి పట్టుకున్నాడు. ఆ అబ్బాయి కూడా ఏమీ అనలే!

ప్రయాణం సాగిపోయింది. అడవిదాటి కొండకి ఇంకో పక్కకి చేరుకున్నారు నారి బృందం.

రంగడు కొత్త అబ్బాయితో స్నేహం చేసేసాడు. ఆ అబ్బాయి కూడా వాడితో చక్కగా తిరుగుతున్నాడు కాని తన విష యాలు అతనికి గుర్తులేవు. అతని పేరు తెలీక, మల్లి అతన్ని "పెద్దోడా" అంటుంది.

మూడో రోజుకల్లా బుడ్డోడు, పెద్దోడు దోస్తులయిపోయారు. నారికి కావలసిన వేరు దండిగా దొరికింది. కొండ చుట్టు తిరిగి, తమ ఇంటికి చేరుకున్నారు.

★ ★ ★

"యెస్, ఎనీ న్యూస్? " అసహనంగా అడిగాడు కమాండర్ శర్మ. రాజ్, నారా యణ్‌లకు అతను కమాండర్.

"నో సర్, ఎవరూ బతికి ఉన్నట్టు లేదు. కాలిన విమాన భాగాలు, ప్రయాణికుల శరీర భాగాలు మాత్రమే దొరికాయి. అవి కూడా ఎవరివో, ఏమిటో తెలీనట్లున్నాయి. అసలు ఆనవాలుకి దొరకడం లేదు" రెస్క్యూ ఆపరేషన్ చూస్తున్న టీం లీడర్ చెప్పాడు.

"డామిట్" బల్లమీద గట్టిగా చేత్తో కొట్టాడు శర్మ.

ఇంతవరకు అతని టీంలో ఎవరూ ఇలా దుర్మరణం పాలవ్వలేదు. కనీసం ఒక్కరు కూడా లేకుండా అందరూ చనిపోవడం చాలా విచారకరం.

అప్పటికి క్రాష్ అయ్యి మూడురోజులు. అసలు క్రాష్ న్యూస్ తెలియడానికి ఒకరో జుపట్టింది. తరువాత రెస్క్యూ పనులు ఆరంభించినా, ఆ దట్టమైన అడవిలో, కొండకోనల్లో వెతకడం కష్టమైంది.

"అన్ని ట్రైబల్ ఏరియాస్, తండాలు వెతికారా? " మళ్ళా అడిగాడు.

"అన్నీ వెతికాం సర్, ఎవరూ ఏమీ చూడలేదన్నారు"

కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు శర్మ.

"ఒకే, ఇక సెర్చ్ క్లోజ్ చేసేయండి" భారంగా చెప్పాడు.

"మరి డెబ్రి, ఇంకా శరీర భాగాలు? "

"దొరికినంత వరకు మూట కట్టండి. ఎవరి పార్ట్స్ ఏమిటో తెలీనప్పుడు ఏం చేస్తాం? "

"యస్ సర్" శెల్యూట్ కొట్టి బయటకు నడిచాడు టీం లీడర్. అప్పటికి ప్లేన్ క్రాష్ అయ్యి మూడు రోజులైంది. ఏదో మూల ఉన్న ఆశతో ఇంతవరకు వెతికారు.

టేబుల్ మీదున్న ఫోన్ తీసి, ఆఫీస్ అసిస్టెంట్‌ని పిలిచాడు శర్మ.

"నారాయణ్ పిళ్ళై, రాజ్‌కుమార్ వాళ్ళ ఫామిలీస్‌కి లెటర్స్ ప్రిపేర్ చేయండి. లెట ర్‌తో పాటు, మంచి ఫ్లవర్స్ కూడా పెట్టాలి, కండొలెన్స్ లెటర్స్ కదా" బరువె క్కిన మనసుతో సూచనలిచ్చాడు శర్మ.

★ ★ ★

"బుడ్డోడా, పెద్దోడా, బువ్వకి రండి" మల్లి పిలుస్తుంది.

రంగడు, రాజ్ ఆటాపి వచ్చారు.

అతని పేరు రాజ్‌కుమార్ అని అతనికి గుర్తులేదు, అతను చెప్పలేదు కనుక నారి కుటుంబానికి తెలీదు.

రాజ్‌కి తిరిగి గతం గుర్తొచ్చేవరకు రాజ్‌కుమార్ చనిపోలేదని బయట ప్రపం చానికి తెలీదు! ఎప్పుడైనా రాజ్‌కి తనెవరో గుర్తొస్తే, అప్పుడు అతను బయటికి రావచ్చు.

అప్పటి వరకు అతను పెద్దోడు, రంగడి దోస్తు.

రంగడికి ఆడుకొనే దోస్తు దొరికాడని వాడికి ఆనందం. రంగడు ఆనందంగా ఉన్నాడని మల్లికి, నారికి సంతోషం.

రాజ్‌కుమార్, కమర్షియల్ పైలెట్, 'పెద్దోడు'గా, అన్నీ మరచి అడవిలో, చిన్న పిల్లాడిలా రంగడితో ఆటపాటలలో పొద్దు పుచ్చుతున్నాడు. V

భారతీయాంగ్ల కథ

- సుభద్రాసేన్ గుప్తా

మనశ్శాంతి

ఇవ్వడంలోను, తీసుకోవడంలోను గంగానది అమిత కరుణామయి అంటుంటారు. మరణాన్ని కోరుకున్నా కాదనకుండా ఇస్తుందిట ఆ నదీమతల్లి. తన నిరంతర వాహినిలో మనని దాచుకొని ప్రశాంతమైన అమర సుఖాన్నిస్తుందిట. ఇదంతా నిజమైతే బాగుండుననుకొంది మృదుల.

కేదార్‌ఘాట్ రాతిమెట్ల మీద కూచుని బాలభానుడి లేతకిరణాలు గంగానది అలలపై తేలుతూ నీటిని కరిగించిన బంగారంలా మార్చడం చూస్తోందామె. గంగమ్మతల్లి పశ్చిమ వాహిని. వారణాశి దగ్గరకు రాగానే మనసు మార్చుకొని తూర్పువైపు ప్రవహిస్తుంది. పవిత్రమైన ఆ గంగాప్రవాహంలో గొంతులోతు నుంచొని ప్రార్థనలు చేస్తున్నారు కొందరు. దోసిళ్ళతో తర్పణాలు విడుస్తున్నారు మరికొందరు. ఏవేవో మంత్రాలు చదువుతున్నారు ఇంకొందరు. కనీసం వీళ్ళకి ఈ మంత్రాలు, ఆచారాలకి అర్థమైనా తెలుసా? అని ఒక్కక్షణం మృదులకి అనిపించింది. తను కూడా వీళ్ళలా అర్థం తెలియని విశ్వాసాన్ని అనుసరించాలనీ, వాళ్ళు స్తోత్రం చేసే వేదమంత్రాలను తనూ స్తోత్రం చెయ్యాలనీ, ప్రార్థిస్తూ మరణిస్తే అది 'మంచి మరణం' అవుతుందని ఆమెకు మొదటిసారిగా అనిపించింది. మతాన్ని, సాంప్రదాయాలను నమ్మని తను జీవిత చరమాంకంలో ఈ అర్థంకాని ఆచారాలు పాటిస్తే హిందువైపోతుందా?

ఇత్తడిచెంబులో నీళ్ళు మోసుకుంటూ నడుము వంగిపోయిన ఒక ముసలామె మెట్లెక్కి మృదుల దగ్గర ఆగింది. నదిలో స్నానం కూడా చేసిందేమో ఆమె నడిచినంతమేరా మెట్లు నీళ్ళు కారుతున్నాయి. మృదులని చూసి చెయ్యి చాచింది.

“నా దగ్గర డబ్బుల్లేవమ్మా” అని భుజాలెగరేసింది మృదుల. మాట పూర్తికాకుండానే ముసలామె ఏవో మంత్రాలు చదువుకుంటూ వెళ్ళిపోయింది. భక్తి భక్తే, భుక్తి భుక్తే అనుకుంది మృదుల.

మదన్‌పురా.

మృదులకి తెలుసు- తన ఆకారాన్ని అక్కడ ఎవరూ పోల్చుకోలేరని. బూడిదరంగు జుట్టుని చెవులదాకా కత్తిరించింది. మెడలో గొలుసుకి వేలాడుతున్న కళ్ళజోడు. చొక్కా, ప్యాంటూ. ఎక్కువదూరం నడవటానికి వీలైన చెప్పులు. ఒక చేతికి పెద్దవాచీ, ఇంకో చేతికి వెండికడియాలు. రంగు వేసిన గోళ్ళు. రోజూ కాశీలో తిరిగే వేలాది సందర్శకుల్లానే ఉంది తను. ఆమె నుంచి వస్తున్న ఖరీదైన సెంటూ, సిగరెట్ల వాసన దుకాణదారుల్ని ఆశ్చర్యపరుస్తోంది. వారంతా ఆమెతో ఇంగ్లీషులో మాట్లాడుతున్నారు. ఆమె వారణాశి వచ్చింది సదాచార మృత్యువు కోసమని, ఆత్మహత్య చేసుకోవటానికని ఎవరైనా ఊహించగలరా?

మృదుల శిథిలమైపోయిన ఒక జమీందారీ బంగ్లాలో ఉంటోంది. దాని అద్దె తన



సిగరెట్ల ఖర్చుకన్నా తక్కువే! నల్ల చేవ మాను మంచమూ, రెండు కుర్చీలూ, ఒక అలమర, గదిలోపలే స్నానాలగది. మృదుల తన గదికి వెళ్ళేప్పటికి డల్లార్ నేల తుడుస్తోంది. అడుగుల చప్పుడు విని తల పైకెత్తి కిళ్ళీ మరకలు పడ్డ పళ్ళు కనిపించేలా నవ్వి అడిగింది-

"ఓకింగ్‌కి ఎల్లారా అమ్మగారూ? "

మృదుల తలూపి ఊరుకుంది. జవాబిచ్చిందా, డల్లార్ ఒక గంటపాటు మాటల్లోకి దింపేస్తుంది! ఇక్కడికొచ్చిన మొదటి రోజు పొట్టిచేతుల రవికె, చీర కట్టుకొని

డల్లార్ స్వాగతం పలికింది.

"ఈడ పనిమడిసిని. బట్టలుతకతా, ఇల్లు తుడస్తా. ఒంట చెయ్యను. ఇంతకీ మీకు పెల్లైందా? " పైనించీ కిందవరకూ శోధిస్తూ అడిగింది. పెళ్ళైన చిహ్నాలేవీ మృదులలో కనిపించలేదు.

"నాకొక కొడుకు, మనవడు ఉన్నారు"

"మరి మీ ఆయన? "

"ఆయన కొన్నినెల్ల కిందటే పోయారు" అంది మృదుల నిర్లిప్తంగా. పనిమనిషితో తన భర్తమరణం గురించి ఎందుకు మాట్లాడుతున్నాను అనుకుంది మనసులో.

"అయ్యో పాపం! పోయినోల్లు మంచోల్లే లెండి! మిమ్మల్ని అమ్మగారు అననా, మేడమ్ అననా? "

"అమ్మగారు అను. ఢిల్లీలో మా పనమ్మాయి అలానే పిలుస్తుంది"

అనువాదం :
హారిక

రోజంతా నడుం పడిపోయేట్టు చాకిరి చేస్తుంది కాబట్టి డల్లార్‌ని నవ్వించడం తేలికే. తన అరవయ్యేళ్ళ జీవితంలో చాలా విషయాల్ని తేలిగ్గా తీసుకోవటం నేర్చుకుంది డల్లార్.

మృదులకి ఆకలేసింది. వివేక్ చనిపోయినప్పటినుంచీ ఇలా ఎప్పుడూ అనిపించలేదు. తనతో తెచ్చిన కచోరీలు, కూరా డల్లార్‌కి పెట్టి తనూ తింది. తర్వాత డల్లార్ తమలపాకులు చుట్టిచ్చింది. మృదులకి ఈ రెండువారాల్లోనే కిళ్ళీ బాగా అలవాటు చేసింది డల్లార్. 'డల్లార్ తల్చుకుంటే నా చేత సిగరెట్లు మాన్పించి బీడీలు అలవాటు చేస్తుందేమో' నవ్వుకుంది మృదుల.

★ ★ ★

పళ్ళెంలో వెలిగించని దీపపు ప్రమిద, పూలమాల, సాంబ్రాణి కడ్డీలు, గులాబీరేకులు, డబ్బాలో మిఠాయిలు ఉన్నాయి.

"దీని మీద పదిరూపాయలు పెట్టండి" అన్నాడు బ్రాహ్మడు. మృదుల అతని వెంటే విశ్వనాథ ఆలయ వీధిలో నడుస్తోంది. చీరల దుకాణాలు, ఆవులు, మేకల అరుపులు, బిచ్చగాళ్ళ ఏడుపులు, యాత్రికుల హడావుడి- ఇంత గోలలో ప్రార్థించడానికి ప్రయత్నిస్తోంది మృదుల. విశ్వనాథ ఆలయం లోపల నేలంతా తడితడిగా, తొక్కేసిన పూలు, ఇతర చెత్తతో బురదగా, కాలుపెట్టటానికి వీల్లేకుండా ఉంది. చెప్పుల్లేని మృదుల కాలివేళ్ళు నేల చల్లదనానికి కొంకర్లుపోతున్నాయి. దీపం వెలిగించి బ్రాహ్మడు మృదులకి పళ్ళెం ఇచ్చి ప్రదక్షిణలు చేయిస్తున్నాడు. గంటలు, శంఖాలు మోగినవి మోగినట్టున్నాయి.

"ఇక్కడ వినాయకుడికి రెండ్రూపాయలు, దుర్గామాతకి ఐదురూపాయలు, ఇక్కడ మూడు రూపాయలు..." ఇలా బ్రాహ్మడు చెప్తూనే ఉన్నాడు. దాంతో మృదులకి సంచీలోంచి డబ్బులు తీయడమే పనిగా ఉండి ప్రార్థన గురించి మర్చిపోయింది.

కాశీవిశ్వనాథుడు పాలతో, నీళ్ళతో అభిషిక్తుడై దర్శనానికి సిద్ధంగా ఉన్నాడు. మారేడు దళాలతో, ఎర్రటి మందారాలతో స్వామిని అలంకరించారు. గర్భగుడి తలుపులు వెండితో చేసినవైనా పొగచూరి మెరుగు మాసిపోయాయి. పైన బంగారు గోపురం మాత్రం వర్షంలో తడవటం వల్ల మురికి వదిలి శుభ్రంగా మెరుస్తోంది. 'ఇదొక్కటి ఇక్కడ అందంగా ఉంది' మనసులో అనుకుంది మృదుల.

గుడి బయటకు వచ్చాక తనకు సరిపడా దక్షిణ ఇవ్వలేదని బ్రాహ్మడు ఆమెను తిట్టాడు. అసలీ హడావుడిలో, కోలాహలంలో మృదుల తను గుడికి వెళ్ళింది వివేక్ కోసం ప్రార్థించటానికన్న సంగతే మర్చిపోయింది. రిక్షావాడు ఆమెకోసం ఎదురుచూస్తున్నాడు.

"పూజ బాగా జరిగిందా అమ్మగారూ? విశ్వనాథస్వామిని చక్కగా దర్శించుకున్నారా? " అని అడిగాడు.

"నువ్వు గుడిలోపలికి ఎప్పుడైనా వెళ్ళావా మక్సూద్ మియా? " జవాబుగా అడిగింది మృదుల.

"ఓ చాలాసార్లు.." రిక్షా గంటల్లాంటి నవ్వుతో "వెళ్ళినప్పుడల్లా మనశ్శాంతిగా ఉంటుంది. మసీదులో ఉండే శాంతిలాగా" చెప్పాడు.

మృదుల నవ్వి "ఏం చేస్తావు గుడికెళ్ళి? " అడిగింది.

"పూజ, ప్రార్థన చేసి ప్రసాదం పంచుతాను" అతను ఉత్సాహంగా చెప్తూ పోతున్నాడు. "ఎక్కువ హారతి సమయానికి వెళతాను. అప్పుడు ప్రసాదంగా పంచే పాలకోవా అంటే నా మనవళ్ళు, మనవరాళ్ళకి చాలా ఇష్టం"

"సరే మక్సూద్! గుడికి వెళ్ళాను. ఎప్పుడో ఒకప్పుడు నీ మసీదుకి కూడా వస్తాలే.."

"తప్పకుండా రా తల్లీ" అంటూ ఆమె వైపు తిరిగి నవ్వాడు.

ఈ ముసలి ముసల్మాను అంగీ చినిగిపోయిందని గ్రహించింది మృదుల. ఒక బట్టలకొట్టు ముందు రిక్షా ఆపించి అంగీ కొనిచ్చింది. దాన్ని అపురూపంగా తీసుకున్నాడు మక్సూద్.

★ ★ ★

'మనశ్శాంతిగా ఉంటుంది'

గదిలో కిటికీ దగ్గర కూర్చున్న మృదుల మనసులో ఇవే పదాలు ప్రతిధ్వనిస్తున్నాయి. తనకి గుళ్ళో మురికి కనపడింది, బ్రాహ్మడి కళ్ళలో ఆశ కనపడింది. మరి మనశ్శాంతి? మక్సూద్‌మియా కళ్ళలోని ప్రశాంతత చివరిరోజుల్లో వివేక్‌కి లభించి ఉంటే ఎంత బాగుండేది! శరీరాన్ని కుళ్ళగించే కాన్సర్, దానికోసం శరీరాన్ని కుళ్ళబొడిచే కీమోథెరపీ. నొప్పి ఫలానా అని కూడా చెప్పలేని నిస్సహాయ స్థితిలో వివేక్. 'ఏం పాపం చేశానని నాకీ శిక్ష? ' అని అతని కళ్ళు అడిగేవి. ఆమెకు సమాధానం తెలియదు. పాలు-నీళ్ళ అభిషేకం చేయించుకునే ఆ విశ్వనాథుడికీ తెలియదు.

మృదుల ఇంకో సిగరెట్ వెలిగించగానే డల్లార్ అడిగింది "ఎన్ని కాలుస్తారు రోజుకి? "

"మూడు ప్యాకెట్లు"

గుండెమీద చెయ్యి వేసుకుని "హమ్మో మూడు పెట్టెలే.." అని ఆశ్చర్యపోయింది డల్లార్.

చీకట్లు ముసురుకుంటున్నాయి. ఇంకాసేపట్లో బిచ్చగాళ్ళు గుంపులు గుంపులుగా దేవాలయాల దగ్గరికి, సాధువులు భంగు, చరస్ అడ్డాలకీ, సానులు వీధిమూలలకీ చేరుకుంటారు. యుగాలనించీ వారణాశి పాపాలకీ, మోసాలకీ, మోక్షానికీ కేంద్రమైంది. అలా ఉండబట్టే ఈనాటికీ నిలబడగలిగింది.

★ ★ ★

మణికర్ణిక.

విష్ణుమూర్తి మహాశివుణ్ని కొలిచిన ప్రదేశం. ఇక్కడ చితిలో కాల్చబడితే పాపాలన్నీ పోయి మోక్షం లభిస్తుందట. అత్యున్నత హిందూ మరణం అంటే మణికర్ణికలో మరణం. చితి చల్లారగానే అస్థికలు గంగలో కలపటాన్ని మించిన మోక్షమార్గం ఉంటుందా? మణికర్ణికలో చితిమంటలు కొన్ని శతాబ్దాలుగా విరామం లేకుండా వెలుగుతూనే ఉన్నాయట.

మృదుల వచ్చేప్పటికి ఇద్దరు మోక్షం పొందుతూ ఉన్నారు. వారి బంధువులంతా చుట్టూ చేరి నిశ్శబ్దంగా చూస్తున్నారు. అస్తమిస్తున్న సూర్యుడి కెంజాయరంగూ, చితిమంటల రంగూ గంగానదిలో ప్రతిఫలించి సృష్టి మొత్తం దహించుకుపోతున్న అనుభూతి కలిగిస్తున్నాయి. పొగకి కళ్ళు మండుతున్నాయి. చీకటితోపాటే మృదుల

ఆలోచనలు కూడా చిక్కబడుతున్నాయి.

'నేను చనిపోతే ఇక్కడకు తీసుకొస్తారా? నాకోసం బాధపడేవాళ్లు ఎవరున్నారు? ! నా చితి కాలి బూడిదైపోతుంటే ఈ మెట్ల మీద ఎదురుచూస్తూ ఎవరైనా కూర్చుంటారా? ఒకేఒక్కడు అలా చూసేవాడేమో! వివేక్! కానీ అతను నాకన్నా ముందే వెళ్లిపోయాడుగా! కొడుకేం చేస్తాడు? ఎలక్ట్రిక్ క్రిమెటోరియంలో త్వరగా పని ముగించి తర్వాతిరోజు ఆఫీసుకి వెళ్ళిపోతాడు. కోడలు నా సామాన్లన్నీ బయటపారేసి నా ఇంటికి యజమానురాలై పోతుంది. మనవడు చిన్న పిల్లాడు. తొందరగానే మర్చిపోతాడు. రాత్రంతా నా శవం పక్కన జాగారం చేసే వాళ్ళుగానీ, నా తల దగ్గర దీపం పెట్టేవాళ్లు గానీ ఎవరూ ఉండరు.

వివేక్ చనిపోయినప్పుడు వాళ్ళెవరూ రాలేదు. తనొక్కతే చలనం లేని వివేక్ తలను తన ఒడిలో పెట్టుకొని... ఎన్ని నెలల వేదన తర్వాత అతనికి మనశ్శాంతి లభించింది? ! సంతోషించాలో బాధపడాలో అర్థంకాక... రెప్పలు తెరిచి ఆ కళ్ళలోకి చూడలేక... రాత్రంతా అలానే...'

ఉలిక్కిపడి ఈ చేదు ఆలోచనల్లోంచి బయటకొచ్చింది. ఎవరో చిన్నపిల్లాడు ఒక క్షణం కనిపించి మరోక్షణం మాయమౌతున్నాడు. లేచి నుంచొని కళ్ళు చికిలించి చూసింది. నిజమే. అక్కడ ఓ పదేళ్ల పిల్లాడు ఉన్నాడు. ఒక మనిషి అక్కడ కాలి బూడిదయ్యాడనే స్పృహే లేకుండా గాలిపటం ఎగరేస్తున్నాడు. మృదుల నవ్వింది. ఆ పిల్లాడు వెనక్కి తిరిగి చూశాడు. ఇక ఆ తర్వాత వాడితో కలిసి గాలిపటం ఎగరేయటం నుంచీ మాంజా కండెకి చుట్టడం వరకు సమయం ఎంత తొందరగా గడిచిపోయిందో మృదులకు గుర్తులేదు. నలభై ఏళ్ళ తర్వాత కూడా తను గాలిపటం ఎగరెయ్యగలిగిందన్న విషయం ఆమెకు విజయగర్వాన్నిచ్చింది. గాలిపటం తీసుకొని ఆ పిల్లాడు వెళ్ళిపోయాడు. చావు ఎంత శాశ్వతమో పిల్లలు గాలిపటం ఎగురవేయడం కూడా అంతే శాశ్వతం!

★ ★ ★

తెల్లవారుతూనే దశాశ్వమేధ్‌కు చేరుకున్న మృదుల అక్కడ అప్పటికే భక్తులుండటం చూసి ఆశ్చర్యపోలేదు. ఈ రెండు వారాల్లో వారణాశి పట్టణం ఎప్పుడూ నిద్రపోదని ఆమె తెలుసుకుంది. సూర్యుడుదయించక ముందే స్నానం చేయడం మంచిది అనే సిద్ధాంతాన్ని వాళ్ళు నమ్మారు. గుడ్డిగా అనుసరిస్తున్నారు. అంతే.

చాలామంది నదిలోకి నాణేల్ని విసిరేయడం, కాసేపయ్యాక ఒక పిల్లవాడు నదిలోకి దూకి వాటిని గుప్పెళ్ళనిండా ఏరుకొని చిల్లర అమ్మేవాళ్ళకి అమ్మెయ్యడం గమనించింది. చిల్లర అమ్మేవాళ్ళ పక్కనే సీసాల్లో గంగనీళ్ళు అమ్మే వ్యాపారులూ ఉంటారు. అవన్నీ మద్యంసీసాలు. 'నేను ఇక్కడ లాభాపేక్ష మాత్రమే చూడగలుగుతున్నాను, భక్తి నాకు కనిపించటం లేదు' అనుకుంది మృదుల.

'కాశీలో ఉండే ఎంతో మంది వితంతువుల్లో నేనూ ఒకదాన్ని' తెల్లచీరలు కట్టుకున్న స్త్రీలను చూస్తూ అనుకుంది. కుటుంబ నిరాదరణకు గురై, అదృష్టదేవత తమ ఉనికినే మర్చిపోయిన, బక్కచిక్కిన, నియంత్రణ లేని స్త్రీలు వాళ్ళు. ఒక విధవరాలు మృదుల దగ్గరకు వచ్చింది. చేయి చాచి సహనంగా ఎదురుచూస్తూ నుంచుంది. మృదుల తన సంచీలోంచి డబ్బులు తీస్తూ "నువ్వెన్నాళ్ల నుంచీ వారణాశిలో ఉంటున్నావమ్మా?" అని అడిగింది.

ఆ నడివయసు స్త్రీకి ఇటువంటి ఆదరణ కొత్త. "ఎన్నో ఏళ్ళుగా..." నెమ్మదిగా చెప్పింది. గొంతు మూగబోయి చాలా కాలమైనట్టు అతి ప్రయత్నం మీద మాట్లాడింది. "...నాకు ఇరవై రెండేళ్ళప్పుడు

ఇక్కడకు పంపించారు”

“ఎక్కడ ఉంటావు? ”

“వితంతు ధర్మశాలలో...” జీవితం ప్రసాదించిన భయానక సంఘటనలన్నిటినీ త్యజించినట్టున్నాయి ఆమె కళ్ళు. “....నాకెప్పుడూ కడుపునిండా భోజనమే దొరకదు. అందుకే అడుక్కుంటాను”

కాశీపట్టణం ఇటువంటి హృదయవిదారకమైపోయే అనేక దృశ్యాలకు ఆలవాలం. అవిటివాళ్ళు, చావుకి దగ్గరగా ఉన్నవాళ్ళు, వెలివేయబడ్డవాళ్ళు, పిల్లలు, దురదృష్టవంతులు కోకొల్లలుగా కనిపిస్తారు. కానీ ప్రతివాళ్లలో జీవించాలన్న కోరిక ఉంది. బతుకంటే మమకారం ఉంది. ఇదే మృదులకు అర్థం కావటం లేదు.

గదికొచ్చేప్పటికి డల్లార్ ముభావంగా ఉంది. తనే మాట్లాడనీ అనుకుంది మృదుల. అనుకున్నట్టుగానే కాసేపయ్యాక డల్లార్ దులుపుతూ “అమ్మగారూ, టాప్టికాడ్ ఎంతలో వస్తుంది” అని అడిగింది.

“ఏంటది? ” విస్మయంగా అడిగింది మృదుల.

“టాప్టికాడ్ అమ్మగారూ. అదే, మనం మీట నొక్కంగానే పాటలొస్తయ్యే అది”

“ఓహ్! టేప్‌రికార్డరా? ”

“అదే”

“నాలుగైదు వందలేమో.. ఎందుకు? ”

“కొందామనుకుంటున్నా... మా ఇంటాయన కోసం..” కొంటెగా నవ్వుతూ అంది.

“మీ ఆయనకి టేప్‌రికార్డర్ ఎందుకు? ”

“బగ్గీలో పెట్టుకుంటాడమ్మగారూ...” ఆమె పెదాల మీద నవ్వు పెద్దదై పోతోంది. మళ్లీ తనే “...రేత్తిరి కొట్లాడుకున్నాం. నేను కూడా ఆణ్ని నాలుగేశా..!”

మృదుల పగలబడి నవ్వింది. “ఏంటీ నువ్వు మీ ఆయన్ని కొట్టావా? ”

“సిన్నగానేలే. తెల్లారి ఆడు నాతో మాట్టాడలేదు. అలక మాన్పించాల. ఈ గాజులమ్మైనా సరే...” - కుడిచేతి గాజులు గల గల్లాడించి- “...ఆడికి టాప్టికాడ్ కొనిస్త”

వివేక్‌కి తను ఇలా ఎన్ని బహుమతులిచ్చింది? సిగరెట్లూ, సెంట్లూ.. మృదుల

నవ్వులో కన్నీళ్ళొస్తున్నాయి ఈసారి.

డల్లార్ తమలపాకులు చుడుతూ వేదాంతం మొదలుపెట్టింది - "ఈ మగో ల్లని ఆనందంగ ఉంచాల. ఆడు పెద్దోడ యిపోయిండు. నేను రెండో పెళ్ళాన్ని తెలుసా? నేనున్నంతకాలం ఆణ్ని సంతోస పెడతానమ్మగారు"

"నీ తరువాత? "

ఒక్కక్షణం మౌనంగా ఉండి సమాధాన మిచ్చింది డల్లార్ "నా కుటుంబం ఉంది గా. మనవళ్ళుండారు. ఆళ్ళు సూసుకుంటా రు. ఎవురో ఒకళ్ళుంటారు కచ్చితంగా..."

★ ★ ★

రోజూలాగే తెల్లవారింది. గుడిగంటలు, సుప్రభాతాలు, పూలసువాసనా, సాంబ్రాణి పరిమళం. మృదుల తన చావుకి ము హూర్తం నిర్ణయించేసుకుంది.

నాలుగురోజుల తర్వాత మంగళవారం వివేక్ పుట్టినరోజు. ఆ రోజే అతని దగ్గరికి తనూ వెళ్లిపోతుంది. రాత్రిపూట కొన్ని ఘాట్లు నిర్మానుష్యంగా ఉంటాయి. తనకి ఈత రాదు. ఎత్తయిన ఘాట్ చూసుకొని దూకేస్తే చాలు... గెస్ట్‌హౌస్ ఎదురుగా నుంచొని ఆటోరిక్షావాడితో మాట్లాడుతోంది డల్లార్.

"అమ్మగారు, సారనాథ్ ఎల్దామా? "

"సారనాథా? నేనేం అనుకోలేదు"

"ఈ ఆటోవాడు ఖాళీగానే ఉన్నాడు. సారనాథ్ ఎంత అందమైన సోటో తెలు సా అమ్మగారూ... సూసి తీరాలి" అని బతిమిలాట, బలవంతం కలిపేసి అర్థిం చింది డల్లార్.

"నీకు వెళ్ళాలనుందా? " మృదుల చిరున వ్వుతో అడిగింది.

"ఔనమ్మగారు. శానాకాలమైపోనాది ఎల్లి!"

"సరే, టిఫిన్ చేసి బయలుదేరదాం"

టిఫిన్ చేస్తూ అనుకుంది మంగళవారం లోపు డల్లార్‌కి 'టాప్టికాడ్' కొనివ్వాలని.

సరిగ్గా అరగంటలో తయారై వచ్చింది డల్లార్. పూలపూల పసుపు చీర, ఆకుపచ్చ రవిక, బరువుగా వేలాడుతున్న జుంకీలు, నోట్లో అప్పుడే వేసుకున్న కిళ్ళీ. మృదుల నఖశిఖ పర్యంతం చూస్తుంటే "తెలుసు తెలుసు. నా బిడ్డలు కూడా అడిగారు ఏంది ఇశేసమని. ఆల్ల అయ్యేమో 'మల్ల పెల్లి జేసుకుంటున్నవా ఏందే' అన్నాడు" అని డల్లార్ మనస్ఫూర్తిగా నవ్వింది.

★ ★ ★

సారనాథ్. మరో ప్రపంచం.

ధ్యానంలో బుద్ధుడు. నెమ్మదిగా వీచే గాలి మోసుకొస్తున్న ధూపపు, పూల పరి మళాలు. డల్లార్ మహాబోధి చెట్టు కింద కూర్చొని తమలపాకుల పెట్టె తీసింది. మృదుల స్థూపంవైపు నడిచింది. ఆ లేత ఎండలో మంచు ముత్యాల్లా మెరుస్తోంది. లాన్ నిండా రాత్రి రాలిన పారిజాతాలు పరుచుకున్నాయి. వాటన్నిటినీ ఏరి మృదుల బుద్ధుడి పాదాల దగ్గర పెట్టింది. ఇద్దరూ యుద్ధంలో ఒరిగిపోయిన సైని కుల్లా కూలిపోయిన స్తంభాల మీద కూర్చు న్నారు. "మనశ్శాంతి దొరికింది. సారనా థ్‌లో" అంది డల్లార్ నెమ్మదిగా.

మనశ్శాంతి. సుఖం. సౌలభ్యం. తేలిక తనం. ప్రశాంతత. గుళ్ళో హారతప్పుడు, మసీదులో ప్రార్థనప్పుడూ, చినిగిన అంగీ వేసుకునే ఒక ముసలివాడికి దొరికింది. కూలిపోయిన స్తంభం దగ్గర, ఒక బౌద్ధ స్థూపం దగ్గర అలసిపోయిన ఒక ముసలి దానికి దొరికింది. మరి తనకి?

"అవును. ఇక్కడ మనసు నెమ్మదిగా ఉంది" అంది మృదుల.

"అసలు మీరు కాశీ ఎందుకొచ్చారు అమ్మగారూ? "

"చచ్చిపోదామని" అకస్మాత్తుగా అడిగిన ప్రశ్నకి వాస్తవమే చెప్పింది.

ఉలిక్కిపడి చూసింది డల్లార్. "మీ ఆయన కోసమా? "

"అవును"

"ఎలా పోయారు? సిన్నవయసే అనుకుంటా? "

"యాభైరెండేళ్ళు. క్యాన్సర్. భరించలేని బాధ..." వలయాలుగా ఉన్న ఆలయశిఖరం వంక చూస్తూ సుళ్ళు తిరిగే కన్నీళ్ళని అతికష్టమ్మీద ఆపుకుంటూ "చావుతోనే ఆయన ప్రశాంతత పొందాడు" అంది.

"అయితే ఆయన మిమ్మల్ని కూడా సనిపోమన్నాడా? "

అదిరిపడింది మృదుల. డల్లార్ వైపు సూటిగా చూసి "అలా అనుకోను"

"మరి? "

"అసలు నేనెందుకు బతికున్నాను? ఎవరికోసం బతికున్నాను? నాకు జీవించి ఉండే హక్కు లేదు. చనిపోవాలని ఉంది. నాభర్త దగ్గరికి వెళ్ళిపోవాలని ఉంది"

"మరి మీ వాల్లు? మీ మనవణ్ని దగ్గరుండి పెద్దోన్ని సెయ్యరా? "

మృదుల సమాధానం చెప్పలేదు.

★ ★ ★

మంగళవారానికి వివేక్‌కి యాభైమూడు వచ్చేవి. పుట్టినరోజు బహుమతి ఇవ్వాలంటే మృదులకి ఎప్పుడూ ఏదీ తోచేది కాదు. ఈసారి తన ప్రాణాన్నే ఇద్దామనుకుంది. కానీ అలసిపోయిన ఒక ముసలామె ముఖంలో ఆమెకు సరైన సమాధానం దొరికింది. మంగళవారం డల్లార్ వాళ్ళ ఆయన బగ్గీలో ఆహారసామగ్రి సర్దారు. కాశీలో ఉన్న మూడు వితంతు ధర్మశాలలకూ వెళ్ళి అన్నదానం చేశారు. దశాశ్వమేధ ఘాట్‌లో తనను యాచించిన వితంతువుకు ఓ ముద్ద ఎక్కువే పెట్టింది మృదుల. ఆమె తనను గుర్తుపట్టలేదు కానీ కృతజ్ఞతగా చూసింది. తిరుగుదారిలో మృదుల, డల్లార్ కలిసి 'టాప్టికాడ్' కొన్నారు. అన్నీ ప్రేమపాటల క్యాసెట్లే తీసుకుంటుంటే సేల్స్‌మేన్ విస్తుపోయాడు.

"భజనలు తీసుకోరా అమ్మా"

"అక్కర్లేదు. నేను భజనలు చేసుకునేదాన్లా కనిపిస్తున్నానా? ముసల్దాన్నయాక అవి కొనుక్కుంటాలే" కయ్యిమంది అరవైయేళ్ళ డల్లార్.

ఆరోజు రాత్రి పొద్దుపోయాక మృదుల మళ్ళీ నిర్మానుష్యంగా ఉన్న కేదార్‌ఘాట్ మెట్లపై కూర్చుంది. చంద్రుడు నది అలల్ని వెండిలా భ్రమింపజేస్తున్నాడు. గాలి చల్లగా వీస్తూ మట్టి పరిమళాన్ని మనసుకు అద్దుతోంది. పైన గుళ్ళో మంగళహారతి పాట వినపడుతోంది. అకస్మాత్తుగా అగ్గిపుల్ల వెలిగింది. మృ దుల చీకట్లో ఆ చిన్న పాపను గమనించలేదు. ఆకుల పళ్ళెంలో ప్రమిదలున్నాయి. "వీటిని నదిలో వదుల్తారా" అడిగింది పాప.

"నా కోరికలు తీరతాయా? " అంది మృదుల చిన్నపిల్లలా.

"ఓ" అంటూ తలూపింది ఆ పాప.

"ఎన్నున్నాయ్ నీ దగ్గర? "

"నాలుగు"

"వెలిగించు. ఆ నాలుగూ తీసుకుంటాను"

"పది రూపాయలౌతాయ్" సందేహంగా అంది పాప.

మృదుల వెంటనే డబ్బిచ్చేసింది. దీపాలను నీళ్ళలో వదిలింది. వాటిని చూస్తూనే ఉంది. ఆ చిన్నపాప ఎప్పుడు వెళ్ళిపోయిందో..! గాల్లో వివేక్ సిగరెట్ వాసన వచ్చినట్టనిపించింది. వివేక్‌కి పుట్టిన రోజు బహుమతులు నచ్చాయి! అనుకుంది మృదుల.

V

మారిషస్ కథ



- ఆనంద దేవి

బాగా తుప్పుపట్టిన ఇనుప తలుపులు గీసుకీచుమనీ... కిర్రుగిర్రుమనీ.. చిత్రవిచిత్రమైన ధ్వనులు చేస్తూ తెరుచుకోగానే ఆ చీకటికొట్టు ఒక్కసారిగా వెలుగుతో నిండిపోయింది. వెలుగుతో పాటే గాలీ ప్రవేశించింది.

గాలీ వెలుతురూ లేకుండా తెల్లవార్లూ అందులో మగ్గిపోయిన రామ్‌జష్‌కు కాస్త ఊపిరాడింది. అయితే... మిరిమిట్లుగొలిపే ఆ వెలుతురుకు తట్టుకోలేక.. కళ్ళకు చేతులను అడ్డంపెట్టుకుంటూ... ఆ సూర్యకాంతిని ఆపే ప్రయత్నంలో పడ్డాడతను.

అంతలోనే... బూట్లు టకటకలాడించుకుంటూ లోపలికి వచ్చిన ఇద్దరు సిపాయిలు ఆ చేతులను విసురుగా లాగేసి, చెరో చెయ్యీ పట్టుకుని గుంజుతూ... అతన్ని బయటకు తీసుకువచ్చారు.

"ఇవాళ మొదటి గంటలోనే నీ కేసును కోర్టులో వినిపించేట్లు చూడాలని పెద్ద దొరగారు గట్టిగా ఆదేశించారు పద!" అని హెచ్చరిస్తూ పూలియార్ అనబడే ఆ ఊళ్ళో... రాళ్ళూ-రప్పలూ, ముళ్ళూ-మురికీ నిండిన రోడ్లమీద నడు... నడు... అని తొందరపెడ్తూ అతన్ని సమీపంలోని పట్టణానికి తీసుకుపోతున్నారు.

అన్యాయంగా హత్యానేరం తన మెడకు చుట్టుకుందనే ఆవేదనతో కుమిలిపోతున్న రామ్‌జష్ మదిలో... నిన్న సాయంత్రం నుంచీ జరిగిన సంఘటనలన్నీ మెదులుతూ.. అతన్ని కలవరపెట్టసాగాయి.

★ ★ ★

"మాధోమాలిక్! అటుచూడు! అడుగో... రాంజష్ వచ్చేస్తున్నాడు!" అంటూ తాజా సమాచారాన్ని యజమానికి అందించాడు కరీం.

పొద్దువాలినప్పటినుంచీ రాంజష్ రాకకోసమే ఎదురు చూస్తున్నాడు మాధో.

"ఇంతాలస్యమైందేం? ఒక్కడివే వచ్చావా... లేక..." అప్పటివరకూ కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్న మాధో, తనగదిలో అడుగుపెడుతోన్న రాంజష్ వంక అనుమానంగా చూస్తూ అడిగాడు.


కోరినదాన్ని తెచ్చి రాంజష్ తనకు అప్పజెప్పేస్తే.. తన ఎదురుచూపులు ఫలించినట్లేననీ, ఆ ఫలాన్ని కొరికి కొరికి రుచి చూస్తూ.. ఎంతో ఇష్టంగా ఆస్వాదించవచ్చనీ ఆశపడ్డాడతను.

"ఒంటరిగానే వచ్చాను" కొంచెం తటపటాయిస్తూ రాంజష్ చెప్పిన సమాధానంతో మాధో ఆశలనే పాలపొంగు మీద నీళ్ళు చిలకరించినట్లైంది.

గరిటెకాల్చి ఒంటిమీద వాత పెట్టినట్లుగా ఉలిక్కిపడ్డ మాధో "అన్నిసార్లు కబురు చేసినా ఊరికేనే వచ్చావంటే, నామాట... అంటే నీ యజమాని మాటంటే నీకు లెక్కలేనట్లేగా!" అంటూ ఆవేశంతో ఊగిపోయాడు.

"అలా అని కాదు..." నీళ్ళు నమిలాడు రాంజష్.

"కాకపోతే మరేమిటో? ..." ఇల్లెగిరిపో



యేలా అరుస్తూ... "కరీం! వీడి సంగతి నేను చూసుకుంటాను గానీ, నువ్వెళ్ళి దాన్ని వెంటబెట్టుకురా! మాధో మాలిక్ రమ్మంటున్నాడని చెప్పు..." గర్వంగా రొమ్ము విరుచుకుంటూ కఠినంగా ఆజ్ఞాపించాడు మాధో.

"వద్దు కరీం! నువ్వెళ్ళొద్దు! ఆ అమ్మాయిని వెంటబెట్టుకువస్తే... జరగబోయేదేమిటో నీకు తెలీదూ? మనజాతి జనుల ఇంటి కోడళ్ళనూ, మనకుటుంబాలకే చెందిన ఆడబడుచులనూ, మనసాటి కూలీల ఇల్లాళ్ళనూ ఈ తెల్లదొరలకు మనమే అప్పజెప్పి, ఆ అబలల శరీరాలతో వాళ్ళ ఇష్టం వచ్చినట్టు ఆడుకునే అవకాశాన్ని కల్పించటం ధర్మమేనా? మన స్త్రీల మానధనాన్ని నీతీ జాతీ లేని ఈ శ్వేత జాతి దొంగలతో కొల్లగొట్టించటం అన్యాయం కాదూ? ఇంత నీచ కార్యానికి అసలు మనమెందుకు ఒడిగట్టాలి? " అంటూ... వెడుతున్న కరీంను గుమ్మం

లోనే అటకాయించి, అతని కళ్ళల్లో కళ్ళు పెట్టి సూటిగా చూస్తూ అడిగాడు రాంజష్.

అవి మాటలే అయినా.. నిప్పుకణికల్లా కరీంను తాకాయి.

అయినా ఓర్చుకుంటూ "కాయకష్టం చేసి బాగా డబ్బు సంపాదించుకుని, సుఖంగా బతుకుదామనే ఆశతో ఈ మారిషస్‌కు వచ్చిన భారతీయులందరమూ ఇక్కడకు వచ్చిన తర్వాత కూలీలుగా మార్చబడి, తెల్లదొరలతో 'బానిసలు, బానిసలు' అని పిలిపించుకుంటూ చాలా హీనంగా బతకాల్సివస్తోంది. ఇది మనమెవరమూ కాదన లేని నిజం.

ఎవరైనా ఈ నికృష్టపు బతుకు ఎంతకాలమని బతకగలరూ? నా వల్ల కాలేదు. వాళ్ళకు విశ్వాసపాత్రునిగా వుంటూ...

అనువాదం :
శీతంరాజు పద్మావతి

వాళ్ళు చెప్పినట్టు వింటే యజమానిలాగా హాయిగా బతికే అవకాశాన్ని దొరలు మనకు ఇస్తున్నప్పుడు, దాన్ని అందిపుచ్చుకోవాలనుకునే తత్వం నాది. అందుకు మన ఆడవాళ్ళ మానాన్ని పణంగా పెట్టాల్సివచ్చినా, మారుమాట్లాడకుండా ఆ పనిచేసి పబ్బం గడుపుకుంటున్నాను" అంటూ తన నీచ మనస్తత్వాన్ని బయట పెట్టాడు కరీం.

"ఓరి దుర్మార్గుడా! నిన్ను నరకాగ్ని కీలలు కూడా దహించలేవు. ఆడవాళ్ళంటే అంత అలుసుట్రా నీకూ? " అంటూ అసహ్యంగా కరీం వంక చూస్తూ.. కోపంతో అంతెత్తున ఎగిరాడు రాంజష్.

"ఉందో లేదో తెలీని ఆ నరకంలోని అగ్ని నన్ను దహిస్తుందో లేదో తెలీదు గానీ.. ఇప్పుడు ఆ ఆడదాన్ని తీసుకురాక పోతే, మాధోమాలిక్ కొట్టే కొరడా దెబ్బలతో నేను అస్థిపంజరంగా మారిపోవటం మాత్రం ఖాయం" అంటూ రాంజష్‌ను పక్కకు నెట్టేస్తూ గడపదాటి వెళ్ళిపోయాడు కరీం.

★ ★ ★

పెద్దదొర మూసే ఆరేల్ పూలియార్‌లో టోకుగా చక్కెర వ్యాపారం చేస్తున్నాడు. అతనికి ఒక చెరుకుతోట కూడా వుంది.

ఇది మంచీ-అది చెడూ అనే తేడాలేకుండా పెద్దదొర చెప్పింది చెప్పినట్లు చేస్తూ వచ్చిన మామూలు కూలీ మాధో ఇప్పుడు సహాయ యజమాని స్థాయికి ఎదిగాడు.

పెద్దదొర కొడుకు చిన్నదొర.

అతను తన కంటికినదరుగా కనిపించిన నవయువతిని తన చెంతకు చేర్చే బాధ్య తను ఈ సహాయక యజమాని మాధోకి అప్పజెప్పాడు.

ఆ పనిని మాధో తూచా తప్పకుండా నిర్వర్తించకపోతే అతని పదవి కాస్తా హుష్‌కాకీ అయిపోతుందని హెచ్చరించాడు.

ఇంత వయసు వచ్చినా.. పెద్దదొరకు కూడా చిన్న బుద్ధులు పోలేదు.

కనిపించిన ప్రతి ఆడదాన్నీ అనుభవించి అవతల పారెయ్యాలనే యావ ఆయనకీ వుంది.

కొడుకు సేవ చేసేవాడు, తండ్రికి సేవ చేసి తరించకుండా వుంటాడా? ఆ తండ్రీ కొడుకులు తానా అంటే తను తందానా అంటూ రోజులు సుఖంగా గడిచిపోయేట్లు చూసుకుంటున్నాడు మాధో.

తన అసలు పేరు సుఖదేవ్ మాధో అయితే.. దాన్ని సిదనే మాధోగా మార్చేసుకున్నాడు.

పనిలోపనిగా... తనకు నచ్చిన అమ్మాయిని చిలక్కొట్టుడు కొట్టి మరీ దొరలకు

అప్పజెబుతున్నాడు.

ఇటువంటి మాధోమాలిక్‌కు విశ్వాసపాత్రుడైన చెంచా కరీం. రమ్మనగానే వచ్చి, కిమ్మనకుండా చెప్పిన పని చేసేస్తాడు.

అందుకు ప్రతిఫలంగా కరీంకు ఎన్నో వెసులుబాట్లు కల్పించాడు మాధో. చక్కని ఇల్లూ, పౌష్టికాహారం, కాస్త ఖరీదైన మంచి బట్టలూ, చెరుకు తోటలోనూ, పంచదార గోదాముల్లోనూ సాటి కూలీలు చేసే బండ చాకిరీ నుంచి విముక్తీ.. ఇలాంటివే ఇంకా ఎన్నో! ఎన్నెన్నో!

"కరీం వెళ్ళాడు గదా! ఇక పని జరిగినట్లే.." అనుకుంటూ మంచంమీద కూర్చుని, పక్కనే వున్న మద్యంసీసా మూత తీసి హుషారుగా గ్లాసులో ఒంపుకున్నాడు మాధో.

★ ★ ★

ఆ గ్లాసును ఆప్యాయంగా అధరాలకు ఆన్చుకుంటూ.. ఇక గుటక మింగి ఆ రుచిని ఆనందంగా ఆస్వాదిద్దామనుకుంటూ వుండగా.. బీసూ హడావిడిగా ఆ గదిలోకి వచ్చాడు.

అటూ ఇటూ చూస్తూ "ఆ అమ్మాయి దొరకలేదా? చిన్నదొరకు ఆ అమ్మాయే కావాలిట! రాంజష్‌తో కలిసి కబుర్లు చెప్పుకుంటూ కాలిబాటమీద వెడుతుండగా ఆ దొర చూశాడట. ఇప్పుడిప్పుడే యవ్వనంలోకి అడుగుపెట్టిన చిన్నపిల్లట! చాలా చక్కగా ఉందిటగదా! ఇంతాలస్యమెందుకు చేస్తున్నారని అగ్గిమీద గుగ్గిలమవుతున్నాడు. ఎవరికొంప ముంచుతాడో గానీ... చాలా కోపంగా ఉన్నాడు" భయం భయంగా మాధోతో చెప్పాడు.

బీసూ కూడా అందరిలాగా మామూలు కూలీగానే వచ్చాడు. అయితే ఇప్పుడు ఏకంగా చిన్నదొరకు చెంచాగా మారిపోయాడు. అవకాశం వచ్చింది... అందిపుచ్చుకున్నాడు!

★ ★ ★

మాధో మంచం మీద నుంచి లేచి, కంగారుగా గదిలో పచార్లు చేస్తూ, "ఇడుగో! ఈ రాంజష్ మూలాన మనందరికీ తంటా తప్పేట్టు లేదు. నిన్నటినుంచీ చెబుతున్నా వినకుండా మొండికేస్తున్నాడు. తానేదో గొప్పవాడిననుకుంటూ, మనందర్నీ నీచులనీ, నైతిక విలువలు లేనివారనీ, దుష్టులనీ.. అదనీ ఇదనీ నిందిస్తున్నాడు" అని బీసూ ముందు తన బాధంతా వెళ్ళగక్కేశాడు.

"రాంజష్! ఆ అమ్మాయిని ఎక్కడ దాచావో చెప్పు... నే వెళ్ళి తీసుకువస్తాను. ఓ ఆడపిల్లను చిన్నదొర కోసం మాకు అప్పజెబితే నీదేం పోతుంది? అసలు దానికీ నీకూ ఏం సంబంధం? " అంటూ ఆరా తియ్యసాగాడు బీసూ.

"ఆ అమ్మాయి ఎవరో కాదు. నేను తాళి కట్టిన భార్య. ఇప్పుడు చెప్పు బీసూ! నా వేలితో నా కన్నే పొడుచుకోమంటావా? "

"అబ్బో! అబ్బో! ఎంత టక్కరితనం నేర్చావురా? ఇంతకుముందు ఇదే సాకుతో ఐదారుగురు ఆడపిల్లల్ని దాచేశావు. ఆ తర్వాత వాళ్ల పెళ్ళిళ్ళకు వెళ్ళినప్పుడు గానీ మాకాసంగతి తెలీలేదు" అన్నాడు మాధో.

"మీ వల్ల తమకు మానహాని వుందని పాపం వాళ్ళు నా దగ్గర తమ గోడు వెళ్ళబోసుకుంటే... ఏదో... అప్పటికి ఆపద్ధర్మంగా అలా అబద్ధమాడి వాళ్ళను కాపాడాను. ఇప్పుడు మీరు అడుగుతున్న అమ్మాయి నిజంగానే నా భార్య, నన్ను నమ్ము మాధో!"

"మాధో... మాధో... అంటూ అలా తీసి పారేసినట్టు మాట్లాడతావేం? నేనిప్పుడు మాధో మాలిక్‌నయ్యానని తెలీదా? "

"ఎందుకు తెలీదూ? పేరు మార్చుకున్నావని కూడా తెలుసు. పేరు మార్చుకున్నంత మాత్రాన నువ్వు భారతీయుడైన సుఖ్‌దేవ్ మాధోవి కాకుండా పోతావా? నీ మూలాలు మారిపోవుగా! ఏది

ఏమైనా.. నువ్వూ, మీ చెంచాలూ కలిసి చేస్తున్నవి ఖచ్చితంగా దుర్మార్గపు పనులే. పువ్వుల్లాంటి మన ఆడపిల్లల్ని పూర్తిగా విచ్చుకోకముందే ఆ తెల్లదొరలతో నలిపించేస్తున్నారు. మానభంగం జరిగిందనే అవమానంతో ఎంతోమంది ఆడపిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మీరు చేయించిన... చేసిన అత్యాచారానికి బలై, మొన్న మన కలవా చెల్లెలు నదిలో దూకి ఆత్మహత్య చేసుకోలేదూ? "

"రాత్రివేళ అది నది గట్టుకు ఎందుకు వెళ్ళింది? చీకట్లో కాలుజారి నీళ్ళలో పడిపోయి కొట్టుకుపోయి వుంటుంది. అందుకు మమ్మల్ని ఆడిపోసుకుంటారెందుకూ? "

"బుకాయించకు మాధోమాలిక్! నిజం నీకూ తెలుసు. రేపు నీ చెల్లెలి మీదన్నా, నీ కూతురి మీదన్నా ఇప్పుడు నువ్వు కొమ్ముకాస్తున్న చిన్నా... పెద్దా... దొరల కళ్ళుపడితే... మారు మాట్లాడకుండా వాళ్ళను ఆ కీచకుల పాలుచేస్తావా?

నేడు నా భార్యకు వచ్చిన ఆపద రేపు మీ ఇళ్ళల్లోని ఆడవాళ్ళకు రాదని గ్యారంటీ ఏమిటి? కనీసం అప్పుడైనా మీ కళ్ళకు పూసుకున్న లోభం, దురాశ అనే మైనపు పొరలను కరిగించుకుంటారా? ... లేక 'వేరే ఆడపిల్లలకి పట్టిన గతినే మన వాళ్ళకీ పట్టనీ!' అనుకుంటూ మీరు హాయిగా.. దొరలిచ్చిన మద్యాన్ని తాగి తందనాలాడుతూ ఆనందంగానే బతుకుతారా? నీకే కాదు! నీలాంటి చిన్నాపెద్దా చెంచాగాళ్లందరికీ నేను సంధిస్తున్న సూటి ప్రశ్న ఇది!..."

మాధోనూ, బీసూనూ మార్చి మార్చి చూస్తూ బాధాతప్త హృదయంతో అన్నాడు రాంజష్.

ఆ వాగ్బాణాలు మాధోకు తగలవలసిన చోటే తగిలాయి. తనదాకా వస్తేనే గానీ..

"ఒరేయ్! ఒరేయ్! రాంజష్! నువ్వెంత? నీ బతుకెంత? నన్నే ప్రశ్నించే అంత పెద్ద వాడివయ్యావా? " అంటూ కొరడా చేత్తో పట్టుకుని, కొడదామని రాంజష్ మీదకు ఎగబడ్డాడు.

రాంజష్ మౌనంగానే వున్నా... ద్వేషమూ, క్రోధమూ, ఏహ్యాభావమూ కలగలిపిన చూపులతో మాధోమీద నిప్పుల వర్షం కురిపించసాగాడు.

ఆ స్థితిలో వున్న వాడిమీద చెయ్యి చేసుకుంటే తిరగబడతాడేమోనన్న భయంతో కొరడా కింద పడేశాడు మాధోమాలిక్!

"అసలు ఈ రాంజష్ ఎవరూ? తనచేతి కింద పనిచేసే కూలీ! వాడి సాటి కూలీతోనే కొట్టిస్తే తగిన బుద్ధి చెప్పినట్లవుతుంది" అనుకుంటూ.. కొరడాతీసి బీసూ చేతిలో పెడుతూ-

"ఒకటీ, రెండు, మూడు అంటూ అంకెలు లెక్కపెడుతూ 'ఛళ్ ఛళ్' మని కొరడాతో... వీడి వీపు మీద నూరు దెబ్బలు కొట్టు. అప్పుడుగానీ, చుట్టరికాల ప్రసక్తి మన ముందు తేకుండా ఉండడు" అంటూ... పట్టరాని ఆవేశంతో, 'పందీ, మలబార్ కూలీ నీచజాతి బానిస వెధవా' అంటూ... తెల్లదొరలతో తనుపడే తిట్లన్నిటినీ రాంజష్ మీద ప్రయోగిస్తూ మహోగ్రరూపంతో బయటకు వెళ్ళిపోయాడు.

★ ★ ★

"నువ్వెన్ని కొరడా దెబ్బలన్నా కొట్టు.. పడతాను. కానీ.. అభం శుభం తెలీని చిన్న పిల్లయిన నా భార్య గౌరాను ఆ చిన్నదొర పాలపడకుండా కాపాడరా బీసూ! అది మన రాముడి ఏకైక కూతురురా. మనవాళ్ళే అయినా.. దొరల చెంచాలుగా మారిన దుండగుల బారినపడకుండా, బస్తీలోని ఆడపిల్లలను కాపాడుతున్న నేనైతే.. తన కూతుర్ని కంటికిరెప్పలా కాపాడుకుంటాననే ధైర్యంతో దాన్ని నాకిచ్చి పెళ్ళిచేశాడు రాముడు. మా పెళ్ళి జరిగి వారం రోజులైంది... అంతే! ఆ కొత్త



పెళ్ళి కూతురు నీ చెల్లెలే అనుకో! నువ్వు తలుచుకుంటే మమ్మల్ని ఈ ఆపద నుంచి గట్టెక్కించగలవు. ఆలోచించరా బీసూ!" అంటూ అతని కాళ్ళ మీదపడి, నుదురును నేలకేసి బాదుకుంటూ హృదయవిదార కంగా రోదించసాగాడు రాంజష్.

తనసాటివాడు, బస్తీలో అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు, ఓ మంచి మగవాడు అలా వలవలా ఏడుస్తూ తన కాళ్ళు పట్టుకునేసరికి బీసూ గుండె కరిగి నీరైంది.

కేవలం తన తరపున కాకుండా, ఇక్కడ తగిన జీతం... వసతీలేక నానా అవస్థలూ పడుతూ, చివరికి తమ స్త్రీల శీల సంప దనూ.. పాతివ్రత్యాన్నీ కూడా కాపాడుకో లేకపోతున్న యావత్ భారత కూలీ సమాజం తరపునా రాంజష్ ఆ ఆక్రందన చేస్తున్నట్లనిపించింది.

వెంటనే బీసూ వంగి... రాంజష్ భుజా లమీద చెయ్యివేసి నిమురుతూ "మామూ లుగా అయితే మీ దంపతులు ఈ పులి బోను నుండి బయటపడలేరు. నేనో ఉపాయం చెబుతాను విను.

నా చేతిలో కొరడా వుండగానే.. నామీద దాడి చేసి దాన్ని లాక్కోటానికి ప్రయత్ని స్తున్నట్లు నటించు. నేను పెనుగులాటలో జరుగుతున్నట్లు జరిగి కిటికీ దగ్గరకు వెడ తాను. నువ్వు అందులో నుంచి దూకేసి వెళ్ళి... గౌరాతో కలిసి ఎక్కడికన్నా పారిపో" అని అతని చెవిలో రహస్యంగా చెప్పి... వెంటనే లేచి శబ్దం చెయ్యకుండా వెనక్కి జరగసాగాడు.

రాంజష్ ఒక్క ఉదుటున బీసూ మీద పడి.. అతన్ని పట్టుకుని కొరడ లాక్కోబోతూ ఉండగానే మాధో ఆ గదిలో అడుగుపెట్టబోయాడు.

★ ★ ★

అప్పటివరకూ వీధుల్లో పచార్లు చేసి, మంచి గాలి పీల్చుకుని, కాస్త ఆగ్రహాన్ని అణచుకున్న మాధో... లోపలికి అడుగుపె డుతూ... అక్కడ జరుగుతున్నది చూసి, రాంజష్ బీసూ మీద తిరగబడుతున్నాడను కున్నాడు. గబగబా వెళ్ళి వాళ్ళని విడ దీసి.. రాంజష్‌ను కొరడాతో చితకబా దటం మొదలుపెట్టాడు.

★ ★ ★

కరీం వెంట వచ్చిన గౌరా ఆ గదిలో కాలు పెడుతూనే... అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి విలవిలలాడిపోయింది.

"అమ్మబాబోయ్! అయ్యయ్యో! ఆయన్న లా చావబాదుతున్నావెందుకు మాధో మాలిక్? " అంటూ... లబలబలాడుతూ వెళ్ళి ఆయనచేతిలోని కొరడాని విసురుగా లాగి కిందపారేసింది.

"ఎలాగైతేనేం? చిలుక పంజరంలో ఇరుక్కుంది. ఇంకెక్కడికి పోతుందిలే!" అనుకుంటూ వెళ్ళి మంచం మీద కూర్చుని స్థిమితపడుతూ-

"ఏం లేదులే! ఓ చిన్నపని చెయ్యమని మొన్నటినుంచీ మొత్తుకుంటుంటే విన కుండా మొరాయిస్తున్నాడు. అందుకని ఏవో రెండు చిన్న దెబ్బలు..." అంటూ అర్థోక్తిలో ఆపేసి.. ఆమె అందాన్ని ఆస్వా దించే పనిలో పడ్డాడు మాధో.

"పనా? అదేమిటో చెప్పండి మాలిక్! చిటికెలో చేసేస్తాను. పాపం మా ఆయన్ని కొట్టకండేం? "

"నువ్వు చేస్తానన్న తరవాత ఇంకెందుకు కొడతానూ? తీరా విన్న తరవాత కాదన కూడదు మరి!"

"పనేమిటో ముందు చెప్పండి మరి!"

"ఏంలేదూ? ... ఈ రాత్రిని నువ్వు చిన్న దొరతో గడపాలి. ఆయన నిన్నేం చేసినా ఎదిరించకుండా ఈ ఒక్కరాత్రికీ కళ్ళు మూసుకుంటే... ఆ పైన మీ జోలికెవరూ రారు. నిశ్చింతగా బతకొచ్చు"

కాళ్ళకింద భూమి కదిలిపోతున్నట్లనిపిం చింది గౌరాకు!

రక్తప్రసరణ ఆగిపోతున్నట్లనిపించి బొమ్మలా నిలబడిపోయింది. ఇక రాంజష్ కూడా తనను రక్షించలేడు. మాధో కొట్టిన దెబ్బలకు సొమ్మసిల్లిపోయాడతను.

ఆదుకోరమ్మని పిలవటానికి ఇక్కడెవరూ లేరు. చుట్టూ ఉన్నవి తోడేళ్ళే! ఇక తప్పించుకోటం అసంభవమనుకున్న గౌరా, ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా.. బొడ్లో దోపుకువచ్చిన చాకు తీసుకుని చటుక్కున ఛాతీలో పొడిచేసుకుంది.

"గౌరా! గౌరా!" అని ఆర్తనాదాలు చేస్తూ వెళ్ళి, భార్యను గట్టిగా పట్టుకుని.. ఆమె ఛాతీభాగంలో లోతుగా గుచ్చుకున్న చాకును లాగెయ్యబోయాడు రాంజష్.

★ ★ ★

"ఏం చేస్తున్నార్రా బానిస వెధవల్లారా? అందరూ ఈ గదిలో పడి పందుల్లాగా దొర్లుతున్నారా? ఎప్పుడో నేను పంపిన బీసూ కూడా తిరిగి రాలేదేం? ఒక్క నవ యువతిని తెచ్చినాకు ఇవ్వమంటే.. నిన్నటి నుంచీ నీలుగుతున్నారేం? " అని అరుచుకుంటూ వచ్చిన చిన్నదొరకు ఆ గదిలో కనపడిన దృశ్యం దిగ్భ్రాంతిని కలిగించింది.

"అసలేం జరుగుతోందిక్కడ? " అంటూ అందరి వంకా గుడ్లురిమి చూడసాగాడు.

"ఖూనీ దొరా! ఖూనీ! రాంజష్ తన భార్యను ఖూనీ చేశాడు. దాన్ని మీకోసం నేనే ఇక్కడకు తీసుకొచ్చాను. మీరు మనసుపడుతున్న పిల్ల ఇదే! మీ దగ్గరకు తీసుకొద్దామని బయల్దేరుతూ వుండగానే వాడు చంపేశాడు" అంటూ భయం భయంగా కంగారు కంగారుగా చెప్పాడు మాధో.

"పట్టుకోండిరా! వాణ్ణి పట్టుకుని బంధించండి" బిగ్గరగా అరుస్తూ ఆజ్ఞాపించి అక్కడ నుంచి నిష్క్రమించాడు చిన్నదొర.

ఆయన వెంట వచ్చిన అనుచరులిద్దరూ రాంజష్‌ను తీసుకెళ్ళి చీకటి కొట్లో పెట్టి, తలుపులు గట్టిగా బిగించి బైట తాళం వేశారు.

★ ★ ★

ఆ రోజు కోర్టులో ముందుగా రాంజష్ కేసు విచారణకు వచ్చింది.

అతను ఆ ఖూనీ చేస్తుంటే తాము కళ్ళారా చూశామని మాధోమాలిక్‌తోపాటు, కరీం, బీసూ కూడా సాక్ష్యం చెప్పారు.

నిజానికి ఆ గదిలో జరిగింది హత్యకాదనీ, చనిపోయిన యువతి తన భార్యేననీ, చిన్నదొర చేతిలో మానభంగం తప్పదని తెలిశాక ఆత్మహత్య చేసుకుందనీ, నెత్తినోరూ బాదుకుని ఏడుస్తూ కోర్టువారికి విన్నవించుకున్నాడు రాంజష్.

"బలమైన సాక్ష్యాధారాలున్నందున.. రాంజష్ అనబడే కూలీ, గౌరా అనబడే యువతిని ఖూనీ చేశాడని కోర్టువారు నమ్ముతున్నారు" అంటూ తన నిర్ణయాన్ని గంభీరంగా చదివి వినిపించాడు జడ్జి.

నేరం తిరుగులేకుండా రుజువవటంతో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధించబడింది.

నేను ఖూనీకోరును కాదు, నేను ఏ ఖూనీ చెయ్యలేదు... చెయ్యలేనుకూడా! నా కొత్త పెళ్ళికూతుర్ని నేనే చంపుకుంటానా? " అంటూ నిర్దోషి రాంజష్ కోర్టు వారికి పదేపదే చేసిన విన్నపాలు ఆ న్యాయాలయం నాలుగు గోడల మధ్యా ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. Ⓥ

మెక్సికో కథ

కానుక

- కార్లోస్ మెలోన్

వాతావరణం చల్లగా ఉంది. డిసెంబర్‌నెల చలి కత్తిలా శరీరాన్ని కోస్తోంది. ఆ నిర్జన ప్రాంతంలో బండరాళ్ళ మధ్య భారంగా అడుగులేస్తున్నాను. నా భుజంపై సుమారు పదిహేను కిలోల బరువుగల మూట ఉంది. మూటలో ఉన్నదంతా బంగారమే.

ఈ బంగారాన్ని పొందటానికి నేనెంతో కష్టపడ్డాను. మూడు నెలలపాటు నిద్రాహారాలు లేకుండా శ్రమించాను. ఆకలి, చలి, ఎండావానలకు తట్టుకున్నాను. ఆఖరి క్షణంలో నమ్మక ద్రోహం చెయ్యబోయిన సహచరుల్ని చంపి మరీ ఈ బంగారాన్ని చేజిక్కించుకున్నాను.

కొన్ని దశాబ్దాల క్రితం అమెరికాలోని ఈ పర్వత ప్రాంతంలో గల మట్టిలో బంగారం ముద్దలు దొరుకుతున్నాయని తెలియగానే ప్రపంచం నలుమూలలనుంచి అన్వేషకులు ఎగబడ్డారు. దొరికిన వారికి దొరికినంత అన్నట్టు ఎవరికివారు బంగారాన్ని తమ తమ దేశాలకు తీసుకుపోయారు. బంగారం కోసం కొన్ని ముఠాల మధ్య పోరాటాలు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోయారు. ఈ విలువైన లోహం అన్వేషణలో ఆకలికి, చలికి బలైన వారి సంఖ్య కూడా తక్కువేం కాదు.

ఇప్పుడిక్కడ బంగారం దొరక్కపోయినా ప్రతి ఏటా కొందరు అన్వేషకులు వస్తూనే ఉన్నారు. నేను కూడా అలాంటి అన్వేషకుణ్ణే. నాది మెక్సికో సరిహద్దులో గల ఓ కుగ్రామం. జీవితమంతా రకరకాల వ్యాపారాలు చేసి నష్టపోయాను. చివరి ప్రయత్నంగా నా అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి ఇక్కడికొచ్చాను. మూడునెలల క్రితం అవసరమైన సామగ్రితో గుర్రంపై బయల్దేరాను. దారిలో నాకు మరో ముగ్గురు అన్వేషకులు జతయ్యారు. నలుగురం కలిసి ఓ బృందంగా ఏర్పడి అన్వేషణ మొదలెట్టాం. దొరికిన బంగారాన్ని నలుగురు సమానంగా పంచుకోవాలని నిర్ణయించుకున్నాం.

కాని వేసవి ముగిసి చలికాలం ఆరంభమైనా మాకు బంగారం దొరకలేదు. తెచ్చుకున్న ఆహార పదార్థాలు ఎప్పుడో అయిపోయాయి. పళ్ళు, కీటకాలు, పాముల్ని పట్టుకొని తింటూ మా అన్వేషణ కొనసాగించాం. హఠాత్తుగా ఓ రోజు మాలో ఒకతను జబ్బుపడి చనిపోయాడు. మాకు విరక్తి పుట్టింది. మాకూ ఆ గతి పట్టక ముందే తిరిగి వెళ్ళిపోవాలనుకున్నాం. కాని ఖాళీ చేతులతో వెళ్లటం ఇష్టంలేక ఇంకొక్క రోజు అన్వేషణ కొనసాగించాలనుకున్నాం.

చివరిరోజు దేవుడు మమ్మల్ని కనికరించాడు. ఓ చోట కొన్ని మానవ అస్థిపంజరాలు కన్పించాయి. అవి మాలాంటి అన్వేషకులవని మాకు తెలుసు. అస్థిపంజరాల్ని చూసి మేం భయపళ్ళేదు. ఎందుకంటే ఆ అన్వేషకులకు బంగారం దొరికివుంటే అది వారి అస్థిపంజరాల పక్కనే పడివుంటుందని మాకు తెలుసు. మా అంచనా నిజమైంది. కొద్ది దూరంలో ఓ గుర్రం అస్థిపంజరం పక్కన బంగారం



ముద్దలతో నిండుగావున్న తోలుసంచి కన పడింది.

మేం సంతోషంతో ఎగిరి గంతులేశాం. మా అన్వేషణ ఫలించింది. మేం హఠాత్తుగా కోటీశ్వరులైపోయాం. అయితే అంత సంతోషంలోనూ నేను ప్రమాదాన్ని శంకించి అప్రమత్తమయ్యాను. నా సహచరులు హఠాత్తుగా నాపై కాల్పులు జరిపారు. నేను గుర్రం వెనక దాక్కోవటంతో తూటాలు గుర్రాలకు తగిలాయి. నేను వెంటనే ఎదురు కాల్పులు జరిపాను. స్వతహాగా మంచి షూటర్‌ని కావటంతో నా గురి తప్పలేదు. ఇద్దరూ నేలకొరిగారు. వాళ్ళిద్దరు నన్ను చంపి బంగారాన్ని తామే పంచుకోవాలనుకున్నారు. అత్యాశకుపోయి బంగారంతో పాటు ప్రాణాల్ని కూడా పోగొట్టుకున్నారు. ఇపుడీ బంగారమంతా నాదే. తూటాలు తగిలి రెండు గుర్రాలు

అనువాదం :
సికందర్

చనిపోయినా నా గుర్రం క్షేమంగా ఉండటం చూసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను. బంగారం మూటని గుర్రంపై పెట్టుకుని తిరుగు ప్రయాణమయ్యాను.

ఓ రోజు నా ప్రయాణం సాఫీగా సాగింది. రెండో రోజు ఉదయం అంతవరకు నా వెంటవున్న అదృష్టదేవత హఠాత్తుగా నన్నొదిలేసింది. నేను ప్రయాణిస్తున్న గుర్రం కాలు పొరపాట్న రెండు బండరాళ్ళ మధ్య సందులో ఇరుక్కుంది. నేను ఎంత ప్రయత్నించినా కాలు బయటికి రాలేదు. రోజంతా ప్రయత్నించినా కాలు బయటికి రాదనిపించింది. మరో పక్క మంచుకురిసే సూచనలు కన్పించాయి. నేను ఆస్మా రోగిని. చలి ఎక్కువైతే ఊపిరి పీల్చటం కష్టమవుతుంది. అందుకే నేను మోయగలిగినంత బంగారాన్ని ఓ మూటలో వేసుకొని దాన్ని మోసుకొని నడక మొదలెట్టాను.

మొదట్లో తేలిగ్గానే అన్పించినా మూట రానురాను బరువెక్కుతున్నట్టు అన్పించింది. దాన్ని మొయ్యటం కష్టంగా అన్పించి కొంత బంగారాన్ని దారిలో పారేశాను. ఇలా నాలుగైదు సార్లు చేశాక మూటలోని సగం బంగారం ఖాళీ అయింది. ప్రాణాలకు తెగించి చేజిక్కించుకున్న బంగారాన్ని ఇలా నేలపాలు చెయ్యాల్సి వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. త్వరగా గమ్యం చేరుకోకపోతే ఇంకెంత బంగారాన్ని పారేయాల్సి వస్తుందోనని కలవరపడ్డాను.

సాయంత్రం వరకు నడుస్తూనే ఉన్నాను. ఓ పక్క ఆకలి. మరో పక్క చలి. ఈ బాధలు చాలవన్నట్టు ఎడంకాలి బూటుకి చిల్లుపడి అందులో రాయి దూరి గుచ్చుకుంటోంది. ఎంత విదిలించినా రాయి బూటుని వదలటంలేదు. నిలబడి దాన్ని బయటికి తీసే ఓపిక లేదు. నిలబడితే మళ్ళీ ముందుకి కదలలేనన్పిస్తోంది. ఏదైనా చిన్న ఊరొస్తే కాస్సేపు విశ్రాంతి తీసుకోవాలన్పించింది. కాని కొన్ని వందల మైళ్ళ వరకు జనావాసం లేదని నాకు తెలుసు.

అయితే చీకటిపడే వేళ నేను కలలో కూడా వూహించని అద్భుత దృశ్యం కన్పించింది. ఆ నిర్జన ప్రదేశంలో బండరాళ్ళ మధ్య చెక్కతో కట్టిన ఇళ్ళ సముదాయమది. దశాబ్దాల క్రితం బంగారం అన్వేషకులు కట్టుకున్న విడిది క్యాంపులా ఉంది. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నా నాకు రాత్రి గడపటానికి సురక్షిత ప్రదేశం. నేను ఒక్కో ఇంటిని పరిశీలిస్తూ ముందుకి వెళ్ళాను. అన్ని ఇళ్ళ తలుపులు బార్లా తెరిచి ఉన్నా చివరి ఇంటి తలుపు మాత్రం మూసి ఉంది. నేను మెట్లెక్కి మెల్లగా

తలుపు తెరిచాను.

అంతే! ఢామ్మంటూ ఓ తూటా నా చెవి పక్కనుంచి దూసుకుపోయింది. నేను మూట పారేసి చేతులెత్తి "కాల్చకు! నేను నీ శత్రువుని కాను" అన్నాను గాభరాగా.

లోపల చేతిలో తుపాకితో నెగడు ముందు కూర్చున్న ఓ ముసలి వ్యక్తి కన్పించాడు. అతడు నా దగ్గరికొచ్చి నా జేబులన్నీ తనిఖీ చేసి నడుముకి వేళ్ళాడుతున్న రివాల్వర్‌ని తీసుకొని నన్ను లోపలికి ఆహ్వానించాడు. నేను మూటనెత్తుకొని లోపలికెళ్ళి నెగడు ముందు కూర్చొని చలి కాచుకున్నాను. నా పరిస్థితి తెలుసుకొని ముసలాయన నాకు కాల్చిన జింక మాంసం, మంచినీరు అందించాడు. నేను కడుపు నింపుకున్న తర్వాత నా కథంతా వివరంగా చెప్పాను.

"ఈ ప్రాంతంలో మనిషికి శత్రువులు రెండే! ఒకటి ఆకలి, రెండోది చలి. నువ్వు రెంటినీ జయించి బంగారం తీసుకొచ్చావ్. కాని గుర్రంలేకుండా గమ్యం చేరుకోలేవు. ఎందుకంటే ఈ బరువైన బంగారాన్ని ఎక్కువ దూరం మోయలేవు. అయితే నీ బరువుని తగ్గించే ఉపాయం నా దగ్గరుంది. నీ బంగారాన్ని నాకు అమ్మేసి డబ్బు తీసుకో. బంగారం కన్నా కరెన్సీ మొయ్యటం తేలిక" అన్నాడు ముసలతను.

నాకు ఆశ్చర్యమేసింది. ఈ నిర్జన ప్రదేశంలో బంగారం కొనేవాడు దొరుకుతాడని నేను కలలో కూడా ఊహించలేదు. అతను బంగారాన్ని తూకం వేసి "దీనికి ఇరవై వేల డాలర్లు ఇవ్వగలను. నువ్వున్న ప్రాంతంలో ఈ మాత్రం ధర దొరకటం నీ అదృష్టం" అంటూ డాలర్ల కట్టలున్న సంచిని నా ముందు పెట్టాడు.

నేను సంచిలోని నోట్లను పరీక్షిస్తుంటే అతను నవ్వుతూ అన్నాడు "అవి నకిలీ నోట్లు కావు. నీ బంగారం దోచుకోవాలను

కుంటే నకిలీ నోట్లు ఎందుకిస్తాను? ఒక్క తూటా పేలిస్తే చాలు. బంగారం నాదైపో తుంది. కాని నేను దోపిడీ దొంగని కాను. నేనొక వ్యాపారిని. ప్రతి వేసవిలో నా కుమారులతో కలిసి ఇక్కడికొస్తాను. కరె న్సీతోపాటు ఆహారపదార్థాలు, దుస్తులు, గుర్రాలు తీసుకొస్తాను. బంగారం దొరికిన అన్వేషకులు కొందరు నాకిక్కడే బంగారం అమ్మేస్తారు. ఇంకొందరు నా వద్ద ఆహారం, దుస్తులు, గుర్రాలు కొనుక్కుం టారు. కాని ఈ ఏడాది వేసవి మొత్తం గడిచిపోయినా ఒక్క గిరాకీ తగల్లేదు. ఇది చాలదన్నట్టు నిన్న రాత్రి మా గుర్రాలన్నీ అడవిలోకి పారిపోయాయి. వాటిని వెతక టానికి నా ముగ్గురు కొడుకులు వెళ్లారు. వాళ్లు రాగానే మేమిక్కడి నుంచి వెళ్లి

పోతాం. ఇక్కడ మంచు కురవటం మొద లయ్యాక బతుకు దుర్భరమవుతుంది"

"మీ వాళ్ళు గుర్రాలు తీసుకొస్తే నేనూ ఒకటి కొనుక్కుంటాను" ఆత్రంగా అన్నాను.

"నువ్వు రాత్రి ఇక్కడే పడుకో. తెల్లారే లోగా మావాళ్ళు గుర్రాలు తెస్తే నీకూ ఓ గుర్రమిస్తా" అన్నారు.

నేను రాత్రి అక్కడే గడిపాను. కాని తెల్ల వారినా ముసలతని కొడుకులు రాలేదు. దాంతో నేను కాలి నడకన బయల్దేరటానికి సిద్ధమయ్యాను. నేనెలా వెళ్లాలో ముసల తను సూచించాడు. "నువ్వు దక్షిణ దిశలో రెండ్రోజులపాటు వేగంగా నడిస్తే రెండు పర్వతాల మధ్య గల కనుమ వస్తుంది. ఆ కనుమ గుండా ఓ రైల్వే లైన్ వెళుతుంది. ఓ ప్రైవేటు బొగ్గు గనులకు చెందిన రైల్వే లైను అది. ఆ మార్గం గుండా వెళ్లే గూడ్సు

బండి ఎక్కావంటే మూడ్రోజుల్లో నీ గమ్యం చేరుకుంటావ్"

ముసలతను దారిలో తినటానికి నాకు ఆహారం కూడా ఇచ్చాడు. నేనతనికి వీడ్కోలు చెప్పి డబ్బు సంచితో ముందుకి కదిలాను. దిక్సూచిలో చూస్తూ దక్షిణ దిక్కుగా నడవసాగాను. చీకటి పడేవరకు ఆగకుండా నడిచి రాత్రి ఓ గుహలో విశ్రాంతి తీసుకున్నాను. మరుసటి రోజు తెల్లవారగానే బయల్దేరి సాయంత్రం కల్లా కనుమని సమీపించాను. కాని రైల్వేట్రాక్ కనపడలేదు. చీకటి పడటంతో ఓ చెట్టు కింద పడుకున్నాను. తెల్లవారగానే వాతావరణంలో మార్పొచ్చింది. మంచు కురవటం మొదలైంది. నేను వెంటనే బయల్దేరాను. కాస్సేపట్లోనే నా ముందున్న పరిసరాలు మంచుతో కప్పబడి తెల్లగా మారిపోయాయి. చల్లదనం పెరగటంతో నాకు ఆయాసం మొదలైంది. ముందుకెళ్ళే కొద్దీ ఆయాసం పెరగసాగింది.

అప్పుడే కొంతదూరంలో నాకు రైల్వే ట్రాక్ కనపడింది. నాకు వెయ్యేనుగుల బలం వచ్చినట్టయింది. ఉత్సాహంగా అరుస్తూ ఆ ట్రాక్ వైపు పరిగెత్తాను. అయితే దారిలో చూసుకోకుండా మంచుతో కప్పబడిన బురదగుంటలో కాలుపెట్టాను. నా ఎడంకాలు తొడవరకు బురదలో కూరుకుపోయింది. ఎంత లాగినా బయటికి రాలేదు. చల్లటి బురద వల్ల నా కాలి రక్తనాళాలు గడ్డకడతాయన్పించింది. కాలి ద్వారా చల్లదనం నా ఒళ్లంతా పాకటంతో నాకు ఆస్త్మా అటాక్ అయింది. ఏదైతే జరగకూడదనుకున్నానో అదే జరిగింది. నా వాయునాళాలు వుబ్బిపోయి ఊపిరి పీల్చటం కష్టంగా మారింది. నాపనిముగిసిపోబోతుంది. ఇంతా చేసి చివరికి దిక్కులేని చావు చావబోతున్నానన్పించింది.

చివరి ప్రయత్నంగా నా జేబులో ఉన్న లైటర్‌ని తీసి వెలిగించాను. దాన్ని నా ముక్కు దగ్గర పెట్టుకుంటే ఆ వేడికి కాస్త వూపిరి ఆడింది. కాని లైటర్‌లో నూనె కొద్దిగా వుంది. అది ఆరిపోకముందే ఇంకేదైనా అంటించాలి. అప్పుడే భుజానికి వేళ్లాడుతున్న బ్యాగులోని నోట్ల కట్టలు గుర్తొ

చ్చాయి. వెంటనే ఓ కట్ట తీసి అంటిం చాను. దాని మంటకి వాయునాళాలు కాస్త తెరుచుకున్నాయి. కాని మంట తగ్గగానే అవి మళ్ళీ మూసుకున్నాయి. దాంతో మరోకట్ట తీసి అంటించాను.

ఇలా ఒకదాని తర్వాత ఒకటి అన్ని నోట్లకట్టలు అంటించాక నా ఒంట్లో వేడి ప్రవేశించింది. అప్పుడు బలమంతా కూడ దీసుకుని నా కాలిని బురదలోంచి బయ టికి తీశాను. కాస్సేపటి వరకు నా కాలు మొద్దుబారిపోయినట్టనిపించింది. చాలా సేపు దాన్ని రెండు చేతులతో రుద్దాక కాస్త వేడి పుట్టి అందులో చలనం వచ్చింది. అయినా లేచి నిలబడలేకపోయాను.

అప్పుడే దూరాన ట్రైన్ వస్తున్న శబ్దం విన్పించింది. నేను రైల్వేట్రాక్ వరకు పాక్కుంటూ వెళ్లాను. అదృష్టవశాత్తు డ్రైవర్లు నన్ను చూసి బండి ఆపారు. అతి కష్టం మీద నన్ను ఇంజన్‌లోకి ఎక్కించు కున్నారు. ఇంజనులో కాలుతున్న బొగ్గుల వేడికి కాస్సేపట్లో నా కాలు నా స్వాధీనం లోకొచ్చింది. నా కథంతా విన్న డ్రైవర్లు ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టారు.

"ఇరవై వేల డాలర్లని కాల్చి చలి కాచుకు న్నావా? కనీసం ఒక్క డాలర్ కూడా మిగ ల్చలేదా? ఇప్పుడు నీ ఇంటికేం తీసుకుపో తావ్?" అని ప్రశ్నించారు. వారి ప్రశ్నకు నా వద్ద జవాబు లేదు.

★ ★ ★

చివరికి చచ్చీ చెడి ఎలాగోలా నా వూరికి చేరుకున్నాను. తిండి లేక ముఖం పీక్కు పోయింది. గడ్డం పెరిగి ముఖం వికృతంగా మారింది. బట్టలు చిరిగి పీలికలయ్యాయి. ఎడంకాలి బూటులో ఇరుక్కున్న రాయి మళ్ళీ గుచ్చుకోవటం మొదలెట్టింది. దాన్ని తీసే ఓపిక లేక కుంటుతూ నడుస్తు న్నాను.

ఈ అవతారంలో చూస్తే భార్యాపిల్లలు నన్ను గుర్తుపడతారా? నేను ఖాళీ చేతు లతో వచ్చానని తెలిస్తే ఎలా స్పంది స్తారు? నేను బంగారం మొయ్యలేక అందులోంచి సగం పారేశాననీ, బంగా రాన్ని అమ్మి నోట్లు తీసుకున్నాననీ, నోట్లు కాల్చి ప్రాణం నిలుపుకున్నానని చెబితే నమ్ముతారా? నేను చేసిన పనికి మెచ్చు కుంటారా లేక తిట్టిపోస్తారా?

ఇదంతా ఆలోచిస్తుంటే నా మీద నాకే అసహ్యమేసింది. 'ఛీ... నాదీ ఒక బతు కేనా?' అని ఉక్రోషంగా ఎడం కాలిని గట్టి గా నేలపై కొట్టాను. దాంతో బూటులోని రాయి మరింత గట్టిగా గుచ్చుకుంది. కత్తి తో కోసినంత బాధేసింది. నేను కోపంగా బూటుని తీసి విసిరి కొట్టాను. దాంతో అంతవరకూ బూటులో ఇరుక్కున్న వస్తువు బయటకొచ్చి నేలపై పడింది. దాన్ని చూడగానే నా కళ్ళు మెరిశాయి.

అది రాయి కాదు. బంగారం ముక్క! ఆత్రంగా వంగి దాన్ని అందుకున్నాను. ఆనందంగా దాన్ని ముద్దాడాను. నేను ఖాళీ చేతులతో తిరిగి రాలేదు. ఎంతో కొంత బంగారం తీసుకొచ్చాను. నేను పడ్డ కష్టానికి స్వల్పంగానైనా ప్రతిఫలం దక్కింది. ఈ బంగారం ముక్కని అమ్మితే కనీసం నా భార్యాపిల్లలకి కొత్త దుస్తులైనా వస్తాయి. ఇంతవరకు నా బూటులో దాక్కొని నన్ను ఇబ్బంది పెడుతూ నాతో పాటు ప్రయాణించిన ఈ బంగారం ముక్క నాకు జీసస్ ఇచ్చిన 'క్రిస్మస్ కానుక' అన్పించింది. V

ఇంగ్లండ్ కథ



- నోబెల్ గ్రహీత **డోరిస్ లెస్సింగ్**

నీటిలో చేపలా...

సెలవుల్లో మొదటిరోజు జెర్రీ వాళ్లమ్మతో కలిసి ఆ బీచ్‌కి వచ్చాడు. ఎప్పుడూ జనంతో కిటకిటలాడే రాళ్లు నిండిన ఆ సముద్రతీరం జెర్రీకి సుపరిచిత ప్రాంతం. ఒక భుజానికి చారల సంచి తగిలించుకుని, ఎలాంటి ఆచ్ఛాదనా లేని రెండోచేతిని ఊపుతూ జెర్రీ ముందు వాళ్లమ్మ నడుస్తోంది. ఆమె తెల్లటిచేతిపై ఎండ పడి అది మరింత తెల్లగాకనిపిస్తోంది. ఆ చేతికేసి, ఒడ్డుకేసి మార్చిమార్చి చూస్తూ జెర్రీ

ముఖం చిట్లించుకుని ఆగిపోయాడు. ముందుకొచ్చేసిన తల్లి కొడుకు తన వెంట లేడని అనుమానమొచ్చి కంగారుగా అటూ ఇటూ చూసింది. అపుడు వెనకాలే ఉన్న కొడుకును చూసి "ఓ! నువ్వు ఇక్కడే ఉన్నావా జెర్రీ!" అని తన కంగారును తగ్గించుకుంటూ నవ్వింది.

ఆమెకి తాను జెర్రీని పట్టించుకోకుండా వెళ్లిపోతున్నానేమోనని అనుమానమొచ్చి "ఎందుకు నువ్వు నాతో రావడం లేదు? " అని ప్రశ్నించింది. తల్లి తనకోసం అలా ఆదుర్దా పడటం జెర్రీకి కొత్తేం కాదు. అందుకే అనవసరంగా తల్లిని బాధపె ట్టానని వెంటనే తల్లి దగ్గరకి పరిగెత్తాడు. అలా ఆమె వెంట వెళుతూ, మళ్లీ ఓసారి వెనక్కి తిరిగి ఒడ్డును చూశాడు. 'ఈరో జంతా తాను అమ్మ చెప్పినట్టు చాలా జాగ్రత్తగా ఈ బీచ్‌లో గడపాలి' అని మన సులో అనుకుని నిరాశ పడ్డాడు జెర్రీ.

మర్నాడు ఉదయం కూడా తల్లీ కొడు కులు బీచ్‌లో ఈతకొట్టడానికి, సూర్యస్నా నానికి వస్తున్నప్పుడు ఉదాసీనంగా ఉన్న కొడుకును చూసి ఆమె "జెర్రీ! ఈ బీచ్ అంటే నీకు మొహం మొత్తిందా? వేరే ఎక్కడికైనా వెళ్లాలనుకుంటున్నావా? " అని అడిగింది.

వెంటనే జెర్రీ బిడియంగా "లేదు మమ్మీ!" అన్నాడు. కానీ, అంతలోనే అతడు "నాకు ఆ రాళ్ల దిగువకెళ్లి ఈత కొట్టాలనుంది" అని మనసులోని మాటను బయటపెట్టాడు.

ఎవరూ లేని ఆ ప్రాంతంలోకి తన కొడు కుని అనుమతించడం అంత క్షేమకరం కాదనుకుని ఆమె "ఈ పెద్ద బీచ్‌లో నువ్వు గడిపింది చాలనుకుంటే తిరిగి విల్లాకి వెళ్లిపో" అంటూ ముందుకు వెళ్లిపో యింది. ఈ రోజు ఆమె అనాచ్ఛాదిత చేయి నిన్నటి ఎండకు కాస్త ఎరుపురంగు లోకి మారింది.

తాను ఊహించని సమాధానమిచ్చి తల్లి ముందుకు వెళ్లిపోయేసరికి జెర్రీ తిరిగి తానెక్కడ విల్లాకి వెళ్లాల్సి వస్తుందో అని కంగారు పడి పరుగెత్తుకుంటూ ఆమెను చేరుకున్నాడు.

తన వెనుకే వచ్చిన కొడుకును చూసి ఆమె మళ్లీ 'వీడు నేను లేకుండా తనను తాను రక్షించుకునేంత పెద్దవాడయ్యాడు. ఇంకా వీడ్ని నేను అంటిపెట్టుకుని ఉండటం అవసరమా' అనుకుంది. కానీ, మళ్లీ తనలో తానే 'వీడు నేను దగ్గర లేక పోతే ఎలాంటి వేషాలు వేస్తాడో ఏమో, నేను తప్పనిసరిగా జాగ్రత్త పడాల్సిందే!' అనుకుంది.

ఆమె అలా ఆలోచించడానికి ఒక కారణం ఉంది. పదకొండు సంవత్సరాల జెర్రీ ఆమె ఒక్కగానొక్క కొడుకు. తండ్రి లేని వాడు.

తల్లి తననుంచి దూరంగా బీచ్‌లోకి వెళ్లి పోయిన తర్వాత ఒడ్డుపై నిటారుగా నిల బడి కంటి ముందున్న అనంత జలరాశిని చూడటం మొదలుపెట్టాడు జెర్రీ. దూరంగా ఎరుపు, గోధుమ వర్ణాల్లో రాతి బండలు, వాటిని ఢీకొట్టి తెల్లనురగలా మారే ఆకుపచ్చని అంచు కలిగిన నీలివ ర్ణపు అలలు మనోహరంగా కనిపించాయి. అతడు మరింత ముందుకువెళ్లి చూశాడు. అక్కడంతా మొనదేలిన రాళ్లున్నాయి. వాటిపై గాఢ నీలం, ఊదారంగు మచ్చలు చిత్రంగా అనిపించాయి. అంతగా లోతు లేనిఆ ప్రాంతంలో అతడికి తెల్లగా నురగలు కక్కుతున్న కెరటాలు, ఆ పక్కనే తెల్లటి ఇసుకపై ముదురునీలం రంగులో కనిపిస్తోన్న నీళ్లు గమ్మత్తుగా అనిపిం చాయి.

'రారమ్మ'ని పిలుస్తున్న ఆ సముద్రాన్ని చూసి ఆగలేకపోయాడు జెర్రీ. వెంటనే సముద్రంలోకి పరుగెత్తుకెళ్లి ఈతకొట్టడం మొదలుపెట్టాడు. జెర్రీ మంచి ఈతగాడు.

అందుకే తళతళా మెరుస్తోన్న ఇసుకమీదుగా మరింత ముందుకు వెళ్లాడు. అతడు సముద్రంపై తేలుతూ తన తల్లికోసం చూశాడు. ఆమె సముద్రతీరాన గొడుగు కింద కూర్చుని ఉంది. జెర్రీకి ఆ బీచ్‌లో కొంతమంది కొత్తవాళ్లు కనిపించారు. వారి మేనిఛాయ ముదురు గోధుమవర్ణంలో ఉంది. వాళ్లల్లో కొంతమంది నగ్నంగానే ఈతకొడుతున్నారు. వాళ్లు మాట్లాడుకుంటున్న భాషేమిటో జెర్రీకి అర్థం కాలేదు. వారిగురించి తెలుసుకోవాలని ఆత్రుతతో వారివైపు వెళ్లాడు. వాళ్లు జెర్రీ వంక అనుమానంగా చూశారు. అయితే వారిలో ఒకడు జెర్రీని చూసి నవ్వాడు. అది చాలు వాళ్లలో కలిసిపోవడానికి అన్నట్లు జెర్రీ కూడా నవ్వి వారికి దగ్గరగా ఈత కొట్టాడు. అప్పుడు అతడు తన సొంత బీచ్‌ని వదిలి అనుకోకుండా ఇటు వచ్చాడని అర్థం చేసుకుని గట్టిగా అరుస్తూ అతడ్ని పలకరించారు.

జెర్రీకంటే పెద్దగా ఉన్న ఆ యువకులంతా అక్కడ బండరాళ్లపైచేరి ఒకరినొకరు నెట్టుకుంటూ ఆ రాళ్లపై నుంచి సముద్రంలోకి దూకుతున్నారు. అలా దూకిన వాళ్లు రాళ్ల చుట్టూ ఈది వచ్చి మళ్లీరాళ్లపైకి ఎక్కి డైవ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జెర్రీ కూడా వాళ్లతో కలిసి ఆ ఆట మొదలుపెట్టాడు.


వాళ్లంతా 'గాలి పీల్చుకోకుండా నీటిఅడుగున కొద్దిసేపు ఉండటం' అనే ఆట ఆడుతున్నారు. అలా చేయడం సాధ్యమే, తమకేం కాదు అనే భరోసా కనిపిస్తోంది వారిలో. వాళ్లల్లో ఒకడు ఓ పెద్దరాతికి ఇటువైపు దూకి నీటిలో మునిగికొంతసేపు నీటి అడుగునే ఈతకొట్టి రాయి అవతలి వైపు పైకి తేలాడు. అతడు నోటితో గాలి పీలుస్తూ రొప్పుతున్నాడు. ఆ తర్వాత తాను విజయం సాధించానని గట్టిగా అరచి చెప్పాడు.

జెర్రీ సముద్రంలోకి డైవ్ చేసి నీటి అడుగున ఈదుతున్నపుడు తనలాగేనీటి అడుగున ఈదుతున్న వారెవరూ కనిపించ లేదు. అంతకుముందు అస్పష్టంగా కనిపించిన ముఖాలన్నీ క్రమంగా మాయమయ్యాయి. అక్కడే ఉన్న ఒక రాతి మధ్యలో ఖాళీగానీ, సొరంగంగానీ ఉండి ఉంటుందనీ, అందుకే వాళ్లు కనిపించలేదని అనుకున్నాడు జెర్రీ. అతడు ఒకసారి నీటి ఉపరితలానికి వచ్చి మళ్లీ నీళ్లల్లో మునిగాడు. కానీ, ఆ ఉప్పునీళ్లల్లో అతడికేమీ కనిపించలేదు. తిరిగి అతడు నీటి ఉపరితలంపైకి వచ్చాడు. అప్పటికే వాళ్లంతా రాళ్లపైకి చేరి ఆ విన్యాసాన్ని మరోసారి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అపుడు జెర్రీ "నా వైపు చూడండి!" అని వాళ్లని గట్టిగా పిలిచాడు. నీటిపై గట్టిగా కొట్టాడు.

వాళ్లు జెర్రీని ఏమాత్రం పట్టించుకోలేదు. అయితే తల్లి తనను పట్టించుకోనపుడు తాను ఆమె దృష్టిని తనవైపు తిప్పుకోవడానికి నేలపైదబదబా బాదినట్టుగా... వాళ్ల దృష్టిని ఆకర్షించడానికి అతడు నీటిపై గట్టిగా కొడుతూ శబ్దం చేశాడు. అయితే అతడు ఎన్ని రకాల చేష్టలుచేసినా వాళ్లెవరూ కన్నెత్తి చూడలేదు.

జెర్రీని ఏమాత్రం పట్టించుకోని వాళ్లు మళ్లీ సముద్రంలోకి దూకినీటి అడుగున ఈతకొట్టడం మొదలుపెట్టారు. జెర్రీ ఒకటి... రెండు..మూడు.. అంటూ అంకెలు లెక్కపెట్టసాగాడు.

యాభై దగ్గరకి వచ్చేసరికి జెర్రీలో భయం మొదలైంది. సముద్రంలోని ఆ భారీరాతి గుహలో మునిగిపోయారేమో అనుకున్నాడు. వంద అంకెలు లెక్కించడం అయ్యేసరికి తాను సహాయంకోసం పిలిచినా రావడానికి చుట్టుపక్కల ఎవరూ కనిపించలేదు. అతడు వేగంగా లెక్కపెట్టడం మొదలుపెట్టాడు. అలా లెక్కించడం వాళ్లు




త్వరగా పైకి రావడానికా, లేక మునిగిపోవడానికా అనేది అతడికే అర్థం కాలేదు. కానీ, భయపడుతూనే లెక్కించసాగాడు. వంద దాటింది. నూటయాభై దాటింది. అతడిలో ఆందోళన క్రమేపీ పెరిగిపోసాగింది. సరిగ్గా నూట అరవై అనేసరికి వాళ్లంతా ఒక్కసారిగా గోధుమ వర్ణపు తిమింగలాల్లానీటి అడుగు నుంచి పైకి వచ్చారు. అయితే వారి గురించి అంత సేపూఆత్రుత పడిన జెర్రీవంక కనీసం చూడనైనా చూడకుండా ఒడ్డువైపు ఈదుకుంటూ వెళ్లిపోయారు.

వాళ్లంతా ఒడ్డు చేరుకుని తమ బట్టలు తీసుకుని పరుగులు తీశారు. వారలా వెళ్లగానే జెర్రీ కళ్లు నులుముకుంటూ బిగ్గరగా ఏడ్చాడు. అయితే కాసేపటికి తేరుకుని తన తల్లి కూర్చున్న వైపు ఈదుకుంటూవెళ్లి చూశాడు. ఆమె ఇంకా ఆ నారింజ రంగు గొడుగు కిందే కూర్చుని ఉండటం చూసి మళ్లీ ఆ పెద్దరాతి దగ్గరకు ఈదుకుంటూవచ్చాడు. ఆ రాతిపైకి వచ్చాడు. దానిపై నుంచి దూకి నీటి అడుగున రాతి కిందకు చేరాడు. ఆ పెద్ద రాతిగోడను పట్టుకున్నాడు. కానీ, ఉప్పునీటి వల్ల అతడు అక్కడ ఏముందో సరిగ్గా చూడలేకపోయాడు.

జెర్రీ ఇక ఆ రోజుకు ఈతకొట్టడం చాలించి విల్లాకు వెళ్లిపోయి, వాళ్లమ్మ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. ఆమె రాగానే ఆమె పక్కకు చేరి "నాకు స్విమ్మింగ్ గాగుల్స్ కావాలి" అని తెగ విసిగించాడు. అయితే ఆమె కోపం తెచ్చుకోకుండా "సరేలే" అని జవాబిచ్చింది. కానీ జెర్రీ నాకు "నాకు ఇప్పుడంటే ఇప్పుడే కావాలి" అని ఆమెషాపుకు తీసుకెళ్లేదాకా ఊరుకోలేదు. ఆమె గాగుల్స్ కొనగానే దానిని ఆమె చేతుల్లోంచి లాక్కొని వెంటనే బీచ్‌వైపు పరుగెత్తాడు.

సముద్రంలోకి దూకిన జెర్రీ ఆ పెద్ద రాయి వరకూ ఈదుకుంటూ వెళ్లిదానిపైకి



చేరి తన కళ్లజోడును సరిచేసుకుని నీళ్ల లోకి దూకాడు. కానీ, తొలిసారి వాటిని ధరించిన కారణంగా జెర్రీ నీళ్లలోకి దూక గానే అది కదిలిపోయి కళ్లజోడు వదులై పోయింది. వెంటనే రాతిపైకి చేరి దాన్నిసరిచేసుకుని ఊపిరితిత్తులనిండా గాలి పీల్చుకుని నీటిలో మునిగాడు. ఇప్పుడు జెర్రీకి నీటి అడుగున నేల స్పష్టంగా కనిపించింది. ఆరు నుంచి ఏడ డుగుల దిగువన నీటి అడుగుభాగం చాలా శుభ్రంగా ఉంది. తెల్లటి ఇసుక, ఆ ఇసుకలో గుచ్చిన గచ్చకాయ రంగులో ఉన్న రెండుచెక్కలు దారి చూపిస్తున్న ట్టుగా ఉన్నాయి. అక్కడ చాలా చేపలు కనిపించాయి. అవి తమ ముక్కులను ఒక దానినొకటి తాకించుకుంటూ ఎలాంటి కద లికా లేకుండా ఉన్నాయి. మరికొన్ని ఒక దాని వెంట ఒకటి తిరుగుతుంటే చూడ్డానికి అది జలనృత్యంలా ఉంది. ఆ తర్వాత తన వేలిగోరంత ఉన్న చిన్నిచిన్ని చేపలు జెర్రీని తాకి చక్కిలిగిలి పెట్టాయి.

ఆ పెద్దరాతి కింద ఉన్న సొరంగం గురించి చూద్దామని ప్రయత్నించిన జెర్రీకి అక్కడ కుచ్చులుగా ఉన్న పచ్చని నాచు తప్ప మరేం కనిపించలేదు.

జెర్రీ ఆ సొరంగం ఆచూకీ కోసం పట్టు విడవకుండా మళ్లీమళ్లీ నీటి పైకి వచ్చి గుండెల నిండుగా గాలి పీల్చుకుంటూ నీటి అడుగుకుచేరి గాలించాడు. రాతిగోడపై చేతులతో తడిమి మరీ వెదకసాగాడు. చివరకు ఎలాగైతేనేం జెర్రీ ఆ భారీ రాతిలో ఓ బిలాన్ని కనుగొన్నాడు. జెర్రీ రాతిగోడ పక్కనుంచి ఆ బిలంలోకి వెళ్లడా నికి ప్రయత్నించాడు. అయితే భారీ ప్రయత్నం తర్వాత అతడు బిలంలోకి చూడగలిగాడు. అది వంకరటింకరగా ఉంది. అతడు ఆ బిలం అంచులు పట్టు కునిబిలంలోకి వెళ్లడానికి ప్రయత్నించాడు. అయితే అతడు తలను లోపలికి దూర్చగ లిగాడు కానీ, భుజాలు ఇరుక్కు

పోయాయి. అతడు వాటిని పక్కకు వంచి, నడుమును కూడా అలాగే పక్కకు వంచి ఎట్టకేలకు బిలంలోకి వెళ్లగలిగాడు. అయితే, అక్కడ అతడికి ఏమీ కనిపించలేదు. కానీ, నోటికి ఏదో మృదువుగా, చెమ్మగా తగిలింది. అప్పుడే సరిగ్గా అతడు పచ్చని రాతి గోడలోంచి కదులుతున్న ఓ మొక్కలాంటి దాన్నిచూశాడు. అతడికి చాలా భయం వేసింది. అది ఆక్టోపస్ అనుకున్నాడు. వెంటనే వెనక్కి గెంతాడు. సముద్రపు నాచుకు చెందిన హానిచేయని ఓ టెంటకిల్‌ని సొరంగం ముఖద్వారం వద్ద చూశాడు. ఒళ్లు జలదరించే అనుభవంతో జెర్రీ పెద్ద రాతిపైకి చేరుకున్నాడు. అయితే అక్కడితో అతడు ఆగిపోలేదు. ఆ సొరంగానికి అవతలివైపు ఏముందో తేల్చుకోవాలనే అనుకున్నాడు.

అనువాదం :
మానేపల్లి మురళి

జెర్రీకి తెలుసు.. ఆ సొరంగం అంతు చూడాలంటే తాను నీటిలో ఊపిరిబిగబట్టి ఎక్కువసేపు ఉండటం సాధన చేయాలని. తనకంటే వయసులోపెద్దగా ఉన్న ఆ స్థానిక కుర్రాళ్లు సాధించింది తానూ సాధించాలి. అందుకే తన చేతుల్లో ఒక రాయిని తీసుకుని అతడు సముద్రంలో మునిగాడు. అలా రాయిని పట్టుకుని దూకడానికి కారణం ఏమిటంటే... దాని బరువు వల్ల అతడు సముద్రపు అడుగున ఉండగలడు.

అలా తీరానికి దగ్గర్లో నీటి అడుగుకు చేరుకున్న జెర్రీ 'ఒకటి... రెండు... మూడు..' అంటూ లెక్కించడం మొదలు పెట్టాడు. అతడు నిదానంగా లెక్కిస్తూ పోయాడు. అతడి గుండెల్లోకి సరఫరా అవుతున్న రక్త ప్రవాహ సవ్వడిని అతడు వింటున్నాడు.

'యాభై ఒకటి... యాభై రెండు..'

జెర్రీ ఇక ఊపిరి బిగబట్టుకో లేకపోయాడు. వెంటనే అతడు రాతిపైకి చేరుకున్నాడు. అప్పటికే సూర్యుడు పడమట కుంగిపోతూ కనిపించాడు. ఇక తన ఆట ఆపి జెర్రీ విల్లాకు పరుగెత్తాడు. అక్కడ అతడి తల్లి రాత్రి భోజనం సిద్ధం చేస్తూ కనిపించింది.

జెర్రీని చూస్తూనే అతడి తల్లి అడిగింది "బాగా ఆడుకున్నావా? "

"అవునమ్మా" జెర్రీ చాలా ఉత్సాహంగా చెప్పాడు.

ఆ రాత్రంతా జెర్రీ ఆ గుహ గురించే కలలుగన్నాడు. ఇక్కడ ఉండగానేఎలాగైనా ఆ సొరంగం అంతు చూడాలని అనుకున్నాడు. అయితే, ఆరాత్రి అతడి ముక్కులోంచి చాలా రక్తం పోయింది. ఎక్కువసేపు ఊపిరి బిగబట్టి నీటి అడుగున ఉండటాన్ని సాధన చేయడంతో అతడికి నీరసంగా, తలంతా దిమ్మెక్కినట్టైంది.

ఆ మర్నాడు జెర్రీ తన ఊపిరితిత్తులు బలంగా ఉండేందుకు వ్యాయామం చేశాడు. కానీ ఆ రోజు రాత్రి కూడా అతడి ముక్కువెంట రక్తం కారింది. దాంతో జెర్రీని తన వెంట రావద్దని చెప్పింది అతడి తల్లి. తన అతి జాగ్రత్తవల్లే ఒక రోజు వృథా అయిపోయిందని జెర్రీ తెగ బాధపడ్డాడు. కానీ చేసేది లేక ఈతకొట్టనని చెప్పి తల్లి వెంట వెళ్లి, బీచ్ దగ్గర కూర్చుని సముద్రాన్ని చూస్తూ గడిపాడు.

మూడోరోజు జెర్రీ తల్లిని అనుమతి అడగకుండానే బీచ్‌లోకి పరుగెత్తాడు. ఒక రోజు విశ్రాంతి తర్వాత తను నీటి అడుగున కొంచెంఎక్కువసేపు అంటే మరో పది అంకెలు లెక్కపెట్టగలిగేంతసేపు ఉండగలిగినట్టు జెర్రీకి అనిపించింది. అయితే సొరంగంలోకి వెళ్లడానికి మాత్రం ప్రయత్నించలేదు. కేవలం సొరంగం ఆను

పానులు తెలుసుకున్నాడంతే..!

విల్లాలో జెర్రీ గడియారం ముందు కూర్చుని మళ్లీ తన వాయుస్థంభన విద్యని సాధన చేయడం మొదలుపెట్టాడు. ఈసారి తాను రెండు నిమిషాలపాటు ఎలాంటి ఇబ్బందికి గురికాకుండా ఊపిరి బిగబట్టినందుకు అతడికి గర్వంగా అనిపించింది.

"మరో నాలుగురోజుల తర్వాత మనం ఇక్కడ నుంచి వెళ్లిపోతున్నాం!" అని జెర్రీకి తల్లి చెప్పింది. అయితే తాము ఈ ప్రాంతాన్ని విడిచి వెళ్ళే ముందు ప్రాణాలకు తెగించైనా సరే ఆ సొరంగం సంగతి తేల్చాలనుకున్నాడు జెర్రీ. అయితే రెండు రోజుల తర్వాత అతడునీటిలో ఉండగలిగే సమయం పెరిగినా ముక్కునుంచి రక్తం కారడంకూడా ఎక్కువైంది. అతడు నీటి అడుగున ఉన్నపుడే తన ముక్కునుంచి కారిన ఎర్రటి రక్తం ఆ నీలిరంగు నీళ్లల్లో కలిసిపోవడాన్ని చూశాడు. వెంటనే పెద్ద రాతిపైకి ఎక్కాడు. ఆ రాతిపై తన చిక్కటి రక్తంకారడం చూసి అతడికి భయమేసింది. అనేక సందేహాలు చుట్టుముట్టాయి.

జెర్రీ తనలో తాను 'ఒకవేళ నేను సొరంగంలోకి ప్రవేశించిన తర్వాత నిస్సత్తువ నన్ను ఆవరిస్తే, తలంతా దిమ్మెక్కిపోయి నేను నిస్సహాయస్థితిలో అక్కడ చిక్కుకు పోతానా? లేకపోతే ఆ సొరంగంలోనే చనిపోతానా? ' అని అనుకున్నాడు. అతడికి భయం వేసింది. పోనీ వచ్చే వేసవి సెలవులకు తాను కాస్త పెద్దవాడ్ని అవుతాను కాబట్టి అప్పుడే ఆ బిలం సంగతి చూడొచ్చు అనుకున్నాడు.

జెర్రీ అలా అనుకున్న కాసేపటిలోనే అతడి ముక్కువెంట రక్తం కారడం ఆగింది. తల ఇంకా దిమ్ముగానే ఉంది. కానీ జెర్రీలో మొండి పట్టుదల చోటు చేసుకుంది. ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ తాను ఆ సొరంగం సంగతి తెలుసుకోలేనని అనుకున్నాడు.

జెర్రీ అలా బలంగా నిశ్చయించుకున్న తర్వాత స్విమ్మింగ్ గాగుల్స్ చేతిలోకి తీసుకుని ఆకాశం కేసి చూశాడు. ఆ తర్వాత గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు. మళ్లీ రాయి తీసుకుని నీటిలో దూకాడు. రాయి బరువు వల్ల చాలా వేగంగా నీటి అడుగుకు చేరుకున్నాడు. తర్వాత రెండు చేతులతో బిలం అంచుల్ని పట్టుకుని దానిలోకి ప్రవేశించాడు. అయితే గతానుభవం దృష్ట్యా తన భుజాలను, నడుమును ఓ పక్కకు వంచి ముందుకెళ్లడం మాత్రం మర్చిపోలేదు. ఇప్పుడతడికి లోపల స్పష్టంగా కనిపిస్తోంది. చుట్టూ రాళ్లతో నిండిన ఆ చిన్నబిలంలో ఊదా, పసుపు వర్ణాలు కలగలసినట్టున్నాయి నీళ్లు. ప్రవాహం అతడిని పైకప్పు వైపుకు నెడుతోంది. గరుగ్గా, మొనదేలిన ఆ పైకప్పు తగిలి అతడి వెన్ను నొప్పెడుతోంది. అందుకే జెర్రీ తన కాళ్లనే తెడ్లలా ఉపయోగించి వేగంగా ముందుకు కదలసాగాడు. సరిగ్గా ఆ సమయంలోనే అతడి తలకు ఏదో బలంగా తగిలింది. ఆ దెబ్బకు తల అదిరిపోయింది.

'యాభై ఒకటి... యాభై రెండు..'

అయినా అతడు లెక్కించడం ఆపలేదు. అతడు ఎలాంటి వెలుతురు లేని ఆ చీకటి బిలంలో, తనను ఆ గరుకైన పైకప్పుకు తగిలేలా విసిరేస్తున్న అలల మధ్య అలా ఈదుతూనే ఉన్నాడు.

'డెబ్బై ఒకటి... డెబ్బై రెండు...'

అతడి ఊపిరితిత్తులకు అలసట రావట్లేదు. అతడు గాల్లో తేలుతున్న బుడగలా ఆ బిలంలో సులువుగా ముందుకు వెళ్లిపోతున్నాడు. కానీ, అతడి తల మాత్రం అంతకు ముందు తగిలిన దెబ్బకు నొప్పిపిస్తోంది.

హఠాత్తుగా జెర్రీకి ఆ బిలంలో ఆక్టోపస్

లున్నాయేమో! అని అనుమానమొచ్చింది. గుహంతా నిండిపోయిన సముద్రపు పాచిలో తాను చిక్కుకుపోతానేమో! అనే అనుమానం కూడా వచ్చింది. అందుకే తలను మరింత కిందకు వంచి ఈదడం మొదలుపెట్టాడు. స్విమ్మింగ్ పూల్‌లో ఉన్నట్టే కాళ్లూ, చేతులూ స్వేచ్ఛగా కదిలిస్తున్నాడు. జెర్రీ తాను ఇంకా వేగంగా ఈదాలనుకున్నాడు. కానీ ముందుకెళ్లే కొద్దీ బిలం ఇరుగ్గా ఉంటే తన తల ఆ బిలం గోడలకు గుద్దుకుంటుందేమోనని అతడికి భయం వేసింది.

'నూరు... నూట ఒకటి... నూట రెండు...'

జెర్రీ అలసిపోయాడు. అతడ్ని నిస్సత్తువ ఆవహించింది. అతికష్టమ్మీద అంకెలు లెక్కపెడుతున్నాడు. విజయానికి చేరువవ్వాలనే పట్టుదలతో ఈదడం ఆపలేదు. కొద్దిదూరంలోనే మసక వెలుతురు కనపడింది.

జెర్రీ 'నూట పదిహేను' అన్న తర్వాత కొంచెంసేపు ఆగి మళ్లీనూట పదిహేను అనే లెక్కపెట్టాడు. అప్పటికి అతని చుట్టూ ఉన్ననీళ్లు పచ్చరంగులో మెరుస్తూ కనిపించాయి. తలెత్తి చూసేసరికిబిలం పైకప్పు పై పొడవాటి పగులు కనిపించింది. ఆ పగులులోంచిసన్నటి వెలుతురు పడుతోంది. ఆ వెలుతురులో కొంతమేర పరిశుభ్రంగా ఉన్న సొరంగపు గోడ, ఆ పైన చిక్కటి చీకటి దారి కనిపించాయి. ఇక ఆగేందుకు సమయం లేదు. తన ముందున్న చిక్కటి చీకటిని చీల్చుకుంటూ ముందుకు వెళ్లాల్సిందే. లేకపోతే అక్కడే మునిగిపోతాడు. కానీ, అప్పటికే అతడి తల ఉబ్బిపోతోంది. 'నూట పదిహేను' అనుకుంటూ బలవంతంగా బిలం గోడని పట్టుకొని ముందుకు సాగుతున్నాడు. ప్రాణవాయువుకోసం ఊపిరితిత్తులు ఎగసిపడుతున్నాయి. దాదాపు స్పృహ కోల్పోయాడు.

'నూట పదిహేను... నూట పదిహేను...'

అలసిన శరీరాన్ని తిరిగి సమాయత్తం చేసుకోవడానికి అతడు ఆ సంఖ్యనే వల్లె వేస్తున్నాడు. అయితే జెర్రీ మరెంతో సేపు ఈదలేడు. తల పగిలిపోతుందేమో అనిపిస్తోంది. ఎలా అయినా అక్కడి నుంచి బయటపడటానికి ఆ పిల్లవాడు తన సర్వశక్తులూ ఒడ్డి చివరి ప్రయత్నం ప్రారంభించాడు.

జెర్రీ చేపలా బుగ్గలు ఉబ్బించాడు. నోటినుండి బుడగలు వస్తున్నాయి. అతడికి తాను ఈ నీటిలో మునిగిపోతానేమో! అనిపించింది. ఇక కొద్దిదూరం కూడా ఈదలేని అశక్తత. అతడి కళ్లముందు ఏదో అల్లిబిల్లిగా అల్లుకున్నట్టు కనిపించింది. అది రక్తం. ముక్కులోంచి బయటకి వచ్చే మార్గం లేక అతడి కళ్లనిండా అలుముకుంది.. అతడు స్విమ్మింగ్ గాగుల్స్‌ని తీసి పడేయగానే రక్తం సముద్రనీటిలో కలిసింది.

జెర్రీ దోసిలినిండా నీరు తీసుకుని ముఖంపై చల్లుకున్నాడు. నోట్లోకి ఉప్పగా, వగరుగా ఉన్న ద్రవం వెళ్లింది. అది సముద్రపు నీరో, రక్తమో అతడికి అర్థం కాలేదు. అయితే కాసేపటికి గాభరాగాకొట్టుకుంటున్న గుండె నెమ్మదించింది. కళ్లు కూడా తేటపడ్డాయి. మరికొద్ది దూరం ఈదగానే దగ్గరలోనే నీలి సముద్రంపై వెచ్చని వెలుగు రేఖలు ప్రసరించడం కనిపించింది. జెర్రీ తనకు అరమైలు దూరంలో స్థానిక కుర్రాళ్లు ఈదడం చూశాడు. అయితే ఈసారి వాళ్లను పలకరించాలనుకోలేదు. ఇప్పుడు అతడికి ఇంటికి వెళ్లికి పడుకోవడం తప్ప ఏమీ అక్కర్లేదు.

ఒడ్డువైపు నెమ్మదిగా ఈదుకుంటూ వెళ్లాడు. విల్లాకు వెళ్లి ఒళ్లు తెలియకుండా నిద్రపోయాడు. చాలాసేపటి తర్వాత అలి

విజ్ఞప్తి

విపులకు కథలు, అనువాద కథలు, ఇతర రచనలు, కార్టూన్లు, కూపన్లు పంపేవారు ఇకపై కింది చిరునామాకు పంపాల్సిందిగా విజ్ఞప్తి.

సంపాదకులు, విపుల, ఈనాడు కాంప్లెక్స్,
గూడ్స్ షెడ్ రోడ్డు, మూసాపేట విలేజి,
బాలానగర్ (మండలం), హైదరాబాద్ – 500072
రంగారెడ్డి జిల్లా ఫోన్: 040-23815851 EX: 339, 355

రచయితలు/రచయిత్రులు రచనలు తమ సొంతమే అన్న హామీపత్రంతో పాటు తమ పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు సహా ఇవ్వాలి. ఫోన్ నెంబరు ఉంటే సమాచారం వేగంగా ఇవ్వడానికి వీలవుతుందని గమనించగలరు. అనువాద కథలు పంపేవారు మూలరచయిత అనుమతి పత్రం పంపాలి. అది సాధ్యం కాని పక్షంలో తాము ఏ సంకలనం/పత్రిక నుంచి ఆ కథను తీసుకున్నారో ఆ ప్రచురణకర్తల చిరునామాలు, ఫోన్ నెంబర్లు వివరంగా పంపాలి. అప్పుడు అనుమతి పత్రం తీసుకోవడానికి 'విపుల' ప్రయత్నిస్తుంది. ***తిరస్కృత రచనలు కావాలనుకునేవారు విధిగా తగినన్ని పోస్టేజి స్టాంపులు అంటించిన సొంత చిరునామాగల కవరును జతపరచాలి.*** ఇలా చేయని పక్షంలో ట్రాష్‌లోకి వెళ్లిపోతాయి. ఆ తర్వాత స్టాంపుల కవర్ పంపినా ప్రయోజనం శూన్యం. చందాదారులు కూడా తాము పంపే డీడీ వెనుక/మెయిల్‌లో తమ పూర్తి చిరునామాను ఫోన్ నెంబరు సహా ఇవ్వాలి.

కిడికి మెలకువ వచ్చింది. తల్లి తిరిగి వచ్చినట్టు గ్రహించాడు జెర్రీ. వెంటనే బాత్రూమ్‌కి పరిగెత్తాడు.

ఎందుకంటే తన ముఖంపై ఆ రక్తపుమరకల్ని, కన్నీటి చారికల్ని ఆమె చూడకూడదు. శుభ్రంగా మొహంకడుక్కుని ఆమె దగ్గరకు వెళ్లాడు.

ఆమె జెర్రీవంక చూసి నవ్వుతూ "ఈ ఉదయం బాగా గడిచిందా?" అనిఅడిగింది.

"అవును, చాలా బాగా!" జవాబిచ్చాడు జెర్రీ.

"కానీ, నువ్వు కొంచెం అలసిపోయినట్టు కనిపిస్తున్నావు, ఆ తల అలా బొప్పి కట్టిందేమిటి?" అని ఆదుర్దాగా అడిగింది.

"ఏం లేదమ్మా, తలకు చిన్న దెబ్బ తగిలిందంతే!" అన్నాడు జెర్రీ.

అనుమానం తీరక జెర్రీ వాళ్లమ్మ అతడ్ని పరీక్షగా చూసింది. అతడు నీరసంగా ఉన్నాడు. అతడి కళ్లు పాలిపోయాయి. ఆమె కంగారు పడింది. కానీ ఆ తర్వాత ఆమె 'ఓహ్! కంగారు పడాల్సిందేమీ లేదు. ఏమీ జరగలేదులే. అయినా జెర్రీ చేపలా చాలా బాగా ఈదగలడు' అని తనకు తానే సర్ది చెప్పుకుంది.

వాళ్లిద్దరూ మధ్యాహ్నం భోజనానికి కూర్చున్నారు.

అప్పుడు జెర్రీ "అమ్మా! నేను నీటి అడుగున కనీసం రెండు నుంచి మూడునిమిషాల పాటు ఉండగలను తెలుసా..!" తాను సాధించిన విజయాన్ని ఉండబట్టలేక చెప్పాడు.

"నిజమా, జెర్రీ?" అని, "అయితే మరీ ఎక్కువ ప్రయత్నించకు. ఇక ఇవాళ్టికి విశ్రాంతి తీసుకో" అంది.

తాను అనుకున్నది సాధించిన జెర్రీ అప్పటికి 'ఊఁ' కొట్టాడు కానీ అది ఈ పూటకే! Ⓥ

తెలుగు కథ

- పి. షహనాజ్

అమ్మకో గూడు

తల్లి నిర్ణయం విని నివ్వెరపోయారు శ్రీధర్, శ్రీరామ్‌లిద్దరూ. తాము వింటున్నదేమిటో అర్థం చేసుకోవడానికి చాలా సేపు పట్టింది. తరువాత ఆశ్చర్యం నుండి తేరుకుంటూ- "నీకు మతిగాని పోయిందామ్మా! ఇక్కడ నీకేం తక్కువ యిందని మానుండి దూరంగా ఉండాలను కుంటున్నావ్? మేం ఊళ్ళో, బంధువుల నడుమ తలెత్తుకుని తిరగాలా? వద్దా? చెట్టంత కొడుకులు బతికుండగా నువ్వు ఇదే ఊళ్ళో వేరుగా ఉంటూ - వేరుకుంపటి పెట్టుకోవాలని నిశ్చయించుకున్నావా? అందరం ఒకేచోట కలిసిమెలిసి ఉన్నప్పుడు ఎన్నో వస్తుంటాయి, పోతుంటాయి. అంత మాత్రాన..." అంటూ ఇద్దరూ ఉక్రోషంతో ఉడికిపోతూ అరిచారు.

"మీ ఆవేశాన్ని తగ్గించుకోండి. నన్ను అపార్థం చేసుకోకండి. మీనుండి దూరంగా బతకాలనుకుంటున్నది నా కోసం. నా అభిరుచికి తగ్గట్టు జీవించాలనుకుంటున్నాను. నా మాటను మన్నించండి. నేను ఇంకా చాన్నాళ్ళు బతకాలని నిజంగా మీరు కోరుకుంటూ ఉంటే నా కోరికను తీర్చండి. ఇప్పటికే సగం కంటే ఎక్కువ జీవితం గడిచిపోయింది. నా శేష జీవితం ప్రశాంతంగానూ, స్వతంత్రంగానూ, సంతృప్తిగానూ జీవించాలనుకుంటున్నాను. మిమ్మల్ని కష్టపెట్టాలని లేదు. నేను నాకంటూ ఓ ఇంట్లో ఉండదల్చుకున్నాను" కళ్ళు చెమర్చుతుండగా చెప్పింది దాక్షాయణి. అది విన్న కొడుకులిద్దరూ సందిగ్ధంలో పడ్డారు. తల్లి మొండితనం ఎలాంటిదో వాళ్లకి తెలియంది కాదు.

దాక్షాయణి తన ఇద్దరు కొడుకులను ఒక చోట సమావేశపర్చి తన మనసులోని మాటని వెల్లడించింది. అప్పటికే ఒకటి రెండుసార్లు ఈ ప్రస్తావన తెచ్చినా వారు ఏదో చెప్పి మాటని దాటవేసేవారు. కానీ ఈసారి తల్లి నిర్ణయంలో మార్పు లేదని గ్రహించారు కొడుకులిద్దరూ. చాలా సేపు కొడుకులతో వాదించింది దాక్షాయణి. తన జీవితపు సాయం సంధ్యలో కొంత ప్రశాంతతను, విశ్రాంతిని, మనశ్శాంతిని కోరుకోవడం సహజమే.

★ ★ ★

భర్త మరణాంతరం తన దగ్గర ఉన్న ఆస్తిపాస్తులతోపాటు నివాసముంటున్న ఇంటిని సైతం పిల్లల పరం చేసేసింది. వాళ్ళ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. అప్పటికే ఆమె శ్రేయోభిలాషులు కొందరు ఆమెకు హితోపదేశం పలికారు కూడా.

"బాగా ఆలోచించుకో నీ వయస్సేం ముదిరిపోలేదు. ముందు ముందు నీ జీవిత కాలం నిశ్చింతగా గడిచిపోవాలంటే ఇల్లు నీ అధీనంలో ఉండటమే సబబు" అంటూ ఎన్నో విధాలుగా బంధువులు, స్నేహితులు చెప్పి చూశారు.

కానీ వారి మాటలను ఆమె లక్ష్యపెట్టదల్చుకోలేదు. కొడుకులు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన ఇబ్బందులను చూసింది. చివరికి వాళ్ళు ఆ ఇంటిని కూల్చేసి అపార్ట్

మెంట్స్ కింద మార్చేసి లాభపడతానంటే సరేనంది. ఇన్నేళ్ళుగా కాపురముంటున్న ఇంటిని కూలదోయటానికి కష్టంగా అన్పించినా అది వాళ్ళకి లాభం చేకూరుస్తుందని ఒప్పుకుంది.

తండ్రి పెద్ద హోదా వెలగబెట్టినా కొడుకులిద్దరూ అంతంత మాత్రంగానే ఎదిగారు. ఉన్నత చదువులు అబ్బలేదు. ఫలితంగా ఏవో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బొటాబొటి జీతాలతో జీవితాలను వెళ్ళదీస్తున్నారు. ఎదుగూ బొదుగూ లేని జీవితాలు వారివి. ఉన్న ఒక్కగానొక్క కూతురు పెళ్ళి చేసుకుని హాయిగా కాపురం చేసుకుంటున్నది. ఆమె చింత లేదు దాక్షాయణికి. తల్లిగా కొడుకుల ఆర్థికావసరాలను ఆదుకోవడమే తన కర్తవ్యంగా భావించింది.

ఫలితంగా ఆ ఇంటి స్థానంలో ఓ అపార్ట్‌మెంట్ వెలిసింది. బిల్డర్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ అన్నదమ్ములిద్దరికీ రెండేసి వాటాలు దక్కాయి. చెరొక వాటాలో కాపురాలుంటూ మరో రెండింటిని అద్దెకిచ్చుకున్నారు. వచ్చే అద్దెలతో వాళ్ళిద్దరూ ఆర్థికంగా కొంత మెరుగుపడ్డారు. దాక్షాయణి కొన్నాళ్ళు పెద్ద కొడుకు దగ్గర మరికొన్నాళ్ళు చిన్న కొడుకు దగ్గర ఉండసాగింది.

అదృష్టవశాత్తూ ఆమె కొడుకులిద్దరూ బుద్ధిమంతులే. బాధ్యతలనెరిగిన వాళ్ళే. తల్లిపట్ల గౌరవం, అభిమానం కలిగిన వాళ్ళే. ఆ విశ్వాసంతోనే ఆమె తన గురించి ఆలోచించకుండా వాళ్ళ క్షేమం కోరి ఇంటిని వాళ్ళపరం చేసేసింది. పిల్లలతోనే తన జీవితం గడిచి పోవాలని ఆశించింది. అలా కొంత కాలం గడిచింది.

కాలం గడిచే కొద్దీ ఆమెకు ఊహకు, వాస్తవానికి చాలా తేడా కన్పించింది. కొడుకులు, కోడళ్ళ అజమాయిషీ కింద బతకాలంటే ఆమెకు అదోలా అన్పించసాగింది. ఒక్కోసారి వాళ్ళ నడుమ తాను పరాయి మనిషినేమోనన్న భావన కలగసాగింది. వాళ్ళ సంసారాలు పెరిగాయి. పిల్లలు ఎదిగారు. వారి చదువుల గొడవల్లో బిజీ అయిపోయారు. ఆమెతో గడపడానికి ఎవరికీ తీరిక లేకపోయింది. ఆమె లోలోపల ఒంటరితనాన్ని అనుభవించసాగింది. ఒక్కోసారి వాళ్ళకి తను భారమయ్యానేమోననే అనుమానం కలిగేది.

చివరికి ఆమె అనుకున్నట్లే జరిగింది. ఓ రోజు తన గదిలో పడుకుని ఉండగా కోడలు వచ్చి, "అత్తయ్యా! మీరు ఇక

నుంచి హాల్లో సర్దుకోండి. అక్కడ సోఫాల పక్కనగల దీవాన్‌పై పడుకోండి. ఈ గది లో పిల్లలు చదువుకోవాలి. పరీక్షలు దగ్గర పడ్తున్నాయి. మీకు తెలుసుగా.. వాళ్ళు ఈ గదిలో కంప్యూటరు అదీ పెట్టుకోవడా నికి అనువుగా ఉందట. అంతేకాదు, రేపో మాపో అమ్మాయికి పెళ్లి జరిగినా కొత్త అల్లుడి కోసం ప్రత్యేకంగా ఓ గది ఉండాలి కదా!" అంటూ పురమాయించింది.

కోడలి మాటల్లో తన స్థానమేమిటో అర్థం చేసుకుంది. తరువాత తనకు తాను సర్దిచెప్పుకుంది. కోడలు చెప్పిన దాంట్లో తప్పేముంది. పిల్లల పరీక్షలు దగ్గర పడ్తు న్నాయి. వాళ్ళు ఏకాంతాన్ని కోరుకోవడం సహజం. వాళ్ళు కూడా పెద్దవారయ్యారు. వారికి ప్రత్యేకంగా ఓ గది ఉండాల్సిందే. అమ్మాయి పెళ్ళికి ఎదిగింది. సంబంధాలు చూస్తున్నారు. పెళ్ళయితే నవ దంపతు లకు ఓ గది కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో తనకంటూ ప్రత్యేకంగా ఓ గది ఎందుకు? హాల్లో సర్దుకుంటే పోలా అని తనకుతాను నచ్చజెప్పుకుంది.

అప్పటి నుంచి ఆమె పడక హాల్లోకి మారింది. కానీ అక్కడా ఆమెను కుదు రుగా ఉండనివ్వలేదు. ఆ హాల్లో టీవీ ఉండటంతో ఇంట్లో వాళ్లందరూ వేళాపాళా లేకుండా టీవీ ఆన్‌చేసి తమకిష్టమైన ఛాన ళ్ళను పెద్దగా చెవులు చిల్లులు పడేటట్టు పెట్టుకుని, నవ్వడం, అల్లరి చేస్తుండటంతో ఆమెకు నిద్ర కరువయింది. ఏ అర్ధరాత్రో టీవీ కట్టేసి వెళ్లి పడుకున్న తరువాతగాని ఆమెకు నిద్ర పట్టేది కాదు.

రాత్రి ఎంత ఆలస్యంగా నిద్రపోయినా తెల్లవారుజామునే నిద్రలేచి కాఫీ తాగే అలవాటు దాక్షాయణికి. కాని ఇక్కడ ఎవ రికీ ఆ అలవాటు లేదు. బారెడు పొద్దెక్కే వరకూ నిద్రలేవకపోవడం అస్సలు నచ్చదు దాక్షాయణికి. కోడళ్ళు లేవకముందే కాఫీ కలుపుకుని తాగి, టిఫిను కోసం కాయగూ రలు తరిగి పెట్టేది. కానీ అది కోడళ్ళకి నచ్చేదికాదు.

అంతేకాక దాక్షాయణికి జిహ్వా చాపల్యం కొంత ఎక్కువే. తన జీవిత కాలంలో మంచి రుచికరమైన వంటలకు అల వాటుపడ్డ ప్రాణం. ఇక్కడ కొడుకులు, కోడల్లిద్దరికీ బీపీ, షుగరు ఉండటంతో చప్పిడి మెతుకులు తినాల్సి వస్తోంది. అప్పటికీ ఆమె వాటిని తినలేక తను తినే పదార్థాల్లో కొంత ఉప్పును, కారాన్ని కలు పుకుని తింటోంది. కానీ సరయిన రుచి మాత్రం లభించటం లేదు.

చిన్న కోడలికి తన పుట్టింటి వారి యావ ఎక్కువ. బంధుప్రీతి గలది. ఆ ఇంట్లో ఎప్పుడూ ఆమె తరపు బంధువులు తిష్ట వేసుకుని ఉండేవాళ్ళు. వాళ్ళ నడుమ ఉండాలంటే దాక్షాయణికి అదోలా ఉండేది. తన ఒక్కగానొక్క కూతురు చుట్టపు చూపుగా వచ్చినా కోడలు తనకేదో పనిభా రమయి పోయినట్లు ఎంతో ఆపసోపాలు పడిపోయేది. పదిమందికి వండి వార్చి నట్లు వేషాలు వేసేది. తన పుట్టింటివాళ్ళు వచ్చి ఎన్ని రోజులున్నా, ఎంతమంది వచ్చినా రెట్టింపు ఉత్సాహంతో పనులు చేసుకుపోయేది. ఇదంతా ఆమెకు చూడ శక్యం కాకుండా ఉంది. దీంతో ఆమె ఆరోగ్యం సైతం దెబ్బతినసాగింది.

అందుకే ఆమె ఆలోచనలు కొత్తపుం తలు తొక్కసాగాయి. ఆమె తన జీవితం లో దర్జాగా, స్వతంత్రంగా, ఏ కష్టమూ లేకుండా బతికిన వ్యక్తి. కోడళ్ళతో మాట పడ్తూ వారికి భారంగా బతకాలంటే కష్టం గా ఉంది. తిండికి, నిద్రకు మొహం వాచి జీవించాలంటేనే చాలా దుర్లభంగా ఉంది. నెలనెలా పెన్షన్ అందుతోంది. తను ఎవ రిపై ఆధారపడి జీవించక్కర్లేదు. ఏ కొడు కు దగ్గరుంటే వాళ్ళకోసం ఖర్చు పెడ్తోంది. తన మందులు, మాకుల కోసం ఖర్చు పెట్టుకుంటున్నది. పెళ్ళిళ్ళు పేరంటాలకు



వెళ్లినప్పుడు కూడా తనే ఖర్చు పెడ్తోంది.

★ ★ ★

గత కొంతకాలంగా ఆమె బ్రురలో ఓ ప్రణాళిక రూపుదిద్దుకుంటోంది. చాలా ఏళ్ళ క్రితం ఆమె పుట్టింటి వాళ్ళు ఆమెకు ఒకచోట నాలుగు సెంట్ల భూమిని ఇచ్చారు. వాళ్ళిచ్చిన వేళా విశేషమే మిటోగాని ఎంత కాలం గడిచినా ఆ స్థలం

అమ్ముడుపోలేదు. అది ఒక వివాదాస్పద మైన స్థలం కావటంతో ఎవరూ కొనడానికి సిద్ధపడలేదు. ఒకవేళ వచ్చినా కారుచౌకగా అడుగుతున్నారు. తన మనవరాళ్ళ వివాహ సమయంలో మంచి ధర పలికితే దానిని విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఆలోచనల్లో ఉంది. లేకుంటే ఈపాటికి కొడుకులు ఆ భూమిని అమ్మేసుకుని సొమ్ము చేసుకుని ఎప్పుడో స్వాహా చేసే వాళ్ళు. ఇప్పుడు ఆ స్థలంలో తనకంటూ ఓ చిన్న నివాసాన్ని ఏర్పరచుకుని ప్రశాంతంగా జీవించాలన్నదే ఆమె కోరిక. ఎందు కోగానీ కొడుకులు దానికి వెనుకాడుతున్నారు. అప్పటికే ఆమె తన దగ్గర ఉన్న కొద్దిపాటి బంగారాన్ని అమ్మేసి ఓ చిన్న కుటీరం లాంటిది ఏర్పాటు చేసుకుని తనకు వచ్చే పింఛను డబ్బులతో జీవనయానం సాగిస్తానని చెప్పింది. వారు ఒప్పుకోలేదు. కానీ చివరికి ఆమె మాటే నెగ్గింది. తాను కోరుకున్నది సాధించుకోగలిగింది.

కొద్దిరోజుల్లోనే ఆమె కోరుకున్నట్లు అక్కడ ఒక నివాస యోగ్యమైన చిన్న కుటీరంలాంటి ఇల్లు వెలిసింది. అది చూసి ఆమె ఆనందానికి అంతులేకుండా పోయింది. ఆ చిన్న నివాసంలోనే ఎంతో ప్రశాంతత చేకూరినట్లనిపించింది. తన పద్ధతిలో అభిరుచులకు, ఇష్టాలకు తగ్గట్టు జీవించడానికి ఆమె సన్నద్ధమైంది.

ఇన్నేళ్ళూ మూలనపడిన తనకు ఇష్టమైన పుస్తకాలను వెంట తెచ్చుకుంది. తన నివాసంలో బయట వాలు కుర్చీని ఏర్పాటుచేసుకుని, అందులో కూర్చుని ఆ పుస్తకాలను చదువుతుంటే ఆమెకెంతో తృప్తిగా అనిపించింది. తన ఇంటి ఆవరణలో కొంతమేర పూల మొక్కలను నాటుకుంది. తరువాత తనకిష్టమైన వంకాయ కూర, టమోటా చారు వంటి వంటలు చేసుకుని కడుపారా తిన్నది. ఆమె అనుకున్నట్లే రోజులు హాయిగా ఏ గొడవల్లేకుండా, తృప్తిగా గడిచిపోతున్నాయి.

ఆమె కూతురు తల్లి వేరుగా ఉంటుందని తెల్సుకుని మొదట్లో ఎంతో బాధపడింది. వెంటనే భర్తను తీసుకుని బయలు దేరి వచ్చింది. కానీ అక్కడ ఆమె జీవిస్తున్న తీరును చూసి స్థిమిత పడింది. కూతురు, అల్లుడిరాక దాక్షాయణికి ఎంతో సంతోషాన్నిచ్చింది. భర్త బతికినన్నాళ్ళూ కూతురుకు పుట్టింట్లో ఎన్నో అచ్చట్లు - ముచ్చట్లు జరిగేవి. అల్లుడికి మర్యాదలు జరిగేవి.

దాక్షాయణి వాటిని గుర్తు చేసుకుంటూ వారికి మంచి మంచి రుచికరమైన వంటలు చేసిపెట్టింది. మనవడికి ఇష్టమైన స్వీట్లు చేసింది. అల్లుడికి మర్యాదలను జరిపించింది. తన కొడుకులు ఇళ్ళల్లో ఉన్నప్పుడు కూతురు, అల్లుడు వచ్చిన సమయాల్లో కోడళ్ళు ఎంత విసుక్కునేవారో గుర్తుకు తెచ్చుకుంది. ఇప్పుడా సమస్యే లేదు. ఆ చిన్ని ఇంట్లోనే కూతురు, మనవడు స్వేచ్ఛగా తిన్నారు. తిరిగారు. ఆనందించారు. తృప్తిగా వెళ్ళిపోయారు.

దాక్షాయణికి కాలం హాయిగా గడిచిపోతోంది. ఆమె తీసుకున్న నిర్ణయం కొంతమందికి విడ్డూరంగా కనిపించినా చాలామందికి ఆమె జీవన శైలి నచ్చింది కూడా. తానొవ్వక ఇతరులను నొప్పించక అన్నట్లుగా ఆమె జీవన యాత్ర సునాయాసంగా సాగిపోతోంది. విచిత్రంగా ఆమె ఆరోగ్యం సైతం మెరుగుపడింది. V

కన్నడ కథ

- బి.యు. గీతా

యవనిక

"ఇవాళ మంగళ ఇంటికి వెళ్ళి రావాలి" ఇంకా ఇంట్లోకి అడుగు పెట్టకుం డానే ఉత్తర్వు జారీ చేసింది భార్యామణి. నేనూ పెడసరంగానే "వెళ్ళిరా..." అంటూ కుర్చీలో కూర్చుని బూట్లు విప్పసాగాను.

"మీరూ రావాలి" అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

"రెండు నెలల నుండి కనీసం ఓ ఏడె నిమిది సార్లయినా మనం వాళ్ళింటికి వెళ్ళాం. కావాలంటే నువ్వు వెళ్ళు. నేనిం ట్లోనే ఉంటాను" అంటూ బాత్రూంకి వెళ్ళాను. కాళ్ళూ చేతులు కడుక్కుని వచ్చే సరికి టేబుల్‌పైన టిఫిన్, కాఫీ రెండూ సిద్ధంగా ఉన్నాయి. నాకు చిరాకనిపిం చింది.

"టిఫిన్ తిన్నాక కాఫీ ఇవ్వచ్చు కదా? రెండూ ఒకేమారు ఇచ్చేస్తావు! టిఫిన్ తినే లోగా కాఫీ చల్లారిపోతుంది"

"కాఫీ తాగి టిఫిన్ తినండి. లేకపోతే ఓ స్పూన్ టిఫిన్ తిని, కాఫీ ఓ మారు సిప్ చేయండి. మీరే కాఫీ చేసుకుంటే ఇంకా భేషుగ్గా ఉంటుంది" అంటూ తల దువ్వు కుంటూ వల్లించేసింది భగవద్గీత!

"నేను చెప్పిన మాట ఏదీ వినవు కదా నువ్వు. డైనింగ్‌హాల్లో, వంటింట్లో తల దువ్వుకోవద్దంటాను, వినవు. ఇంట్లో ఏ మూల చూసినా వెంట్రుకలే... ఛీ ఛీ"

"నేను చేసే ప్రతి పనిలోనూ తప్పులు వెదకడమే మీ పని. నాకసలు జుత్తు రాలదు... ఇంతకూ మీరెందుకు రానంటు న్నారు? పాపం మంగళ! మనం అప్పుడ ప్పుడూ వెళ్ళి కాస్త ధైర్యం చెప్పక్కర్లేదా? "

"నువ్వు చెప్పిన ధైర్యం చాల్లే. ఆమెలో నిండిన ధైర్యంపాలు ఎంత ఎక్కువయిం దంటే సదాశివ పోయాక మునుపటికన్నా చాలా చురుగ్గా ఉంటోంది మంగళ. ఛీ... ఈ ఉప్మా ఉప్పుమయం...? ఓ గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చిపెట్టు"

"ఎదురుగా ఫిల్టరుంది. గ్లాసులు టేబుల్‌మీదే ఉన్నాయి. పట్టుకుని తాగండి" చకచకమని ఓ చేత్తో జుత్తు చక్కగా ముడేసుకుని ముడిపిన్ను పెట్టు కుంటూ యాథాలాపంగా అనేసింది. అంత టితో ఆగక "మీరు రానంటే ఆటోలో వెళ్ళి రావాలి. మీరు వస్తే త్వరగా వెళ్ళి త్వరగా రావచ్చు" అని నా అవసరం ఏమిటో తెలి యజెప్పింది.

"అది కాదు శశీ పోయినవారమే కదా వెళ్ళి వచ్చాం. మళ్ళీ ఇవాళెందుకు? మంగళ బానే ఉందిగా" లేచి నా బ్రీఫ్‌కే సులోంచి కొంచెం వాడిన ఎర్రగులాబి తీసి శశికి ఇచ్చాను.

"ఇదేమిటండీ గులాబీ"

"ఈ రోజు ఆఫీసులో నా టేబుల్ మీద పెట్టిన పూలగుత్తిలో ఈ ఎర్ర గులాబీ చూస్తే నువ్వే గుర్తొచ్చావు. నీ కిష్టం కదాని తెచ్చాను"

"హా నైస్! థాంక్స్..." అంటూ గులా బీని టేబుల్ మీదపెట్టి, అక్కడే ఉన్న పర్సు తీసుకుని బయలుదేరబోయింది.

"శశీ, నీ కోసం తెచ్చిన పువ్వు పెట్టుకో వచ్చుగా!"

"ఇంత పెద్ద పువ్వు పెట్టుకుంటే విచిత్రంగా కనిపిస్తాను. అక్కడ ఆ చిన్న ఫ్లవర్‌వేజ్ ఉంది కదా దాన్లో కొంచెం పంచదార, నీళ్ళు వేసి ఈ పువ్వు పెట్టండి. నేను వెళ్తున్నాను బై" అని తలుపు వేసుకుని వెళ్ళిపోయింది శశి. ఆమె వెళ్ళినవైపే చూసి నిట్టూర్చాను.

అంతలో మేడ మెట్లమీద నుండి గెంతుకుంటూ వచ్చాడు వినోద్.

"హలో డాడీ! మమ్మీ వెళ్ళిపోయిందా? మీరు వెళ్ళలేదేం? "

"వెళ్ళలేదు. నువ్వెక్కడికి బయలుదేరావు ఈ వేళలో? "

"ట్యూషన్ డాడీ. ఫిజిక్స్ క్లాసివ్వాళ సీయూ" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు సుపుత్రుడు. ఎవరికీ అక్కర్లేకుండా పడివున్న గులాబీపువ్వుని చేతిలోకి తీసుకున్నాను. బుర్రలో రకరకాల ఆలోచనలు..

నేనింట్లో ఉన్నా, లేకపోయినా... లేదా అలాగే పైలోకానికి వెళ్ళిపోయినా ఇక్కడ పెద్ద మార్పులేమీ రావేమో! పని తగ్గింది అని శశి, నాన్న సుత్తి తప్పింది అని వినోద్ హాయిగా ఉంటారేమో! ఆలోచిస్తున్న కొద్దీ బుర్ర వేడెక్కింది. ఈ మధ్య నాకెందుకో శశి మాటలూ, ప్రవర్తనా చూస్తుంటే నా ఉనికి వ్యర్థమేమో అనిపిస్తోంది.

మంగళ భర్త సదాశివం చనిపోయి రెండు నెల్లయింది. మంగళ శశి పిన్ని కూతురు. ఇంచుమించు ఒకే వయసు వాళ్ళిద్దరూ. ముప్పై తొమ్మిదేళ్ళు ఇద్దరికీ. మా పదిహేనేళ్ళ కొడుకుకన్నా ఓ నాలుగేళ్ళు పెద్ద కూతురుంది, శ్యామల దాని పేరు. నలభై ఆరేళ్ళ సదాశివం నాకన్నా ఓ ఏడాది చిన్న. అనుకోకుండా హఠాత్తుగా గుండెపోటుతో చనిపోయాడు. అది మంగళ మనస్సుకి పెద్ద దెబ్బే. అందుకే మంగళకు ధైర్యం చెప్పడానికి ఓ ఇరవైమార్లయినా వారింటికి వెళ్ళివుంటుంది శశి. నన్నే ఓ ఏడెనిమిది సార్లయినా తనవెంట తీసుకుని వెళ్ళి ఉంటుంది.

వెళ్ళినప్పుడల్లా శశి మంగళకు ధైర్యం చెప్పే తీరులోనే మొగుడు అనే ప్రాణి ఉన్నా లేకపోయినా భార్య సమస్యలు లేకుండా బతకచ్చు అన్న ధ్వని మనం వద్దన్నా వినిపిస్తూనే ఉంటుంది. అది వినీ వినీ నాకు జీవితమంటేనే విరక్తి వచ్చింది. రేపే నాకేమయినా అయి నేను హరీ మన్నా శశిని జీవితంలో ఆ లోటేమీ బాధించదు.

ఆమె నిశ్చింతగా తన బతుకు సాగిస్తుంది అనేది నాకు స్పష్టమయింది.

నేను చనిపోయానని బాధపడని, బెంగపెట్టుకోని భార్య, మేమిద్దరం కలిసిగడిపిన రోజుల్ని పూర్తిగా మర్చిపోయి జీవితంలో తనకు దొరికిన దానితో తృప్తిపడి నిశ్చింతగా జీవితం సాగించడాన్ని గత నెల రోజులుగా అనుక్షణం ఊహించుకుని నేను అనుభవిస్తున్న నరకయాతనతో నాకు నిజంగానే గుండెపోటు వచ్చినా ఆశ్చర్యం ఏమీలేదు.

ఇదంతా అతిశయోక్తిగానూ, ఊహాజనితంగానూ అనిపిస్తోందా? అయితే మేము మంగళ ఇంటికి వెళ్లినప్పుడుల్లా జరిగే సంభాషణ యథాతథంగా వినిపిస్తాను. అది విన్నాక మీరు తప్పనిసరిగా మీ అభిప్రాయాన్ని మార్చుకుంటారు. అది నా నమ్మకం!

★ ★ ★

"ఇదేమిటి మంగళా, అలా కూర్చున్నావు చీకట్లో? మొహం కడుక్కుని చక్కగా తయారవకూడదూ? మీ వీధి చివర్న చక్కటి పందిరి మల్లెపూల దండలు అమ్ముతున్నాడు. నాలుగు మూరలు కొన్నాను. కాస్త తల దువ్వుకుని పెట్టుకో"

ఆ రోజున మంగళ ఇంట్లోకి ఇలా మట్లాడుతూ శశి వచ్చేసరికి మంగళ


Sivaji

కంట్లో నీళ్లు తిరిగాయి.

"అది కాదు శశీ, ఆయనే లేకపోయాక నాకివన్నీ ఎందుకు? ఆ దేవుడు అన్నీ లాక్కున్నాడు..."

"అదే వద్దన్నాను. ఈ లోకం విడిచి వెళ్ళినవారు వచ్చి చెప్పారా, బొట్టుపెట్టుకోకు, పూలు ముడవకు అని? అలంకరించుకోవడం ఆడపిల్లలకు పుట్టుకతో వచ్చిన హక్కు. పెళ్ళికి ముందు బొట్టుపెట్టుకోలేదా? తల్లో పూలు పెట్టుకోలేదా? కావాలంటే మొగుడు కట్టిన తాళి తీసేసి చెరిపించి, వేరే పెండెంట్ చేయించుకుని వేసుకోవచ్చు. మరీ బోసి మెడతో ఉండలేం కదా?" శశి మాటలు వింటూ మంగళ జుత్తు దువ్వుకుంది.

నిజమే... ఆడపిల్లలను వికారంగా

అనువాదం :
కల్యాణి

తయారు చేయడం దేనికోసం? ఆ రోజుల్లో మగవాళ్ళకి సంయమనం ఉండేది కాదు- వారిని నియంత్రించే సాధనం ఏదీ లేదు.

కనుక స్త్రీని అందవిహీనంగా తయారు చేస్తే ఏ మగవాడికైనా ఆమెను చూస్తే కోరిక కలగదు అనే తర్కం ఈ పద్ధతికి మూలం ఇప్పటికైనా ఈ పద్ధతికి స్వస్తి చెప్పడం మంచిది.

కాని... కాలం ఎంత మారిపోయిందంటే పెళ్లికాని అమ్మాయిలూ, పెళ్లయిన స్త్రీలూ అందరూ ఒకనాటి విధవలలాగానే... పూలూ, బొట్టు, గాజులూ, ఏవీ అక్కర్లేకుండా, వాటి పట్టింపులు లేకుండా బతికేస్తున్నారు. వేసుకున్న దుస్తులకు మ్యాచ్ కాకపోతే మంగళసూత్రం, నల్లపూసలూ, తీసి పక్కనపెడతారు. షా వేసుకోవటానికి ఇబ్బందని మట్టెలూ, పట్టీలు ధరించరు.

ఈ మధ్యనే వార్తల్లో చదివాము 'నా భార్య మంగళసూత్రాలు తీసి పక్కన పెట్టేసింది. ఇది నాకు మెంటల్ టార్చర్' అంటూ ఓ భర్త కోర్టులో కేసు వేసిన ఉదంతం.

కాలం మారింది. మనుష్యులు మారుతున్నారు. అని ఎంత సర్దుకుపోదామన్నా కొత్తకొత్త విషయాలు వచ్చి కొత్తకొత్త సమస్యల్ని సృష్టిస్తూనే ఉన్నాయి. "వీలునామా రాశారా కనుక్కో. బ్యాంకు అకౌంట్లు ఇద్దరి పేరిటా ఉంటే సమస్యలుండేవి కావు. ఫిక్సిడ్ డిపాజిట్లకు నామినీ ఎవరంటే తెలీదంటావు. ఇంత మొద్దువైపోయావేంటే తల్లీ" అసలు శశి మంగళను మందలిస్తే నేనెందుకు భుజాలు తడుముకుంటున్నాను.

"అందరూ ఏదో ఒక రోజున పోవాల్సిన వాళ్ళమే! ఎవరు శాశ్వతం చెప్పు? భార్యాభర్తలయినా అంతే. ముందూ, వెనకా అంతే. ఎంత ప్రేమ ఉన్నా ఒకరు చనిపోయారని ఇంకొకరు చనిపోవడం సాధ్యమా? అటుదిటయి నువ్వుపోయి సదాశివం జీవించివుంటే ఇలా బెంగపెట్టుకునేవారా? నువ్వూ అంతే! భర్త పోతే ప్రపంచం ఏమీ మునిగిపోదు. నీకు చేతికి అందివచ్చిన కూతురు ఉంది. నీక్కూడా బోలెడంత జీవితం ఉంది. నీ కూతురి జీవితం చక్కదిద్దాల్సిన బాధ్యత నీది. పెళ్ళిచేయాలి, దాని పిల్లాపాపా, వాళ్ల ఆలనా, పాలనా చూడాలి..." శశి మాటల్లో ఆమె ఆత్మవిశ్వాసం, స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె మాటలు వింటూ నేను పాతాళానికి కుంగిపోయాను.

అబద్ధమే అయినా 'మీరులేకపోతే నేనుండలేను' అన్న మాట ఎంతో వినసొంపుగా వుంటుంది. మంగళకు ధైర్యం చెప్పే ప్రక్రియలో శశి మనస్సు లోపలి పొరల్లో దాగిన ఆలోచనలు మాటల రూపంలో

పైకి వస్తున్నాయి. అది వింటున్నది, అర్థం చేసుకుంటున్నది నేను, ఆమె భర్తను. సత్యం ఎప్పుడూ కఠోరమైనదే. అబద్ధంలో దొరికే శాంతి నిజంలో లేదు, నమ్మకంలో మనకు దొరికే ప్రశాంతత విశ్లేషణలో దొర కదు.

భవిష్యత్తులో నాకేమైనా అయి, నేను చనిపోతే శశి నిశ్చింతగా ఉంటుంది. అన్న విషయం నాకు బాగా అర్థమయింది.

"డబ్బులు కాస్త కూడబెట్టకపోయినా, చిన్నచిన్న పిల్లలున్నా ఎలా జీవించడం? అని బెంగపెట్టుకోవాలి. సొంతిల్లు ఉంది. ఎదిగిన కూతురుంది. ఇబ్బంది పడక్కర్లేదు డబ్బుకి... మేమంతా ఉన్నాం ఏ చిన్న సాయంకావాలన్నా.."

నిజమే! ఆ ఇల్లు కట్టించినవాడు, కూతురి తండ్రి, బ్యాంకులో డబ్బుకూడబెట్టిన వ్యక్తి చనిపోతే దానిగురించి దుఃఖించక్కర్లేదా?

"సదాశివం పోయారు నిజమే. కాని అలాగని రోజూ ఏడుస్తూ కూర్చుంటే ఎలా? అతడితో గడిపిన జ్ఞాపకాలు నీతో ఎప్పుడూ ఉంటాయి. భౌతికంగా నీతో లేకపోయినా సదాశివం ఎప్పుడూ నీతోనే ఉంటారు. మనస్సు ప్రశాంతంగా ఉంచుకుని జీవించాలి"

శశి నోట్లోంచి వచ్చిన ప్రతీ మాటా, సలహా మంగళ మీద బాగానే పనిచేసినట్టుంది. ఎందుకంటే మంగళ ఇప్పుడు బాగానే ఉంది. కానీ శశి మంగళకు ధైర్యం ఇవ్వటానికి చెప్పిన ప్రతీ ఒక్క మాటా నన్ను అథఃపాతాళానికి కూలదోసిన మాట సత్యం.

మానసికంగా దుర్బలుడినవుతున్నాను. సదాశివం కన్నా ఓ ఏడాది పెద్దవాడిని, మంగళ కూతురికన్నా ఓ రెండేళ్ళు చిన్న మా అబ్బాయి వినోద్. మాది సొంతిల్లు. మేడమీద వాటా అద్దెకిచ్చి ఇంట్లో కూర్చున్నా నెలనెలా పదివేలు చేతిలో పడతాయి. శశికి బాగా దగ్గర స్నేహితులే ఓ పదిమంది పైనే ఉంటారు...

ఇప్పుడు మీరే చెప్పండి. నేనుకాని రేపే చనిపోయినా శశి ఏమీ బెంగపెట్టుకోదు కదా? నాకు తన మనస్సులో ఎలాంటి స్థానం, విలువా లేవా? నేను లేకపోయినా తన జీవితంలో లోటేమీ ఉండదు. ప్రేమ, ఆపేక్ష? అవి మనస్సులోనే ఉంచుకుని నా జ్ఞాపకాలలో జీవించవచ్చు. లేదా ఇంకెవర్నైయినా కట్టుకుని, తన మనసు నుండి నా జ్ఞాపకాలన్నింటిని ఊడ్చి అవతలపారెయ్యవచ్చు. నేనిలా ఆలోచించడం తప్పేమో... కాని

నేను ప్రశాంతంగా జీవించలేను...

కాని... అలాగని చావగలనా? V

తెలుగు కథ

- లక్ష్మీ రంగరాజన్

మాకో అమ్మ కావాలి!

ఆశ్రమం వాకిట్లో కారు ఆపి లోపలికె ళ్లారు శ్రీధర్, మాధవి.

అధికారి రండి అంటూ ఆహ్వానించి "ఏం కావాలి? " అని అడిగాడు.

"మేం త్వరలో అమెరికా వెళుతున్నాం. మా ఇంట్లో ఇన్నేళ్లుగా ఓ అనాథని ఆదరించి చూసుకున్నాం. ఇప్పుడు ఆమెను మాతో పాటు తీసుకువెళ్లలేం. పాపం ఆవిడని ఎక్కడ వదలాలి? అని ఆలోచిస్తుంటే, మీ ఆశ్రమం గురించి తెలిసి ఇక్కడకు వచ్చాం. మీరు అనుమతిస్తే ఆవిడని ఇక్కడ చేర్చి వెళ్దామనుకుంటున్నాం. అంతేకాదు మీ ఆశ్రమానికి విరాళం ఇద్దామనుకుంటున్నాం కూడా.." అని శ్రీధర్ అనగానే-

"ఆవిడకి ఎవరూ లేరంటున్నారు. మా ఆశ్రమం రూల్ అదే. ఎవరూ లేనివారినే ఆదరిస్తాం, చేర్చుకుంటాం. మీరు ఎపుడొచ్చి వదిలి వెళ్లినా సరే. ఈ అడ్మిషన్ ఫారమ్ మాత్రం పూర్తిచేసి ఇవ్వాల్సి ఉంటుంది. అంతే!" అన్నాడు ఆ అధికారి.

"సమస్య తీరిపోయింది. రేపే చేర్పించేద్దాం. సరేనా!" అని మాధవి అనగానే...

"ఒ. కే." అంటూ శ్రీధర్, మాధవిలిద్దరూ అధికారికి విషయం చెప్పి వచ్చేశారు.

★ ★ ★

మరుసటి రోజు మాధవి, శ్రీధర్‌లిద్దరూ వచ్చి జానకిని ఆశ్రమంలో వదిలి వెళ్లారు. ఆశ్రమానికి ఓ పాతికవేలు విరాళం కూడా ఇచ్చి వెళ్లిపోయారు.

"అమ్మా, మీకేం లోటు రాదు. మేమంతా ఉన్నాం మీకు తోడుగా..." అంటూ ఆశ్రమ వాసులు చేయి కలుపగానే "ప్చ్.." అంటూ విరక్తిగా నవ్వుకుంది జానకి.

జానకి గదిలో కూర్చుని ఆలోచించసాగింది. ఆశ్రమంలో అందరూ శ్రీధర్, మాధవిలను మెచ్చుకున్నారు. "ఎంత మంచి మనసు వాళ్లది. అనాథని ఒంటరిగా వదిలి వెళ్లక, ఆశ్రమంలో చేర్పించి మరీ వెళ్లారు. వాళ్లు చల్లగా ఉండాలి" అని అందరూ అంటున్నప్పుడు తన మనసెంత విలపించిందో.. వాళ్లకేం? తెలుసు. ఎలా బతికిన తను ఇలా ఇక్కడ తన చరమాంకాన్ని గడపాలని ఆ భగవంతుడు నుదుటన రాసిపెట్టాడు. చేసుకున్నవారికి చేసుకున్నంత... జానకికి గతం కళ్లముందు మెదిలింది.

భాస్కర్‌కి పెళ్లయిన రెండేళ్లకే భార్య పురిటిలో చనిపోయింది. సుధ అంటే భాస్కర్‌కి పంచప్రాణాలు. వాళ్లది చాలా అన్యోన్యమైన దాంపత్యం. ఊళ్లో అందరూ ఈడూ-జోడూ బాగుంది అని తెగ పొగిడేవారు. అందరి దృష్టి తగిలే కాబోలు, సుధ అల్పాయుష్షుతో పోయింది. బాబు కోసం రెండో పెళ్లి చేసుకోలేదు. భాస్కర్‌కి తల్లిదండ్రులు చిన్నతనంలోనే పోయారు. దాంతో బాబును పెంచడానికి ఎవ్వరూ లేరు. రాను రాను బాబుని పెంచడం కష్టమైపోయింది భాస్కర్‌కి. బంధువర్గం "బాబు కోసమైనా పెళ్లి చేసుకోరా!" అంటూ బలవంతపెట్టి చివరికి ఒప్పించి, పీడించి జానకినిచ్చి పెళ్లి జరిపించారు. జానకి కూడా మంచిదే. భర్త మనసుకి తగ్గట్లు, నడుచుకునేది. బాబుని బాగానే

చూసుకునేది. తనకు నెల తప్పగానే అందరి సవతి తల్లుల లాగానే జానకి మనసు మారసాగింది. బాబు పట్ల శ్రద్ధ తగ్గింది. భర్తను మౌనంగానే సాధించసాగింది. కావాలని బాబుకి ఆలస్యంగా పాలు కలిపి ఇవ్వడం, ఏడుస్తున్నా పట్టనట్లు టీ.వీ. చూస్తూ కూర్చోవడం చేసేది. రాను రాను బాబు చిక్కిపోయి బలహీనంగా అవడంతో భాస్కర్ తట్టుకోలేకపోయాడు.

జానకిని నిలదీసి అడగ్గానే ఇదే తరుణమని "ముందు వాడిని ఎక్కడన్నా వదిలి రండి. చూసుకోవడం నా వల్ల కాదు. కాదూ కూడదంటే నేను విషం తాగి చస్తాను. మీరే బాబుని చూసుకోలేదని చిత్ర హింసలు పెట్టారని రాసి మరీ చస్తాను. తరువాత మీ ఇష్టం..." అని కోపంగా జానకి అరవగానే- ఏం చేయాలో..? అర్థం కాలేదు భాస్కర్‌కి. 'ఆమెను ఇంట్లోంచి వెళ్లగొట్టలేను. నెలలు నిండిన గర్భిణి. రేపు బాబో పాపో పుడితే, బాబుని సాధిస్తుందేమో.. నా బాబు ఎక్కడు న్నా క్షేమంగా ఉంటే చాలు!' అని తీర్మానించుకుని భారమైన మనసుతో ఓ అనాథాశ్రమం వాకిట్లో బాబుని వదిలేసి వచ్చేశాడు భాస్కర్.

తన కొడుకును వదిలేసి ఆ ఊళ్లో ఉండటం ఇష్టంలేక బొంబాయికి వెళ్ళిపోయాడు భాస్కర్ సతీసమేతంగా.. కాలగమనంలో గతం అపుడప్పుడూ గుర్తుకొచ్చినా, ఉద్యోగరీత్యా అన్నీ కనుమరుగైపోయాయి భాస్కర్‌కు. చిన్న కొడుకు శ్రీధర్ బాగా చదివి మంచి ఉద్యోగంలో ఉన్నాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కోడలు మంచి పిల్లే కానీ ఈ తరానికి చెందింది. తను చెప్పినట్లు అంతా నడుచుకోవాలనుకునే రకం. ఉద్యోగం చేస్తోంది. శ్రీధర్ ఆమె కీ ఇస్తే ఆడే బొమ్మ. ఎవర్నని ఏం లాభం? నోరెత్తక చెప్పినట్లు వింటూ కాలం గడిపితే సరి అని భాస్కర్ మౌనంగా ఉండేవాడు.

జానకి అపుడపుడు కోడలిపై నోరు పారేసుకున్నా, మాధవి నిర్లక్ష్యంగా నడుచుకునేది. పెద్దవాళ్ళిద్దరికీ ఓ గది కేటాయించి, అక్కడే అన్ని ఏర్పాట్లూ చేసి, గది దాటి బయటకు రాకుండా కట్టుదిట్టం చేసింది కోడలు. కొద్దిరోజులకే మానసిక క్షోభతో భాస్కర్ చనిపోయాడు. దాంతో జానకి పరిస్థితి మరింత దిగజారిపోయింది.

జీతంలేని పనిమనిషిలా ఆ ఇంట్లో ఉండాల్సి వచ్చింది. భర్త ఉన్నప్పుడే కాస్త నయం. ఆయన పోగానే కొడుకు, కోడలు తననసలు పట్టించుకోవడం లేదు. ఏం చేస్తున్నారో..? చెప్పరు. అడిగితే అది మీ కనవసరం.. అని కోడలు కసిరేది. ఇక తను ఏం మాట్లాడగలదు? మౌనమే శరణ్యంగా మూగదానిలా ఉండిపోయింది.

రెండేళ్లు కూడా నిండని సవతికొడుకును నిర్లక్ష్యం చేసి నిరసనగా చూసింది గుర్తుకొచ్చింది జానకికి. అందుకే భగవంతుడు తనకీ శిక్ష విధించాడు కాబోలు.. ఆ తల్లి శాపమే తన కొడుకు, కోడలు రూపంలో పగ సాధిస్తున్నట్లున్నది అని బాధపడేది. అనుభవించక తప్పదు కనీసం ఇంట్లోంచి బయటికి గెంటకుండా ఉన్నారు అది చాలు! అని తృప్తిపడేది పాపం జానకి.

ఎదురుచూస్తున్న అమెరికా జాబ్ దొరికింది శ్రీధర్‌కి. ఇక కొడుకు, కోడలిద్దరికీ భూమి మీద కాలు ఆనడం లేదు. త్వరలో వెళ్లిపోవాలని ప్రయాణ సన్నాహాలు మొదలుపెట్టారు. ఇంటిని అద్దెకిచ్చే ఏర్పాట్లు చేసేశారు. జానకికి లోలోపల చిన్న ఆశ తనని కూడా తీసుకువెళతారేమోనని.. 'అమెరికాలో ఎవరి పనులు వాళ్లే చేసుకోవాలి. ఇద్దరూ ఉద్యోగానికి వెళితే, మనవరాలిని చూసుకోడానికి, ఇంటి పనులు చేయడానికి తను కావాలి. అందుకోసమైనా పిలుచుకు వెళ్లాల్సిందే!' అని అనుకుంది.

ఓ వారం రోజుల క్రితమే తెలిసింది. తనను అనాథాశ్రమంలో చేర్పించే ప్రయత్నంలో ఉన్నారని.. నిలదీసి అడిగితేనేమో



“ఒంటరిగా ఉంటావు. ఈ ఇల్లు నాది. నీకంటూ ఏముంది? నిన్ను మాతో తీసుకువెళ్లలేం. మేము ఇండియా తిరిగి వచ్చేది కష్టం. అందుకే ఈ ఏర్పాట్లు. పాపని డే కేర్ సెంటర్‌లో వేస్తాం. అక్కడ మాకేం లోటు రాదు. అయినా అక్కడి వాతావరణం నీకు పడదు. చూసుకోవడం నావల్ల కాదు. అందుకే ఈ ఏర్పాట్లు చేస్తున్నాం.

ఆశ్రమానికి కొంత డబ్బు విరాళంగా ఇస్తున్నాం. నీకేమయినా అయితే వాళ్లు దగ్గరుండి చూసుకుంటారులే! నీకేం ఇబ్బంది ఉండదు. నిశ్చింతగా తోటివాళ్లతో హాయిగా ఉండవచ్చు" అని కొడుకు, కోడలు అనగానే నిజంగానే మాటలు రాని మూగదై పోయింది జానకి. ఆ పసికందుని ఏడిపించిన పాపమే, నిన్నిలా ఏడిపిస్తోంది అని మనసు దెప్పి పొడుస్తున్నట్లు ఫీలయ్యింది. 'బాబు నువ్వెక్కడున్నావో ఏమో నన్ను క్షమించరా..!' అని మనసులోనే వేడుకుంది.

★ ★ ★

ఆశ్రమానికి వచ్చి దాదాపు నెల రోజులైపోయింది. అక్కడ అందరూ అభిమానంగా పలకరిస్తున్నారు. వాళ్లంతా నిజంగా అనాథలు. తను మాత్రం అందరూ ఉండి అనాథగా ఇక్కడుంది. అందరి మనసుల్లోనూ చెప్పుకోలేని వ్యథలు. పైకి నవ్వుకుంటూ అందరూ కలిసి మెలిసి ఉంటున్నారు. 'భగవంతుడా! నేను చేసిన తప్పుకి శిక్ష అనుభవిస్తున్నాను. క్షమించమని అడిగే అర్హత లేదు. నేను దూరం చేసిన బాబు వచ్చే జన్మలో నాకే పుట్టాలి!' అని మనసులో విలపిస్తూ అందరితో కలిసిపోయింది జానకి.

"సార్!" అంటూ ఆశ్రమంలోకి అడుగుపెట్టారు ఓ జంట.

"ఎవరు కావాలి..? "

"ఆశ్రమ మేనేజర్‌ని కలవాలి. ప్లీజ్" అనగానే-

"రండి లోపలికి.." అని పిలుచుకు వెళ్లి పరిచయం చేశాడు ఒక వ్యక్తి.

"సార్! మేమిద్దరం అనాథాశ్రమంలో పెరిగి, చదివి, ప్రేమించి, పెళ్లి చేసుకున్నాం. ఇప్పుడు ఉద్యోగరీత్యా ఇక్కడికి వచ్చాం. మా ఇద్దరికి అమ్మా నాన్నల ప్రేమానురాగాలు తెలియవు. అమ్మ ఒడిని చూడని మాకు ఓ చిన్న ఆశ..! మాకో అమ్మ కావాలి! ఆవిడ నీడలో, మేమూ, మా పిల్లలు జీవితాన్ని సాగించాలి. పెద్దలున్న ఇంట పిల్లలు పెరిగితే క్రమశిక్షణ అలవడుతుందన్నది మా నమ్మకం. ఎవరూ లేని అనాథలకి ఆశ్రయమిచ్చే మీదగ్గర్నుంచి ఓ అమ్మని పిలుచుకు వెళ్లాలని వచ్చాం. దయచేసి మాకా సహాయం చేయండి. ఆవిడ బాధ్యత చివరి దాకా మేము వహిస్తామని రాతపూర్వకంగా రాసిస్తాం. ఎవరైనా మాతో రావడానికి సమ్మతిస్తే పంపండి ప్లీజ్!"

వాళ్ళని ఒక్క క్షణం మేనేజర్ ఆశ్చర్యంగా చూసాడు. 'సాధారణంగా పిల్లలు లేనివాళ్లు అనాథాశ్రమం నుంచి పిల్లల్ని దత్తత తీసుకుంటారు. వీళ్లేమో అమ్మ కావాలి అని అడుగుతున్నారు. ఈ మధ్య చేరిన జానకి అందరికంటే వయసులో చిన్నది. అడిగి చూద్దాం సరేనంటే పంపిద్దాం. లేదంటే వీలు కాదందాం' అని ఆలోచిస్తూ లోపలికెళ్లాడు. జానకికి విషయం చెప్పగానే ఏం బదులివ్వాలో..? అర్థం కాలేదు జానకికి.

'కన్న కొడుకే అనాథనని చెప్పి ఇక్కడ వదిలి వెళ్లిపోయాడు. ఈ అనాథకి ఆశ్రయం ఇస్తానంటూ ఓ అనాథ జంట ముందుకు వస్తోంది. వాళ్లకు సేవలు చేస్తూ అయినా పాప పరిహారం వెతుక్కుంటాను' అని మనసులో అనుకుని "సార్! వాళ్లు సరేనంటే నాకే అభ్యంతరం లేదు" అనేసింది.

జానకిని వాళ్లిద్దరికీ పరిచయం చేసాడు మేనేజరు. ఆ ఇద్దరూ సరేనన్నారు. ఫార్మాలిటీస్ ముగించుకుని జానకితో కలిసి కారులో బయలుదేరారు ఆ దంపతులు.

కార్లో కూర్చున్న జానకికి తను వెళ్తున్నది, ఆనాడు పసికందుగా ఇంట్లోంచి వెళ్లగొట్టిన బాబు ఇంటికే అని తెలియదు. కారు నడుపుతున్న బాబుకి తను పిలుచుకు వెళ్తున్నది తన సవతి తల్లినే అని తెలియదు. ఇద్దరి మనసులు తృప్తిగా ఉన్నాయా క్షణంలో.. అమ్మా! అంటూ ఆ ఇద్దరూ పిలుస్తూంటే, చెప్పనంత హాయిగా ఉంది జానకికి. కారు వేగంతోపాటు అందరి మనసులు సంతోషంగా పయనించసాగాయి. V

మలయాళ కథ

- కమలాదాస్

గూళ్ళు

గదిలో మాట సద్దు తారాస్థాయికి చేరింది. అయితే ఆమె అదేది గమనించకుండా ఎక్కడో బయటకు చూస్తూ కూర్చుంది. మధ్యాహ్నాలప్పుడు వాళ్ళంతా విశ్రాంతి కోసం ఆ చీకటి గదిలో చేరేవారు. ఆ గది బయట కర్ర ఊచలున్న వరండా ఉంది. దాన్ని వరండా అని చెప్పలేం. అదీ ఒక విధంగా గదిలా ఉంది. ఆ దారిన తిరిగే జనానికి బాగా కనిపించటానికి వరండాను ఇలా గూళ్ళలా నిర్మించారు. గోడకు మేకు కొట్టి అక్కడ దీపాలను వెలిగించి తగిలించేవారు. తెల్లటి రంగు ప్రతిఫలింపజేసే అట్టహాసపు వెలుగులో బయట తిరిగేవారికి, ట్రాములలో ప్రయాణించేవారందరికీ ఇక్కడ ఉన్నవారు స్పష్టంగా కనిపిస్తారు.

★ ★ ★

"లక్ష్మీ, నువ్వు నీ నిద్రమబ్బును వొదుల్చుకుని కొంచెం దీన్ని చదివి చెప్పు" అని అమ్మ కూర్చున్న చోటునుంచే కేక పెట్టింది.

★ ★ ★

'అమ్మ' అని పిలుస్తారు గానీ ఆమె తల్లి కాదు. అంతేకాదు, ఆమె అక్కడున్నవారెవరికీ తల్లికాదు. అయితే అందరూ ఆమెను అమ్మ అనే పిలుస్తారు. స్థూలకాయంతో, కారునలుపుతో, ఎడమకంటికి కాస్త మెల్ల ఉండి, తుప్పుపట్టిన మేకుల రంగులా ఉన్న దంతాలతో ఉన్న ఈ అమ్మకూ ఒక కొడుకున్నాడు. అయితే వాడు పన్నెండేళ్ళు నిండుతుండగానే అమ్మను వొదిలి దూరంగా వెళ్ళిపోయాడు. సుమారు పది పన్నెండేళ్ళ తరవాత అమ్మకు వాడి నుంచి ఉత్తరాలు రాసాగాయి. గీతల కాగితం మీద గుండ్రటి అక్షరాలతో రాసిన అందమైన ఉత్తరాలు!

లక్ష్మి నెమ్మదిగా ఉత్తరాన్ని చదవటం మొదలుపెట్టేది.

తనకే ఈ ఉత్తరం వచ్చివుంటే ఎంత బాగుండేదనిపించేది లక్ష్మికి. ఆమెకు ఉత్తరం రాయటానికి ఎవరూ లేరు. ఆమె తల్లి ఆమెను ఈ అమ్మకు అమ్మేసింది. అయితే తమ్ముణ్ణి అమ్మలేదు. ఎందుకంటే వాడు మగవాడు! కన్నతల్లిని గురించి లక్ష్మి ఎక్కువగా ఆలోచించేది కాదు. అందుకు ఆమెను డబ్బుపెట్టి కొన్న ఈ తల్లి చెప్పిన కారణం సమంజసంగా తోచింది.

"లక్ష్మీ, ఇప్పుడు నేనే నీ తల్లిని. మీ అమ్మకు నీ పట్ల కొంచమైనా ప్రేమ ఉంటే ఖచ్చితంగా నిన్ను నాకు అమ్మేది కాదు" అని ఆమె అప్పుడప్పుడు లక్ష్మి జుత్తులో బొద్దుబొద్దుగా ఉన్న తన వేళ్ళనుజొనిపి చిక్కుతీస్తూ అనేది.

"నీ జుత్తు చాలా సొంపుగా పొడుగ్గా ఉంది. నేను నీకు బ్రాహ్మి తైలాన్ని తెప్పించి పెడతాను. అప్పుడు నీ జుత్తు ఇంకా బాగా పెరుగుతుంది.." అంటూ అనేక విధాలుగా ప్రేమ కురిపించినా లక్ష్మికి ఆమె మీద ప్రేమ పుట్టేది కాదు. ఈ జీవితంలో ఆమె ఇష్టపడినది, ప్రేమతో చూసింది సీతను మాత్రమే. సీత గుర్తు రాగానే ఆమె ఆలోచనల్లో కూరుకుపో

యింది లక్ష్మి.

పాపం సీత! తనలా చిన్నప్పుడే ఇక్కడికి చేరాల్సి వచ్చింది. అమ్మ ఆమెకు పచ్చ రంగు మాత్రలను, ఉలవలు ఉడికించి వడబోసిన నీటిని చాలాసార్లు ఇచ్చింది. అయినా ఆమె ముఖం పేలవంగా ఉండేది, శరీరపు రంగు పచ్చగా ఉండేది.

"నిన్ను ఊసరవెల్లి కనివుండాలి" అని అమ్మ అప్పుడప్పుడు వెక్కిరించేటప్పుడు ఆమె తల వొంచుకుని నవ్వేది.

సీత పొడుగు లంగా వేసుకున్నప్పుడు మరింత అందంగా కనిపించేది. కండ లేని ఆమె పొడుగైన కాళ్ళు, పసిమి రంగులోని గుండ్రటి మోకాళ్ళు లంగా ధరించినపుడు బయటికి కనిపించేవి కాదు.

సీత, నేను ఇద్దరం ఒకే చోట పడుకునే వాళ్ళం. రాత్రి అయితే ఇద్దరికీ ఏ పని ఉండేది కాదు. ఆ కాలమూ బాగుండేది. మధ్యాహ్నపు వేళలో ఆయాసంతో తూగుతూ కూర్చోవలసిన అవసరం ఉండేది కాదు. చిరిగిపోయిన జాకెట్టును కుట్టుకోవలసిన పని లేదు. నేను, సీత పక్కనున్న స్కూలుకు వెళ్ళే వాళ్ళం. సాయంత్రం ఇంటికి రాగానే ఇద్దరికీ తాగటానికి అమ్మ పాలు ఇచ్చేది.

"అంతా తాగాలి. పది పన్నెండేళ్ళ కోడి పిల్లల్లా ఉన్నారు కదా!" అని అమ్మ ప్రేమగా కసురుకునేది.

"పదేళ్ళప్పుడు నేను ఎలా ఉండేదాన్నో తెలుసా? మీకు రెండింతలు ఉండేదాన్ని, నునుపుదేరిన దేహంతో అందంగా ఉండేదాన్ని. ఇన్‌స్పెక్టర్ అనేవారు, "శారదా, నిన్ను చూడటానికి రెండు కళ్ళు చాలవు. ఆడదంటే నువ్వే అనేవారు" అంటూ అమ్మ చెప్పే సంగతులను తాము నోళ్ళు వెళ్ళబెట్టుకుని వినేవారు.

సీత ఒకసారి నా దగ్గర రహస్యంగా "ఈ ఇన్‌స్పెక్టర్ ఉన్నారే, ఆయనే అమ్మ కొడుక్కు తండ్రి" అని చెప్పింది.

ఇవన్నీ సీత తలుపుచాటు నుంచి లేదా తలుపు సందుల్లోంచి విన్న విషయాలు. సీత చాలా సన్నగా ఉండటం వల్ల ఆమె ఇదంతా అవలీలగా చేసేది. ఒకసారి లక్ష్మి, అమ్మ మంచం కింద కూర్చుని తూగుతోంది.

"లక్ష్మీ, ఎందుకిలా కూర్చుని నిద్రలో తూగుతున్నావు. లేచి వెళ్ళు" అంటూ అమ్మ కంఠం విన్నప్పుడు కోడెలు బురదలో అటూ ఇటూ కదులుతున్న సద్దు గుర్తుకొస్తోందని సీత అనేది. సీత ఆ విషయాన్ని లక్ష్మి చెవిలో చెప్పి కిలకిలా నవ్వేది. ఆమె అలా నవ్వినప్పుడు ఆమె నోటి వెంట పొగాకు వాసన గుప్పుమనేది.

సీత చిన్న వయస్సు నుంచే పొగాకు నమలటం అలవాటు చేసుకుంది. అమ్మ మంచం కింద పెట్టిన ఇత్తడి కంచంలో ఎప్పుడూ పొగాకు ఉండేది. సీత దాన్ని అరచేతిలో పెట్టుకుని దానికి కొంచెం సున్నం కలిపి వేలితో బాగా రుద్ది కలిపి చివరికి దవడలో పెట్టుకునేది. నన్నూ పొగాకు నమలమని సీత వొత్తిడి పెట్టేది. అయితే నేను ఇప్పటిదాకా దాన్ని వాడనే లేదు. సీత పళ్ళన్నీ గారపట్టాయి. దానికి ముఖ్య కారణం పొగాకు. ఆ విషయం నేను చెబితే ఆమె కోప్పడేది. పళ్ళు పాడైనందువల్లే తాను పొగాకు వాడుతున్నానని సమర్థించుకునేది.

సీతకు అనేక రకాల జబ్బులు ఉండేవి. అందుకేనేమో ఆమె శరీరపు రంగు పచ్చగా ఉండేది. ఆమె పోయాక అమ్మ అదే విషయాన్ని చెప్పేది. ఆమె ఏ జబ్బుతో చచ్చిపోయిందో నాకు గుర్తు లేదు. ఆమె చాప మీద చేతినాన్చి లేచి కూర్చుని విచిత్రంగా సద్దు చేస్తూ వాంతి చేసుకోవటం గుర్తుచేసుకుంటే నా మనసంతా ఆర్ద్రతతో నిండిపోతుంది. సీత మరణించటానికి ముందు రోజైతే నా మనస్సులోంచి చెరిగిపోదు. సాయంత్రం



స్నానం ముగించి, పౌడర్ కోసం ఆమె గదికి వెళ్ళాను. అప్పుడు ఆ మంత్రగత్తె ముసలిది కూర్చుని ఉంది. 'మంత్రగత్తె' అని ఆమెను పిలవటానికి లేదు. ఆమె ఏ సమయంలో వచ్చినా అమ్మ ఆమెను పక్క లోనే కూర్చోబెట్టుకుని చాయ్ ఇచ్చి పొగాకు ఇచ్చి "సింధమ్మా, ఎంత కాలం తర్వాత వచ్చారు... ఏవైనా ముఖ్యమైన సంగతులు ఉంటే చెప్పండి..." అనేది.

సీతకు ఆ ముసలిదాన్ని చూస్తే ఏ మాత్రం పడేది కాదు. ఆమె ఒక మంత్రగత్తె అని చెప్పేది. కారణం ఆ ముసలిది వచ్చి వెళ్ళిన మరుసటి రోజున ఎవరో ఒకరు ఏదో ఒక జబ్బు పడేవారు. మూసిన తలుపుల వెనుక కనీసం ఒకరైనా బాధపడుతూ, మూల్గుతూ వుండేవారు.

అనువాదం :
రంగనాథ రామచంద్రరావు

గోరింటను రుబ్బి ఉండచేసి ఒక బాటిల్ మంచి నూనెను పట్టుకుని ముసలిది సీత గదిలోకి ప్రవేశించటం చూడగానే సీత జబ్బు తీవ్రమైందని నాకు స్పష్టమైపోయింది. మరుసటిరోజు తనకు మెలుకువ వచ్చినప్పుడు సీత రోదన, మూల్గులు వినిపిస్తున్నాయి.

మొదటి బస్సు ఆ దార్లో వెళ్ళినపుడే నాకు మెలుకువ వచ్చింది. పాలవాళ్ళ సైకిల్ సద్దు, కాకుల అనుమానపు ఏడ్పు, అమ్మ గడుసు ధ్వని, వంటింట్లో మండుతున్న పాత స్టౌ చేస్తున్న కర్కశ ధ్వనులన్నిటినీ వింటూ నేను పక్కకు తిరిగాను. అప్పటికీ సీత ఏడ్పు వినిపిస్తూ ఉంది. నేను వెళ్ళి చూసినపుడు సీత గది తలుపు మూసి ఉంది. లోపలినుంచి సింధమ్మ మాటలు వినిపిస్తున్నాయి. నాకు అప్పుడు తల తిరిగినట్టయి కళ్ళుబైర్లు కమ్మాయి. వంటింటి వైపు వెళ్లాను. అక్కడ సుందరమ్మ పాలు కాస్తోంది.

"సుందరమ్మా, ఎందుకు ఇంత పొద్దున్నే లేచి వచ్చారు? " నా ప్రశ్నకు ఆమె సమాధానం ఇవ్వలేదు.

బహుశా పక్క గదిలో కూర్చుని చాయ్ తాగుతున్న అమ్మ వింటే... అనే భయం వల్ల కావచ్చు. అమ్మను చూస్తే ఎందుకో అందరికీ భయం. అమ్మకు భయపడని ఏకైక వ్యక్తి అందమైన మీరా ఒక్కతే. మీరా ఉండటం వల్ల నా కోసం ఎవరూ రావటం లేదన్న విచారం నాకూ ఉంది. సాయంత్రం వరకు మీరా గదికి ఎవరెవరో వచ్చి వెళ్ళేవారు. మీరా బాగుండే చీరను కట్టేది కాదు. మిగతావారు అలంకరించుకునేలా ఆమె చిరుగు ఉన్న చీర కట్టటం కానీ, ముఖానికి రంగు వేయటం కానీ చేసేది కాదు. అయినా వచ్చి వారందరికీ మీరాను చూస్తే ఎక్కువ ప్రేమ. అమ్మ ఆమెను మధ్యాహ్నపు భోజనం తరువాత నిద్రపోమని బలవంతంచేసేది.

ఉదయం అందరిలా ఆమె చాయ్ తాగటానికి వరండాలోకి వచ్చేదికాదు. స్నానానికి వేడినీళ్ళే కావాలి. అన్ని అనుకూలతలు ఉన్నా మీరాకు ఈ ఇల్లు నచ్చలేదు. అందుకే కాబోలు మీరా బొద్దుగా మెలితిరిగిన మీసాల యువకుడితో పారిపోయింది. అతడ్ని చూస్తే అమ్మకు పడేది కాదు. అతడు వచ్చినప్పుడల్లా మీరాతో గంటల కొద్దీ కబుర్లు చెప్పేవాడు. అది అమ్మకు నచ్చేది కాదు. గది గోడలు పల్చగా ఉండటం వల్ల వాళ్ల మాటలన్నీ వినిపించేవి కానీ అర్థమయ్యేవి కావు.

"ఏమిటి అతను అంత సేపు మాట్లాడుతాడు? " అని అమ్మ మీరాను అడిగినా ఆమె సమాధానం ఇచ్చేదికాదు. బదులుగా నవ్వుతూ పడుకోవటానికి తన గదిలోకి వెళ్ళిపోయేది.

మీరా పారిపోయాక అమ్మకు పిచ్చిపట్టి

నట్టయ్యింది. రాత్రీపగలూ కోపంతో బుసలుకొడుతూ ఉండేది. నన్ను, సీతను, అందరినీ నోటికి వచ్చినట్లు తిట్టింది. అమ్మకు కోపం వస్తే అంతే. విచిత్రంగా ప్రవర్తించేది. అప్పుడు ఆమె ముఖం వికారంగా తయారయ్యేది. పళ్ళతో పెదాలను కరిచి పట్టుకుని తీక్షణంగా చూస్తూ అందరి దగ్గరికి వెళ్ళి కోపంతో తిట్టేది. ఆమె హడావుడికి పక్కింటివారూ పరుగెత్తుకు వచ్చి కిటికీ ఊచల మధ్య తలదూర్చి తొంగి చూసేవారు.

"అక్కగారూ! ఎందుకలా కేకలేస్తారు? కాస్సేపు పడుకోండి. మనస్సు చల్లబడ్డాక అంతా సరి అవుతుంది" అని పక్కింటివారు నచ్చజెప్పేవారు. అప్పుడు అమ్మ కోపం రెట్టింపయ్యేది.

"నాకు బుద్ధి చెప్పటానికి ఎవరూ రాకండి. మీ మీ పనులు చూసుకుని వెళ్ళిపోండి..." అని అమ్మ అరిచేది.

అంతేకాకుండా అమ్మకు పక్కింటివారి మీద కోపం ఉండనే ఉంది. ఈ ఇంట్లో ఉన్న వారందరికీ రోగాలున్నాయని వచ్చే గిరాకీలకి చెప్పి వాళ్ళను మన దగ్గరికి రాకుండా ఈ పక్కింటివాళ్ళు చేస్తున్నారని చెబుతుండేది. ఇలాంటి వార్తలను తెచ్చి అమ్మకు చేరవేయటంలో సింధమ్మ సిద్ధహస్తురాలు. ఆమె ఒక్కసారి వచ్చి వెళితే చాలు అమ్మ శత్రువుల సంఖ్య పెరిగేది.

"చెల్లీ, నీ మనస్సు పరిశుద్ధమైంది. పాపం. నీకు ఇదంతా అర్థంకాదు. వాళ్ళు చెప్పేది వింటే చాలు, వాళ్ళు ఎలాంటి వాళ్ళో అర్థమైపోతుంది. నేను వివరంగా చెబుతాను. అయితే నా పేరు మాత్రం ఎక్కడా ఎత్తకు. సరేనా" అంటూ చాయ్

తాగి, పొగాకుకు సున్నం కలుపుతూ సింధమ్మ మొదలెట్టేది. అలాంటి సమయంలో ఆమెను ఇంటినుంచి బయటికి తోసేయాలనిపించేది. సీత చనిపోయిన తరువాత ఆ భావం అప్పుడప్పుడు వేధించేది. సీత మరణించిన వార్తను తనకు ముందుగా చెప్పింది సింధమ్మే.

ఆ రోజు సీత గదినుంచి బయటికి వచ్చిన సింధమ్మ మెల్లగా ఏదో రహస్యాన్ని చెబుతున్నట్టు, "లక్ష్మీ, అమ్మను పిలువు. మన సీత పోయిందే తల్లీ" అంది. తను వెంటనే సీత గదిలోకి వెళ్ళింది. అయితే చీకటి కమ్ముకున్న గది మూలలో నిశ్చలంగా పడుకునివున్న సీతను చూడలేకపోయింది. తెల్లటి దుప్పటిని చూసినట్టయ్యింది. బయటికి వచ్చి అమ్మను పిలిచింది. సీత గురించి ఆలోచించింది.

బయట పట్టాల మీద పొడవైన ట్రాము సాగిపోతోంది. మధ్యాహ్నంలో తెల్లటి రంగు ఆకాశం తన కళ్ళను బాధపెట్టింది. తెల్లటి రంగు గోడలా ఉంది ఆకాశం అని ఒకసారి సీత తన దగ్గర అనటం లక్ష్మి గుర్తు తెచ్చుకుంది. ఇంతలో ఆమె ఆలోచనలను భగ్నంచేస్తూ "పోస్ట్" అనే పోస్ట్‌మేన్ పిలుపు వినిపించింది.

ఒక ఉత్తరాన్ని అతడు కిటికీ ద్వారా లోపలికి వేశాడు. లక్ష్మి దాన్ని తీసుకుని వెళ్ళి అమ్మ కాళ్ళ దగ్గర కూర్చుంది.

★ ★ ★

"మీరంతా కాస్త అటువైపు వెళ్ళండి" అని అమ్మ ఆజ్ఞాపించి, "లక్ష్మీ, నువ్వా నీ నిద్రమబ్బును వొదుల్చుకుని కొంచెం దీన్ని చదివి చెప్పు. మెల్లగా చదువు. నా కొడుకు ఈ మహాపాపాత్మురాలైన తల్లిని చూడటానికి ఎప్పుడు వస్తాడట? కొంచెం తొందరగా చదివిచెప్పు లక్ష్మీ..." అంటూ అమ్మ లక్ష్మిని బతిమిలాడుతున్నట్టు వేడుకుంది.

"ఎల్లప్పుడూ నా మనసులోనే ఉండే అమ్మకు..

నేను నీ ఉత్తరాన్ని చదివి చాలాసేపు ఏడ్చాను. తెలియకుండా ఏదేదో రాసేసానమ్మా. నన్ను క్షమించు. దీపావళికి నాకు సెలవు దొరుకుతుంది. అప్పుడు వచ్చి నిన్ను కలుస్తాను. నువ్వు మహాపాపివని నాకు అనిపించటం లేదమ్మా. ఈ ప్రపంచంలో బతకటానికి ప్రతీ ఒక్కరికీ పని ఉండాలన్న నియమం ఏమీలేదు. నేను పనిచేస్తున్న హోటల్‌కు వస్తున్న అనేక మంది జీవితాలను నేను గమనించాను. సినిమావాళ్లు, నాట్యంచేసి, పాటలు పాడి డబ్బు సంపాదించేవాళ్లు, పాఠశాలల్లో పాఠాలు చెప్పేవారు, జబ్బులు నయం చేసేవారు, బాత్రూంలను శుభ్రంచేసేవారు.. ఇలా చాలామంది మా హోటల్‌కు వస్తారు. అందరికీ అవసరమైనది తినటానికి రొట్టె, పడుకోవటానికి ఇంత స్థలం. అందరూ మనుషులే అమ్మా. ఇదంతా నాకు అర్థం అయ్యేలా చేసిన వ్యక్తి మా హోటల్ యాజమాని కొడుకు. ఆయన చాలా చదివినవాడు. తెలివైనవాడు. నీ గురించి ఆలోచిస్తునప్పుడల్లా నాకు సిగ్గువేస్తోందని రాసేసానమ్మా.. నన్ను క్షమించమ్మా... నేనే మహాపాపాత్ముడినమ్మా..

ఇట్లు

నీ కుమారుడు"

లక్ష్మి ఉత్తరాన్ని చదవడం పూర్తి చేసిన వెంటనే అమ్మ ముఖం కళకళలాడింది.

"చూడు లక్ష్మీ, నా కొడుకు ఏం రాశాడో..." అంటూ అమ్మ తన ఎదమీది చీర చెరుగును తీసి ముక్కు చీది, "వాడికి ఇప్పుడు ఎంత జ్ఞానం వచ్చింది..." అంది.

అమ్మ కళ్ళ నుంచి కన్నీళ్ళు బొటబొటా కారాయి. ఆమె ఏడ్పు ముఖాన్ని లక్ష్మి చూడలేకపోయింది.

కళ్ళు తిప్పుకుని ఎక్కడో వీధి వైపు చూడసాగింది విశాలమైన శుభ్రమైన ఆకాశపు తెల్లనిరంగు ఆమె కళ్ళను పొడిచి నొప్పించింది. V

తెలుగు కథ

- రాధ మండువ

మాన్యత

అమ్మని దహనం చేసి వచ్చాక నాన్న, నేను నట్టింట్లో ఉన్న ఉయ్యాల బల్లమీద పడుకుని ఉన్నాం. పెద్దక్కయ్య వంటింట్లో నాయనమ్మకి సహాయం చేస్తోంది. తాత మూలన ఉన్న నులకమంచం మీద పడుకుని ఉన్నాడు. తమ్ముడు తాత పక్కన కూర్చుని ఉన్నాడు. చిన్నక్క మేము పడుకున్న ఉయ్యాల బల్ల పక్కనే కూర్చుని చెల్లికి జడలు వేస్తోంది.

ఇప్పటి దాకా మేం ఏడవడం చూసింది చాలలేదేమో ఇళ్ళకి పోయి భోజనాలు చేసి మళ్ళీ వచ్చారు ఊళ్ళోని నలుగురైదుగురు. పడుకున్న నాన్న, తాత లేచి కూర్చున్నారు. అందరూ తాత మంచం మీద కూర్చున్నారు. రేపు చిన్న దినం ఎలా చేయాలో, ఎవరెవరికి కబురు పంపాలో..? మాట్లాడుతున్నారు. ఉచిత సలహాలు చెప్తున్నారు. వాళ్ళని చూస్తే నాకు మండిపోతోంది. వాళ్ళ నోళ్ళు 'పాపం' అంటున్నాయి. కానీ వారి కళ్ళలో మాత్రం సంతోషం.

నిన్నగాక మొన్న మా పొలం గట్లను దున్ని తన చేలో కలపుకున్న చలమడూ, ఆడపిల్లలు పెద్దవాళ్ళయ్యారని నీళ్ళు పోసుకోవడానికి దొడ్లో తడికలు అడ్డం పెట్టుకుంటుంటే 'నీళ్ళు మా ఇంటివైపుకి రానీయబాకండి, వాటం అటు పెట్టండి' అంటూ కట్టినంతసేపూ అక్కడే కాపలాగా నిలబడ్డ పక్కింటి రామడూ- వీళ్ళా సలహాలు ఇచ్చేది. ఇక నేను ఊరుకోలేకపోయాను.

"అబ్బబ్బ! అరవబాకండి. మా అమ్మ ఇక్కడే ఉంది. ఇదిగో నా దగ్గర ఉంది. అరవకుండా అందరూ లేచి వెళతారా వెళ్ళరా? " అని అరిచాను వాళ్లని కోపంగా చూస్తూ. వాళ్ళు నా మాటలకు ఏం జవాబు చెప్పాలో అర్థం కానట్టు మా తాత వైపు, నాన్న వైపు చూశారు. నేను చూసిన చూపులో వాళ్ళ మీద నాకున్న అసహ్యాన్ని కనిపెట్టాడు తాత.

"ఏదో చిన్నపిల్ల.. నిద్రలో అమ్మ గుర్తొచ్చినట్టుంది. మళ్ళీ మాట్లాడుకుందాం. ఏమైనా కావాలంటే అడుగుతాంలే రామయ్యా!" అని వాళ్ళని పంపించాడు తాత.

అప్పుడు నాకు పదిహేనేళ్ళు. ఎవరికళ్ళల్లోనైనా అసూయ కనబడిందంటే మనం బాగున్నట్లు. సంతోషం కనబడిందంటే మనం కష్టాల్లో ఉన్నట్లు అని ఆ వయసులోనే నాకర్థమయింది. అప్పుడే, ఆ క్షణమే నిర్ణయించుకున్నాను. ప్రతివాడి కళ్ళల్లో నేనన్నా, నా కుటుంబం అన్నా అసూయ కనబడాలి. దానికోసం ఏమైనా చేస్తాను, ఎంత కష్టమైనా భరిస్తాను.

★ ★ ★

చదువుకుంటాను గానీ గొప్పగా చదవాలని పెద్ద ఆసక్తి ఏమీ ఉండేది కాదు నాకు ఇంతకుముందు. ఇప్పుడు ఎలాగైనా పదో తరగతిలో స్టేట్ ఫస్ట్ రావాలి. అందరి కళ్ళల్లో అసూయని చూడాలి. అంతే- రాత్రింబవళ్ళూ మరో ధ్యాస లేకుండా చదువుకుంటున్నాను. నాన్న ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. కుటుంబ భారమంతా

తాతమీద పడింది. ఊళ్ళో వాళ్ళ కళ్ళల్లోని సంతోషాన్ని భరించలేక నాన్న మీద అసహ్యం కలిగింది. మంచంలో దిగులుగా కూలబడిపోయిన తాతకి నేనే ధైర్యం చెప్పాను. పెద్ద నాపసానిగా మాట్లాడుతున్న నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. నా కళ్ళలో ఉన్న పట్టుదలని తదేకంగా చూశాడు తాత. ఎక్కడనుండి వచ్చిందో తాతకు అంత ధైర్యం- ఒక్క ఊపున మంచం మీద నుండి లేచి "ఎంత కష్టం చేసైనా నిన్ను చదివిస్తాను మాన్యతా!" అన్నాడు తాత.

నేను పదో తరగతిలో స్టేట్ ఫస్టు వచ్చాను. అందరి కళ్ళలో అసూయ. నా మనసు మొదటిసారిగా గర్వంతో ఉయ్యాలలూగింది. "ఇదే కావాలి నాకు. దీనికోసం ఏమైనా చేస్తాను" అని మనసులో అనుకున్నాను గట్టిగా.

మా ఊళ్ళో చాలా మంది పదవ తరగతి ఫెయిల్ అయ్యారు. అందరూ ఫెయిల్ అయిన సబ్జెక్ట్‌ల్లో డౌట్లు ఉన్నాయని చెప్పమని అడుగుతున్నారు. ఊరికే ఎందుకు చెప్పాలి? "ప్రైవేట్ చెప్తాను ఫీజు ఇస్తేనే" అన్నాను. ఆ సెలవుల్లో ఫెయిల్ అయిన వాళ్ళేకాక చాలామంది నా దగ్గరికి ట్యూషన్‌కి వచ్చారు. అందరి దగ్గరా ఫీజులు వసూలు చేశాను. అలా నా సంపాదనతో పాటు తాత మరికొంత డబ్బు వేసి నా కాలేజీ ఫీజు కట్టాడు.

★ ★ ★

ఊళ్ళో వాళ్ల కళ్ళల్లో బాగా చదువుతానని అసూయ కనబడుతుంది కానీ బట్టలను చూసి వ్యంగ్యంగా "ఇదేమిటే మాన్యా! మీ తాత కాలేజీకి పోయే పిల్లకి మంచి బట్టలు కూడా కొనియ్యలేకపోతే ఎట్టా..? " అని సాగదీస్తూ అడుగుతుంటే కోపం వస్తోంది. ఇంట్లో పరిస్థితులు నాకు మంచి బట్టలు కొనిచ్చే విధంగా లేవని నాకు తెలుసు. ఎలాగైనా సంపాదించాలి. కాలేజీలో మా సెక్షన్‌లో చదివే పిల్లల గురించి ఆరా తీశాను. ఎవరు మొద్దులో- ఆ మొద్దుల్లో కూడా ఎవరు బాగా డబ్బున్న వాళ్ళో కనిపెట్టి వాళ్ళతో స్నేహం చేయసాగాను. ఈ సారి డౌట్‌లు తీర్చినా, రికార్డులు రాసిపెట్టినా డబ్బు అడగకుండా డ్రస్‌లు గిఫ్టుగా ఇవ్వమని చెప్పాను. వాళ్ళ ఇళ్ళకు వెళ్ళినపుడు వాళ్ళమ్మలకి వంటింట్లో సహాయం చేసి వాళ్ళ అభిమానాన్ని చూరగొన్నాను. వీలైనంతవరకూ వాళ్ల ఇళ్ళల్లోనే భోజనాలు తినేదాన్ని. అలా భోంచేస్తున్నప్పుడు నాకో ఆలోచన వచ్చింది.

"మా ఇంట్లో మేము పచ్చళ్ళు, పొడులూ, వడియాలు పెట్టి అమ్ముతాం ఆంటీ. తెచ్చివ్వనా? " అన్నాను ఓసారి మా స్నేహితురాలి అమ్మతో.

అలా ఎవర్ని అడిగినా "అలాగే మాన్యా. తప్పకుండా తీసుకురా" అన్నారు.

"చాలామంది అడుగుతున్నారండీ. అంత పెద్దమొత్తంలో పెట్టాలంటే కొంచెం అడ్వాన్స్ కావాలి ప్లీజ్" అన్నాను తెలివిగా. అందరూ అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఇంట్లో ఏడవ తరగతి వరకూ చదివి మానేసిన పెద్దక్క, పదవ తరగతి ఫెయిల్ అయి ఇక చదవను అన్ని కూర్చున్న చిన్నక్కల సహాయంతో నాన్నమ్మ వ్యాపారం మొదలుపెట్టింది. వాళ్ళు పెట్టిన పచ్చళ్ళు నా స్నేహితుల తల్లులకే కాదు, వాళ్ళ స్నేహితులూ, ఇంకా వాళ్ళ ఇంటి చుట్టుపక్కల వాళ్లకు బాగా నచ్చి వాళ్ళూ కొంటున్నారు. మా లెక్చరర్స్‌కి చెప్పొచ్చు కానీ వాళ్ళు డబ్బులు ఇవ్వకపోతే అడగలేం కదా! అనుకుని వాళ్ళకి చెప్పలేదు.

మాకు ఉండటానికి ఐదు ఎకరాలు పొలం ఉంది కానీ ఏం వేసినా నష్టమే వస్తోంది. దాంతో తాత దిగులు పడసాగాడు. మా ఊళ్ళో భవానీ అనే వ్యక్తి వ్యవసాయం గురించి బాగా తెలిసినవాడు. ఏ కాలంలో ఏ పంటలు వేస్తే లాభమో అతనికి బాగా తెలుసు. "భవానీ ఏం పంటలు

వేస్తే నువ్వూ అవే వెయ్ తాతా మన పొలంలో" అని తాతకు చెప్పాను. భవానీ దగ్గర పనిచేసే వెంకటేశు గాడికి పచ్చళ్ళూ, సంగటీ పెట్టి మంచి చేసుకున్నాం. భవానీ పొలంలో ఏం వేయబోతున్నాడో..? రాబట్టేదాన్ని. తరువాత తాతా, నేను మాట్లాడుకుని ఆ పంటలే వేసేవాళ్ళం.

ఇంటర్‌లో కాలేజీ ఫస్ట్ వచ్చాను. డిగ్రీలో చేరడానికి ఇప్పుడు నాకు డబ్బు ఇబ్బందేమీ లేదు. పచ్చళ్ళు బాగా పోతున్నాయి. షాపుల నుంచి, హోటళ్ళ నుంచి ఆర్డర్స్ సంపాదించాను. ఒక్కోసారి పెళ్ళిళ్లకి కూడా సప్లై చేస్తున్నాము. తాతకి పొలంలో ఆదాయం బాగానే వస్తోంది. తమ్ముడు నాలాగే పట్టుదల కలిగినవాడు. పదోతరగతికి వచ్చాడు. వాడి సహాయంతో ఇంకా ఎక్కువమందికి ప్రైవేట్లు చెప్తున్నాను. కాలేజీకి వెళ్ళి రావడానికి, పచ్చళ్ళ ఆర్డర్లకోసం స్కూటీ కొనుక్కున్నాను.

నేను చాలా అందంగా ఉంటాను. నా అందానికి మెరుగులు దిద్దుకొని డిగ్రీలో అడుగుపెట్టాను. ఇక్కడ నా అందమే నాకు ప్లస్ పాయింట్ అని నాకు తెలుసు. మగపిల్లలతో స్నేహంగా మాట్లాడడం అలవాటు చేసుకున్నాను. ఇక ఆడపిల్లలతో ఎవరికేం కావాలో..? తెలుసుకుని వాళ్ళకు తగ్గట్లుగా మాట్లాడతాను. ఒక స్థిరమైన అభిప్రాయాన్ని ఏర్పరుచుకొని దాన్నే పట్టుకుని వేళ్ళాడటం కాదు నాకు కావాల్సింది. నాకు కావాల్సింది ఉన్నతంగా బతకడం. డబ్బుకోసం నా కుటుంబం ఇబ్బంది పడకూడదు- అంతే- 'అదే నాకు కావాల్సింది. దానికోసం నేనేమైనా చేస్తాను' అని మరోసారి మనసులో గట్టిగా అనుకున్నాను.

సాగర్ గాడు ఈ మధ్య నాతో అదో రకంగా మాట్లాడుతున్నాడు. వీడు నామీద ప్రేమ పెంచుకుంటున్నట్లున్నాడు. ఇక రెండు మూడు రోజుల్లో నాకు "నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్తాడని వాడి కళ్ళు చూసి గ్రహించి సాగర్ గురించి ఎంక్వయిరీ మొదలుపెట్టాను. నా అన్వేషణలో సాగర్ పల్లెటూరు నుండి వచ్చాడని, అతనికి ఇద్దరు అన్నలని, ఉన్న పొలాన్ని పంచుకుంటే వీడికి ఐదు ఎకరాలు కూడా రాదని, వీడి చదువూ అంతంత మాత్రమేనని తెలిసింది. వీడిని చేసుకుంటే- ఛీ! ఛీ! తలుచుకోవడానికే నాకు అసహ్యం. ఏమీ బయటపడకుండా సాగర్‌ని చూడగానే పెద్ద పనిలో ఉన్నట్లు, దేని గురించో ఆలోచిస్తున్నట్లుగా ముఖం పెట్టేదాన్ని.

పెద్దక్కకి మంచి సంబంధం వచ్చింది. కలెక్టర్ ఆఫీసులో గుమాస్తా. పెద్దకట్నం ఏమీ లేకుండానే ఆమె నెమ్మదితనం, పనితనం చూసి కావాలని అడిగారు. అలా ఇబ్బంది పడకుండానే పెద్దక్క పెళ్ళయింది. పెళ్ళయ్యాక అక్క మా ఊళ్ళోనే వేరే ఇల్లు తీసుకుంది. బావ ఆఫీసుకి వెళ్ళాక ఇంటికి వచ్చి పచ్చళ్ళు, పొడులూ పెడుతుండేది. పచ్చళ్ళ వ్యాపారం బాగా పెరిగింది. తాత, నాన్నమ్మలు బాగా ఆరోగ్యంగా ఉండాలి. అందరికంటే వారు ఎక్కువ కాలం బతకాలి. అమ్మకి మందులు, బలమైన తిండి ఇప్పించలేక చనిపోయిన సంగతి ఎన్నటికీ మర్చిపోలేను. కాలేజీ నుంచి వచ్చేప్పుడు వాళ్ళకి కావలసిన మందులు తెచ్చి పెట్టేదాన్ని. తమ్ముడికి నేనే ఇన్స్పిరేషన్. పదో తరగతిలో స్టేట్ ఫస్టు తెచ్చుకున్నాడు. ఇప్పుడు మా ఊళ్ళో "ఆ మాన్యతను చూడండిరా. చిన్నపిల్ల అయినా బాధ్యతని ఎట్టా భుజాల మీదకు వేసుకుందో" అంటున్నారు. అందరి కళ్ళల్లో అసూయ. 'అదే నాకు కావాల్సింది. దానికోసం నేనేమైనా చేస్తాను' మరోసారి మనసులో గట్టిగా అనుకున్నాను.

★ ★ ★

"మాన్యా! లత, మధు సినిమాకి వెళుతున్నారు. మనం కూడా వెళదామా? " అని సాగర్ అడిగాడు. మధు చాలా అంద

గాడు. కోటీశ్వరుడు. కార్లల్లో కాలేజీకి వచ్చే వాళ్ళల్లో మధు ఒకడు. చాలా బాగా చదువుతాడు. నాకు పోటీ అతనే. మధు లతని ప్రేమిస్తున్నాడా? లేకపోతే సినిమాకి ఎందుకు ప్లాన్ చేస్తారు? కనిపెట్టడం ఎంతసేపు? వాళ్ళ కళ్ళు చూస్తే తెలియదా- అనుకుంటూ నేరుగా మధు సీట్ దగ్గరికి వెళ్ళాను. నేను మధు దగ్గరికి వెళ్ళడం



చూసిన లత ఆసక్తిగా పక్కనుండి చూస్తోంది.

"మధూ! సినిమాకి ప్లాన్ చేశావుట. ఎవరెవరు వస్తున్నారు? ఏం సినిమాకి వెళదాం? " అని క్యాజువల్‌గా అడిగాను. ఓరగా లత వైపు చూస్తూ "ఇంకా ఏం అనుకోలేదు మాన్యా. చూద్దాంలే..!" అన్నాడు.

నాకర్థం అయింది. ఇప్పుడిప్పుడే వాళ్ళిద్దరి మధ్యా ఏదో మొగ్గ తొడుగుతోందని. లాభనష్టాలు ఆలోచించే నా మనస్సు మధుని నావైపుకి తిప్పుకోమంది. అవకాశాన్ని ఎలా చేజిక్కించుకోవాలా? అని ఆలోచిస్తున్నాను.

తర్వాత రోజు సాగర్ "మాన్యా! ఫ్రెండ్‌షిప్ డేకి మధు, లతకి ఇవ్వాలని భలే గ్రీటింగ్ కొన్నాడు. నేను కూడా నీకోసం అలాంటి గ్రీటింగ్ కొనాలనుకుంటున్నా..!" అన్నాడు.

"ఏం గ్రీటింగ్ అది? " అని అడిగాను అనాసక్తతను నటిస్తూ.

"పూలు అందించే చేతుల గ్రీటింగ్. ఎంత బాగుందో..!" అన్నాడు.

"చూడు సాగర్! నాకు ఇలాంటివి నచ్చవు. దయచేసి నన్ను అలా అనుకోకు. నేను నీకు చెల్లెలిని అనుకో..!" అన్నాను. వాడి ముఖం ఎలా మారిందో కూడా చూడకుండా గ్రీటింగ్ కార్డ్సు షాప్‌కి పరిగెత్తాను.

పూలు అందించే చేతుల గ్రీటింగ్ కార్డు కొన్నాను. రేపే ఫ్రెండ్‌షిప్ డే. రేపటి దాకా ఆలస్యం చేయడం వల్ల మధు తను కొన్న గ్రీటింగ్ లతకి ఇవ్వొచ్చు. అది జరగకూడదు. అందుకే సాయంత్రమే మధుని కలుసుకున్నాను. "మధూ! రేపు నేను కాలేజీకి రాను. చిన్నక్కకి పెళ్ళి చూపులు. నాకు నువ్వంటే ఎంతో ఇష్టం. మన స్నేహం చిగురించాలనే ఆశతో ఈ గ్రీటింగ్ నీకోసం" అంటూ ఆ గ్రీటింగ్ ఇచ్చాను. గ్రీటింగ్‌ని కవర్లో నుండి తీసి చూసిన మధు కళ్ళు ఆనందంతో వెలిగాయి.

"వావ్! మాన్యా!.. నేను కూడా ఇలాంటి గ్రీటింగ్ కార్డే కొన్నాను" అన్నాడు.

"అవునా! నాకోసమేనా? అబ్బ! మధూ! మనిద్దరి టేస్ట్సు ఎంత బాగా కలిశాయి. ఏదీ చూపించు. నాకిప్పుడే ఇవ్వు" అని గారాలు పోయాను మధుపైన వాలుతూ.

తడబడిపోయిన మధు "ఇప్పుడొద్దులే. రేపు నేను మీ ఇంటికి వచ్చి ఇస్తాను సరేనా!" అన్నాడు.

"ఎందుకు నన్ను చూడాలనా..? " అన్నాను మరింత కవ్వింపుగా- అంతే మధు నా ప్రేమలో పడిపోయాడు. తర్వాత రోజు గ్రీటింగ్, పూలు, పండ్లతో సహా మా ఊరు వచ్చాడు. కారు మా ఇంటి ముందు ఆగడం చూసిన జనం కళ్ళల్లో ఎంత కుళ్ళో! వచ్చింది ఎవరో తెలుసుకోవాలని ఎంత ఆత్రమో..!

"మాన్యా ఎవరే వచ్చింది కార్లో? " అని ఆరా తీయడం. మా ఇంట్లో వాళ్ళని ఇప్పటికే ఎన్నోసార్లు అడిగి ఉంటారని నాకు తెలుసు. మా వాళ్ళకి తెలియదు. తెలిసినా చెప్పరు. "మా మాన్యని అడగండి" అంటారు.

అలా అడిగిన వారికి "మా చిన్నక్కకి సంబంధం వచ్చింది కదా! వాళ్ళ చుట్టాలు లెండి" అని చెప్పాను.

★ ★ ★

చిన్నక్కకి పెళ్ళయింది. బావ కంప్యూటర్ ఇంజనీర్. కట్నం లేకుండా చిన్నక్క అందానికి మెచ్చి పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళయిన వెంటనే చిన్నక్క హైదరాబాద్‌కి వెళ్ళిపోయింది. నాయనమ్మకి పని ఎక్కువయింది. ఆమెకి రెస్ట్ కావాలి. పచ్చళ్ళు రుబ్బడానికి, పొడులు కొట్టడానికి వెంకటేశు పెళ్ళాన్ని పెట్టాను. దానికి సినిమాల పిచ్చి. వారానికి రెండు మూడు సార్లు పని ఎగ్గొట్టి టౌన్‌కి సినిమాలకి వెళుతుంది.

దాన్ని టౌన్‌కి వెళ్ళకుండా ఆపడానికి టి.వి. కొనుక్కొచ్చాను. వంటింటికి, ముందు గదికి మధ్య ఉన్న అలమరా పగ లకొట్టించి ఎటు కావాలంటే అటు తిప్పుకు నేట్లుగా టి.వి. పెట్టించాను. టి.వి. చూస్తూ ఎంత పని చెప్పినా కిక్కురు మన కుండా చేస్తుంది. వెంకటేశు పెళ్ళాన్ని మా ఇంటికి రాకుండా చేయాలని ఎంతమంది ప్రయత్నించారో.. నాకు అది అన్నీ చెప్పేది. ఇప్పుడిక ఇది మా ఇల్లు వదిలి పెట్టదు. బాగా పనిలో కుదురుకుంది. దానికి బదులుగా వెంకటేశు కొడుక్కి ఫీజు లేకుండా ప్రైవేటు చెప్పి 10వ తరగతి ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యేట్లు చేశాను.

తమ్ముడు కాలేజీలో చేరాడు. చెల్లి తొమ్మిదవ తరగతికి వచ్చింది. నాకు మధుకి మధ్య ప్రేమ గాఢం అయింది. డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు దగ్గరకొచ్చాయి. ఈ పనుల వత్తిడిలో, ప్రేమ మత్తులో చదువు వెనకపడింది. మధుకి బాగా చదువుకోవాలని చెప్పాను. ప్రైవేట్లు చాలా వరకు తమ్ముడి చేత, చెల్లెలి చేత చెప్పించి బాగా చదువుకోసాగాను. డిగ్రీలో గోల్డ్‌మెడల్ సాధించాను. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో చేరాను.

★ ★ ★

మధుతో నా పెళ్ళి జరగాలంటే, అతడి పేరెంట్స్ మా పెళ్ళికి ఒప్పుకోవాలంటే ఫాల్స్ ప్రిస్టేజ్ చూపించాలి- తప్పదు. పొలం లోన్ పెట్టించి, బ్యాంక్‌లో ఉన్న డబ్బు తీసి, బావల దగ్గర కొంత అప్పు చేసి పెద్ద ఇల్లు కట్టించాను. ఇంటి లోపల గదుల్లో సామాన్లు లేకపోయినా హాలులో మాత్రం సోఫాసెట్, పెద్ద టి.వి., ఫ్లవర్ వాజ్‌లతో అలంకరించాను.

మధు తల్లిదండ్రుల్ని తీసుకుని మా ఇంటికి వచ్చాడు. మధు నాన్న పెద్ద బిజినెస్ మాగ్నెట్. చాలా తెలివైన వాడని కనిపెట్టాను. ఆయన నా అందం, చదువు, ముఖ్యంగా నా కళ్ళల్లో పట్టుదల గమనించాడు. అందుకే ఒక్కమాట కూడా మాట్లాడకుండా పెళ్ళికి ఒప్పుకున్నాడు.

రంగరంగ వైభవంగా జరిగిన నా పెళ్ళికి వచ్చిన ఊరి వాళ్ళు, నా క్లాస్‌మేట్స్ అందరి కళ్ళల్లో అసూయ చూసిన నేను 'ఇదే నాకు కావలిసింది. దీనికోసం నేనేమైనా చేస్తాను' అని మరోసారి మనసులో అనుకున్నాను.

ఇప్పుడు నేను కోటీశ్వరుడి కోడలినే కానీ ఆ ఇంటిమీద నాకు అధికారం రావడానికి, నిజంగా ఆ కోట్లు నాకు అందడానికి నేను చాలా కష్టపడాలని నాకు తెలుసు. హనీమూన్‌లో నా అందాన్ని ఆరబోసి నా భర్తను పూర్తిగా నా వాడిని చేసుకున్నాను. మధు నా మాట గీటు దాటడు. ఇక మామగారి అభిమానాన్ని సంపాదించాలి.

తమ్ముడిని ఇంజనీరింగ్‌లో చేర్పించాను. చెల్లి పదవ తరగతి 60%తో ఏదో ఫస్ట్ క్లాస్‌లో పాసయింది. సెకెండ్ క్లాస్ వచ్చినట్లయితే మళ్ళీ అందరి కళ్ళల్లో సంతోషం చూడవలసి వచ్చేది. ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయింది అంతే చాలు అనుకున్నాను.

మామగారు చేసే వ్యాపారాల్లో జీడిపప్పుని ఎక్స్‌పోర్ట్ చేసే వ్యాపారం బాగా లాభాలను ఆర్జించి పెడుతోందని గమనించాను. జీడిపప్పుతో పచ్చళ్ళు కూడా ప్యాక్ చేసి పంపడానికి మామగారిని ఒప్పించి లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టి 'నాయనమ్మ పికిల్స్' అనే పేరుతో లైసెన్స్ సంపాదించాను. నా దశ తిరిగింది. విపరీతంగా ఆర్డర్స్ రాసాగాయి. దేశవిదేశాల్లో నాయనమ్మ పికిల్స్‌కి బ్రాండ్‌నేమ్ వచ్చేసింది. మామగారికి హఠాత్తుగా గుండెపోటు రావడంతో డాక్టర్స్ రెస్ట్ కావాలన్నారు. ఆయనకు నా మీద పూర్తిగా నమ్మకం ఉండటంతో బిజినెస్ వ్యవహారాలన్నీ నాకు అప్పచెప్పారు.

చిన్న బావకి అమెరికాలో తెలిసిన వాళ్ళ కంపెనీలో ఉద్యోగం వచ్చేట్లు చేశాను. తాత పూర్తిగా మంచాన పడిపోయాడు. నాయనమ్మ మాత్రం పచ్చళ్ళు కలుపుతూనే ఉంది. పెద్దక్క మా పచ్చళ్ళ ఎక్స్‌పోర్ట్ కంపెనీకి పార్టనర్. అసలు మా పెద్దక్క నాకు ఎంతో సపోర్ట్. ఇంట్లో తాతని, నాన్నమ్మని, పచ్చళ్ళని అంతా మానేజ్ చేసింది అక్కే. చెల్లికి చదువురాదు అని తెలుసు. అందుకే మధు చిన్నాన్న కొడుక్కిచ్చి పెళ్ళి చేశాను. తమ్ముడికి ఎం.టెక్ పూర్తి అయింది. ఎం.ఎస్ కోసం అమెరికాకి వెళుతున్నాడు.

★ ★ ★

పిల్లలు కావాలని మధు, అత్తగారు పోరు పెడుతున్నారు. పెళ్ళయి అయిదేళ్ళు అయింది. బాధ్యతలు కూడా తీరినట్లే. నేను అనుకున్నది సాధించగలిగాను. ఇప్పుడిక నాకు, నా కుటుంబానికి ఏ బాధలూ లేవు. పిల్స్ తినడం ఆపేశాను. నాకు ఏడో నెల రాగానే మామగారితో, మధుతో చెప్పి టెక్స్‌టైల్స్ కంపెనీ మూసేయాలని నిర్ణయం తీసుకున్నాను. ఈ కంపెనీలో పని ఎక్కువ. లాభాలు తక్కువ. ముఖ్యంగా పర్యవేక్షణ చేసేవాళ్ళు లేరనే ఈ నిర్ణయం తీసుకున్నాను. కంపెనీ అమ్మేస్తున్నట్లు నోటీసు పెట్టగానే వర్కర్స్

అందరూ మా బంగళాకి వచ్చారు. అందరి కళ్ళల్లో నీళ్ళు. మామగారు నా వైపు ఏం చేద్దాం? అన్నట్లు చూశారు. నాకు వాళ్ళని చూస్తే బాధ కలగలేదు కాని వీళ్ళంతా రక రకాలుగా మాట్లాడతారు. చేయలేక కంపెనీ మూసేసుకున్నారు అని చెప్పుకుం టారని బాధ కలిగింది. అలా అనుకోకూ డదు. అది నాకిష్టం ఉండదు.

"సరే- లాభాల్లో మీరు షేర్ తీసుకోండి. కంపెనీని లాభాల దిశగా నడిపించే బాధ్యత ఇక మీదే..!" అన్నాను.

అందరూ సంతోషపడ్డారు. మామగారు మెచ్చుకోలుగా చూశారు నావైపు. నాకు అబ్బాయి పుట్టాడు. అమ్మ పేరు వైష్ణవి. ఆ పేరు కలిసేటట్లుగా మా అబ్బాయికి విష్ణు అని పేరు పెట్టుకున్నాను. మామగా రికి, అత్తగారికి వాడితో బాగా కాలక్షేపం. వాడికి కావలసినవన్నీ వాళ్ళే చూసుకుం టారు. నేను మళ్ళీ పూర్తిగా బిజినెస్ వ్యవ హారాల్లో పడిపోయాను.

★ ★ ★

తాతకి బాగాలేదని కబురొచ్చింది. ఊరికి వెళ్ళాను. అందరూ పలకరించే వాళ్ళే. వాళ్ళ కళ్ళల్లో అసూయ లేదు. మెచ్చుకోలు తప్ప. ఆశ్చర్యపడ్డాను. "తాతా!" అని పిలిచాను ఆయన మంచం మీద కూర్చుని. తాత కళ్ళల్లో నీళ్లు. నా కళ్ళల్లోనూ నీళ్ళే... అవి ఆనంద బాష్పా లని ఇద్దరికీ తెలుసు. తాత నా చేతుల్లో ప్రశాంతంగా కళ్ళు మూశాడు.

తాత దినం మూడు రోజులు వైభవంగా పెళ్ళిలా చేశాను. అందరూ నన్ను గౌర వంగా చూసేవాళ్ళే. ఒక్కరి కళ్ళల్లో కూడా నేను అసూయని చూడలేదు. నాకు ఆశ్చర్యం ఎక్కువవుతోంది. నా ఫీలింగ్స్ చెప్పుకోవడానికి నాకెవరూ లేరు. ఎవరితో చెప్పుకోను? అసలు ఎలా చెప్పను? నాకు కావలసింది అందరి కళ్ళల్లో అసూయ. కాని ఇదేమిటి అందరూ సంతోషంగా, గౌరవంగా, మెచ్చుకోలుగా, ఆప్యాయంగా చూస్తున్నారు? ఇది నాలో వచ్చిన మార్పా? లేక వాళ్ళల్లో వచ్చిన మార్పా? నాకెవరు చెప్తారు? దిగాలుగా ఉన్న నన్ను చూసి మధు, తాత కోసం దిగులు పడుతున్నాననుకున్నాడేమో-

"పెద్దవాళ్ళయ్యాక చనిపోకుండా ఎలా ఉంటారు మాన్యా" అంటున్నాడు.

ఆరు నూరయినా ఉదయాన్నే లేచి కంపెనీ పనులు చేసుకునే నేను ఆ రోజు పది అయినా నా గదిలో నుండి బయ టకు రాలేదు. మధు ఆశ్చర్యంగా చూశా డు. "కంపెనీకి వెళ్ళాలనిపించడం లేదా మాన్యా? " అని అడిగాడు. మధు కళ్ళలోకి నిస్తేజంగా చూస్తూ నా భావాలని, నా

ఆలోచనలనీ, వాటిని సాధించడం కోసం నేను చేసిన పనులనీ ఆఖరికి గ్రీటింగ్ విషయం కూడా దాచకుండా చెప్పాను.

"మధూ! ఇదంతా నేను, నా కుటుంబం ఉన్నతస్థాయిలో ఉండాలనీ, సరైన మందులు ఇప్పించుకోలేక మా అమ్మ కోసం పడ్డ అవస్థ ఇక రాకూడదని చేశాను. బాధలను తట్టుకోలేక, బాధ్యతల నుండి తప్పించుకోవడానికి ఇంట్లో నుండి వెళ్లిపోయి, చనిపోయాడో లేదో తెలియకుండా ఉన్న మా నాన్న బాధ్యతలను నెత్తిన వేసుకుని చేశాను. మా తాత కళ్ళల్లో గర్వాన్ని చూడాలనుకుని చేశాను. అయితే నాకు అర్థం కానిది ఏమిటంటే ఇన్నాళ్ళూ మేము ఎదుగుతుంటే అసూయ వ్యక్తం చేసే వాళ్ళ కళ్ళల్లో ఈ రోజు అసూయ స్థానంలో గౌరవం ఎలా వచ్చిందనే ..!" అన్నాను.

మధు కళ్ళల్లో కలవరం స్పష్టంగా తెలుస్తోంది. నాకు దగ్గరగా వచ్చి మంచం మీద కూర్చున్నాడు. నా వీపు మీద చేయి వేసి నిమురుతూ "మాన్యా! ఏదో ప్రోద్బలం, మోటివ్ లేకుండా మనం మనుషులం సాధారణంగా ఏ పనీ చేయం. ఎదుగుతున్న వయసులో నీకు తగిలిన దెబ్బల వల్ల నీ ఆర్థిక పరిస్థితులను ఉన్నత స్థాయికి తెచ్చుకోవాలనే పట్టుదల నీలో కలిగింది. సాధించావు. ఈ ప్రయాణంలో కొంతమందికి సహాయాలు, మరికొంతమందికి గాయాలూ చేసి ఉండవచ్చు. అంతవరకు బానే ఉంది. కానీ మాన్యా! వీటి వెనుక ఉండి నిన్ను నడిపించింది ఎదుటి వాళ్ళలో 'అసూయని కలిగించడం' అన్న కోరిక- అది మాత్రం అర్థం లేనిదేమో" అన్నాడు.

"నేను ఎదగడానికి ఆధారమే అది. అర్థం లేనిది ఎలా అవుతుంది" అన్నాను మధువైపు ప్రశ్నార్థకంగా చూస్తూ.

"మనం అసూయ పడగలిగేది మనకి దగ్గరగా మనవర్గంలో వాళ్ళనిచూసే. మన కన్నా మరీ ఎక్కువ స్థాయిలో ఉన్న వాళ్ళనిచూసి అసూయపడటం, మనకన్నా మరీ తక్కువస్థాయిలో ఉన్న వాళ్ళని చూసి గర్వపడటం జరగదు మామూలుగా. మీ ఊరి వాళ్ళు నిన్ను చూసి అసూయ పడటానికి అవకాశం పెద్దగా లేదు. వాళ్ళ వర్గం నుండి నువ్వు ఎప్పుడో పైకి తన్నేసుకుని ఎగిరిపోయావు. ప్రస్తుతం నీ స్థాయిలో ఉన్న వారిని నువ్వు గమనిస్తే వాళ్ళ కళ్ళల్లో అసూయని చూడగలవు. ఈ స్థాయినీ మించి నువ్వు మరో స్థాయికి వెళ్ళినపుడు అక్కడా అదే చూస్తావు. నువ్వు వెతుక్కుంటున్నది అదే అయితే నీ ప్రతి వర్గంలోనూ కొంతమంది మనుషుల దగ్గర అది తప్పకుండా దొరుకుతుంది. ఇతరుల మెప్పు కోసమో లేదా అసూయని కలిగించడంకోసమో నువ్వు ఎదిగినప్పుడు ఆ ఎదుగదల పరిపూర్ణమైనది కాదు. జీవిత చరమాంకంలో 'నేను సాధించిందేమిటి' అని చూసుకుంటే నీకంటూ ఏమీ ఉండదు" నా వైపే చూస్తూ నిదానంగా చెప్తున్న మధు మాటల్లోని నిజాన్ని గ్రహించాను. ఎందుకు నేనుప్పుడూ నెగిటివ్‌గా ఆలోచిస్తానో, ఎందుకు నాకంటూ స్నేహితులు లేరో కూడా నాకర్థమయింది. మధుని కౌగిలించుకుని చాలాసేపు ఏడ్చాను. ఒంటరిగా ప్రయాణిస్తున్న నా మనసుకు ఏదో ఆలంబన లభించిన అనుభూతి కలిగింది.

ఇంతకుముందు నా ప్రస్తుత స్థాయి వర్గం వారితో కలవలేదు. కలవాలని ప్రయత్నించలేదు కూడా. వీళ్ళను కూడా చూద్దామనే ఆ రోజు సాయంత్రం మధు స్నేహితుడి ఇంట్లో పార్టీకి వెళ్ళాను. ఎప్పుడూ ఏ పార్టీలకీ రాని నన్ను చూసి అందరూ ఆశ్చర్యపోయారు కాని కాసేపట్లోనే కొంతమంది కళ్ళల్లో ఆశ్చర్యం స్థానంలో అసూయ చోటు చేసుకోవడం గమనించాను.

నాకిప్పుడు ఆ అసూయ సంతోషం కలిగించట్లేదు. Ⓥ

అమెరికా కథ

- ఏనీ రీడ్

మా మంచి కార్ల్

నా మిత్రుడు కార్ల్ బుర్ర ఎప్పుడూ వివిధ ఆలోచనలతో నిండి ఉంటుంది. అవి ఎలాంటి ఆలోచనలంటే, స్కూల్లో చదివేప్పుడు ఓ సారి కార్ల్ నాకు పెట్టెలో రాళ్ళని పెట్టి అమ్మి డబ్బు చేసుకోవచ్చని చెప్పాడు.

"మనుషులు బాగా అమాయకులు. సరైన ప్యాకింగ్ ఉంటే దేన్నయినా కొంటారు. పెట్ రాక్ అనే పేటెంట్ కూడా తీసుకోవచ్చు"

ఓ రోజు మేం ఇద్దరం బిగ్ ఎడ్స్ టేవరన్ బార్‌లో బీర్ తాగుతూ, టీవీలో ఫుట్‌బాల్ ఆటని చూస్తున్నప్పుడు డబ్బు సంపాదించే తన కొత్త ఆలోచనని నాతో కార్ల్ పంచుకున్నాడు.

"మన ఊళ్ళోని పచారీ సరకుల పెద్ద దుకాణాల బయట గంటలని వాయించే వాళ్ళని గమనించావా? " అకస్మాత్తుగా అడిగాడు.

"చూసాను. సాల్వేషన్ ఆర్మీ మనుషులు వాళ్ళు. బీదలకోసం పాత దుస్తులని, డబ్బుని సేకరిస్తుంటారు" చెప్పాను.

"నీకు తెలిసింది ఇంతేనా? " అన్నట్లుగా నా వంక చూసి అడిగాడు.

"వారంతా సాల్వేషన్ ఆర్మీ మనుషులే అంటావా? "

"కాదా? వారి దుస్తుల మీదా, వారి పక్కనగల ఎర్రటి బక్కెట్ల మీద ఆ సంగతి రాసుంటుంది కదా? "

"టీ షర్ట్‌ల మీద మనం కోరింది ముద్రించే మాల్‌లోని దుకాణంలో వారు ఆ అక్షరాలని ముద్రించి ఉండచ్చుగా? "

కార్ల్ చెప్పిన దాంట్లో పాయింట్ ఉంది. సొంత కంప్యూటర్, ప్రింటర్ గల ఎవరైనా ఆ టీ షర్ట్‌ల మీద ఏదైనా ముద్రించచ్చు లేదా మాల్‌లో అయినా అలా జరిగే అవకాశం ఉంది.

నా భార్య హాలోవిన్ పార్టీకి వెళ్ళే మా అబ్బాయి టీ షర్ట్ మీద ఘోస్ట్ బస్టర్ బొమ్మని ముద్రించి ఇవ్వడం నాకు గుర్తుంది.

"బక్కెట్ల మాటేమిటి? అవి వాల్‌మార్ట్‌లో షెల్ఫ్‌ల్లో అమ్మకానికి ఉండవు"

"ఓ బక్కెట్ మీద ఎర్రరంగు పూయడానికి ఎవర్‌కైనా ఎంతసేపు పడుతుంది? ఆ గంట కొట్టే వాళ్ళంతా సాల్వేషన్ ఆర్మీ మనుషులని నాకు తోచదు" కార్ల్ చెప్పాడు.

"ఈ విషయం గురించి నువ్వు ఆలోచించావంటే నీకు పిచ్చెక్కి ఉండాలి" చెప్పాను.

కార్ల్ మళ్ళీ టివి స్క్రీన్ మీద దృష్టి నిలిపాడు. కాని అతని బుర్రలో ఆలోచనా చక్రాలు తిరుగుతున్నాయని అతనితో చాలాకాలం పరిచయం వల్ల నేను గ్రహించగలిగాను.

నేను నాలుగో క్లాసులో ఉన్నప్పుడు కార్ల్ తండ్రి మా ఇంటి పక్కన అమ్మకానికి ఉన్న ఇంటిని కొన్నాడు. అప్పటినించి నాకు కార్ల్‌తో స్నేహం కొనసాగుతోంది. మేమిద్దరం కలిసి కొన్ని పిచ్చిపనులు చేసాం. వాటిలో అధికభాగం నేను మా ఆవిడకి చెప్పడానికి సిగ్గు పడేవే కాబట్టి


Amar

ఎన్నడూ ఆమెకి చెప్పలేదు. ఉదాహరణకి మేం ఎనిమిదో క్లాసులో ఉండగా పుస్తకాల దుకాణాల బయట 'ఏదైనా ఇరవై ఐదు సెంట్లు' అని రాసి ఉంచిన పుస్తకాలని బొడ్లోకి దోపుకుని జారుకున్నాం. ఆ తప్పు నా మనస్సాక్షిని తొలుస్తోంది. కాబట్టే నేను పేదవిద్యార్థులకి పుస్తకాలు కొని ఇస్తున్నాను. మా ఆవిడ మాత్రం నాది ధార్మికబుద్ధి అనుకుంటోంది అని ఆమె తన మిత్రురాళ్ళతో చెప్పిన మాటల్ని బట్టి గ్రహించాను. కార్ల్‌తో స్నేహం మానేయాలని చాలాసార్లు అనుకున్నాను. కాని అది అతను సాధ్యపడనివ్వడం లేదు.

నాకు మొదటి సంతానం పుట్టినప్పుడు హాస్పిటల్‌కి వచ్చి ఆ రాత్రంతా నాతో ఉండి మర్నాడు మొదటగా అభినందనలు

అనువాదం :
మల్లాది వెంకట కృష్ణమూర్తి

తెలియజేసి వెళ్ళింది కార్లే. నా భార్య నమ్మకం ప్రకారం అత్యధికకాలం నొప్పులు పడింది తనే. నా పెళ్ళిలో కార్ల్ బెస్ట్ మేన్. మా నాన్న మరణించినప్పుడు ఆ శవపేటికని మోసినవారిలో కార్ల్ ఒకడు. అతను తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఆలోచనలని నాకు చెప్పినప్పుడల్లా "ఇలా ఐతే నీకు కటీఫ్ చెప్పేస్తాను" అంటూం టాను. ఐనా మామూలే. మా స్నేహం జీవితాంతం కొనసాగుతుందన్న ధీమా కార్ల్‌లో ఉంది.

"రేపు కలుద్దామా? " నేను నాలుగో బీర్ తాగాక బార్ స్టూల్ మీంచి దిగుతూ అడిగాను.

"రేపు నేను చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి" చెప్పాడు.

కార్ల్‌కి సరైన ఉద్యోగం లేదు. నేను అతన్ని "ఏం చేస్తున్నావు? " అని అడిగినప్పుడల్లా 'ఇతరులకి సేవచేసి సంపాదిస్తున్నాను' అని జవాబు చెప్తాడు. మేం చిన్నప్పుడు చేసిన పనుల లాంటివి చేస్తూంటే మాత్రం అతను ఇంతదాకా చట్టానికి చిక్కనందుకు అదృష్టవంతుడే. ఏదో ఓరోజు పోలీసులు మా ఇంటికి వచ్చి నా మిత్రుడు కార్ల్ గురించి నన్ను ప్రశ్నిస్తారని నాకు అనిపిస్తూంటుంది. అతడు బార్లో నాతో జరిపిన సంభాషణ ఆ తర్వాత మర్చిపోయాను.

★ ★ ★

మూడు రోజుల తర్వాత కార్ల్ నాకు ఫోన్‌చేసి చెప్పాడు.

"బిగ్ ఎడ్స్‌లో సాయంత్రం కలు. నువ్వు నమ్మలేనిది ఒకటి నీకు చూపిస్తాను"

ఆ రోజు ఆదివారం. క్రిస్టమస్ ముందు వచ్చే ఆదివారం. సాధారణంగా నా భార్య ఆరోజు నేను బయటికి వెళ్ళడానికి అనుమతించదు. కాని నేను టీవీలో ఫుట్‌బాల్ చూస్తున్నాను. ఆమె వంటల ఛానల్ చూసి కప్ కేక్స్ చేయాలని అనుకుంటోంది. లేదా ఆ ఛానల్‌లో ఏది చూపిస్తే అది. అందుకని 'నేను కార్ల్ దగ్గరకి వెళ్తాను' అని చెప్పగానే అభ్యంతరం చెప్పకుండా 'అలాగే త్వరగా రండి' చెప్పింది.

ఎడ్స్ కార్ పార్క్‌లో కూర్చున్న కార్ల్ నన్ను చూసి హారన్ కొట్టి చెయ్యి ఊపాడు. నేను అతని దగ్గరికి వెళ్ళాక "ఎక్కు" అన్నాడు.

"ఎక్కడికి? " కారు బయలుదేరాక అడిగాను.

"నీకోటి చూపించాలి" అతని నవ్వులో గర్వం తొణికిసలాడింది.

"అదేదో ఇక్కడ చూపించలేవా? " అడిగాను.

"ఉహూ"

ఎన్నో వందల సంవత్సరాల వయసు కలిగిన పొడవైన కాడిలాక్ కారుకి చాలా

కాలంగా కార్ల్ యజమాని. నా కాలి పక్కన అట్టపెట్టె నిండా చిల్లర కనిపించింది.

"ఎక్కడికో చెప్పు? " విసుక్కున్నాను.

"కొద్దిసేపు ఆగు" నవ్వి చెప్పాడు.

అర మైలు దూరం వెళ్ళాక కారుని ఓ మాల్ ఆవరణలోకి పోనిచ్చి లాండ్రి దుకాణానికి, కాస్మోటిక్స్ దుకాణానికి మధ్యగల ఇరవై నాలుగు గంటలు తెరచి ఉండే లిక్కర్ దుకాణం ముందు ఆపాడు. దాని ముందు నిలబడ్డ ఓ వ్యక్తి చేతిలోని గంటని వాయిస్తున్నాడు. అతని పక్కనే నల్లటి చెక్క స్టాండ్‌కి బకెట్ తగిలించి ఉండడం చూసాను. ఎర్ర బకెట్ అది.

'సాల్వేషన్ ఆర్మీ' అన్న అక్షరాలకి బదులుగా అతని టీ షర్ట్ మీద 'హెల్ప్ పూర్ కిడ్స్' అన్న అక్షరాలు ఉన్నాయి.

"అతను నా మనిషి" కార్ల్ చెప్పాడు

అతని కార్లోని చిల్లర ఎక్కడ నించి వచ్చిందో తక్షణం నాకు బోధపడింది.

"అతను ఎవరు? " అడిగాను.

"కిరాయి మనిషి. రోజుల చొప్పున జీతం చెల్లిస్తున్నాను. ఇతనొక్కడే కాదు. ఇంకో ఐదు చోట్ల ఐదుగుర్ని ఇదే పనికి నియమించాను"

"వాళ్ళ జీతం పోను నీకేమైనా మిగులుతుందా? " అడిగాను.

"చాలా... చాలా.." నవ్వుతూ చెప్పాడు.

"అబద్ధం కాదుగా? "

"దేవుడి మీద ఒట్టు"

కార్ల్ అమాయకుల నించి ఆ డబ్బు తీసుకుంటున్నాడు. బహుశ డబ్బు అవసరం ఉన్న బీదవారి నించి కూడా. కాని కార్ల్ అలా సంపాదించే డబ్బు లేకుండా కూడా జీవించగలడు.

తర్వాత కార్ల్ నాకు మిగిలిన 'హెల్ప్ పూర్ కిడ్స్' మనుషులని చూపించి బిగ్ ఎడ్స్ బయట తన కారుని ఆపి చెప్పాడు.

"బీర్ తాగుదాం రా. బిల్ నాది"

"ఇంటికి వెళ్ళాలి. పనుంది"

అతని ఆ సంపాదనతో నాకు బీరు తాగబుద్ధి వేయలేదు. మనస్సాక్షి ఏం చేయాలో చెప్తుంది కాని ఎలా చేయాలో చెప్పదు. సాల్వేషన్ ఆర్మీ వారికి ఫిర్యాదు చేసినా వారేం చేయలేరు. అడుక్కునే హక్కు అమెరికాలో అందరికీ ఉంది. అది చట్ట వ్యతిరేకం కాదు.

ఆ రాత్రి 'ఏం చేయాలి? ' అన్న ప్రశ్న నన్ను వేధిస్తూండటంతో నాకు చాలాసేపు నిద్రపట్టలేదు. తెల్లవారుఝామున నాకో ఆలోచన వచ్చింది.

నాకు పెళ్ళికాక మునుపు నేను ఓ జర్నలిస్ట్‌తో డేటింగ్ చేసాను. గోధుమరంగు జుట్టు. నాకన్నా అడుగుంపావు పొట్టి. ఆమె నన్ను ఎందుకో పెద్దగా ఇష్టపడలేదు. ఇప్పుడు నా మాజీ గర్ల్‌ఫ్రెండ్ స్థానిక టీవీ స్టేషన్‌లో వాతావరణ వివరాలు గంటకోసారి చెప్తూంటుంది. మేము డేటింగ్ చేసేప్పుడు తరచు ఆమె 'ఏదైనా సెన్సేషనల్ వార్త దొరికితే బావుండును' అని నాతో అంటూ ఉండేది. అలాంటి కథ నాన్ని ఆమె బయట పెడితే జాతీయ టివి కంపెనీల దృష్టిలో పడి, తనకి అక్కడ ఉద్యోగం దొరకచ్చని, దాంతో ఏ న్యూయార్క్‌లోనో లేదా లాస్ ఏంజెలెస్‌లోనో స్థిరపడచ్చని ఆమె ఆశ. కాని మా ఊరు లాంటి ఏభై వేల జనాభా గల ఊళ్లో ఆమెకి జాతీయ దినపత్రికల్లోకి ఎక్కగలిగే గొప్ప వార్తలు ఎలా దొరుకుతాయి? దాంతో స్థానిక టివిలో వాతావరణ వార్తలని ప్రెజెంట్ చేస్తోంది.

ఓ సారి ఆమె నా మాజీ గర్ల్‌ఫ్రెండ్ అని నా భార్యకి తెలిసింది. దాంతో ఆమెని నా భార్య తన జీవితాంతపు శత్రువుగా పరిగణిస్తోంది. నామీద కొద్దిపాటి ఆసక్తి కూడా లేని ఆమె మీద మా ఆవిడకు ఎందుకంత అసూయో నాకైతే అర్థం కాదు, అంతే కాదు. తన భార్యని అర్థం

చేసుకున్న ఏ భర్త ఈ భూమి మీద నేడు కాని, ఎప్పుడైనా కాని జీవించి ఉన్నాడని నేను నమ్మను.

సోమవారం ఉదయం ఆమె పనిచేసే టివి స్టేషన్‌కు ఫోన్ చేసి, నాకు ఫోన్ చేయమని ఆమెకి మెసెజ్ పెట్టాను. నా కాల్ తీసుకున్న వ్యక్తి దాన్ని ఆమెకి నిజాయితీగా అందించాడు. మంగళవారం మధ్యాహ్నం నాకు ఆమె ఫోన్ చేసింది.

"ఏమిటి? మీ ఆవిడనుంచి విడాకులు తీసుకున్నావా? నీతో డేటింగ్‌కి నాకు ఆసక్తి లేదు" ఆమె చెప్పింది.

"ఈ క్రిస్టమస్‌ని నేను మా ఆవిడతో, పిల్లతో గడుపుతున్నాను. నేను ఫోన్ చేయడానికి కారణం నీకు సహాయం చేయాలనే సుమా" చెప్పాను.

"ఏమిటా సహాయం? "

"నువ్వు ఇంకా నిన్ను జాతీయస్థాయిలో నిలబెట్టే వార్త కోసం వెదుకుతున్నావా? "

"అవును. కాని ఈ చిన్న ఊళ్లో అలాంటివేం జరగవని నాకు అర్థమైపోయింది. దేనికి ఫోన్ చేసావో చెప్పు. నాకు అట్టే టైం లేదు"

"ఆ విషయం మీదే చేసాను. క్రిస్టమస్‌కి 'హెల్ప్ పూర్ కిడ్స్' అనే పేరిట ఓ మనిషి మన ఊళ్లో చందాలని సేకరిస్తున్నాడు. వెతికితే అరడజను షాపింగ్ మాల్స్ బయట గంట మోగిస్తూ నిలబడుతూండటం నువ్వు చూస్తావు. పక్కనే స్టాండ్‌కి వేలాడే ఎర్ర బక్కెట్‌లు నీకు కనబడతాయి"

ఆమె వెంటనే మాట్లాడలేదు. ఆమె బుర్రలో ఆలోచనలు వేగంగా సుళ్లు తిరుగుతున్నాయని నాకు అనిపించింది.

"ఓ! చాలామంది అమాయకులు తమ డబ్బుని వాళ్లకి దానం చేస్తున్నారా? సరే, థాంక్స్"

రిసీవర్‌ని క్రెడిల్ మీద ఉంచేప్పుడు నా చేతులు వణకడం గమనించాను. కాని మనసులో ఆనందం వేసింది.

★ ★ ★

బుధవారం రాత్రి పదకొండు గంటల వార్తల్లో ఆ వార్త వెలువడింది. నేను సోఫా మీద నా భార్యతో కూర్చుని టివి చూస్తుంటే నా మాజీ గర్ల్ ఫ్రెండ్ తెర మీద కనిపించింది.

"ఆమె కేవలం వాతావరణ వార్తలే చెప్తుందనుకున్నాను" నా భార్య నాతో చెప్పింది.

మా ఆవిడకి ఎప్పుడు నోరు మూసుకుని ఉండాలో తెలీదు అని నాకు తెలుసు. కాని ఆ మాట ఆమెతో నేను ఎన్నడూ అనలేదు.

తర్వాత టివిలో కార్ల్ కనిపించాడు. కారు హెడ్ లైట్ల వెలుగులో హైవేలో కనబడే జింకలా అనిపించాడు. లిక్కర్ స్టోర్ దగ్గర నా మాజీ కాపేసి బక్కెట్లోని డబ్బుని తీసుకోవడానికి కార్ల్ వచ్చినప్పుడు కెమేరాతో అతని దగ్గరికి ఆ సాయంత్రం వెళ్లిందని. వెనకాల కనబడే లిక్కర్ స్టోర్‌ని చూడగానే నాకు అర్థమైంది. ఆమె ఓ మైక్‌ని అతని నోటి ముందు ఉంచి, 'మెర్రి క్రిస్టమస్‌కి అతను ఎంతమంది చిన్న పిల్లలకి బొమ్మలని ఉచితంగా ఇస్తున్నాడో అంచనా ఉందా? ' అని అడిగింది.

"ఆ? " కార్ల్ ప్రశ్నించాడు.

"మీ ఛారిటీ కార్యక్రమం 'హెల్ప్ పూర్ కిడ్స్' గురించి నేను అడిగేది. మీరు బీద పిల్లల తరపున ప్రజల నంచి చందాలు వసూలు చేస్తున్నారు కదా. అందుకేగా అంతా ఈ బక్కెట్లో నాణాలు పడేస్తున్నారు. అవునా? కాదా? "

"అవును" గొణిగాడు.

"లేక ఇది స్కామా? "

"అతను నీ ఫ్రెండ్ కార్ల్ కదా? " నా భార్య అడిగింది.

"అలాగే కనిపిస్తున్నాడు"

"ఏం చేస్తున్నాడు? నాకు మీరు చెప్ప

లేదే? ”

“తెలీదు”

కార్ల్ కెమేరా వంక, తర్వాత నా మాజీ వంక చూసి జుట్టుని కొద్దిగా వేళ్లతో సర్దుకున్నాడు.

“ఎలాంటి స్కామ్ కాదు. మాది సరి కొత్త ఛారిటీ సంస్థ. ఈ ఏడు బీద పిల్లలకి సహాయం చేయాలని నిశ్చయించుకున్నాను”

“ఎలాంటి సహాయం? ”

“అ... ఉ... అ...”

ఏం చెప్పాలో ఆలోచించుకుంటున్నాడని చూసే వాళ్లకి అర్థమైపోయేలా ఉన్నాయి అతని ముఖ కవళికలు. నాకు కార్ల్ మీద కొద్దిగా జాలి లాంటిది కలిగింది కూడా. నా మాజీకి ఫోన్ చేయకుండా ఉండాల్సింది అనిపించిందా క్షణంలో.

“తల్లిదండ్రులు క్రిస్ట్మస్‌కి బొమ్మలని కొనివ్వలేని పిల్లలందరికీ మా సంస్థ ఈ క్రిస్ట్మస్‌కి వాటిని కొనిస్తుంది”

“మరి బొమ్మలని కూడా డొనేట్ చేయమని అడిగి ఉండచ్చుగా? ”

“ఆ... ఉ... నిజమే. కాని మేము ఈ పనిని సాధ్యమైనంత గుప్తంగా చేయదలిచాం. క్రీస్తు ఏమన్నాడు? కుడి చేత్తో చేసే దానం ఎడం చేతికి తెలీకూడదన్నాడు. లేదా ఎడం చెయ్యి చేసే... అర్థమయిందిగా? కాని ఇప్పుడు ఆ గోప్యత పోయినట్లుంది”

“అవును. అందువల్ల మీరు బొమ్మలని అలాంటి పిల్లలకి ఇస్తున్నప్పుడు మా కెమేరా కూడా మీతో పాటుగా ఉండటానికి మీకు అభ్యంతరమా? అందువల్ల ఇది స్కామ్ కాదని దానం చేసిన ప్రతి ఒక్కరికి నమ్మకం కలుగుతుంది”

“అలాగే, తప్పకుండా” ఓ గుటక వేసి కార్ల్ అంగీకరించాడు.

“రేపు రాత్రికి మీరు బీదపిల్లల్ని, వాళ్ల ఆట బొమ్మల్ని, వారి సంతోషాన్ని కార్ల్‌తో పాటు చూస్తారు” నా మాజీ ప్రేక్షకుల వంక చూసి చెప్పాక ఆ వార్త ముగిసింది.

“ఈ వార్తకి, మీకు ఏదైనా సంబంధం ఉందా? ” నా భార్య నా వైపు గుచ్చి గుచ్చి చూస్తూ అడిగింది.

“అంటే? ”

“కార్ల్‌కి పబ్లిసిటీ గురించి నీ మాజీ గర్ల్ ఫ్రెండ్‌కి నువ్వు రికమెండ్ చేసావా అన్నది నా ప్రశ్న? ”

“లేదు. నేను అలాంటిదేం చేయలేదు” అబద్ధం చెప్పాను.

“నేను నమ్మను”

“ఎందుకు నమ్మవు? ”

“ఆ వార్త ప్రసారం అయినంత సేపు నీ ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఆగిపోయాయి కాబట్టి. కార్ల్‌వి కూడా”

ఏం జవాబు చెప్పాలో నాకు అర్థం కాలేదు. మా ఆవిడ నా చేతిని తన చేతిలోకి తీసుకుని, మృదువుగా దాన్ని ముద్దు పెట్టుకుని చెప్పింది.

“మీలో ఓ మంచి మనిషి ఉన్నాడని నాకు తెలుసు. జో... కాని మీ స్నేహితుడు కార్ల్ గురించి మాత్రం చెప్పలేను. మీరు అతనికి ప్రేరణ ఇచ్చారని నాకు తెలుసు”

నేను సంతోషడేలోగా దాన్ని ఆమె తక్షణం అణిచేసే మాటలు చెప్పింది.

“కాని ఇంకోసారి నువ్వు నీ మాజీతో మాట్లాడితే మాత్రం ఈ సోఫాలో నేను ఒక్క దాన్నే కూర్చుని టివి చూస్తాను. నీకు ఈ ఇంట్లో చోటు ఉండదు.

★ ★ ★

మర్నాడు రాత్రి పదకొండు గంటల వార్తల్లో మళ్లీ నా మాజీ, కార్ల్‌లు టివి తెర మీద కనిపించారు. ఇంటర్వ్యూ బదులు ఈసారి ఆటబొమ్మల దుకాణంలోకి కార్ల్‌ని కెమేరామెన్, నా మాజీ గర్ల్ ఫ్రెండ్ అనుసరించారు. అతను నాలుగైదు సంచీల నాణాలని ఇచ్చి చాలా బొమ్మలని

కొన్నాడు. తర్వాతి దృశ్యం అతను స్థానిక ఫైర్ స్టేషన్‌కి వెళ్లి, వాటిని అక్కడ పోగ యిన బాల బాలికలకి పంచే దృశ్యం. ఆ పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆనందంగా కనిపించారు. ఫైర్ మెన్ ఆనందంగా కని పించారు. నా మాజీ ఆనందంగా కనిపిం చింది. తక్కువ ధరకి అమ్మిన ఆ ఆట బొ మ్మల దుకాణం యజమాని కూడా ఆనం దంగా కనిపించాడు. వాటిని సేకరించిన మనుషులు ఆనందంగా కనిపించారు. ఒక్క కార్లే నాకు దుఃఖంగా కనిపించాడు.

కార్ల్‌కి క్రిస్టమస్ డ్రింక్‌ని కొనివ్వాలని నా మనస్సాక్షి నాకు చెప్పింది. క్రిస్టమస్ ఈవ్ మధ్యాహ్నం కార్ల్‌ని బిడ్ ఎడ్స్ టేవ రిన్‌లో కలిసాను.

కార్ల్ లోపలికి వచ్చినప్పుడు అక్కడ ఎన్నడూ జరగంది జరిగింది. బార్లో అంతా లేచి చప్పట్లు కొట్టారు. నేను అబద్ధం చెప్పడం లేదు. కార్ల్‌ని చూసి, 'హలో' అనని వారు కూడా లేచి వచ్చి కార్ల్‌ని ఆప్యాయంగా కౌగిలించుకున్నారు.

"ఈ సంగతి టివిలో చూసేదాకా మాకు తెలీలేదు. లేదా మీకు ఓ ఐదో, పదో డాలర్లు ఇచ్చేవాళ్లం" కొందరు చెప్పారు.

ఎడ్ కూడా కార్ల్‌కి మొదటి బీర్‌ని ఉచి తంగా ఇచ్చాడు. కార్ల్ నా ముందు కూర్చు న్నాక బల్ల మీద ఒంగి అడిగాడు.

"నిజం చెప్పు. అది నీ పని కదా? "

నేను నటించాల్సిన అవసరం లేకుండా నా మొహంలో కలత కనపడింది.

"నువ్వు హైస్కూల్‌లో ఆమెతో డేటింగ్ చేసావు కదా? నేను గుర్తు పట్టాను. దాంతో జరిగింది నాకు అర్థమైంది. ఆమెని అడిగాను కూడా"

"నామీద నీకు కోపంగా ఉందా? " ప్రశ్నించాను.

బీర్‌ని ఓ గుక్కతాగి తల అడ్డంగా ఊపి చెప్పాడు.

"లేదు. ఇక్కడ జరిగింది చూసావు కదా? ఊళ్లో ప్రతీచోటా ఇలా జరిగింది. అంతా నేను మంచివాడిని అనుకుంటు న్నారు"

అతని మొహంలో ఆశ్చర్యంతో కూడిన సంతోషం కూడా నాకు కనిపించింది. ఎందుకంటే అంతదాకా ఎవరూ కార్ల్‌ని మంచివాడుగా భావించలేదు. చెడ్డవాడు అని భావించిన వారు కూడా!

"జో! ఆ పిల్లలకి ఆటబొమ్మలని పంచు తున్నప్పుడు వాళ్ల మొహాల్లోని ఆనందాన్ని చూస్తే నాకు ఎంతో మంచిగా అనిపిం చింది. జీవితంలో ఎన్నడూ నాకు ఇలాంటి భావన కలగలేదంటే నమ్ము"

"కేడిలాక్ కార్లో శాంతాక్లాజ్" ఆ రోజు దినపత్రికలోని హెడ్డింగ్‌ని చెప్పాను.

కార్ల్ ఆ రోజు నించి స్థానిక ప్రముఖుడు అయ్యాడు. ఆ తర్వాత తేలికగా డబ్బు సంపాదించే స్కాములని ఆలోచించడం మానేసాడు. తనకి ఆయాచితంగా లభిం చిన మంచివాడు బిరుదుని పోగొట్టుకో వడం అతనికి ఇష్టం లేదు.

ప్రతీ క్రిస్టమస్‌కి ఆ ఫైర్‌స్టేషన్లో కార్ల్ పిల్లలకి బొమ్మలని ఇచ్చే దృశ్యాన్ని నా మా జీ ఏటా టివిలోని పదకొండు గంటల వా ర్తల్లో ప్రసారం చేస్తూనే ఉంది. వారిద్దరి పెళ్లికి నేను, నా భార్యతో హాజరయ్యాను.

ఇప్పుడు నా భార్యకి నా మాజీ మీద గల అసూయ కొద్దిగా తగ్గినట్లు నాకు అనుమానం. Ⓥ

మధుమాస విశేషం



విచ్చెనా విరితోట వెచ్చవెచ్చని రేకు
ఎద విప్పి చెప్పగా ఎదురుకోలు
కూసెనా గొంతెత్తి కోయిల ననవీటి
ముసురు పట్టిన పూల మొగిలు పాట
వీచెనా లలిగాలి వీవని గందమ్ము
తమిగొన్న ఎదవాటి తరగచాలు
కదిపెనా తిరవంపు కలల కోనేటిలో
తెలవారి కలనేత తొగరు పసుపు

ప్రకృతి నిరుపమ రూప లావణ్య మధుర
మధు రసాస్వాద హర్షసామ్రాజ్యమేమొ
నిఖిల వర్ణ సుందరతర స్నిగ్ధమైన
హరిధనుఃఖండముదయించె నంతరాత్మ...

మకర సంక్రాంతికే మాగాని తొలిపంట
పురులెత్తి మొగసాల పొర్లిపోయె
జనప పచ్చని పూల జారవేసిన పైట
జవరాలి ఎదగుట్టు చర్చరించె
పచ్చ ఎర్రని మిరపల పంట సిరిచేను
కలికి ప్రాయపు మంచె కాన్కజేసె
కన్నెగేదకి పువ్వు కనుసన్న ప్రాపుకై
కుర్ర గుండెలు గాలి కొలుములయ్యె

వివిధ భావమ్ములొరసి యుద్విగ్నమైన
సుకవి హృదయమ్ము పోలిక ప్రకృతి యెల్ల
ప్రతి పదమ్మున తన్మయత్వము భజించె
మధు విశేషమ్ము లేక మైమరపు గలదె..!

– సాంధ్యశ్రీ

మీ జాడలేవి తల్లీ!



వయస్సా?
పూలతో నక్షత్రాలతో
మాట్లాడే పాలవయస్సు!
మనస్సా?
కల్మష మెరుగని బంగారు మనస్సు!

మీ కోసమే ఉషస్సు
మీ కోసమే తపస్సు
మీ కేరింతలతో, మురిపాలతో
మువ్వల సవ్వడులతో
మారు మ్రోగవలసిన బాటలలో
మీ జాడలేవి తల్లీ? !

ఏవీ మీ దరహాసాలు?
ఏవీ మీ దోబూచులాటలు?
మృగాళ్లకు భయపడి
అమ్మలు మిమ్మల్ని దాచేశారా?
ఐదేళ్లకే మిమ్మల్ని ఖైదు చేసేశారా?

మూలమేమిటో తెలియని
మర్మమేమిటో ఎరుగని
మిమ్మల్ని కోల్పోయేది ఎవరన్నదే ప్రశ్న

మీ జాడలలో మా బాల్యాన్ని
వెతుక్కునే మాకు
బంగారు జ్ఞాపకాలేవి?

– కొప్పర్తి వసుంధర

నవ్వుల విందు



మీ ఆయనకి తినడం కుదరనంత మాత్రాన.. ఉగాది పచ్చడి ఇందులో కలపమన్నా!!
చక్రవర్తి
ఉగాది శుభాకాంక్షలు



అందాక కూర్చోండి!! తాతగారు పళ్ళుతోముకుంటున్నారు!!



కాసేపు రంభ డాన్సు చూసి పోదామని వచ్చామండీ!

నేనెవరిని?– 25 కి
సరైన సమాధానాలు
రాసిన వారిలో డ్రా ద్వారా
ఎంపికైన ఈ విజేతకు

రూ.100/- త్వరలోనే అందుతాయి.

మొక్కపాటి హరిణీసాయి
ప్లాట్ నెం. 87/1403/116,
మారుతీ మెగాసిటీ, నంద్యాలరోడ్,
కర్నూలు - 518007

నేనెవరిని? - 25 జవాబులు

1	2	3	4	5
ర	స	రా	జ	ము

1	2	3	4	5
స	మా	గ	మ	ము

1	2	3	4	5	6
వి	లా	స	వ	తు	లు

1	2	3	4	5
న	వ	త	ర	ము

1. పి. లోకేశ్వరి, అనంతపురం, 2. గాలి రామచంద్రయ్య, సూర్యాపేట, 3. ఉడాలి భాస్కరయ్య, చెన్నయ్, 4. ఇందన మల్లికార్జున్‌రావు, ఏలూరు, 5. గేదెల రామారావు, ఏలూరు, 6. అత్తిలి కస్తూరిభాయి, తిరుపతి, 7. నలుకుర్తి విజయకుమార్, భవానీపురం, విజయవాడ, 8. పాలకుర్తి సుధీర్ కుమార్, మాదాపూర్, 9. గంగుల మన్నెంరెడ్డి, వెదిరేపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా, 10. పి. రంగనాథం నాయుడు, తిరుపతి, 11. వి.డి. భవాని తల్లాప్రగడ, న్యూ నల్లకుంట, 12. కలువకొలను కళావతి, మాటేడు, వరంగల్ జిల్లా, 13. నియాజ్ అలి, హైదర్‌గూడ, 14. వి.వి. సత్యనారాయణ శెట్టి, తిరుపతి, 15. యు. విజయశేఖర రెడ్డి, కూకట్‌పల్లి, 16. తిప్పావఝుల వెంకట నారాయణ, మల్కాజిగిరి, 17. దేవరాజు వెంకట నరసింహారావు, చైతన్యపురి, హైదరాబాద్, 18. అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం, శేరిలింగంపల్లి, 19. ఎమ్. వసంత, బోరబండ, 20. బి. విశ్వనాథరావు, సైదాబాద్, 21. డా. సి. జనార్దన సింగ్, నల్లకుంట, 22. ధరణి పద్మాసన, డి.డి. కాలనీ, హైదరాబాద్, 23. పి. దేవసేనమ్మ, సిద్ధార్థనగర్, హైదరాబాద్, 24. ఆర్. భవ్య, ఎమ్మిగనూరు, 25. కన్నేపల్లి నారాయణమూర్తి, శ్రీకాకుళం, 26. యు. చిట్టిబాబు, కొత్త పాల్వంచ, ఖమ్మం జిల్లా, 27. అడపా సుమతి, కూకట్‌పల్లి, 28. డా. శివభూషణం, కర్నూలు, 29. సి. హెచ్. వి.ఎస్.ఎల్. రాజేశ్వరి, కాకినాడ, 30. గుర్రాల జయశ్రీ, గుంటూరు, 31. చింతపల్లి నాగేశ్వరరావు, ప్రసాదంపాడు, విజయవాడ, 32. ఎ. అరుంధతి, పుణె, 33. పి.వి. రమణారావు, మల్కాజిగిరి, 34. వడ్ల మన్నాటి విమల, దిల్‌సుఖ్‌నగర్, 35. యల్లాప్రగడ కృష్ణమూర్తి, అలకాపురి కాలనీ, హైదరాబాద్, 36. కణుగుల గ్రీష్మ, శ్రీకాకుళం, 37. అనంతుల సుబ్బారావు, గుంటూరు, 38. మతుకుమల్లి లలిత, మెహిదీపట్నం, 39. నెల్లుట్ల ప్రేమలత, ప్రగతినగర్, హైదరాబాద్, 40. వి. వెంకట రమణయ్య, కడప, 41. కోనే నాగ వెంకట ఆంజనేయులు, విశాఖపట్నం, 42. పి. నాగేశ్వరి, తుని, 43. కొక్కెరగడ్డ అన్నపూర్ణ, మానేపల్లి, తూ.గో. జిల్లా, 44. కె.వి. లక్ష్మణరావు, మానేపల్లి, తూ.గో. జిల్లా, 45. బిక్కునూరి రాజేశ్వర్, ఈద్‌గాం, ఆదిలాబాద్ జిల్లా, 46. తోటపల్లి శశి కళాధర్, గుంతకల్లు, 47. మొహమ్మద్ ఖాసిం, కల్లూరుగూడెం, ఖమ్మం జిల్లా, 48. వి.పి. కిరణ్, బెంగళూరు, 49. నోరి శివప్రకాశం, నెల్లూరు, 50. బి.వి. నరసింహారావు, పేరాల, ప్రకాశం జిల్లా, 51. బద్దెపూడి లక్ష్మీ సుశీల, చీరాల, 52. సి.వి. మాధవీప్రియ, ఎ.ఎస్. రావ్ నగర్, 53. అవధానం రంగనాథం, బెంగళూరు, 54. భూమా భాగ్యలక్ష్మి, గుంటూరు, 55. జి. యశోలత, కావలి, నెల్లూరు జిల్లా, 56. ఎమ్. రామచంద్ర రావు, హిల్‌కాలనీ, నల్గొండ జిల్లా 57. కందికుప్ప సీతాలక్ష్మి, బెంగళూరు, 58. కొత్తపల్లి సుధాదేవి, చీరాల, 59. బి. గురునాథరావు, శ్రీకాకుళం, 60. ఆర్. లక్ష్మి, శ్రీకాకుళం, 61. ఆర్. నాగేశ్వరరావు, శ్రీకాకుళం, 62. సగుటూరు గోపాలశెట్టి, భవానీపురం, విజయవాడ, 63. నేమాన సుభాష్ చంద్రబోస్, వైజాగ్, 64. కొండుపర్తి జగదంబ, మైలార్‌గడ్డ, 65. తటవర్తి రామలక్ష్మి, తాళ్లగడ్డ, హైదరాబాద్, 66. ముద్దుగుత్తుల జయగోపాల్, పాత బోయినపల్లి, 67. చుండూరు అప్పల నరసింహం, బాచుపల్లి, 68. టి. రాజశేఖర్, రాజమండ్రి, 69. ఆర్. లక్ష్మి, మోతీనగర్, 70. నూతేటి జ్యోతిర్మయి, అనంతపురం, 71. కాకర్లమూడి రామలింగమూర్తి, తణుకు, 72. ఎస్.సి. సీతాదేవి, ఆత్రేయపురం, తూ.గో. జిల్లా, 73. సృజన ఉప్పులూరి, చెన్నై,

74. నండూరి నాగేశ్వరరావు, బేగంపేట, 75. కె. నాగభూషణం, మౌలాలి, 76. ఎస్. విజయ లక్ష్మి, ఒంగోలు, 77. పప్పు శ్రీదేవి, అమలాపురం, 78. వెలసిరి రమాదేవి, నల్గొండ, 79. పంతం తమ్మయ్యదొర, గెద్దనాపల్లి, తూ.గో. జిల్లా, 80. ఎమ్. వేణుగోపాల్, అనంతపురం, 81. చాగంటి శేషకుమారి, విశాఖపట్నం, 82. కె. లక్ష్మీ కమల, విజయవాడ, 83. వి.ఆర్.కె. అల్లమరాజు, కాత్రే నికోన, తూ.గో. జిల్లా, 84. యమ్. అలమేలు, మల్కాజిగిరి, 85. గరికిపాటి సూర్యశ్రీ, కాకినాడ, 86. యన్. శేషఫణి శర్మ, కర్నూలు, 87. వారణాసి విజయలక్ష్మి, పొడగట్ల పల్లి, తూ.గో. జిల్లా, 88. టి.ఆర్. బాలకృష్ణారావు, రాజమండ్రి, 89. జె. రాజగోపాల రావు,ఎ.ఎస్. రావు నగర్, 90. ఎస్. నాగశ్వేత, బెంగళూరు, 91. ఎస్.శ్రీహరి, బెంగళూరు, 92. కె. మోహన్, బెంగళూరు, 93. ఏకా సావిత్రి, బాపట్ల, 94. కె. సుబ్రహ్మణ్యం, అనంతపూర్, 95. మండవ శ్రీకాంత్, కొత్త గూడెం, 96. పి. సీతారత్నం, నరసాపురం, ప.గో. జిల్లా, 97. కులుకూరి నీరజ, విశాఖ, 98. సౌదా మిని నాగరాజన్, విశాఖ, 99. చి.పు. శాస్త్రి, నిజామాబాద్, 100. ఎస్. రవికిరణ్, విజయవాడ, 101. అల్లడి సుబ్బారావు, పాలపర్రు, గుంటూరు జిల్లా, 102. వెల్మల రాంరెడ్డి, పూడూరు, కరీంన గర్ జిల్లా, 103. డా. సి. కె. శాస్త్రి, గుంటూరు, 104. మంచాళ శ్రీలక్ష్మి, విశాఖ, 105. పి.య స్.వి. సుబ్బారావు, రాజమండ్రి, 106. షేక్‌నజీర్ బాషా, కోట, 107. వి.ఆర్. జయలక్ష్మి, కరీంన గర్, 108. బి. శాంతి, విజయవాడ, 109. పక్కి శ్రీదేవి, మెట్టపల్లి గ్రామం, విజయనగరం జిల్లా, 110. జి. జయచంద్ర గుప్తా, కర్నూలు, 111. ఎ. మానస, యర్రగుంట్ల, కడప జిల్లా, 112. సాధ నాల నాగవర్ధిని, నూజివీడు, 113. వల్లభ సైమన్, మచిలీపట్నం, 114. పి. లక్ష్మి ప్రసన్న, గుడి మల్కాపూర్, 115. ఎన్.వి. రమణి, బంజారాహిల్స్, 116. పి. శ్రీనివాసులు, గుంతకల్లు, 117. సూరి నాగరాజు, రామవరప్పాడు, కృష్ణా జిల్లా, 118. యం. తిరుపాలమ్మ, గుంతకల్లు, 119. బందెల హరిణి, ఉయ్యూరు, కృష్ణా జిల్లా, 120. ఎ. రేవణ్, కందుకూరు, 121. బి.వి. ర వికుమార్, నజర్‌పేట్, తెనాలి, 122. కొత్తప్రసాదరావు, టెక్కలి, శ్రీకాకుళం, 123. దప్పూరి శ్రీధరా చార్యులు, సీతారాంబాగ్, 124. జి. కరుణప్రభాకర్, తిరుపతి, 125. చెల్లూరి లలితకుమారి, తాడే పల్లి, గుంటూరు జిల్లా, 126. ఆంధ్ర అచ్యుతరామయ్య, తణుకు.

నేనెవరిని? - 26 రూ.100/- బహుమతి

1	2	3	4	5

నేను ఐదు అక్షరాలతో అందమైన కనులు కలిగిన స్త్రీని చెప్పే పదాన్ని. నన్ను కనుగోడానికి ఆధారాలివిగో... 1. ఒకటి, ఐదు అక్షరాలు కలిస్తే స్త్రీ. 2. మూడు, ఐదు అక్షరాలు కలిస్తే లోపల. 3. ఒకటి, రెండు అక్షరాలు కలిస్తే అందమైన, రసం అని అర్థాలు. 4. మూడు, నాలుగు, ఐదు అక్షరాలు కలిపితే నేత్రం, చూపు. మరి నేనెవరినో చెప్పండి.

1	2	3	4	5

నేను ఐదు అక్షరాలతో కుమారుడు/కుమార్తె ఆడ సంతానాన్ని తెలిపే పదాన్ని. నన్ను కనుగోడానికి ఆధారాలివిగో... 1. నాలుగు, ఒకటి అక్షరాలు కలిస్తే స్త్రీ, అందగత్తె. 2. నాలుగు, ఐదు అక్షరాలు కలిస్తే కిందపడు. 3. నాలుగు, రెండు అక్షరాలు కలిస్తే 'వస్తాను'కు వ్యతిరేకం. 4. మూడు, రెండు, ఒకటి, ఐదు అక్షరాలు కలిస్తే కుమార్తె, కుమారుడి సంతానం. నేనెవరినో చెప్పుకోండి.

1	2	3	4	5

నేను ఐదు అక్షరాలతో సుకుమారమైన స్త్రీని తెలిపే పదాన్ని. నన్ను కనుగోడానికి ఆధారాలివిగో... 1. రెండు, ఐదు అక్షరాలు కలిస్తే దేవాలయం. 2. నాలుగు, మూడు అక్షరాలు కలిస్తే గొట్టపు బావి. 3. రెండు, మూడు అక్షరాలు కలిస్తే పెద్ద. 4. ఒకటి, మూడు అక్షరాలు చిరంజీవి పొట్టిపేరు. మరి నేనెవరినో చెప్పండి.

1	2	3	4

నేను నాలుగు అక్షరాలతో చెల్లెలు/అక్కను తెలిపే పదాన్ని. నన్ను కనుగోడానికి ఆధారాలివిగో... 1. ఒకటి, నాలుగు అక్షరాలు కలిపితే అంగీకారాన్ని తెలపడం, 'బేసి'కి వ్యతిరేకం. 2. మూడు, నాలుగు అక్షరాలు కలిపితే తీరం, ఒడ్డు. 3. ఒకటి, మూడు, నాలుగు అక్షరాలు కలిస్తే సప్తస్వరాల్లో మూడు. మరి నేనెవరినో చెప్పండి.

పంపినవారి పేరు: --

వయసు (   ) చిరునామా: ----------------------------------

----------------పిన్ : ------------ ఫోన్ : ----------------

నిబంధనలు

✷ 'నేనెవరిని?' ఇదే పేజీలో పూర్తిచేసి పంపాలి. ✷ ఇచ్చిన ఆధారాలకు అనుగుణమైన పదాన్నే గళ్లలో నింపాలి. ✷ తుడుపులు, కొట్టివేతలు ఉండరాదు. ✷ ఆల్ కరెక్ట్ రాసినవారే విజేతగా నిలుస్తారు. ✷ మా 'కీ'తో సరిపోలిన పూరణలనే పరిగణనలోకి తీసుకుంటాం. ✷ ఎక్కువ మంది సరైన జవాబులు రాస్తే డ్రా ద్వారా విజేతను ఎంపిక చేస్తాం. ✷ ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.

పంపాల్సిన చిరునామా : **నేనెవరిని?** విపుల, ఈనాడు కాంప్లెక్స్, గూడ్స్‌షెడ్ రోడ్డు, మూసాపేట విలేజి, బాలానగర్ (మండలం), హైదరాబాద్ - 072, రంగారెడ్డి జిల్లా

చివరి తేది : 18

FORM IV (See Rule 8)

Statement about ownership and other particulars of VIPULA.

1. Place of Publication	:	6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.
2. Periodicity of its Publication	:	Monthly
3. Printer's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin	:	-
Address	:	6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.
4. Publisher's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin	:	-
Address	:	6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.
5. Editor's Name	:	**RAMOJI RAO**
Whether citizen of India	:	Yes
If foreigner, state the country of origin	:	-
Address	:	6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.
6. Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital.	:	**RAMOJI RAO, VASUNDHARA PUBLICATIONS** 6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082.

I, RAMOJI RAO, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

for VASUNDHARA PUBLICATIONS
Sd/- RAMOJI RAO
Publisher

Date: March 1, 2014

